www.andhrajyothy.com
విజయవాడ సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI పేజీలు: 14 వెల (Price) : Rs. 6.50 సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 27
మంగళవారం | 13-5-2025
శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం, తిథి: పాడ్యమి రా.12:36 తదుపరి విదియ, నక్షత్రం: విశాఖ ఉ.9:09 తదుపరి అనూరాధ, వర్జ్యం: మ.1:35-3:21, దుర్ముహూర్తం: ఉ.8:21-9:12, రా.10:15-10:58, అమృతఘడియలు: రా.12:14-2:01, రాహుకాలం: మ.3:00-4:30, సూర్యోదయం: 5:47, సూర్యాస్తమయం: 6:35
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

టెస్ట్‌లకు విరాట్ గుడ్‌బై



అనుకున్నట్టే.. విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పేశాడు. కెప్టెన్ రోహిత్ శర్మ నాలుగు రోజుల కిందటే సంప్రదాయ క్రికెట్‌కు వీడ్కోలు పలకగా.. తాజాగా కోహ్లీ కూడా అతడిని అనుసరించాడు. ఇంగ్లండ్ టూర్ వరకైనా వీడ్కోలు నిర్ణయాన్ని వాయిదా వేసుకోవాలని కోహ్లీని బీసీసీఐ కోరింది. అతడిని ఒప్పించే ప్రయత్నం చేసింది. కానీ, తన నిర్ణయం మార్చుకోనని విరాట్ స్పష్టం చేశాడు. 2011లో టెస్టు అరంగేట్రం చేసిన కోహ్లీ మొత్తం 123 మ్యాచ్‌లాడి 9230 పరుగులు చేశాడు. ఇందులో 30 శతకాలున్నాయి. ఇక సారథిగా అద్భుత రికార్డు కోహ్లీ సొంతం. అతను సారథ్యం వహించిన 68 టెస్టుల్లో భారత్‌ను 40 సార్లు విజయ పథంలో నడిపి అత్యంత విజయవంతమైన కెప్టెన్‌గా నిలిచాడు. 11

అణు బూచికి బెదరం

అణ్వస్త్ర బెదిరింపులను సహించం

ఆపరేషన్ సిందూర్ అనేది కేవలం ఒక పేరు మాత్రమే కాదు.. అది కోట్లాదిమంది భారతీయుల భావోద్వేగాలకు ప్రతీక. న్యాయం జరగాలని చేసిన దృఢమైన సంకల్పం. దీనినే ఈనెల ఆరేడు తేదీల్లో ప్రపంచం మొత్తం చూసింది.

మన దాడి పాకిస్థాన్ దుర్బలత్వాన్ని బయటపెట్టింది. భారతదేశ అడ్వాన్స్‌డ్ వాయు రక్షణ వ్యవస్థల ముందు దాని క్షిపణులు, డ్రోన్లు కట్టె పుల్లల్లా తేలిపోయాయి. కేవలం మూడు రోజుల్లోనే పాకిస్థాన్ ఊహకు కూడా అందనంత విధ్వంసం జరిగింది. భారత ప్రతి దాడులతో పాకిస్థాన్ ఉద్రిక్తతలు చల్లారేందుకు దారులు వెతుక్కుంది. తమకు ఊరట కల్పించాలంటూ ప్రపంచ దేశాలను వేడుకుంది.

పాకిస్థాన్ ప్రభుత్వం, సైన్యం ఎప్పటికప్పుడు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూనే ఉన్నాయి. పాకిస్థాన్ పతనానికి కూడా ఇటువంటి చర్యలే కారణమవుతాయి. ఉగ్రవాదానికి ఇలాగే చేయూత ఇస్తే ఏదో ఒక రోజు పాకిస్థాన్‌నే మింగేస్తుంది. పాకిస్థాన్ బయటపడాలంటే ఉగ్రవాద మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయాల్సిందే. శాంతికి ఇది తప్ప మరో మార్గం లేదు.

ఉగ్రవాదులు, వారికి ఆశ్రయమిచ్చే ప్రభుత్వాల్ని వేర్వేరుగా చూడం
నుదుట సిందూరాన్ని తుడిచే సాహసం చేస్తే వాటి ప్రధాన కార్యాలయాలనే తుడిచిపెట్టేశాం
సరిహద్దుల్లో దాడికి సిద్ధమైతే.. పాక్ గుండెలపైనే దాడులు చేశాం
భద్రతా బలగాల తెగువ, పరాక్రమం తిరుగులేనివి
ఉగ్రవాద స్థావరాలనే కాదు.. నైతిక స్థైర్యాన్నీ బదాబదలు చేశాం
మన దాడులతో పాక్‌కు ఊహకు కూడా అందనంత విధ్వంసం
అందుకే ప్రపంచ దేశాల్ని వేడుకుంది.. పరుగెత్తుకుంటూ వచ్చింది
మేడిన్ ఇండియా రక్షణ వ్యవస్థల సత్తా ప్రపంచానికి తెలిసింది
ఉగ్రవాదం, చర్చలు ఒకేసారి కుదరవు..
ఉగ్రవాదం, వాణిజ్యం ఒకే బాటలో పయనించలేవు..
రక్తం, నీళ్లు కలిసి ప్రవహించ లేవు..
జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ, మే 12 (ఆంధ్రజ్యోతి): అణు బెదిరింపులకు భారత్ బెదిరేది లేదని, అణ్వస్త్ర బ్లాక్ మెయిలింగ్‌ను ఏమాత్రం సహించేది లేదని పాకిస్థాన్‌కు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తేల్చి చెప్పారు. అణ్వస్త్ర బూచిని చూపించి ఉగ్రవాద స్థావరాలను నిర్వహిస్తే కచ్చితమైన, నిర్ణయాత్మక దాడులు తప్పవని హెచ్చరించారు. ఉగ్రవాదులకు, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే వారికి మధ్య ఏమాత్రం తేడా లేదని, ఉగ్రవాద నాయకులను, వారికి ఆశ్రయం ఇచ్చే ప్రభుత్వాలను భారత్ వేర్వేరుగా చూడదని పునరుద్ఘాటించారు. భారత సైన్యం హతమార్చిన ఉగ్రవాదుల అంత్యక్రియలకు పాకిస్థాన్ సైనికాధికారులు హాజరయ్యారని, దీనిని ప్రపంచమంతా చూసిందని, ప్రభుత్వ ప్రేరేపిత ఉగ్రవాదంలో పాకిస్థాన్ పూర్తిగా కూరుకుపోయిందనడానికి ఇది మరో నిదర్శనమని చెప్పారు. మన కుమార్తెలు, చెల్లెళ్ల నుదుటిపై సిందూరాన్ని

మిగతా 12వ పేజీలో...

ఉగ్రవాదంపై పోరులో ఆపరేషన్ సిందూర్ ఇక నుంచి భారత సువ్యవస్థిత విధానం. ఉగ్రవాద వ్యతిరేక పోరాటాలకు ఈ ఆపరేషన్ సరికొత్త ప్రమాణాన్ని నిర్దేశించింది.

ఇది యుద్ధాల యుగం కాదు. అలాగే, ఉగ్రవాద శకమూ కారాదు. సురక్షిత, అత్యుత్తమ ప్రపంచం కావాలంటే ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించరాదు.

10 బ్రహ్మాస్త్రంలా దూసుకెళ్లిన మార్కెట్

2,975 పాయింట్ల లాభంతో 82,429.90 వద్ద ముగిసిన సూచీ
రూ.16 లక్షల కోట్లు పెరిగిన సంపద.. రూ.3,400 తగ్గిన బంగారం

వాణిజ్య బెదిరింపులతో దారికి..!

యుద్ధం ఆపకపోతే వాణిజ్యం ఉండదని బెదిరించా
ఉన్నపళంగా కాల్పుల విరమణ పాటించాలని చెప్పా
భారత్-పాక్ అణు యుద్ధాన్ని నివారించా
లేకుంటే కోట్ల మంది చనిపోయేవారు
భారత్, పాక్ ప్రధానులు పరిస్థితిని అర్థం చేసుకున్నారు
భారత్‌తో చర్చలు ప్రారంభించాం.. పాక్‌తోనూ త్వరలో..
అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు
ఆయన వ్యాఖ్యల్లో వాస్తవం లేదన్న భారత ప్రభుత్వ వర్గాలు



న్యూయార్క్/వాషింగ్టన్, మే 12: భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలకు అడ్డుకట్ట వేసింది తానేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి పేర్కొన్నారు. కాల్పుల విరమణ పాటించకపోతే.. తమ దేశంతో వాణిజ్యం ఆపేస్తానని హెచ్చరించానని, ఇరు దేశాల మధ్య అణుయుద్ధాన్ని నివారించానని వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్ష కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "భారత ఉపఖండంలో కొన్ని రోజులుగా

మిగతా 12వ పేజీలో...

వాణిజ్య యుద్ధానికి విరామం!

ప్రతీకార సుంకాల తగ్గింపుపై అమెరికా, చైనా ఒప్పందం
ద్వైపాక్షిక దిగుమతులపై 115% టారిఫ్‌ల తగ్గింపు
90 రోజుల పాటు కొనసాగించాలని నిర్ణయం
ఇక నుంచి చైనాపై 30%.. అమెరికాపై 10% సుంకాలు
11



సాగర్‌లో సుందరీమణుల సందడి

గిరిజన నృత్యంతో అందగత్తెలకు స్వాగతం
బుద్ధవనాన్ని సందర్శించిన భామలు 14

వద్దన్నా జనాన్ని ఎందుకు తెచ్చారు?

హెలిప్యాడ్‌లోకి ఎందుకు పోనిచ్చారు? 2
ఇందులో ఏదో కుట్ర దాగి ఉందనిపిస్తోంది
మీ ప్రమేయంపై మావద్ద ఆధారాలున్నాయి
వైసీపీ ఇన్‌చార్జిగా జగన్ బాధ్యత మీది కాదా?
తోపుదుర్తిపై పోలీసుల ప్రశ్నలవర్షం
చాలా ప్రశ్నలకు తెలియదు అంటూ దాటవేత

పునరుత్పాదక ఇంధన రంగంలో

రూ.22 వేల కోట్ల పెట్టుబడులు

14
17న పలు ప్లాంట్లకు లోకేశ్ భూమిపూజ

'సెకీ' సీఎండీ గుప్తాపై కేంద్రం వేటు

పదవీకాలం నెల ఉండగానే తొలగింపు
కేంద్ర పునరుత్పాదక ఇంధన కార్యదర్శి సారంగికి అదనపు బాధ్యతలు 13
అదానీ స్కాంను దాచిపెట్టలేరు: కాంగ్రెస్
ట్రంప్ యంత్రాంగంతో అదానీ చర్చలు!

వలసలపై బ్రిటన్ కఠిన వైఖరి

పౌరసత్వం పొందడానికి నిరీక్షణ సమయం 5 నుంచి 10 ఏళ్లకు పెంపు 13
అత్యున్నత ప్రమాణాలతో ఇంగ్లిష్ తప్పనిసరి

పోరు బందర్!

పాక్ డ్రోన్ల వెన్ను విరిచిన మచిలీపట్నం సరుకు
హైదరాబాద్‌లో జామర్ల తయారీ
బెంగళూరులో రాడార్లు, బందరులో ఎలక్ట్రో ఆప్టిక్స్, తుదిరూపు
శత్రు దేశానికి డేంజర్ బెల్ మన డీ4

గతంలో యుద్ధం అంటే యుద్ధ విమానాలు, ట్యాంకులు, శతఘ్నులు, యుద్ధ నౌకలే ఎక్కువగా కనిపించేవి. కానీ రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నుంచీ డ్రోన్ల పాత్ర చాలా ప్రధానంగా మారిపోయింది. తాజా భారత్-పాక్ యుద్ధంలో డ్రోన్ల వినియోగం పతాక స్థాయికి చేరింది. రెండు వైపుల నుంచి డ్రోన్లు, ఎగిరే బాంబులు (లాయిటరింగ్ మ్యూనిషన్లు) వందల, వేల సంఖ్యలో దాడులకు దిగాయి. అలాగే ప్రత్యర్థి డ్రోన్ల

మిగతా 13వ పేజీలో...



డీ4 వ్యవస్థ



కశ్మీర్‌లోని సాంబ జిల్లాలో పాక్ డ్రోన్లను తిప్పికొడుతున్న భారత గగనతల రక్షణ వ్యవస్థ

సరిహద్దుల్లో సైన్యాన్ని తగ్గిద్దాం

డ్రోన్లు, మిస్సైల్స్ దాడులు జరగొద్దు
కాల్పుల విరమణను పాటిద్దాం
భారత్-పాక్ డీజీఎంవోల భేటీలో నిర్ణయం
కాసేపటికే భారత్ భూభాగంలోకి పాక్ డ్రోన్లు
సమర్థంగా కూల్చేశామన్న భారత సైన్యం
ఎలాంటి ఆందోళన అవసరం లేదని వెల్లడి
సాంబ, హోషియార్‌పూర్‌లో బ్లాకవుట్
పాక్ వైమానిక స్థావరాలకు చావుదెబ్బ
11 ఎయిర్‌బేస్‌లపై భీకర దాడులు
'ఆపరేషన్ సిందూర్'పై డీజీఎంవోల వెల్లడి
కిరానా హిల్స్‌పై దాడి చేయలేదు: ఏకే భారతి

న్యూఢిల్లీ, మే 12: నియంత్రణ రేఖ(ఎల్‌వోసీ) వెంబడి ఉద్రిక్త పరిస్థితులను తగ్గించాలని భారత్-పాక్‌కు చెందిన మిలటరీ ఆపరేషన్ల డైరెక్టర్ జనరల్స్(డీజీఎంవో) నిర్ణయించారు. సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో ఇరువురు డీజీఎంవోలు హాట్‌లైన్‌లో దాదాపు 45 నిమిషాలపాటు సమావేశమై పలు నిర్ణయాలు తీసుకున్నారు. నిజానికి మధ్యాహ్నం 12 గంటలకే వీరి భేటీ జరగ్గా.. కాసేపటికి సమావేశాన్ని సాయంత్రానికి వాయిదా వేశారు. ఈ సందర్భంగా

మిగతా 12వ పేజీలో...

మన సీట్లు మనకే

ఉన్నత విద్యపై నిర్ణయం.. తెలంగాణ బాటనే ఏపీ



ఆంధ్రా, ఎస్వీయూ రీజియన్లే ప్రామాణికం
రెండు రీజియన్ల మధ్య 85:15 నిష్పత్తి
రాష్ట్ర యూనివర్సిటీలకు 65.62: 34.38
ఉత్తర్వులు జారీ చేసిన ఉన్నత విద్యాశాఖ

అమరావతి, మే 12(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్య అడ్మిషన్లపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకూ ఉన్నత విద్యాసంస్థల్లోని సీట్లలో ఆంధ్రా యూనివర్సిటీ, శ్రీవేంకటేశ్వరయూనివర్సిటీ(ఎస్వీ), ఉస్మానియా యూనివర్సిటీ మూడు రీజియన్ల ప్రకారం సీట్ల కేటాయింపు జరుగుతోంది. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీ(తెలంగాణ) రీజియన్‌లో ఆంధ్రాకు చెందిన విద్యార్థులకు సీట్లు కేటాయించబోమని తెలంగాణ ప్రభుత్వం కొత్త నిబంధన అమల్లోకి తెచ్చింది. దీంతో ఏపీ ప్రభుత్వం కూడా అదే కోణంలో ఇకపై ఉన్నత విద్యాసంస్థల్లో సీట్లు మన రాష్ట్ర విద్యార్థులకు మాత్రమే దక్కేలా అడ్మిషన్ల నిబంధనలకు సవరణలు చేసింది. వీటి ప్రకారం రాష్ట్రంలోని ఆంధ్రా, వెంకటేశ్వర యూనివర్సిటీల మధ్య మాత్రమే సీట్ల పంపిణీ

మిగతా 2వ పేజీలో...

వర్సిటీలకు కేటాయింపు ఇదీ..

రాష్ట్ర స్థాయి విశ్వవిద్యాలయాలుగా ఉన్న పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ద్రవిడియన్ యూనివర్సిటీ, ఉర్దూ యూనివర్సిటీ, వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ వర్సిటీ, ఆర్జీయూకేటీతో పాటుగా క్లస్టర్ యూనివర్సిటీలోని సిల్వర్ జూబ్లీ కాలేజీకి రెండు రీజియన్ల మధ్య 85 శాతం సీట్లను 65.62:34.38 నిష్పత్తిలో విభజించారు. మిగిలిన 15 శాతం సీట్లను అన్‌రిజర్వ్‌డ్ కోటా ప్రకారం రాష్ట్రంలోని విద్యార్థులందరూ పొందవచ్చు. కాగా, ఈ నిబంధనలు 2025-26 విద్యా సంవత్సరానికి మాత్రమే వర్తిస్తాయని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అలాగే ప్రవేశ పరీక్షలకు, డిగ్రీ అడ్మిషన్లకు కూడా ఇవే నిబంధనలతో మరో రెండు జీవోలు జారీ చేసింది.

శ్రీశైలం దుస్థితిపై సీఎం సీరియస్!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

'ఆర్థిక శాఖతోనే అసలు పేచీ'పై ఆరా

సిలిండర్లు దెబ్బతిన్న సంగతి ఇన్నేళ్లూ ఎందుకు చెప్పలేదు?
తక్షణమే ఎన్‌డీఎస్ఏ, జలసంఘంతో సమావేశం నిర్వహించాలి
మరమ్మతులకు ఎంతవుతుందో వాటి ద్వారా అంచనా వేయించాలి
ఆ మొత్తానికి వెంటనే కేబినెట్ ఆమోదం తీసుకోవాలి
సీఎంవో కార్యదర్శికి ఆదేశం



అమరావతి, మే 12 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయంలో కొన్ని నిర్మాణాల వద్ద నెలకొన్న దుస్థితిని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా పరిగణించారు. స్పిల్‌వే.. అప్రోచ్ చానల్ వద్ద ఏర్పాటు చేసిన సిలిండర్లు పూర్తిగా ధ్వంసం కావడం.. టెయిల్‌పాండ్ వద్ద కట్టిన ఆనకట్ట

మిగతా 14వ పేజీలో...

ఏజెన్సీలో స్థానిక గిరిజనులకే ఉద్యోగాలు 14

100% కల్పించేందుకు కట్టుబడి ఉన్నాం
రద్దయిన జీవో 3 పునరుద్ధరణకు చర్యలు
గిరిజన సంక్షేమ సమీక్షలో సీఎం ఆదేశాలు



ప్రజలకు సేవ పేరిట నియమించిన వలంటీర్లను వైసీపీ కోసం ఉపయోగించుకున్న జగన్ సర్కారు.. అస్మదీయ సంస్థలకు వందల కోట్లు దోచిపెట్టడానికి వారి 'పేరు'ను కూడా బాగా వాడుకుంది. వలంటీర్లకు 'శిక్షణ' పేరిట రూ.274 కోట్లు దోపిడీ చేయగా.. అదే వలంటీర్లపై 'పర్యవేక్షణ' పేరిట మరో రూ.280 కోట్ల కాంట్రాక్టు అప్పనంగా ఇచ్చినట్టు తాజాగా బయటపడింది.

ఈ రెండు కాంట్రాక్టులూ పొందింది రామ్ ఇన్ఫో అనే సంస్థ. అయితే.. తెరవెనుక కథ నడిపించిందేమో వైసీపీకి వ్యూహకర్తగా పని చేసిన ఐప్యాక్ సంస్థ. రామ్ ఇన్ఫో ద్వారా ఈ మొత్తం రూ.554 కోట్లు ఐప్యాక్‌కు చేరినట్టు బలమైన ఆరోపణలు వస్తున్నాయి. ఇంత మొత్తం జనం సొమ్ము దోచిపెట్టి వైసీపీకి రాజకీయ లబ్ధి కలిగేలా వలంటీర్లు, ఐప్యాక్‌ను వాడుకున్నారు.

ఐప్యాక్‌కు డబ్బుల్ ధమాకా!

జగన్ సర్కారులో వలంటీర్ల 'పేరిట' వందల కోట్లు సరికొత్త దోపిడీ


'శిక్షణ' పేరిట రూ.274 కోట్లు
అదనంగా 'పర్యవేక్షణ'కు 280 కోట్లు
మానవ వనరుల పేరిట రామ్ ఇన్ఫోకు కాంట్రాక్టు
యూని కార్పొరేట్‌తో కన్సార్షియం
1045 మంది సేవలు.. వీరంతా ఐప్యాక్ వారే?
కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, ప్రతిపక్షాలపై నిఘా
వైసీపీ కోసం సాగిన 'పర్యవేక్షణ'
రామ్ ఇన్ఫో ద్వారా సొమ్ము ఐప్యాక్‌కు?

2021లో యూని కార్పొరేట్, అదాన్ డిస్టిలరీస్ చిరునామాలు ఒక్కటే
వాటి లింక్ ఏమిటో?
విచారిస్తే అసలు గుట్టు వెలుగులోకి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అసత్యాలు, అబద్ధాలు, ఫేక్ ప్రచారాలతో 2019లో వైసీపీ అధికారంలోకి రావడానికి ఐప్యాక్ వ్యూహరచన చేసింది. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఇందుకు ప్రతిఫలంగా.. ఐప్యాక్‌కు మేళ్లు జరిగేలా భారీ ప్రణాళికనే అమలు చేశారు. ఎక్కడా ఆ సంస్థకు నేరుగా డబ్బులు చెల్లించినట్లు కనిపించకుండా కొత్త రకం కనికట్టు విద్యను ప్రదర్శించారు. ఫీల్డ్ ఆపరేటింగ్ ఏజెన్సీ (ఎఫ్ఓఏ)ని ఏర్పాటు చేసి తన చాతుర్యాన్ని ప్రదర్శించారు. వలంటీర్లకు శిక్షణ పేరిట

మిగతా 2వ పేజీలో...



కారు విజేత కోటేశ్వరరావుకు చెక్కు అందిస్తున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పక్కన 'ఆంధ్రజ్యోతి' బీఎం హరికృష్ణ, ఇతర సిబ్బంది

'ఆంధ్రజ్యోతి లక్కీడ్రా' కారు విజేతకు చెక్కు అందజేత

- నాడు-నేడు 'ఆంధ్రజ్యోతి'ది ప్రజాపక్షం
- కొనియాడిన ఎమ్మెల్యే కోటంరెడ్డి
- సైకిల్ పక్కనపెట్టి కారులో వెళ్తా: విజేత

నెల్లూరురూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి' పాఠకులకు కార్ అండ్ బైక్ రేసుకు సంబంధించి రాష్ట్రస్థాయి లక్కీడ్రాలో కారును గెలుచుకున్న నెల్లూరు నగరవాసి జొన్నాదుల కోటేశ్వరరావుకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సోమవారం చెక్కు అందజేశారు. గత నెల 9న విజయవాడలో జరిగిన బంపర్ డ్రాలో కోటేశ్వరరావును అదృష్టం వరించింది. రైల్వే శాఖలో పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఆయన 20 ఏళ్లుగా 'ఆంధ్రజ్యోతి' పాఠకుడిగా ఉంటున్నారు. 'కార్ అండ్ బైక్ రేసులో రాష్ట్రస్థాయి విజేతగా నిలిచిన కోటేశ్వరరావు కారును గెలుచుకున్నారు. నెల్లూరు నగరంలోని ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి పాల్గొని కోటేశ్వరరావుకు కారుకు సంబంధించి నగదు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 'ఆంధ్రజ్యోతి' నాడు, నేడు ప్రజల పక్షాన నిలిచే నిజాయితీ గల సంస్థ అని కొనియాడారు. అధికార పక్షమా, ప్రతిపక్షమా అన్న తేడా లేకుండా ఎవరు తప్పులు చేసినా విమర్శించగల పాత్రికేయ లక్షణం ఈ యాజమాన్యం సొంతమని తెలిపారు. వార్తలే ప్రధాన ఉద్దేశం కాకుండా సమాజం పట్ల కూడా తన బాధ్యతను గుర్తెరిగి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కారును గెలుచుకున్న కోటేశ్వరరావును అభినందించారు.

'ఆంధ్రజ్యోతి' రోజూ చదువుతా: కోటేశ్వరరావు

"కొన్నేళ్లగా నేను 'ఆంధ్రజ్యోతి' పత్రిక చదువుతున్నా. ఈ పత్రిక చదవకపోతే సమాజంలో ఏం జరుగుతోందో వాస్తవాలు తెలియవు. 'ఆంధ్రజ్యోతి'లో నిజాయితీతో కూడిన వార్తలుంటాయి. నేను రైల్వే ఉద్యోగిగా ఉన్న రోజుల్లో ఎక్కడున్నా ఈ పత్రికను చదివేవాడిని. నా జీవితం ఇప్పటి వరకు సైకిల్‌తో సాగింది. ఇక నుంచి సైకిల్‌ను పక్కన పెట్టేసి 'ఆంధ్రజ్యోతి' ఇచ్చిన కారులో నేను, నా కుటుంబం వెళ్తాం. ఈ సంతోషం మరువరానిది." అంటూ విజేత కోటేశ్వరరావు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' నెల్లూరు సిబ్బంది పాల్గొన్నారు.

లోకం తీరు



ఐప్యాక్‌కు 'డబ్బుల్' ధమాకా!

(మొదటి పేజీ తరువాయి)

రామ్ ఇన్ఫో సంస్థకు నాలుగేళ్లలో రూ.274 కోట్లు సమర్పించిన విషయం వెలుగుచూసిన సంగతి తెలిసిందే. ఆ డబ్బు మరో మార్గంలో ఐప్యాక్‌కే చేరిందన్న అనుమానాలున్నాయి. ఇప్పుడు మరో దందా వెలుగులోకి వచ్చింది. వలంటీర్లపై పర్యవేక్షణ పేరిట రామ్ ఇన్ఫోకు మరో కాంట్రాక్టు ఇచ్చి రూ.280 కోట్లు సమర్పించారు. ఈ డబ్బు కూడా రూట్ మారి ఐప్యాక్‌కే చేరిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తమ్మీద జగన్ ప్రభుత్వంలో వలంటీర్లకు శిక్షణ, పర్యవేక్షణ పేరిట నాలుగేళ్లలో నికరంగా రూ.554 కోట్ల రూపాయల ప్రజాధనాన్ని సమర్పించారు.

పర్యవేక్షణ అంటూ నిఘా

వలంటీర్లపై పర్యవేక్షణ అంటే.. వారు ఏం పని చేస్తున్నారు? ఎక్కడికి వెళ్లాలి? ఎలాంటి డేటా సేకరించాలి? ఆ డేటాను ఎవరికి అందించాలి? అన్న అంశాలపై దిశానిర్దేశం చేసేందుకు జగన్ ప్రభుత్వంలో రామ్ ఇన్ఫోకు రూ.280 కోట్లకు మరో కాంట్రాక్టు ఇచ్చారు. దానిపేరు మానవ వనరుల కాంట్రాక్ట్. రామ్ ఇన్ఫో యూని కార్పొరేట్ అనే సంస్థతో కన్సార్షియంగా ఏర్పడింది. ఆ సంస్థ పేరిట పర్యవేక్షణ వ్యవహారాలు నడిపించింది. మానవ వనరుల కింద రాష్ట్ర వ్యాప్తంగా 1045 మందిని ఆ సంస్థ దింపింది. మండలం, రెవెన్యూ డివిజన్, జిల్లా కేంద్రాల్లో ఒక్కొక్కరు చొప్పున పనిచేశారు. పైకి రామ్ ఇన్ఫో ప్రతినిధులుగా చెలామణి అయినా వీరంతా ఐప్యాక్‌కు చెందినవారని అధికార వర్గాలు అనుమానిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో సూపర్ బాస్‌లుగా వ్యవహరించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, ఇతర అధికార యంత్రాంగం దగ్గరికి వెళ్లి తాము ఫలానా ప్రతినిధులమని చెప్పి డేటా సేకరించేవారు. వీరు ఇచ్చే సమాచారాన్నే జగన్ ఎక్కువగా పరిగణనలోకి తీసుకునేవారు. దీంతో వీరంటే.. కలెక్టర్లు, ఇతర అధికారులు భయపడేవారు. వీరు వస్తున్నారంటే వీవీఐపీ ట్రీట్‌మెంట్ ఇచ్చేవారు. వీరు వైసీపీ ప్రభుత్వంలో ప్రత్యేక నిఘా వ్యవస్థలా పనిచేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు, జిల్లా కలెక్టర్లు నిర్వహించే సమావేశాల్లో సైతం అనధికార ప్రతినిధులుగా కూర్చొనేవారు. నిజానికి రామ్ ఇన్ఫోతో ప్రభుత్వం చేసుకున్న కాంట్రాక్టు ఒప్పందం ప్రకారం.. వలంటీర్ల పనితీరును పర్యవేక్షించడం వారి బాధ్యత. కానీ ప్రభుత్వ పనితీరునే పర్యవేక్షించి నివేదికలు ఇచ్చేవారు. ఆ నివేదికలు నేరుగా ఐప్యాక్‌కు చేరేవి. ఇలా జిల్లాల నుంచి వచ్చే నివేదికలను ఐప్యాక్ క్రోడీకరించి అంశాల వారీగా జగన్‌కు అందించేది. ఒక దశలో ఇంటెలిజెన్స్ ఇచ్చే నివేదికల కన్నా వీరు ఇచ్చే రిపోర్టులపైనే ఎక్కువగా ఆధారపడి సీఎం హోదాలో జగన్ నిర్ణయాలు తీసుకునేవారు. పేరుకు మాత్రమే రామ్ ఇన్ఫోకు కాంట్రాక్టు ఇచ్చారు. కానీ అసలు పని అంతా తెరవెనక ఐప్యాక్ నడిపించినట్టు తెలుస్తోంది. ఈ కాంట్రాక్టు కింద జగన్ సర్కారు చెల్లించిన రూ.280 కోట్లు వయా రామ్ ఇన్ఫో నుంచి ఐప్యాక్‌కు చేరి ఉంటాయన్న అనుమానాలు, సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అదాన్ డిస్టిలరీస్‌తో లింకేమిటి?

మానవ వనరుల కాంట్రాక్ట్ కింద రామ్ ఇన్ఫోతో కలిసి పనిచేసిన యూని కార్పొరేట్ సంస్థకు అదాన్ డిస్టిలరీస్‌తో ఉన్న అనుబంధం ఏమిటో తెలియాల్సి ఉంది. 2021లో ఈ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్న సమయంలో దాని అడ్రస్ అదాన్ డిస్టిలరీస్ అడ్రస్ ఒక్కటిగానే ఉండింది. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' అప్పట్లోనే ఆధారాలతో సహా బయటపెట్టింది. అదాన్ డిస్టిలరీస్, యూని కార్పొరేట్ సొల్యూషన్ చిరునామాలు అప్పట్లో హైదరాబాద్‌లోని ప్రశాంతి హిల్స్‌లో ఉన్నాయి. ఇది ఖాజాగూడలో ఉంది. 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన తర్వాత రెండు కంపెనీలు అడ్రస్‌లు మార్చాయి. ఇప్పుడు ఇదే అదాన్ డిస్టిలరీస్ వేల కోట్ల మద్యం కుంభకోణంలో ఇరుక్కుంది. ఆ సంస్థకు యూని కార్పొరేట్ సంస్థతో ఉన్న అనుబంధం ఏమిటో తేలితే అసలు గుట్టు బయటకొస్తుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. వైసీపీ నేతలు ఇలాంటి కంపెనీలు పుట్టించి వాటికి టెండర్లు కట్టబెట్టి ప్రభుత్వ సొమ్మును దోచుకొని ఉంటారన్న అనుమానాలున్నాయి. కూటమి ప్రభుత్వం సమగ్ర విచారణ చేస్తే అసలు గుట్టు బయటపడుతుందని అధికారవర్గాలు చెబుతున్నాయి.

వైసీపీ-ఐప్యాక్ ప్రత్యేక బంధం

వైసీపీతో ఐప్యాక్‌కు ఎనలేని అనుబంధం ఉంది. ప్రతిపక్షాలపై అబద్ధపు ప్రచారాలు చేయడం, వైసీపీకి లేని బలాన్ని ఉన్నట్లు చూపడం, అబద్ధాన్ని నిజంగా, సత్యాన్ని అవాస్తవంగా ప్రచారం చేయడం తనకు వెన్నతో పెట్టిన విద్య అన్నట్లుగా వ్యవహరించింది. ఇలా అబద్ధాల మేడలపై జగన్‌కు రాజకీయంగా మేలు చేసి 2019లో అధికార పీఠంపై కూర్చోబెట్టేలా ఆ సంస్థ పనిచేసింది. అందుకు ఆయన ఎంత రుణం తీర్చుకున్నారో బయటకు చెప్పలేదు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా ఆ సంస్థ సేవలను అటు వైసీపీకి, ఇటు ప్రభుత్వం కోసం వినియోగించుకున్నారు. వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చిన ఆయన దాని శిక్షణ బాధ్యతలను ఆ సంస్థకే అప్పగించాలనుకున్నారు. అయితే రాజకీయ విమర్శలు వస్తాయని ముందు జాగ్రత్తగా రామ్ ఇన్ఫో అనే సంస్థను తెరపైకి తీసుకొచ్చారు. నిజానికి ఆ సంస్థ శిక్షణ ఇచ్చింది లేదు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వారు ఐప్యాక్ కనుసన్నల్లోనే పనిచేశారు. ఇదే తరహాలో వలంటీర్లపై పర్యవేక్షణ కాంట్రాక్టు సాగింది.

అనంత మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య కన్నుమూత

- పొలం వద్దకు వెళ్లి వస్తుండగా గుండెపోటు
- రేపు అంత్యక్రియలు... పలువురి సంతాపం



మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య

బళ్లారి, మే 12(ఆంధ్రజ్యోతి): అనంతపురం మాజీ లోక్‌సభ సభ్యుడు దరూరు పుల్లయ్య (93) సోమవారం గుండెపోటుతో కన్నుమూశారు. బళ్లారి నగరంలోని దరూరు పుల్లయ్య కాంపౌండ్‌లో ఆయన నివాసం ఉంటున్నారు. సోమవారం బళ్లారి నుంచి కంప్లి కొట్టాల వద్దనున్న పొలాన్ని చూడటానికి కారులో వెళ్లారు. పొలం చూసి ఇంటికి వస్తుండగా కంప్లిలో రోడ్డు పక్కన ఉన్న స్నేహితుడితో మాట్లాడేందుకు కారు దిగారు. అక్కడే కుప్పకూలిపోయి మరణించారు. ఆయన మృతదేహాన్ని బళ్లారిలోని ఇంటికి తరలించారు. దరూరు పుల్లయ్య సొంతూరు అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం ఛాయాపురం. మద్రాస్‌లో లా పూర్తి చేసిన ఆయన... ఉరవకొండ పంచాయతీ సమితి ప్రెసిడెంటుగా 1968 నుంచి 78 వరకూ చేశారు. రెండు దఫాలు... 1977, 1980 ఎన్నికల్లో పుల్లయ్య అనంతపురం ఎంపీగా కాంగ్రెస్ పార్టీ తరపున గెలుపొందారు. ఎన్నో సేవా కార్యక్రమాలు, దానధర్మాలు చేశారు. పుల్లయ్య మరణంతో ఆయన కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. ఆయన పార్థివ దేహాన్ని సందర్శనార్థం బళ్లారిలోని దరూరు పుల్లయ్య కాంపౌండ్‌లో ఉంచారు. ఆయనకు భార్య సత్యవతి, ఆరుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ నెల 14వ తేదీ, బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతికి పలువురు ప్రజాప్రతినిధులు, కమ్మ సంఘం నేతలు సంతాపం తెలిపారు.

భూ మార్పిడి చట్టాన్ని రద్దు చేయాలి

- సీఎం చంద్రబాబుకు పరిశ్రమల సమాఖ్య లేఖ

అమరావతి, మే 12(ఆంధ్రజ్యోతి): వ్యవసాయేతర ప్రయోజనాల కోసం భూ మార్పిడి చట్టం-2006ను వెంటనే రద్దు చేయాలని రాష్ట్ర పరిశ్రమల సమాఖ్య (ఏపీ ఛాంబర్స్) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఏపీ ఛాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. ఈ చట్టాన్ని రద్దు చేస్తామని మార్చి 27న సీఎం ప్రకటించారని, దీంతో పారిశ్రామికవేత్తలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈ చట్టం (వ్యవసాయ భూములను వ్యవసాయేతర ప్రయోజనాల కోసం మార్పిడి)ను రద్దు చేయడం వల్ల పెట్టుబడులు త్వరగా కార్యరూపం దాలుస్తాయని, తద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతుందని భాస్కరరావు ఆ లేఖలో పేర్కొన్నారు.

వీధికుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

- త్వరగా పూర్తి చేయాలని మంత్రి నారాయణ ఆదేశం

అమరావతి, మే 12(ఆంధ్రజ్యోతి): వీధికుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. సోమవారం మంత్రి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలు పడే వరకు తాగునీటికి ఎక్కడా ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలను కొనసాగించాలన్నారు. వర్షాకాలం వచ్చే లోపు డ్రైన్ల పూడికతీత పూర్తి చేయాలని నిర్దేశించారు. తిరుపతి, విశాఖ, గుంటూరులో టీడీఆర్ బాండ్ల జారీని వేగవంతం చేయాలన్నారు. అన్న క్యాంటీన్లలో ఎప్పటికప్పుడు ఆహారం నాణ్యతను పరీక్షించాలని ఆదేశించారు. పన్నుల వసూళ్లలో అలసత్వం లేకుండా ఆదాయంపై దృష్టి సారించాలని, చండీగఢ్ తరహాలో రోడ్డుకు ఇరువైపులా చెట్లు నాటాలని ఆదేశించారు.

జీతాల సమస్య పరిష్కారం

- డీడీఓ అధికారాలున్న గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు ఊరట

అమరావతి, మే 12(ఆంధ్రజ్యోతి): కొత్తగా డీడీఓ(డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్) అధికారాలు పొందిన గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు పొజిషన్ ఐడీలు తయారవడంతో వారి జీతాల సమస్యకు పరిష్కారం లభించింది. వీరు రాష్ట్రవ్యాప్తంగా 650 మంది ఉన్నారు. గత 8 నెలలుగా పొజిషన్ ఐడీలు లేక వీరికి జీతాలు రావడం లేదు. ఇటీవల వీరు ఈ సమస్యను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ కృష్ణతేజ దృష్టికి తీసుకురావడంతో ఆయన ట్రెజరీశాఖకు లేఖ రాసి వారందరికీ పొజిషన్ ఐడీలు తయారు చేయించారు.

అప్పు కింద ట్రాక్టరు లాగేసుకుని..

వైసీపీ నాయకుడి జులుం

- మనస్తాపంతో కౌలు రైతు ఆత్మహత్య.. పొన్నూరులో విషాదం

పొన్నూరుటౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన బాకీ చెల్లించాలని దౌర్జన్యానికి పాల్పడటమే కాకుండా బలవంతంగా ట్రాక్టర్ కూడా గుంజుకోవడంతో కౌలురైతు తన్నీరు శ్రీనివాసరావు ఆత్మహత్య చేసుకున్నారు. వైసీపీ నేత అరాచకానికి బలయ్యారు. పోలీసుల కథనం ప్రకారం, గుంటూరు జిల్లా పొన్నూరు మండల పరిధిలోని వడ్డిముక్కల గ్రామానికి చెందిన శ్రీనివాసరావు(60) ఐదు ఎకరాల పొలం కౌలుకు సాగు చేస్తున్నారు. వ్యవసాయ పనుల నిమిత్తం 2023లో నిడుబ్రోలు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, వైసీపీ నేత నన్నపనేని వీరయ్య చౌదరి వద్ద రూ.1.70 లక్షలు అప్పు తీసుకున్నారు. అందులో కొంత భాగం చెల్లించారు. మిగిలిన అప్పు తీర్చడానికి కొంత గడువు ఇవ్వాలని వీరయ్య చౌదరిని కోరారు. అందుకు అంగీకరించని ఆయన గురువారం శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి దుర్భషలాడారు. అప్పు కింద శ్రీనివాసరావు ట్రాక్టర్‌ను బలవంతంగా తీసుకువెళ్లారు. దీనిపై అదేరోజు శ్రీనివాసరావు పొన్నూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదుచేశారు. అయితే, ట్రాక్టర్ లాగేసుకున్నారనే మనస్థాపంతో శ్రీనివాసరావు శుక్రవారం పురుగుల మందు తాగారు. అప్పటినుంచి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆయన సోమవారం మరణించారు. గ్రామంలో మొక్కజొన్న, మట్టి తవ్వకాల పనులకు ట్రాక్టర్లకు మంచి డిమాండ్ ఉంది. నాలుగు డబ్బులొచ్చే సమయంలో ట్రాక్టర్ దూరం కావడాన్ని తట్టుకోలేక శ్రీనివాసరావు ఆత్మహత్యకు పాల్పడ్డారని పోలీసు వర్గాలు తెలిపాయి. వీరయ్యచౌదరి, ఆయన అనుచరుడు పిచ్చయ్య కోసం పోలీసులు గాలిస్తున్నారు.

మన సీట్లు మనకే

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతుంది. ఉదాహరణకు ఆంధ్రా యూనివర్సిటీ రీజియన్‌లో.. ఏయూ రీజియన్‌కు 85శాతం సీట్లు వస్తాయి. మిగిలిన 15శాతం సీట్లు అన్ రిజర్వ్‌డ్‌గా ఉంటాయి. వాటిలో అటు ఆంధ్రా, ఇటు వెంకటేశ్వర యూనివర్సిటీల విద్యార్థులు అడ్మిషన్లు పొందవచ్చు. అంటే మొత్తం వంద శాతం సీట్ల పంపిణీ ఆంధ్రా, వెంకటేశ్వరా రీజియన్ల మధ్యే జరుగుతుంది. గతంలో 15 శాతం కోటాలో ఉస్మానియా వర్సిటీ రీజియన్ కూడా ఉండేది. ఇప్పుడు దానిని తొలగించారు.

స్థానిక కోటా(85%) అర్హత ఇలా..

- స్థానిక కోటాలో అడ్మిషన్ పొందేందుకు అవసరమైన అర్హతను నిర్ధారించే కోర్సుతో పాటు అంతకముందు వరుసగా నాలుగేళ్ల ఆ ప్రాంతంలోనే చదివి ఉండాలి. ఉదాహరణ: బీటెక్‌లో అడ్మిషన్ పొందాలంటే ఇంటర్మీడియట్ రెండేళ్లు, పదో తరగతి, తొమ్మిదో తరగతి అదే ప్రాంతంలో చదివి ఉండాలి.
- వరుసగా నాలుగేళ్లు అదే ప్రాంతంలో చదవని విద్యార్థులు అర్హత పరీక్ష ప్రారంభమయ్యే నాటికి ముందు వరుసగా ఆ ప్రాంతంలో నాలుగేళ్ల పాటు నివాసం ఉండి ఉండాలి.
- మొత్తం నాలుగేళ్లు లేదా అందులో కొంతకాలం వేర్వేరు ప్రాంతాల్లో చదివి ఉంటే.. అర్హత పరీక్ష నాటికి ముందు వరుసగా ఏడేళ్లు రాష్ట్రంలో చదివి, అందులో ఎక్కువ కాలం ఏ రీజియన్‌లో చదివితే దానిని స్థానికతకు ప్రామాణికంగా తీసుకుంటారు. ఒకవేళ రెండు ప్రాంతాల్లో సమానంగా చదివి ఉంటే చివరి సంవత్సరం చదివిన ప్రాంతాన్ని స్థానికంగా గుర్తిస్తారు.
- మొత్తం ఏడేళ్లు లేదా అందులో కొంతకాలం వేర్వేరు ప్రాంతాల్లో చదివి ఉంటే అర్హత పరీక్ష రాసే సమయానికి ముందు ఏడేళ్లు ఆ ప్రాంతంలో నివాసం ఉండాలి. దీనిలో ఎక్కువ ఏళ్లు ఎక్కడ ఉంటే దానిని స్థానిక ప్రాంతంగా గుర్తిస్తారు. ఒకవేళ రెండు ప్రాంతాల్లో సమానంగా చదివి ఉంటే చివరి సంవత్సరం చదివిన ప్రాంతాన్ని స్థానికతగా గుర్తిస్తారు.

అన్‌రిజర్వ్‌డ్ కోటా(15%) అర్హత ఇలా..

- రాష్ట్రంలోని అందరూ అన్‌రిజర్వ్‌డ్ కోటా 15 శాతానికి అర్హులే.
- ఒకవేళ విద్యార్థులు బయట రాష్ట్రాల్లో చదివి ఉంటే.. అలా చదివిన కాలం కాకుండా పదేళ్లు రాష్ట్రంలో నివాసం ఉండాలి. లేదా వారి తల్లిదండ్రులు రాష్ట్రంలో పదేళ్లు నివాసం ఉండాలి. అప్పుడే వీరు అన్‌రిజర్వ్ కోటాకు అర్హులు.
- రాష్ట్రంలో పనిచేస్తున్న రాష్ట్ర, కేంద్ర, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు, విశ్వవిద్యాలయాలు, ఇతర ప్రభుత్వ సంస్థలలోని ఉద్యోగుల పిల్లలు, జీవిత భాగస్వాములు అర్హులు.

'సజ్జల'ను కస్టడీకి ఇవ్వండి

- మద్యం కుంభకోణం కేసులో ఏసీబీ కోర్టులో సిట్ పిటిషన్
- బెయిల్ కోరిన కసిరెడ్డి పీఏ.. విచారణ 15కు వాయిదా



విజయవాడ, మే 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో నిందితుడు సజ్జల శ్రీధర్‌రెడ్డి(ఏ-6)ని కస్టడీకి ఇవ్వాలని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) అధికారులు ఏసీబీ కోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. శ్రీధర్‌రెడ్డి నుంచి కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలు రాబట్టాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆయనను ఐదు రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. అయితే, ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను న్యాయస్థానం ఈ నెల 15కి వాయిదా వేసింది. మరోవైపు, మద్యం కుంభకోణం కేసులో జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి(పీఏ) దిలీప్ ఏసీబీ కోర్టులో సోమవారం బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో దిలీప్ ఏ-30గా ఉన్నారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయడానికి గడువు కావాలని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టును అభ్యర్థించారు. దీంతో న్యాయస్థానం కేసును ఈ నెల 15కి వాయిదా వేసింది.

రెండోసారి పీఎస్ఆర్ బెయిల్ పిటిషన్

విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు రెండోసారి కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసులో ఆయన అరెస్టయిన విషయం తెలిసిందే. కొద్దిరోజుల క్రితం ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను మూడో అదనపు చీఫ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు కొట్టేసింది. దీంతో పీఎస్ఆర్ సోమవారం రెండోసారి బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.

వంశీపై 2019 ఎన్నికల కేసు.. ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరు



టీడీపీ కార్యకర్త ముదునూరి సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని పోలీసులు సోమవారం ప్రజాప్రతినిధుల కేసుల విచారణ కోర్టులో హాజరుపరిచారు. 2019, ఎన్నికల సమయంలో వంశీ టీడీపీ తరఫున పోటీ చేశారు. ఆ సమయంలో వైసీపీ నుంచి పోటీ చేసిన యార్లగడ్డ వెంకట్రావు.. ప్రసాదంపాడులోని పోలింగ్ బూత్‌లో రిగ్గింగ్ జరుగుతోందని అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్కడికి చేరుకున్న వంశీ, ఆయన అనుచరులు జాతీయ రహదారిని దిగ్బంధించారు. దీనిపై పటమట పోలీసులు కేసులు నమోదు చేశారు. వంశీపై నమోదైన మూడు కేసుల్లోను పీటీ వారెంట్‌పై కోర్టులో హాజరుపరిచారు. కోర్టు తదుపరి విచారణను జూన్ 3కి వాయిదా వేసింది.

వద్దన్నా జనాన్ని ఎందుకు తెచ్చారు?

- హెలిప్యాడ్‌లోకి ఎందుకు పోనిచ్చారు?
- ఇందులో ఏదో కుట్ర దాగి ఉందనిపిస్తోంది...
- మీ ప్రమేయంపై మావద్ద ఆధారాలున్నాయి
- వైసీపీ ఇన్‌చార్జిగా జగన్ బాధ్యత మీది కాదా?
- తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డిపై పోలీసుల ప్రశ్నలవర్షం
- చాలా ప్రశ్నలకు తెలియదు అంటూ దాటవేత
- నేడు విచారణకు పైలట్ అనిల్‌కుమార్



శ్రీసత్యసాయి జిల్లాలోని రామగిరి సర్కిల్ కార్యాలయానికి విచారణ కోసం వస్తున్న తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి

ధర్మవరం/చెన్నేకొత్తపల్లి, మే 12(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ హెలిప్యాడ్ కేసులో ప్రధాన నిందితుడు, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి సోమవారం న్యాయవాదితో కలిసి శ్రీసత్యసాయి జిల్లా రామగిరి పోలీసు సర్కిల్ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. కో-పైలట్ నుంచి సేకరించిన విషయాలను ముందుపెట్టి తోపుదుర్తిని ప్రశ్నించినా.. తెలియదు, గుర్తు లేదు అంటూ ఆయన చాలా ప్రశ్నలను దాటవేశారు. లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ చేసిన పర్యటనతో భారీగా జన సమీకరణ వద్దని ముందే సూచించినా.. ఎందుకు పెడచెవిన పెట్టారంటూ ప్రకాశ్‌రెడ్డిని రామగిరి సీఐ శ్రీధర్ నేరుగా ప్రశ్నించారు. వీటన్నింటి వెనుక ఏదో కుట్రకోణం ఉందన్న అనుమానం కలుగుతోందంటూ స్పష్టం చేశారు. "వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయిన మీకు జగన్ రక్షణ బాధ్యత లేదా? గతనెల 8న కుంటిమద్దిలో హెలికాప్టర్ ల్యాండ్ అయ్యే సమయంలో మీ పార్టీ శ్రేణులు హెలిప్యాడ్‌లోకి దూసుకెళ్తున్నా ఎందుకు నిలువరించలేకపోయారు? హెలిప్యాడ్ విండ్‌షీల్డ్ దెబ్బతిన్న విషయం మీకు ఎప్పుడు తెలిసింది? జగన్ తిరుగు ప్రయాణానికి మరో హెలికాప్టర్‌ను ఎందుకు ఏర్పాటుచేయలేదు? రోడ్డుమార్గాన ఆయన ఎందుకు వెళ్లారు?" అంటూ ప్రకాశ్‌రెడ్డిపై పోలీసులు ప్రశ్నల వర్షం కురిపించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.10 గంటలదాకా విచారణ కొనసాగింది. పోలీసులు దాదాపు 102 ప్రశ్నలదాకా సంధించి, సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేశారు. మాజీ సీఎం పర్యటనకు సంబంధించి తన బాధ్యత ఏమీలేదనీ, అంతా వైసీపీ జిల్లా యంత్రాంగమే చూసుకుందని ప్రకాశ్‌రెడ్డి తెలిపినట్టు సమాచారం. హెలిప్యాడ్ వద్దకు జనం దూసుకెళ్తుంటే మైకు ద్వారా తానే వెళ్లవద్దని వారించాననీ, తమ నాయకుడికి అత్యవసర ప్రయాణం ఉండటంతో రోడ్డుమార్గంలో వెళ్లారని చెప్పినట్టు తెలిసింది. "హెలిప్యాడ్ వద్ద జరిగిన ఘటనలో మీకు, మీ వైసీపీ శ్రేణులకు ప్రమేయం ఉన్నట్లు మావద్ద ఆధారాలున్నాయ"ని ప్రకాశ్‌రెడ్డికి పోలీసులు గట్టిగా చెప్పినట్టు తెలిసింది. కాగా, హెలిప్యాడ్ ఘటనలో విచారణకు పైలట్ అనిల్‌కుమార్ మంగళవారం హాజరవనున్నారు. ఇప్పటికే రెండు సార్లు ఆయన విచారణకు గైర్హాజరయ్యారు. వయసు, అనారోగ్యం కారణంగా నేరుగా హాజరుకాలేనని వర్చువల్‌గా అవకాశం ఇవ్వాలని పోలీసులకు అనిల్‌కుమార్ విన్నవించారు. అలా కుదరదనీ, భౌతికంగా హాజరు కావాల్సిందేనంటూ పోలీసులు మూడోసారి నోటీసు పంపించారు. ఈనెల 13న రామగిరి సర్కిల్ కార్యాలయంలో హాజరుకావాలని అందులో స్పష్టం చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే కోపైలట్ శ్రేయస్ జైన్‌ను విచారించారు.

మీడియాపై తోపుదుర్తి అక్కసు

కుంటిమద్ది హెలిప్యాడ్ ఘటనకు పోలీసుల వైఫల్యమే కారణమని రాప్తాడు వైసీపీ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి ఆరోపించారు. విచారణ అనంతరం బయటకు వచ్చిన ఆయన.. ప్రశ్నించబోయిన మీడియాపై అక్కసు వెళ్లగక్కారు. లింగమయ్య హత్యను మరుగుపరిచేందుకు కొన్ని మీడియా సంస్థలు ప్రయత్నిస్తున్నాయంటూ నోరు పారేసుకున్నారు. మీడియా బాధ్యత లేకుండా వ్యవహరిస్తోందన్నారు. జగన్ పర్యటన సందర్భంగా జన సమీకరణలో తానే రెచ్చగొట్టేలా వ్యవహరించానని పోలీసులు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కాగా, ఇదే కేసులో తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి సోదరుడు రాజశేఖర్‌రెడ్డికి; వైసీపీ నాయకులు నరేంద్రరెడ్డి, బాలనాగిరెడ్డికి బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసులు ఇచ్చామని, వారికి త్వరలోనే విచారణకు పిలుస్తామని పోలీసులు తెలిపారు.

ప్రతి ధాన్యం గింజా కొనాల్సిందే..

- ట్రాక్టర్లతో రోడ్డెక్కిన కొవ్వూరు, చాగల్లు రైతులు
- రెండున్నర గంటల పాటు జాతీయ రహదారి దిగ్బంధం



కొవ్వూరు, గుండుగొలను జాతీయ రహదారిపై ధాన్యం ట్రాక్టర్లు అడ్డుగా పెట్టి ఆందోళన చేస్తున్న రైతులు

కొవ్వూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): "రైతు సేవా కేంద్రా (ఆర్ఎస్‌కే)ల్లో కొనుగోళ్ల లక్ష్యం పూర్తయిపోయిందంటూ సిబ్బంది ధాన్యం తీసుకోవడంలేదు. మరి పండించిన పంటను ఏం చేయాలి..? ప్రభుత్వం ప్రకటించిన విధంగా పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేయాల్సిందే. అప్పటిదాకా ఆందోళన విరమించేది లేదు.." అంటూ తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు, చాగల్లు మండలాల రైతులు సోమవారం రోడ్డెక్కారు. కొవ్వూరు, గుండుగొలను జాతీయ రహదారిపై గామన్ బ్రిడ్జి టోల్‌ప్లాజా సమీపంలో ధాన్యం ట్రాక్టర్లను అడ్డంగా పెట్టి ఆందోళన చేపట్టారు. ఎండను సైతం లెక్క చేయకుండా సుమారు రెండున్నర గంటల పాటు జాతీయ రహదారిని దిగ్బంధం చేశారు. పంట మొత్తం కొనుగోలు చేస్తామని జేసీ, ఆర్డీవోలు హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు, తహసీల్దార్, వ్యవసాయ శాఖ అధికారులు అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. రోడ్డుకు అడ్డంగా పెట్టిన ధాన్యం ట్రాక్టర్లను తొలగించి ట్రాఫిక్ క్లియరెన్స్‌కు సహకరించాలని కోరారు. పోలీసులు రైతులను బలవంతంగా తరలించే ప్రయత్నం చేశారు. అయినా వారు తమ సమస్య పరిష్కారమయ్యే వరకు ఆందోళన విరమించేది లేదని పట్టుబట్టారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ రైతులను చూసి కారు దిగి వచ్చి విషయం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని.. ఆందోళన చెందనవసరం లేదని చెప్పారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

మండిన కోస్తా



- వడగాడ్పులు, ఉక్కపోత.. పలుచోట్ల 41డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత
- ఈదులగూడెంలో 43.09 డిగ్రీలు
- నేడూ పలుప్రాంతాల్లో వడగాడ్పులు

విశాఖపట్నం/అమరావతి, మే12(ఆంధ్రజ్యోతి): భానుడు భగ్గుమంటున్నాడు. రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. అగ్నికార్తె (రెండు రోజుల క్రితం కృతిక కార్తె ప్రారంభం) ప్రారంభం కావడంతో కోస్తా, రాయలసీమల్లో ఎండ తీవ్రత మరింత పెరిగింది. పలుప్రాంతాల్లో 41 డిగ్రీల కన్నా అధికంగా ఉష్ణోగ్రత నమోదైంది. ఏలూరు జిల్లా ఈదులగూడెంలో 43.09 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. పల్నాడు జిల్లా కాకానిలో 43.7, బాపట్ల జిల్లా ఇం కొల్లులో 43.5, ప్రకాశం జిల్లా జువ్విగుంటలో 43.3, ఎన్టీఆర్ జిల్లా మొగులూరులో 43.1, తూర్పు గోదావరి జిల్లా చిట్యాలలో 42.8, ఏలూరులో 42.6, తిరుపతి జిల్లా గూడూరులో 42.3 డిగ్రీలు, పల్నాడు జిల్లా జంగమహేశ్వరపురంలో 42.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీనికితోడు వాయవ్య భారతం నుంచి పొడిగాలులు వీచాయి. ఇంకా గాలిలో తేమశాతం పెరగడంతో ఉక్కపోత నెలకొంది. రాయలసీమకంటే కోస్తాలో ఉక్కపోత ఎక్కువగా ఉండడంతో ప్రజలు అల్లాడిపోయారు. మంగళవారం రాష్ట్రం లో 42.0నుంచి 43.5 డిగ్రీల మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని విపత్తు నిర్వహణ సంస్థ పేర్కొంది. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లోని 53మండలాల్లో వడగాడ్పుల ప్రభావం ఉంటుందని, 21 మండలాల్లో తీవ్రంగా ఉంటుందని హెచ్చరించింది. కాగా, ఎండ తీవ్రతతో వాతావరణ అనిశ్చితి నెలకొని సోమవారం సాయంత్రం పలుచోట్ల వర్షాలు కురిశాయి. అలాగే రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఇదిలావుండగా దక్షిణ అండమాన్ సముద్రం, దక్షిణ బంగాళాఖాతం, నికోబార్ దీవులను మంగళవారం నైరుతి రుతుపవనాలు తాకుతాయని వాతావరణ శాఖ పేర్కొంది. ప్రస్తుతం అండమాన్, నికోబార్ దీవుల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని, దీంతో రుతుపవనాలు ప్రవేశానికి వాతావరణం అనుకూలంగా మారిందని తెలిపింది.

పిడుగుపాటుకు ఇద్దరు మృతి

శ్రీకాకుళం/సీతానగరం/మెంటాడ/సీతానగరం, మే 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో సోమవారం పలుచోట్ల పిడుగులు పడ్డాయి. రెండు జిల్లాల్లో మృతిచెందారు. శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం పాలవలస గ్రామానికి చెందిన దాసరి అప్పన్న(47) చిగురువలస పంచాయతీ పరిధిలోని తాడికొండ వద్ద గొర్రెల మందను మేతకు తీసుకువెళ్లిన సమయంలో ఉరుములు, మెరుపులతో పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విజయనగరం జిల్లా మెంటాడ మండలం కుంటినివలస గ్రామానికి చెందిన కొల్లి రాంబాబు (45) పులిగుమ్మి గ్రామ సమీపంలోని పొలాల్లో మట్టి తవ్వకాల పనిలో ఉండగా వర్షం మొదలై అతనికి దగ్గరగా పిడుగు పడింది. ఆ ధాటికి రాంబాబు అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. మట్టిపని వద్ద ఉన్న కొల్లి సింహాచలం, లోకార్పు మురళి గాయాలపాలయ్యారు. పార్వతీపురం మన్యం జిల్లా.. సీతానగరం మండలం సుభద్ర సీతారాంపురం గ్రామ సమీపంలో పిడుగుపాటుకు గుర్రై 11 గొర్రెలు మృతి చెందాయి.



తిరుమల శ్రీవారి ఆలయం ముందు జస్టిస్ రవీంద్రబాబు, జస్టిస్ అరవింద్

శ్రీవారి సేవలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి

తిరుమల, మే12(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రవీంద్రబాబు సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కేవీ అరవింద్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

శ్రీవాణి టికెట్లు మిగలడం లేదు: టీటీడీ

తిరుమల, మే12(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆఫ్‌లైన్‌లో ఇస్తున్న శ్రీవాణి దర్శన టికెట్లు మిగిలిపోయాయంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అబద్ధమని టీటీడీ సోమవారం ఓ ప్రకటన ద్వారా తెలిపింది. 'ఆన్‌లైన్‌లో 500 టికెట్లు, తిరుపతి ఎయిర్‌పోర్టులో 200 టికెట్లను అందుబాటులో ఉంచుతున్నాం. ఏరోజూ మిగిలిన సందర్భం లేదు. తిరుమలలో ప్రతిరోజు 800 టికెట్లను ఆఫ్‌లైన్‌లో జారీ చేస్తున్నాం. వందలాది టికెట్లు మిగిలిపోతున్నాయన్న ప్రచారం నిజం కాదు' అని టీటీడీ వివరణ ఇచ్చింది.

తిరుమల రెండో ఘాట్‌లో చిరుత కలకలం

తిరుమల, మే12(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండో ఘాట్‌రోడ్డులో సోమవారం చిరుత సంచారం కలకలం సృష్టించింది. బైకుపై వెళ్తున్న కొందరు వినాయకస్వామి ఆలయానికి సమీపంలో చిరుత రోడ్డు దాటడాన్ని గమనించి విజిలెన్స్, ఫారెస్ట్ సిబ్బందికి సమాచారమిచ్చారు. దీంతో ద్విచక్రవాహనదారులు వెళ్లవద్దని సూచనలు చేశారు.

గెస్ట్ జూనియర్ లెక్చరర్ల పారితోషికం పెంపు

అమరావతి, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న గెస్ట్ జూనియర్ లెక్చరర్ల పారితోషికం పెంచుతూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. గంటకు ప్రస్తుతం రూ.150 ఇస్తుండగా దానిని రూ.375 చేసినట్టు తెలిపారు. అయితే నెలకు గరిష్ఠంగా 72గంటల బోధన మాత్రమే చేయాలని, దానివల్ల వారికి గరిష్ఠంగా రూ.27వేల పారితోషికం అందుతుందని వివరించారు. దీనివల్ల 475 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న 1177 మంది గెస్ట్ జేఎల్స్‌కు లబ్ధి చేకూరనుంది.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల హాల్‌టికెట్లు విడుదల

అమరావతి, మే 12 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల హాల్ టికెట్లు అందుబాటులోకి తీసుకొచ్చినట్టు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయ రామరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. www.bse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా స్కూల్ లాగిన్ లేదా వ్యక్తిగత లాగిన్‌తో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ నంబరు 9552300009 ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఈనెల 19 నుంచి 28 వరకు సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. ప్రతిరోజూ ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు పరీక్షలు జరుగుతాయి.

నేటి నుంచి మాక్ ఎక్సర్‌సైజ్

- విపత్తుల జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన

అమరావతి, మే 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అత్యవసర, ఉద్రిక్త పరిస్థితులు, విపత్తు సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈనెల 13, 14, 16 తేదీల్లో పలు జిల్లాల్లో మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించనున్నట్లు విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ తెలిపారు. మంగళవారం విజయనగరం, ఏలూరు, ప్రకాశం, కడప జిల్లాల్లో... 14న మన్యం, అనకాపల్లి, పశ్చిమగోదావరి, గుంటూరు, పల్నాడు, నెల్లూరు, అన్నమయ్య, అనంతపురం జిల్లాల్లో... 16న కాకినాడ, చిత్తూరు జిల్లాల్లో విపత్తు నిర్వహణతో సంబంధమున్న విభాగాలన్నీ అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన కార్యకలాపాలపై మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహిస్తాయని ఆయన తెలిపారు. సంక్షోభ సమయాల్లో ప్రజలు ఎలా స్పందిస్తే ప్రమాదాలను నివారించవచ్చనే దానిపై మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించి భద్రతపై అవగాహన కల్పిస్తామని కూర్మనాథ్ చెప్పారు.

గ్రూప్-1 స్కామ్‌లో సవాంగ్ కూడా శిక్షార్హుడే

- పీఎస్ఆర్ అక్రమాలను దాచారు
- హాయ్‌ల్యాండ్ మూల్యాంకనంపై హైకోర్టుకు తప్పుడు సమాచారం
- సవాంగ్‌నూ విచారించాలి: నీలాయపాలెం



అమరావతి, మే 12(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 స్కామ్‌లో సీనియర్ ఐపీఎస్ పీఎస్ఆర్ ఆంజనేయులుతో పాటు ఏపీపీఎస్సీ మాజీ ఛైర్మన్ గౌతమ్ సవాంగ్ కూడా శిక్షార్హుడేనని బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ ఆరోపించారు. ఏపీపీఎస్సీ నిబంధనలకు విరుద్ధంగా పీఎస్ఆర్ హాయ్‌ల్యాండ్‌లో మాన్యువల్ మూల్యాంకనం చేయించారని, అనంతరం కమిషన్ ఛైర్మన్‌గా వచ్చిన సవాంగ్ దానిని దాచిపెట్టారని అన్నారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నోటిఫికేషన్‌లో మాన్యువల్ మూల్యాంకనం జరుగుతుందని స్పష్టంగా పేర్కొన్నారని, కానీ పీఎస్ఆర్ ఉద్దేశపూర్వకంగా డిజిటల్ విధానంలో మూల్యాంకనం చేయించారని అన్నారు. దానిపై అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించగా, మాన్యువల్‌గా చేయాలని ఆదేశించిందని తెలిపారు. దాన్ని ఆసరాగా తీసుకున్న పీఎస్ఆర్ గుంటూరు సమీపంలోని హాయ్‌ల్యాండ్ రిసార్ట్స్‌లో మాన్యువల్ మూల్యాంకనం ప్రారంభించి.. డ్రైవర్లు, వారి భార్యలు, వెల్డర్లు, పిల్లలతో మూల్యాంకనం చేయించారని ఆరోపించారు. పీఎస్ఆర్ బదిలీ తర్వాత ఛైర్మన్‌గా వచ్చిన గౌతమ్ సవాంగ్ మరిన్ని ఘోరాలకు పాల్పడ్డారని, డిజిటల్ మూల్యాంకనం, మాన్యువల్ మూల్యాంకనం ఫలితాల్లో 62 శాతం వ్యత్యాసం వచ్చిందని తెలిపారు. దీనిపై న్యాయస్థానం ఏపీపీఎస్సీకి చీవాట్లు పెట్టిందన్నారు. పీఎస్ఆర్ హయాంలో జరిగిన హాయ్‌ల్యాండ్ కథను సవాంగ్ కోర్టులో చెప్పకుండా తప్పుడు అఫిడవిట్ సమర్పించారని చెప్పారు. పీఎస్ఆర్ హాయ్‌ల్యాండ్‌లో చేయించిన మూల్యాంకనం గురించి సవాంగ్ ఎందుకు దాచిపెట్టారో చెప్పాలన్నారు. అలాగే అభ్యర్థులు రాసిన పేపర్లను రెండుసార్లు మూల్యాంకనం చేయిస్తే 62 శాతం తేడా ఎందుకు వచ్చిందో కూడా ఆయనకే తెలియాలన్నారు. ఏపీపీఎస్సీని పీఎస్ఆర్ తప్పుదోవ పట్టిస్తే, సవాంగ్ దానిని కొనసాగించారని విమర్శించారు. ఈ స్కామ్‌లో సవాంగ్‌ను కూడా విచారించాలని డిమాండ్ చేశారు.

వేలం లేకుండానే లీజు!

చౌకగా ఆలయాల వ్యవసాయేతర భూములు

- ప్రస్తుతం వేలం ద్వారా 11 ఏళ్ల వరకూ లీజు
- వేలం లేకుండా 33 ఏళ్ల వరకూ భూములు కట్టబెట్టేలా దేవుడి చట్ట సవరణకు నిర్ణయం
- ఆలయాల ఆదాయానికీ గండిపడే ప్రమాదం
- ప్రాథమిక నోటిఫికేషన్ జారీ
- ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టించి ప్రతిపాదనలు
- దేవదాయ ఉన్నతాధికారుల తీరుపై అభ్యంతరాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఏదైనా చట్ట సవరణ చేస్తే నిబంధనలు మరింత పకడ్బందీగా ఉండేలా మారుస్తారు. ఆస్తులకు సంబంధించిన చట్టమైతే వాటికి మరింత రక్షణ కల్పించేలా ప్రతిపాదనలు చేస్తారు. అయితే దేవదాయ, ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారులు ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఆలయాలకు సంబంధించిన వ్యవసాయేతర భూముల రక్షణకు పారదర్శకంగా ఉన్న చట్టంలోని నిబంధనలను మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. వేలం లేకుండా భూములను ఆయా సంస్థలకు లీజుకు అప్పగించి, ఎంత లీజు ఇస్తే అంత తీసుకునేలా సరికొత్త నిబంధనలు తీసుకురాబోతున్నారు. ప్రస్తుతం వేలం ద్వారా 11 ఏళ్ల వరకూ మాత్రమే లీజుకు ఇచ్చే అధికారం ఉండగా, ఏకంగా 33 ఏళ్ల వరకూ కూడా లీజు ఇచ్చే విధంగా సవరణ తీసుకొస్తున్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ చారిటబుల్ అండ్ హిందూ రిలీజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్ చట్టం-1987కు సవరణ చేయాలని నిర్ణయించారు. చట్ట సవరణకు సంబంధించిన ప్రాథమిక నోటిఫికేషన్‌కు ఆ శాఖ కార్యదర్శి వి.వినయ్ చంద్ ప్రత్యేక ఉత్తర్వులు కూడా జారీ చేసేశారు. చట్ట సవరణపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే 30 రోజుల్లో తెలియజేయాలని సూచించారు. ప్రస్తుతం దేవదాయ శాఖ ఏదైనా సంస్థకు లేదా వ్యక్తికి భూములు కేటాయించాలంటే 2003 చట్టంలోని నిబంధనలు పాటిస్తున్నారు. ఆ నిబంధనల ప్రకారం భూముల కేటాయింపునకు కచ్చితంగా వేలం నిర్వహించాలి. వేలంలో ఎవరు ఎక్కువకు పాడుకుంటే వారికి మాత్రమే భూములు కేటాయిస్తున్నారు. ఎలాంటి దాపరికాలూ లేకుండా దేవదాయ శాఖ అధికారికంగా బహిరంగ వేలం నిర్వహిస్తోంది. వేలం అనంతరం లీజుదారుడు ముందస్తుగా డబ్బులు చెల్లిస్తేనే కేటాయింపులు చేస్తారు. పైగా 11 సంవత్సరాల వరకు మాత్రమే లీజుకు ఇచ్చే అధికారం దేవదాయ శాఖ కమిషనర్‌కు ఉంది. పదకొండేళ్లకుపైగా సెంటు భూమి లీజుకు ఇవ్వాలన్నా ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాలి. ఆ భూములు అమ్మాలన్నా నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ముఖ్యంగా హైకోర్టు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ప్రజాప్రయోజనాల కోసం చేస్తున్నారంటేనే హైకోర్టు అనుమతి ఇస్తుంది. కానీ, 2003కు ముందు అధికారులు వేల ఎకరాల భూములను అడ్డగోలుగా అమ్మేశారు. ఇలా వదిలేస్తే దేవుడి భూములు మిగలవని నేరుగా హైకోర్టు జోక్యం చేసుకుంది. హైకోర్టు అనుమతి లేకుండా సెంటు భూమి కూడా అమ్మడానికి లేదు. లీజులు, లైసెన్సులు మాత్రం ఆంధ్రప్రదేశ్ చారిటబుల్ అండ్ హిందూ రిలీజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్ చట్టం-1987కు 2003లో చేసిన సవరణల ప్రకారం చేసుకునే వెసులుబాటు కల్పించింది. హైకోర్టు జోక్యం ఆ అధికారులకు తీవ్ర అడ్డంకిగా మారింది. వారు అనుకున్న సంస్థలకు భూములు దక్కడం లేదు. పైగా వేలం పెద్ద సమస్యగా మారింది. దీంతో చట్ట సవరణకు అధికారులు సిద్ధమయ్యారు. ప్రభుత్వాన్ని కూడా తప్పుదారి పట్టించి చట్ట సవరణకు సంబంధించిన ప్రతిపాదనలు పంపించారు. దీనికి ప్రభుత్వం కూడా ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసేసింది.

ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో వేల ఎకరాలు

దేవదాయ శాఖ పరిధిలోని వ్యవసాయ, వ్యవసాయేతర భూములు ఆయా ఆలయాలకు చెందినవి. వీటిలో ఆ శాఖ జోక్యం ఎంత తక్కువ ఉంటే అంత మంచిది. ఆలయాల నిర్వహణ కష్టంగా ఉన్నప్పుడు, ఆలయాల ఉద్ధరణకు, నిర్వహణకు ఎంతోమంది దాతలు దేవుడిపై భక్తితో భూములను ఆలయాలకు ఇస్తారు. ఆ భూములను కేవలం ఆలయాల నిర్వహణకు, అందులో పని చేసే ఉద్యోగులకు జీతభత్యాల కోసం మాత్రమే ఉపయోగించాలి. సంస్థలకు ఆలయ భూములను ఇవ్వడం వల్ల ఆలయానికి ఎలాంటి ఆదాయమూ రాదు. ఇప్పటికే ప్రముఖ ఆలయాలకు చెందిన వేల ఎకరాల వ్యవసాయేత భూములు ప్రైవేటు వ్యక్తుల్లో చేతుల్లో ఉన్నాయి. వాటిని విడిపించడం ఆ శాఖకు తలనొప్పిగా మారింది. ఇప్పుడు మరిన్ని భూ సమస్యలు దేవదాయ శాఖ నెత్తిన పెట్టడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. చట్ట సవరణ జరిగితే ఏ ఆలయానికీ వ్యవసాయేతర భూములు మిగిలే పరిస్థితి ఉండదు. అప్పుడు ఆలయాల నిర్వహణతో పాటు ఉద్యోగుల జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతుంది.

చట్ట సవరణ జరిగితే..

దేవదాయ శాఖ ప్రతిపాదించిన చట్ట సవరణ జరిగితే ఆలయాల వ్యవసాయేతర భూములను వేలం లేకుండానే ప్రైవేటు సంస్థలకు కేటాయించొచ్చు. కనీసం 20 ఏళ్ల లాభాపేక్ష లేకుండా, నిత్యం సేవా కార్యక్రమాలు చేయడమే భూమి పొందడానికి ప్రధాన అర్హత. ఈ విషయాన్ని సదరు సంస్థ లేఖ ద్వారా దేవదాయశాఖకు నిర్ధారించాలి. దీనికి సంబంధించిన అకౌంట్స్ వివరాలూ అందించాలి. భూములకు ఎంత లీజు చెల్లిస్తారన్న విషయాన్ని కూడా సంస్థ తెలియజేయాల్సి ఉంది. సంస్థ నిర్వహించే కార్యకలాపాల ఆధారంగా కూడా లీజు ఎంతో నిర్ధారిస్తారు. ఎంత అనేది అధికారులే నిర్ణయించేలా సవరణ చేయబోతున్నారు. పైగా 33 ఏళ్ల వరకూ కూడా లీజు ఇచ్చే విధంగా సవరణ తీసుకొస్తున్నారు. ఈ సవరణపై అనేక అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో రెండుసార్లు ఈ చట్టాన్ని సవరించారు.

పవిత్రమైన వృత్తి నర్సింగ్

- నర్సుల సేవలు అనితరసాధ్యం: మంత్రి సత్యకుమార్



అవార్డులు అందుకున్న నర్సులతో మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు

విజయవాడ(వన్‌టౌన్), మే 12(ఆంధ్రజ్యోతి): చిత్తశుద్ధి, కరుణ, సానుభూతి, మానవత్వం, అంకితభావాలు కలబోసిన పవిత్రమైన వృత్తి నర్సింగ్ అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో సోమవారం నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అత్యంత ప్రతిభ కనబరిచిన నర్సులకు ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నర్సుల సేవలు అనితరసాధ్యమన్నారు. అయితే, కొన్నిచోట్ల ఉదాసీనంగా వ్యవహరించటంపై ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. హక్కుల గురించి మాట్లాడే నర్సులు తమ బాధ్యతలను కూడా గుర్తించాలన్నారు. రానున్న రోజుల్లో 5,300 నర్సింగ్ ఖాళీలను కాంట్రాక్టు విధానంలో భర్తీ చేస్తామని చెప్పారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నర్సింగ్ కాలేజీలపై చర్యలు తీసుకుంటామన్నారు.

పోలీస్ స్టేషన్లలో సీసీ కెమెరాల నిర్వహణకు ప్రణాళిక రూపొందించండి

- జూన్ 17 విచారణ నాటికి సిద్ధం చేయండి
- కోర్టు ధిక్కరణ పిటిషన్‌లో హైకోర్టు ధర్మాసనం ఆదేశం

అమరావతి, మే 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్లలో సీసీ కెమెరాల నిర్వహణ, వాటి మరమ్మతుల విషయంలో సంబంధిత అధికారులతో కలసి ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర డీజీపీని హైకోర్టు ఆదేశించింది. ఈ ప్రణాళికలో పలు అంశాలను పొందుపర్చాలని సూచించింది. సీసీ కెమెరాల నిర్వహణకు బాధ్యత వహించేలా ప్రతి జిల్లాలో ఓ అథారిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. సీసీ కెమెరాలతో పాటు సీసీటీవీ ఫుటేజ్ నిల్వలో ఏదైనా లోపాలు తలెత్తినప్పుడు సంబంధిత అథారిటీకి ఎలా తెలియజేయాలనే విధానాన్ని రూపొందించాలని స్పష్టం చేసింది. పరికరాలకు మరమ్మతులు, పాడైన వాటి స్థానంలో మరొక పరికరం ఏర్పాటు వంటివాటికి 'టైమ్ ఫ్రేమ్' నిర్ణయించాలని తెలిపింది. నిర్దేశిత సమయంలో సమస్యలు పరిష్కరించకుంటే సంబంధిత అధికారులను బాధ్యులను చేయాలని పేర్కొంది. జిల్లాల వారీగా సీసీ కెమెరాల, స్టోరేజ్ పరికరాల పనితీరుపై క్రమం తప్పకుండా నిర్ణీత కాలంలో టెక్నికల్ ఆడిట్ నిర్వహించాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణ నాటికి ప్రణాళికను కోర్టు ముందు ఉంచాలని డీజీపీకి స్పష్టం చేసింది. విచారణను జూన్ 17కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్లు, జైళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటుపై 2019లో న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. కెమెరాలు ఏర్పాటు చేయాలంటూ 2019 జూలై 15న ఆదేశాలిచ్చింది. సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వుల అమలులో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని స్పష్టం చేసింది. ఏళ్లు గడుస్తున్నా ఉత్తర్వులు అమలు కాకపోవడంతో యోగేష్ 2022లో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు పల్నాడు జిల్లా, మాచవరం పోలీసులు తన సోదరుడు గోపిరాజును అక్రమంగా నిర్బంధించారని పేర్కొంటూ కటారు నాగరాజు గత ఏడాది నవంబరులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు ఇటీవల విచారణకు రాగా పోలీస్ స్టేషన్లలో సీసీ కెమెరాల నిర్వహణకు ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర డీజీపీని ధర్మాసనం ఆదేశించింది.

సెల్ఫీ వీడియో తీసి.. పురుగుల మందు తాగి..

ఫీల్డ్ అసిస్టెంట్ వేధింపులకు మహిళా మేట్ ఆత్మహత్య

ఎమ్మెల్యే సౌమ్య.. ఆయనపై చర్యలు తీసుకోవాలని అభ్యర్థన



అబ్బూరి మాధురి

విజయవాడ/చందర్లపాడు, మే 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ వేధింపులు తట్టుకోలేక ఓ మహిళా మేట్ (మేస్త్రి) ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలపై సెల్ఫీ వీడియో రికార్డు చేసి.. ఆపై పురుగుల మందు తాగి తనువు చాలించారు. తన చావుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ ఎమ్మెల్యే సౌమ్యను కోరారు. ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం విపరీంతలపాడు గ్రామంలో అబ్బూరి మాధురి.. ఉపాధి పథకంలో మహిళా మేట్‌గా పనిచేస్తున్నారు. గ్రామంలో ఉపాధి పనులకు ఫీల్డ్ అసిస్టెంట్‌గా షైలా రవితేజ వ్యవహరిస్తున్నాడు. ఇటీవల రవితేజ పనికి హాజరుకాని వారికి మస్తర్లు వేయడం, ఒక కూలీని వేర్వేరు పనుల్లో చూపించి అదనపు కూలి డ్రా చేయడం చేస్తున్నారు. ఈ అవకతవకలపై మాధురి ఫీల్డ్ అసిస్టెంట్‌ను ప్రశ్నించారు. దీంతో ఆమెపై కక్ష పెంచుకున్న రవితేజ పలు రకాలుగా వేధించడం మొదలుపెట్టాడు. తీవ్ర మనస్థాపం చెందిన మాధురి.. శనివారం తన బాధ తెలియజేస్తూ సెల్ఫీ వీడియో రికార్డు చేసి.. అనంతరం పురుగుల మందు తాగారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి ఆమె మరణించారు. ఆమె మృతి తర్వాత సెల్ఫీ వీడియో బయటకు వచ్చింది. 'నాకు టీడీపీ, సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అంటే ఎంతో అభిమానం. ఉపాధి పనుల్లో అవినీతి వల్ల పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటుంది. ఉపాధి పనుల్లో అనేక అక్రమాలు జరుగుతున్నాయి. షైలా రవితేజ అందరి ముందు నా మీదకు వచ్చాడు. నా అంతు చూస్తానని బెదిరించాడు. ఎమ్మెల్యే సౌమ్య చాలా డైనమిక్. నా చావుకు కారణమైన రవితేజ అంతుచూడాలి. నా కుమార్తె బాధ్యతను చూసుకోవాలి. రవితేజ వంటివారిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టి పెట్టాలి' అని వీడియోలో చెప్పారు. ఆమె మృతదేహానికి నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య నివాళులర్పించారు. చందర్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. మాధురి సెల్ఫీ వీడియోలో ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలను వివరిస్తే, ఆమె భర్త వెంకటరావు మాత్రం.. తన భార్య కడుపునొప్పి కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుందని వాం గ్మూలం ఇచ్చారు. ఫీల్డ్ అసిస్టెంట్‌తో గ్రామంలోని అధికార పార్టీ నాయకులకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, దీంతో మాధురి భర్తపై ఒత్తిడి చేయించి అలా చెప్పించినట్టు సమాచారం.

అమ్మ, అమ్మమ్మలే యశ్విత హంతకులు

- రెండో పెళ్లికి అడ్డుగా ఉందని గొంతు నులిమి బావిలో పడేశారు
- పోలీసుల విచారణలో వెల్లడి



యశ్విత

పిఠాపురం, మే 12 (ఆంధ్రజ్యోతి): రెండో పెళ్లి చేసుకునేందుకు అడ్డుగా ఉందని ఐదునెలల పసికందును తల్లి సాయంతో హతమార్చింది కన్నతల్లి. కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి సమయంలో ఐదు నెలల చిన్నారి యశ్వితను గొంతునులిమి హత్య చేసి ఇంటి వెనుక భాగంలో ఉన్న నూతిలో పడవేసిన వైనం తెలిసిందే. ఈ చిన్నారి హత్య కేసులో కన్న తల్లి, అమ్మమ్మే హంతకులుగా తేలింది. చిన్నారిని గొంతు నులిమి హత్య చేసినట్టు విచారణలో వెల్లడి కాగా వారిద్దరినీ అరెస్టు చేసినట్టు పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్ సోమవారం మీడియాకు వెల్లడించారు. పసుపులేటి శైలజ, పిఠాపురం మండలం నరసింగపురం గ్రామానికి చెందిన పెదపాటి సతీష్ పెద్దలకు ఇష్టం లేకుండా పెళ్లి చేసుకోగా ఐదు నెలల క్రితం యశ్విత జన్మించింది. పెళ్లయిన నాటి నుంచీ తనను అత్తవారింటికి తీసుకువెళ్లకపోవడం, పాప పుట్టిన తర్వాత భర్త బంధువులు ఎవరూ చూడ్డానికి రాకపోవడం నేపథ్యంలో తన తల్లిదండ్రులు చెప్పినట్టు మేనత్త కొడుకుని వివాహం చేసుకుంటే బాగుండేదని శైలజ భావించింది. ఇందుకు చిన్నారి అడ్డుగా ఉందని, అడ్డు తొలగిస్తే రెండో పెళ్లి చేసుకోవచ్చనే ఉద్దేశంతో శైలజ, తల్లి అన్నవరం కలిసి చిన్నారిని హత్య చేసినట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఇద్దరినీ అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో ఇతర కుటుంబసభ్యుల పాత్రపై లోతుగా విచారణ జరుపుతున్నామని సీఐ చెప్పారు.

ఇద్దరు బావమరుదులను చంపేశాడు

- తమ అక్కను సరిగా చూసుకోవడం లేదని అడిగినందుకు బావ ఘాతుకం
- ఈటెతో పొట్ట, ఛాతీ భాగాల్లో పోట్లు
- అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఘటన



కిముడు కృష్ణ, రాజు

సీలేరు, మే 12 (ఆంధ్రజ్యోతి): తమ అక్కను ఎందుకు కొడుతున్నావని అడిగినందుకు ఇద్దరు బావమరుదులను ఈటెతో పొడిచి చంపాడో బావ. అడ్డుకోబోయిన మరో వ్యక్తిని కూడా గాయపరిచాడు. ఈ ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలంలో చోటుచేసుకుంది. కిముడు కృష్ణ (46) ఒడిశాలోని ఇంద్రావతిలో డ్రైవర్‌గా పనిచేస్తుండగా.. అతని సోదరుడు కిముడు రాజు (36) విశాఖపట్నంలో ఉంటున్నాడు. ఇద్దరూ గూడెంకొత్తవీధి మండలం సీలేరు పంచాయతీ పరిధిలోని అయ్యప్పస్వామి ఆలయం వెనుక గల చింతపల్లి క్యాంపు (జీడీ క్యాంపు)లో నివాసం ఉంటున్న తమ పెద్దమ్మ చనిపోవడంతో అంత్యక్రియల కోసం ఆదివారం సీలేరు వచ్చారు. అంత్యక్రియల అనంతరం కృష్ణ రాజులను అదే గ్రామంలో నివాసం ఉంటున్న వారి అక్క మణి, బావ వంతల గెన్ను రాత్రి తమ ఇంటికి భోజనానికి పిలిచారు. బావమరుదులు ఇద్దరికీ గెన్ను మందు పార్టీ ఏర్పాటు చేశాడు. కాగా, తమ సోదరిని సరిగా చూసుకోవడం లేదంటూ బావమరుదులు బావతో ఘర్షణకు దిగారు. దీంతో మద్యం మత్తులో ఉన్న గెన్ను ఇంటికి వెళ్లి భార్య మణిని కొట్టాడు. అది చూసి కృష్ణ, రాజు తమ సోదరిని తీసుకెళ్లిపోయేందుకు సిద్ధమయ్యారు. దీంతో గెన్ను ఇంట్లో ఉన్న ఈటెను తీసుకొచ్చి కృష్ణ, రాజులను పొట్ట, ఛాతి భాగంలో పొడిచి హత్య చేశాడు. అదే గ్రామానికి చెందిన కిముడు చిన్నరాజు అడ్డుకునే ప్రయత్నం చేయగా.. అతనిపై కూడా దాడి చేశాడు. చిన్నరాజు చేతికి తీవ్ర గాయం కావడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. హత్య అనంతరం గెన్ను ఈటెతో సహా పరారయ్యాడు. గెన్ను కోసం గాలిస్తున్నామని పోలీసులు చెప్పారు. అతనిపై గతంలోనూ ఒక హత్య కేసు ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు.

ప్రాణాలు తీసిన సెల్‌ఫోన్!

- మొబైల్‌లో మాట్లాడుతూ రైలు పట్టాలు దాటే యత్నం
- సబర్బన్ రైలు ఢీకొని ఇద్దరు విద్యార్థుల మృతి

చెన్నై, మే 12(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్.. ఇద్దరు విద్యార్థుల ప్రాణాలు తీసింది. ఫోన్ మాట్లాడుతూ పట్టాలు దాటుతున్న ఆ ఇద్దరూ రైలు ఢీకొని మృతి చెందారు. స్థానిక సెయింట్‌థామస్ మౌంట్‌లో సోమవారం ఉదయం ఈ ఘటన జరిగింది. పెరంబలూరుకు చెందిన మహమ్మద్ నఫూల్ (20), సబీర్ అహ్మద్ (20) థామస్ మౌంట్ సమీపంలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్నారు. థామస్‌మౌంట్ రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం వారు పట్టాలు దాటుతుండగా ఎగ్మూరు నుంచి తాంబరం వైపు వెళ్తున్న సబర్బన్ రైలు ఢీకొంది. రైలుడ్రైవర్ ఎన్నిసార్లు హారన్ మోగించినా ఫలితం లేకుండాపోయింది. మృతదేహాలను ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

యుద్ధం, శాంతి...

భారత్-పాకిస్థాన్‌ల మధ్య నాలుగు రోజులపాటు సాగిన సాయుధ సంఘర్షణ పూర్తిస్థాయి యుద్ధంగా మారకముందే ముగిసింది. ఘర్షణ ఆగిపోవడం, హింసకు తెరపడడం సంతోషమే అయినా అది జరిగిన తీరు మాత్రం తీవ్ర చర్చకు, అనుమానాలకు దారి తీసింది. పాక్ ఉగ్రవాదులు, పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు ఏప్రిల్ 22న పహల్గాంలో భారత టూరిస్టులను వారి భార్యాబిడ్డల ముందు దారుణంగా కాల్చిచంపిన సంఘటన ప్రపంచాన్ని కుదిపేసింది. లష్కరే తోయిబా నుంచి విడివడిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ అనే నిషేధిత సంస్థకు చెందిన ఈ టెర్రరిస్టులకు పాక్ అన్ని రకాల సహాయ సహకారాలు అందించినట్లు భారత్ ప్రాథమిక దర్యాప్తులో బయటపడింది. దీనిపై అట్టుడికిన భారత్ మే 7న పాకిస్థాన్, ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్ర స్థావరాలపై లాంగ్‌రేంజ్ ఆయుధాలతో దాడులు చేసింది. దానికి పాక్ ఊరుకోకుండా ఎదురుదాడికి దిగడంతో భారత్ కూడా స్పందించి గట్టిగా తిప్పికొట్టింది. భారత్ దాడుల్లో పాక్ సైన్యానికి బలమైన ఎదురుదెబ్బలు తగలడంతో పాక్ ప్రధాని షాబాజ్ షరీఫ్ అణ్వస్త్ర నేషనల్ కమాండ్ అథారిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఇది అణు యుద్ధానికి దారితీస్తుందనే ఆందోళన మొదలైంది.

ఆ దశలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నుంచి అకస్మాత్తుగా కాల్పుల విరమణ ప్రకటన వెలువడింది. ఆ తర్వాత కాసేపటికి కాల్పుల విరమణను ధ్రువీకరిస్తూ భారత్ కూడా ప్రకటన విడుదల చేసింది. "నిర్దేశిత లక్ష్యాలేవీ సాధించకుండా, పాక్ నుంచి ఎలాంటి హామీలూ పొందకుండా కాల్పుల విరమణకు అంగీకరించడం ఏమిటి? అది కూడా ట్రంప్ దీనిని ప్రకటించడం ఏమిటి?" అంటూ వివిధ వర్గాల నుంచి వచ్చిన ప్రశ్నలు ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. కొందరు బీజేపీ మద్దతు దారులు సైతం ఈ విషయంలో మోదీ ప్రభుత్వాన్ని విమర్శించారు. పైగా ఒప్పందాన్ని ఉల్లంఘించి పాక్ రెండు గంటల్లోనే భారత్‌పై దాడికి దిగడంతో ఈ విమర్శలు మరింత తీవ్రమయ్యాయి. చివరికి కాల్పులు ఆగిపోవడంతో పరిస్థితి సద్దుమణిగింది.

భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తోను, పాక్ ప్రధాని షరీఫ్‌తోను అమెరికా విదేశాంగ మంత్రి రూబియో గత శుక్రవారం చర్చలు జరిపారు. దీంతో కాల్పుల విరమణ కోసం అమెరికా ప్రయత్నాలు చేస్తోందని అందరూ భావించారు. అయితే ఆ తర్వాత కాసేపటికే అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మాట్లాడుతూ భారత్, పాక్ వివాదంతో అమెరికాకు సంబంధం లేదని, తాము అందులో జోక్యం చేసుకోబోమని ప్రకటించారు. ఇది జరిగిన కొన్ని గంటల్లోనే తమ మధ్యవర్తిత్వం వల్ల రెండు దేశాలూ కాల్పుల విరమణకు అంగీకరించినట్లు శనివారం ట్రంప్ ప్రకటన వచ్చింది. 5 గంటల నుంచి కాల్పుల విరమణ అమలులోకి వచ్చిందని భారత్ చెప్పిన కాసేపటికే పాక్ ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. దీంతో ఏం జరుగుతోందనే ఆందోళన అందరిలో కలిగింది. కానీ తుదకు అన్నీ సర్దుకున్నాయి.

ఘోరమైన ఉగ్రవాద దాడి మనస్సుల్ని కాలుస్తున్నప్పుడు కాల్పుల విరమణ అందరికీ సంతృప్తి కలిగించకపోవచ్చు. కానీ ఈ యుద్ధం ద్వారా భారత్ కొన్ని లక్ష్యాలను నెరవేర్చుకుందనే చెప్పాలి. తొలిరోజు దాడుల్లోనే పాక్‌లోని అనేక ఉగ్రవాద శిబిరాల్ని, వారి మౌలిక సదుపాయాల్ని భారత్ ధ్వంసం చేసింది. పలువురు కీలకమైన ఉగ్రవాదుల్ని మట్టుబెట్టింది. అలాగే అణ్వస్త్ర దాడి చేస్తామనే బెదిరింపుల్ని లెక్క చేయబోమని, పాక్ మరోసారి ఉగ్రవాద దాడికి పాల్పడితే యుద్ధమే మా సమాధానమని పాక్‌కే కాదు, ప్రపంచానికి కూడా గట్టి సందేశం ఇచ్చింది. పుల్వామా ఉగ్రదాడి తర్వాత జరిగిన బాలాకోట్ దాడులు ఆరేళ్లపాటు పాక్ భారీ ఉగ్రదాడులకు పాల్పడకుండా నిరోధించగలిగాయి. ఇప్పుడు భారత్ మరింత తీవ్రంగా స్పందించడంతో ఉగ్రవాదాన్ని ప్రేరేపించే విషయంలో భవిష్యత్తులో పాక్ ఒకటికి పదిసార్లు ఆలోచించుకోక తప్పదు. పాక్ యుద్ధ విమానాలు, క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడినా ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలతో వాటిని కూల్చడం ద్వారా భారత్ తన సత్తా చాటింది. భారత్ కూడా కొన్ని యుద్ధ విమానాలను కోల్పోయినట్లు వార్తలు వస్తున్నప్పటికీ యుద్ధంలో కొన్ని నష్టాలు సర్వసాధారణమే.

ఏ యుద్ధమైనా శాంతితోనే ముగియాలి. ఇది కూడా అంతే! యుద్ధం చేసే సైనికుడికే శాంతి విలువ తెలుస్తుంది. "మంచి యుద్ధమూ, చెడు శాంతీ ప్రపంచంలో లేవు" అన్నాడు బెంజమిన్ ఫ్రాంక్లిన్. గతంలో దీనిని చెడు యుద్ధంగా భావించిన బీజేపీ వ్యతిరేకులు తాజా కాల్పుల విరమణ మంచిది కాదనడం, గతంలో ఇది మంచి యుద్ధమన్న బీజేపీ మద్దతుదారులు ఇప్పుడు కాల్పుల విరమణ మంచిదేననడం మాత్రం ఇందులో ఓ వైచిత్రి.

అనుకున్నది సాధించాం, అప్రమత్తంగా ఉందాం!



భారత భూభాగాలపై ఎటువంటి ఉగ్రదాడినైనా యుద్ధచర్యగా పరిగణించి, అందుకు ప్రతిస్పందనగా పాకిస్థాన్‌లోని ఉగ్రవాద సంస్థల, బృందాల స్థావరాలను లక్ష్యంగా ప్రతిదాడులు జరుపుతామని ఆపరేషన్ సిందూర్‌తో భారత్ స్పష్టం చేసింది. 'ఎటువంటి ఉగ్రదాడి అయినా యుద్ధ చర్యే' అన్న విషయాన్ని మోదీ సిద్ధాంతంగా భావించవచ్చు.

భారత్-పాకిస్థాన్ తాజా యుద్ధస్థితి ఉభయ దేశాల భావి సంబంధాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తుందనడంలో సందేహం లేదు. ఏప్రిల్ 22న పహల్గాంలోని బైసరన్ లోయలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాద దాడి యావద్భారతీయులను అమితంగా కలచివేసింది. ఆ హతులు అందరూ ఆసేతు హిమాచలంలోని అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు. కశ్మీర్‌లో ప్రశాంత పరిస్థితులను భగ్నం చేసి, ఆ కేంద్ర పాలిత ప్రాంత పర్యాటక రంగ ఆధారిత ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసే కుతంత్రంతో జరిగిన ఉగ్రవాద దాడిపై సమస్త భారతీయుల ఆగ్రహావేశాలు, భావోద్వేగాలలో కేంద్ర ప్రభుత్వమూ పాలుపంచుకున్నది.

2016లో ఉరి, 2019లో పుల్వామా ఉగ్రవాద ఘాతుకాలు సంభవించినప్పుడు భారత్ శక్తిమంతమైన, ప్రభావ దాయకమైన ప్రతిచర్యలు చేపట్టింది. భవిష్యత్తులోనూ ఎలాంటి ఉగ్రదాడులకైనా అటువంటి ప్రతిస్పందనలు ఖాయమని ఆ ప్రతి దాడులతో భారత్ స్పష్టం చేసింది. పహల్గాం పాశవికకాండకు మరింత కఠినమైన గుణపాఠాన్ని నేర్పాలని భారత్ దృఢంగా సంకల్పించుకున్నది. ఆ సంకల్పసాధనలో భాగంగా తొలుత భారత్‌లోని పాకిస్థానీ జాతీయుల వీసాలను రద్దు చేసింది; దశాబ్దాలుగా అమల్లో ఉన్న, పాకిస్థాన్‌కు ప్రాణాధారమైన సింధునదీజలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ నిర్ణయాలతోనే పహల్గాంపై తన ప్రతీకార చర్య ఎంత కఠినంగా ఉండేది భారత్ తేటతెల్లం చేసింది.

మే 7 ప్రాతఃకాలంలో ఆపరేషన్ సిందూర్ పేరిట ఎంపిక చేసుకున్న తొమ్మిది ప్రదేశాల (పాకిస్థాన్‌లో నాలుగు, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఐదు)లోని ఉగ్రవాదుల స్థావరాలపై భారత వాయుసేన క్షిపణి దాడులు నిర్వహించింది. పహల్గాం ఊచకోత అనంతరం పాకిస్థాన్ సాయుధ బలగాలు అప్రమత్తంగా ఉన్నప్పటికీ మన సైనిక దళాలు ఎంచుకున్న నిర్దిష్ట లక్ష్యాలను కచ్చితంగా ధ్వంసం చేయడంలో సంపూర్ణంగా సఫలమయ్యాయి. పాకిస్థాన్ పంజాబ్ రాష్ట్రంలోని బహవల్‌పూర్ (జైషే మహమ్మద్ ప్రధాన కార్యాలయమున్న నెలవు), మురిద్కే (లష్కరే తయిబా ప్రధాన స్థావరమున్న ప్రదేశం) పట్టణాలపై జరిగిన ఆ మెరుపుదాడులు ఒక వాస్తవాన్ని తిరుగులేని రీతిలో వెల్లడించాయి. పాకిస్థాన్ ఆధారిత, ప్రేరేపిత ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా సరే వారిని శాశ్వతంగా మట్టుబెట్టి తీరాలన్న భారత్ దృఢసంకల్పాన్ని అవి విశాల ప్రపంచానికి, మరీ ముఖ్యంగా ఇస్లామాబాద్ పాలకులకు ఎటువంటి మినహాయింపులు లేకుండా చాటిచెప్పాయి.

తన భూభాగాలపై ఎటువంటి ఉగ్రదాడినైనా యుద్ధ చర్యగా పరిగణించి, అందుకు ప్రతిస్పందనగా పాకిస్థాన్‌లోని ఉగ్రవాద సంస్థల, బృందాల స్థావరాలను లక్ష్యంగా ప్రతిదాడులు జరుపుతామని ఆపరేషన్ సిందూర్‌తో భారత్ స్పష్టం చేసింది. భారత్-పాకిస్థాన్ సంబంధాల శబ్ద కోశంలో అదొక ప్రభావదాయక సూత్రంగా ఖాయమయింది. ఎటువంటి ఉగ్రదాడి అయినా యుద్ధచర్యే అన్న విషయాన్ని మోదీ సిద్ధాంతంగా భావించవచ్చు. పాకిస్థాన్ పట్ల మన దౌత్యనీతిలో ఒక కొత్త ఆలోచనకు, కచ్చితమైన ఆచరణకు మోదీ సిద్ధాంతం ప్రాతిపదికగా నిలుస్తుంది.

భారత్, పాకిస్థాన్‌ల మధ్య ప్రస్తుత జగడానికి పహల్గాంలో ఉగ్రవాద ఘాతుకమే ప్రధాన కారణం. ఆ దాడికి ప్రతి స్పందనగా మనం చేపట్టిన దాడులు చర్య–ప్రతిచర్య క్రమంలో కీలకమైనవి. భారత్ తన ప్రతిచర్యలను జయప్రదంగా నిర్వహించి, పాక్ మద్దతుతో చెలరేగిపోతున్న ఉగ్రవాదుల గర్హనీయమైన మానవతా వ్యతిరేక నేరాలను అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకువెళ్లడంలో సఫలమవ్వడం ఇస్లామాబాద్ పాలకులకు ఎంతైనా ఆగ్రహం తెప్పించింది. తత్ఫలితంగానే పాక్ సైనిక దళాలు భారత్‌పై తెగబడి దాడులు చేశాయి. కాల్పుల విరమణను సైతం ఉల్లంఘించి పరిస్థితులను మరింత విషమింపజేస్తున్నాయి. పాకిస్థాన్ ప్రేరిత ఉగ్రవాద మూకలు భవిష్యత్తులో పాల్పడే ఎటువంటి దాడులనైనా యుద్ధ చర్యలుగా పరిగణించి అందుకు అదే రీతిలో దీటుగా ప్రతిస్పందించడం ఒక సూత్రంగా ఇప్పుడు స్థిరపడింది.

పాకిస్థాన్ మరింత భారీగా నష్టపోయేలా యుద్ధ చర్యలను కొనసాగించాలని ప్రభుత్వ విమర్శకులు పలువురు వాదిస్తున్నారు. అయితే ఆపరేషన్ సిందూర్‌ను నిర్వహించడంలో భారత్ మౌలిక లక్ష్యం తమ భూభాగాలలో ఎటువంటి ఉగ్రదాడినైనా యుద్ధచర్యగా పరిగణించి తీరుతామని నొక్కిచెప్పడమేనన్న విషయాన్ని ఆ విమర్శకులు విస్మరిస్తున్నారు. భారత్ తన లక్ష్య సాధనలో సందేహాతీతంగా జయప్రదమయింది. ఇక యుద్ధ చర్యలకు స్వస్తిచెప్పి మన ఆర్థిక వ్యవస్థ సర్వతో ముఖాభివృద్ధి లక్ష్య సాధనపై దృష్టి కేంద్రీకరించాలి.

భారత్, పాకిస్థాన్‌ల మధ్య ప్రస్తుత సంఘర్షణను సైనిక వ్యవహారాల నిపుణులు జాగ్రత్తగా అధ్యయనం చేయవలసిన అవసరమున్నది. ఈ 'యుద్ధా'నుభవాల ప్రాతిపదికన మనం సరైన నిర్ణయాలు తీసుకోవాలి. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ సైనిక బలాధిక్యత తిరుగులేని రీతిలో రుజువయింది. మన వాయుతల రక్షణ వ్యవస్థలు అన్నీ ప్రశస్తంగా పనిచేశాయి. మన వాయుసేన ఎదురులేని రీతిలో పాక్ వాయుతలంలోకి ప్రవేశించి ఎంపిక చేసుకున్న నిర్దిష్ట లక్ష్యాలను కచ్చితంగా తుదముట్టించడం జరిగింది. ఉగ్రవాదానికి ఊతమిస్తున్న వ్యవస్థలను ధ్వంసం చేయడమే భారత్ అసలు లక్ష్యమని, పాకిస్థాన్‌ను విస్తృతంగా దెబ్బతీయడమే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్‌ను నిర్వహించడం జరిగిందన్న వాస్తవాన్ని మనం విస్మరించకూడదు. త్రివిధ సాయుధ బలగాల మధ్య పటిష్ఠ సమన్వయంతో పాక్‌పై ప్రతి దాడులు జరిగాయి. మన సాయుధ బలగాలకు ఇదొక కొత్త అనుభవం. మన దేశ రక్షకులు ఇంతకు ముందు చూడని, పాల్గొనని వినూత్న యుద్ధ తంత్రమది. ఆపరేషన్ సిందూర్ మన సాయుధ బలగాలకు ఒక శుభశకునం. భావి యుద్ధాలు, త్రివిధ దళాలు విడివిడిగా కాకుండా ఒక ఏకీకృత కమాండ్ ఆధ్వర్యంలో జరిగే సమరాలుగా ఉంటాయి. త్రివిధ సాయుధ బలగాలను ఏకీకృతం చేయడమనే లక్ష్యాన్ని మన ఛీఫ్ డిఫెన్స్ స్టాఫ్ చాలా ప్రశస్తంగా పరిపూర్తి చేస్తున్నారు.

పహల్గాం ఉగ్రదాడిపై ప్రతి స్పందన, దాని లక్ష్యాలపై ప్రభుత్వం స్పష్టమైన అవగాహనతో ఉన్నందునే ఆపరేషన్ సిందూర్ విజయవంతమయింది. చర్య–ప్రతి చర్యాత్మక సంఘటనల నెదుర్కొనే విషయమై ప్రభుత్వం ఉక్కు సంకల్పంతో వ్యవహరించింది. పరిస్థితులు తీవ్రమయ్యేందుకు పాకిస్థాన్ తప్పక పూనుకుంటుందనే వాస్తవాన్ని మన పాలకులు విస్మరించలేదు. ప్రశాంత చిత్తంతో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అదే ప్రశాంత చిత్తంతో ప్రతి దాడుల పరిణామాలపై అధికారిక ప్రకటనలు చేశారు. సరళమైన మాటలతో ప్రభుత్వ నిర్ణయాలను ప్రకటించడం జరిగింది. ఒక మహా ఉద్రిక్త సమయంలో పరిస్థితులు అదుపుతప్పని రీతిలో భారత ప్రభుత్వ విధాన నిర్ణేతలు, ప్రతినిధులు వ్యవహరించడం ప్రపంచ దేశాలు గమనించాయి. పాకిస్థాన్ పాలకులకూ ఇది అవగతమై ఉంటుంది. సంగ్రహించి చెప్పాలంటే పహల్గాం ఉగ్రదాడి ఫలితంగా పాకిస్థాన్‌తో ప్రజ్వరిల్లిన సంఘర్షణల్లో భారత్ ప్రశస్తంగా వ్యవహరించింది. భారత్ వ్యతిరేక ఉగ్రవాద కార్యకలాపాలను ప్రోత్సహించడాన్ని పాకిస్థాన్ మానదుగాక మానదు కనుక ప్రస్తుత యుద్ధచర్యల అనుభవాల నుంచి మనం భావి యుద్ధ వ్యూహాలను రూపొందించుకోవాలి. పాకిస్థాన్‌పై సైనికేతర ఒత్తిళ్లను కొనసాగించాలి.

దేశ సరిహద్దులను దాటి ప్రవహించే నదుల జలాల విషయంలో దేశీయ ప్రయోజనాలకు ప్రథమ, అగ్ర ప్రాధాన్యమిస్తూ నిక్కచ్చిగా నిర్ణయాలు తీసుకోవాలి. అలాగే ఉగ్రవాద సంస్థలకు నిధులను నిరోధించేందుకు ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఎటిఎఫ్) 'గ్రే జాబితా'లో పాకిస్థాన్‌ను మళ్లీ చేర్చాలి. ఉద్రిక్తతలు లేనప్పటికీ పాకిస్థాన్ సక్రమంగా వ్యవహరించేలా చేసేందుకు అటువంటి సైనికేతర ఒత్తిళ్లు తప్పనిసరి. ఈ విషయంలో భారత్ సంకోచాలకు తావులేని రీతిలో చర్యలు చేపట్టాలి. ఆఖరుగా ఓ ముఖ్యమైన మాట ఏమిటంటే, పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రసర్పం మళ్లీ ఏ క్షణంలోనైనా బుసలు కొట్టవచ్చు. అది రేపు, లేదా ఎల్లుండే సంభవించవచ్చు, కొద్ది సంవత్సరాలలోనూ ఎదురుకావచ్చు. ఎప్పుడైనా సరే ఆ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ఈ క్షణం నుంచే మనం సర్వసన్నద్ధంగా ఉండి తీరాలి.

• గౌతమ్ బంబావాలె
పాకిస్థాన్‌లో భారత మాజీ హై కమిషనర్
(ది ట్రిబ్యూన్)

ఈ పోటీలు ఫక్తు వ్యాపారం!

మిస్ వరల్డ్ 72వ అందాల పోటీలు హైదరాబాద్ నగరంలో జరుగుతున్నాయి. మన దేశంలో ఇదివరకు 1996లో, 2024లో ఈ పోటీలు నిర్వహించారు. ఇది ముచ్చటగా మూడోసారి.

ప్రపంచవ్యాప్తంగా ఇంతవరకు జరిగిన అందాల పోటీలను పరిశీలిస్తే వీటి వెనుక పెట్టుబడిదారీ మార్కెట్ ప్రయోజనాలు ఎలా పనిచేస్తాయో అర్థమవుతుంది. అందాల సంస్కృతిని స్త్రీలపై రుద్దటం ద్వారా ఆయా దేశాల్లో సౌందర్య సాధనాలకు సంబంధించిన మార్కెట్‌ను పెంచటమే ఈ పోటీల లక్ష్యం. ఇదే విధంగా పలు కార్పొరేట్ సంస్థలు దక్షిణాఫ్రికా, లాటిన్ అమెరికా, మెక్సికో దేశాలలో లాభాల పంట పండించుకున్నాయి. వెనిజులా, జమైకా, ఫిలిప్పీన్స్ లాంటి దేశాలైతే అందాల సుందరులను ఉత్పత్తి చేసే పరిశ్రమలుగా మారిపోయాయి. అందాల పోటీల్లో పలు కిరీటాలు దక్కించుకున్న మన దేశం కూడా ఈ వ్యాపారానికి ముఖ్యమైన గమ్యంగా మారింది.

ఈ పెట్టుబడిదారులు ఏ దేశాల్లో ఐతే వ్యాపారాన్ని విస్తరించాలని భావిస్తారో ఆ దేశాల స్త్రీలే అందాలరాణులుగా ఎంపికై కిరీటాలు దక్కించుకుంటారు. ఈ కారణం వల్లనే అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాల కంటే వర్ధమాన దేశాలే ఎక్కువగా అందాల కిరీటాలను గెలుచుకుంటాయి. ఎందుకంటే, పాశ్చాత్య ప్రపంచంలో సౌందర్య సాధనాల వినియోగం ఇప్పటికే గరిష్ఠ స్థాయికి చేరుకుంది. ఈ దేశాలలో సౌందర్య, చర్మ సంరక్షణ ఉత్పత్తులు, బ్రాండ్ల మార్కెట్ ఇక పెద్దగా పెరిగేందుకు ఆస్కారం లేదు. ఉదాహరణకి– ప్రపంచానికే ఫ్యాషన్ రాజధానిగా పేరున్న ఫ్రాన్స్ రాజధాని పారిస్ నగరంలో ఇప్పటివరకు ఇద్దరు మహిళలు మాత్రమే మిస్ యూనివర్స్ కిరీటాన్ని పొందారు. ఫ్యాషన్ ప్రపంచాన్నే శాసించే యూరప్, అమెరికా దేశాల మహిళలు చాలా తక్కువ సార్లు కిరీటాలు గెలుచుకున్నారు. దీని అర్థం న్యాయ నిర్ణేతలకు ఆ దేశాల వారు అందంగా కనిపించటం లేదని కాదు కదా! వెనిజులా దేశం ప్రపంచ సుందరి పోటీలలో ఏడుసార్లు విజేతగా నిలిచింది. కానీ 2013 తర్వాత వెనిజులాలో రాజకీయ సంక్షోభం ముదిరింది. ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమయింది. సౌందర్య సాధనాల పరిశ్రమ పూర్తిగా దెబ్బతిన్నది. అందుకే– ఆ దేశం 2013లోనే చివరిసారి అందాల కిరీటాన్ని గెలుచుకున్నది!



మన దేశం విషయానికే వస్తే– 1992 వరకు భారతదేశంలో అందాల సుందరీమణులే లేరు! 1990లో సరళీకృత ఆర్థిక విధానాల తర్వాత దేశంలో బహుళ జాతి కంపెనీలకు ప్రవేశం మొదలైంది. ఆ కంపెనీలు ఎక్కడ ఆదేశిస్తే అందాల కిరీటాలు అక్కడికే తరలివెళ్తాయి. అక్కడికే అందాల పోటీల వేదికలు కూడా వెళ్తాయి. ఇందులో భాగంగానే 90వ దశకంలో ఇండియాలో అందాల పోటీలకు తెరలేచింది. అప్పటి నుంచి భారతీయ వనితలు వరుసగా కిరీటాలు దక్కించుకున్నారు. మార్కెట్ శక్తుల ప్రయోజనాలకు కొమ్ము కాసే పాలకవర్గాలు దీనిని భారత స్త్రీలందరూ గర్వించదగ్గ విషయంగా ప్రచారం చేశాయి.

ఇప్పుడు మన దేశం అంతర్జాతీయ కాస్మొటిక్ బ్రాండ్లకు సారవంతమైన మార్కెట్. వారి కాస్మోటిక్ ఉత్పత్తుల అమ్మకాలు పెంచుకోవడానికి ఇక్కడి యువ జనాభా గణాంకాలు సరిగ్గా సరిపోతాయి. ప్రపంచ సౌందర్య సాధనాల మార్కెట్ పరిమాణం 2019లో 380.2 బిలియన్ డాలర్లుగా ఉంది. 2027 నాటికి 463.5 బిలియన్ల డాలర్లకు చేరుకుంటుందని ఒక అంచనా. భారత దేశ సౌందర్య సాధనాల పరిశ్రమ మార్కెట్ విలువ డిసెంబర్ 2020లో 15 బిలియన్ డాలర్లకు మించి ఉంది. 2022 నుంచి ఇక్కడి సౌందర్య రంగం ఏటా 2.8శాతం వృద్ధి చెందుతున్నదని బహుళ జాతి కంపెనీల అంచనా. పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థ, యువ జనాభా కలిగిన ఈ దేశం భవిష్యత్తులో సౌందర్య సాధనాల పరిశ్రమలో అగ్రగామిగా నిలబడుతుందని భావిస్తున్నారు.

దేశ, విదేశీ పర్యాటకులను ఆహ్వానించడానికీ, గొప్ప చేనేత వారసత్వాన్నీ, అద్భుతమైన పర్యాటక ప్రదేశాల్నీ, అరుదైన వంటకాల్నీ చాటడానికి ఈ అందాల పోటీలను ఎంచుకున్నాం అని పాలకులు ప్రచారం చేస్తున్నారు. కానీ మరే ఇతర అంతర్జాతీయ ఎగ్జిబిషన్లు, ఈవెంట్లు, సదస్సులు, కార్యక్రమాలను నిర్వహించినా ఇవే ప్రయోజనాలు నెరవేరుతాయన్నది జగమెరిగిన సత్యం. ఇందుకోసం సామ్రాజ్యవాద ప్రయోజనాలు చేకూర్చే ఈ పోటీలకు హైదరాబాద్‌ను వేదికగా మార్చాల్సిన అవసరం లేదు.

మానవాళి చరిత్రలో మేడం మేరీ క్యూరీ, హెలెన్ కెల్లర్, ఫ్లోరెన్స్ నైటింగేల్, సావిత్రిబాయి పూలే నుంచి నిన్న మొన్నటి మలాలా, కల్పనా చావ్లా, సునీత విలియమ్స్ దాకా సమాజం వారిని గొప్ప వ్యక్తులుగా గుర్తించింది కేవలం వారు సమాజానికి అందించిన సేవల ఆధారంగా మాత్రమే తప్ప, శారీరక సౌందర్యం ఆధారంగా కాదు! ఏ సమాజమైనా స్త్రీలను వారి శక్తియుక్తులు, వ్యక్తిత్వం, మేధస్సు, మానసిక పరిణతి, సామాజిక సేవ లాంటి గుణగణాల ఆధారంగా గౌరవించుకోవాలే తప్ప శరీర కొలతలు, అంగాంగ ప్రదర్శనల ద్వారా కాదు. అందాల పోటీల వలన మహిళలలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నది అబద్ధం. భౌతిక అందానికి ప్రాధాన్యత ఇవ్వడం కొద్దిమంది మహిళలలో ఆధిక్యతా భావాన్ని, మరికొద్దిమందిలో ఆత్మన్యూనతా భావాన్ని పెంచుతుంది.

○ ఆర్.గంగాధర్
అసోసియేట్ ప్రొఫెసర్, స్టాన్లీ మహిళా ఇంజనీరింగ్ కళాశాల

రెండేళ్లయినా కుదుటపడని 'మణిపూర్'!

మణిపూర్ విధ్వంసానికి రెండేళ్లు పూర్తయింది. ఈ విధ్వంసం ఎన్నో విషాదకర సంఘటనలకు, మానవతా సంక్షోభానికి సాక్ష్యంగా నిలిచింది. రెండు తెగల మధ్య అధికార పార్టీ వర్గీయుల ఆధిపత్యం కోసం సృష్టించిన విధ్వంసక క్రీడలో అమాయక ప్రజలు ఊచకోతకు గురైన మే 3వ తేదీ చరిత్రలో ఓ చేదు జ్ఞాపకంగా మిగిలిపోతుంది. ఒకప్పుడు ప్రశాంతంగా ఉండే ఈ రాష్ట్రం, ఇప్పుడు భయం, అభద్రతా భావంతో కొట్టుమిట్టాడుతోంది. తెగల మధ్య నెలకొన్న వైషమ్యాలతో ఎన్నో కుటుంబాలు తమ ఆత్మీయులను కోల్పోగా, మరెన్నో జీవితాలు దెబ్బతిన్నాయి. ఈ ఘర్షణ సామాజిక నిర్మాణాన్ని విచ్ఛిన్నం చేసి, రాష్ట్రాన్ని దీర్ఘకాలిక మానవతా సంక్షోభంలోకి నెట్టివేసింది. మెయితీ, కుకీ తెగల మధ్య మొదలైన ఘర్షణలు తారాస్థాయికి చేరి... ఇళ్లు, చర్చిలు, ఆస్తులు ధ్వంసమయ్యాయి, స్త్రీలపై అత్యాచారాలు జరిగాయి. మహిళలతోపాటు పిల్లలు సైతం హింసకు గురయ్యారు. 70వేల మందికి పైగా ప్రజలు నిరాశ్రయులవగా, 260 మందికి పైగా మరణించారు. వందలాది ఇళ్లు, గ్రామాలకు గ్రామాలు బూడిదయ్యాయి. నిరాశ్రయులైన ప్రజలు ఇప్పటికీ కొండలు, లోయలలోని సహాయక శిబిరాల్లో మగ్గుతున్నారు. వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. అల్లర్లను నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాల్సిన ముఖ్యమంత్రి, ఒక తెగకు ప్రతినిధిగా వ్యవహరించారు. ఇంత విధ్వంసం జరిగినా ప్రధాని నరేంద్ర మోదీ ఆ రాష్ట్రం వైపు కన్నెత్తి చూడలేదు. ప్రతిపక్ష పార్టీలు, మానవహక్కుల సంస్థలు, సుప్రీంకోర్టు పలు ప్రశ్నలు లేవనెత్తినా శాంతిని నెలకొల్పడానికి కేంద్రప్రభుత్వం ఇప్పటికీ చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదు.

ప్రస్తుత పరిస్థితుల్లో శాంతి స్థాపన, బాధితులకు న్యాయం చేకూర్చడం అత్యంత ఆవశ్యకం. నిష్పక్షపాతంగా విచారణ జరిపి, హింసకు కారకులైన వారిని శిక్షించాలి. నిరాశ్రయులైన వారికి పునరావాసం కల్పించాలి. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సైతం ఈ ఏడాది మార్చి 22న రాష్ట్రంలో పర్యటించారు. జస్టిస్ బి.ఆర్ గవాయ్ నేతృత్వంలోని ఆరుగురు న్యాయమూర్తుల ప్రతినిధి బృందం మణిపూర్‌లోని సహాయ శిబిరాలను సందర్శించింది.

మణిపూర్‌లో కుకీ ఇతర ఆదివాసీ వర్గాలపై జరుగుతున్న హింసకాండను అదుపు చేయకపోగా ముఖ్యమంత్రి తన వర్గీయులను పూర్తిస్థాయిలో రెచ్చగొట్టి అగ్నికి ఆజ్యం పోసినట్లు అశాంతిని రగిలించారు. పరిస్థితి ఎంతవరకు వెళ్లిందంటే అత్యధిక బీజేపీ ఎమ్మెల్యేలే ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేయక తప్పలేదు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి 13న మోదీ ప్రభుత్వం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించక తప్పలేదు. దీనిని బట్టి రాష్ట్రంలో శాంతి భద్రతలు ఎంత దిగజారాయో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రపతి పాలన విధించాక కూడా శాంతి నెలకొనకపోగా, మరింతగా దిగజారింది. డబుల్ ఇంజన్ సర్కార్‌లు ఉన్నచోట్ల శాంతిభద్రతలు ఎంతగా దిగజారుతాయో మణిపూర్ స్పష్టమైన ఉదాహరణ.

పునరావాస కేంద్రాలలో మగ్గిపోతున్న ఆదివాసీ కుటుంబాలను స్వస్థలాలకు క్షేమంగా పంపించాలి. రాష్ట్రపతి పాలనను ఎత్తివేసి, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలను వెంటనే నిర్వహించాలి. ఆదివాసీలపై జరిగిన హత్యా ఘటనలపై పూర్తిస్థాయి న్యాయ విచారణ జరిపించి, దోషులను కఠినంగా శిక్షించాలి.

– ముప్పాళ్ళ భార్గవశ్రీ, సీపీఐ ఎంఎల్ నాయకులు

కులగణన ప్రతిష్ఠను కాజేసే కుట్రలు!


కేంద్ర కులగణన నిర్ణయం రాహుల్‌గాంధీ పోరాట ఫలితమే అని దేశమంతా కీర్తించింది. ఇది బీజేపీ నేతలకు మింగుడుపడక అడ్డగోలు వాదనలు చేస్తున్నారు. బీజేపీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ మే 3న ఆంధ్రజ్యోతిలో 'చరిత్రాత్మకం... మోదీ కులగణన నిర్ణయం' పేరుతో రాసిన వ్యాసంలో అట్టడుగు వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మేలును పూర్తిగా వక్రీకరించారు.

కులగణన చేస్తామని 2024 లోకసభ ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ పేర్కొన్నది. 'జిత్‌నీ ఆబాదీ ఉత్‌నా హక్' (జనాభా ఎంతో అంత వాటా) అని రాహుల్‌గాంధీ మోదీ ప్రభుత్వానికి పక్కలో బల్లెంలా తయారయ్యారు. కులగణన వాదాన్ని బలపరిచారు. మోదీ మాత్రం కాంగ్రెస్ పార్టీ కులగణనను సమర్థించటాన్ని అర్బన్ నక్సలిజంతో పోల్చి విమర్శించారు. కులగణన హిందువుల మధ్య విభజన తెస్తుందన్నారు. "ముందు నీ కులమేంది? నీ మతమేంది?" చెప్పు అని బీజేపీ నాయకులు రాహుల్‌గాంధీని అవమానించారు. బీజేపీ నేతలు ఎంత అవమానపరిచినా రాహుల్ కులగణన వాదాన్ని వీడలేదు. దేశంలో ఆయనకు పెరుగుతున్న ఆదరణను చూసి కులగణనకు వ్యతిరేకంగా వెళితే బీజేపీ పార్టీకి భవిష్యత్‌లో జరిగే బిహార్, గుజరాత్ తదితర ఎన్నికల్లో పుట్టగతులుండవని గ్రహించి, కులగణన చేస్తామని మోదీ ప్రభుత్వం ప్రకటించింది.

కులగణన ఘనత తమదేనని డాక్టర్ లక్ష్మణ్ తన వ్యాసంలో సొంత డబ్బా కొట్టుకున్నారు. భారతదేశంలో సామాజిక న్యాయానికి ఇప్పటికీ ఎప్పటికీ దిక్సూచి ఐన కాంగ్రెస్ పార్టీ పట్ల విషం కక్కారు. మొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ 1953లో కాకా కాలేల్కర్ చైర్మన్‌గా 11 మంది సభ్యులతో తొలి బీసీ కమిషన్ వేశారు. 1951 జనాభా లెక్కల ప్రకారం 36.11కోట్ల జనాభా ఉంటే ఆ కమిషన్ కేవలం 11.5కోట్ల మంది నుండి సమాచారం సేకరించి నివేదిక రూపొందించింది. కమిషన్ వెనుకబడిన తరగతులను గుర్తించటంలో ఎటువంటి శాస్త్రీయ విధానాలు పాటించలేదని ఆ నివేదికను తోసిపుచ్చటం జరిగింది. ఇందులో నెహ్రూ తప్పు లేదు.

2011లో దివంగత డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రభుత్వం జనాభా లెక్కల్లో భాగంగా సామాజిక, ఆర్థిక కులగణన (ఎస్.ఇ.సి.సి) చేసింది. నివేదిక వచ్చే సమయానికి 2014లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కులగణన లెక్కలను బయటపెట్టాలని కాంగ్రెస్ ఎంపీలు నిలదీసినా మోదీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రధానమంత్రి మోదీకి 2024 పార్లమెంటు ఎన్నికల ముందు 2011 కులగణన లెక్కలు బయటపెట్టాలని లేఖ రాసినా ఎందుకు బయటపెట్టలేదో ఎంపీ లక్ష్మణ్ సమాధానం చెప్పాలి.

కె. లక్ష్మణ్ గుర్తుపెట్టుకోవాల్సిన అంశం ఏమిటంటే ఈ దేశంలో తొలి బీసీ కమిషన్ వేసి, ఎస్సీ ఎస్టీ బీసీలకు ముమ్మాటికి న్యాయం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వాలే. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి వర్గీకరణను అమలుచేసిన తొలి ప్రభుత్వం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వమే. నిజంగా మీకు బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే రాహుల్ గాంధీ చెప్పినట్లు 50శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేసి శాస్త్రీయంగా జనగణనతో పాటు కులగణన చేసి దేశంలో అత్యధిక సంఖ్యలో ఉన్న వారి వాటాను వారికి పంచండి.



రేవంత్‌రెడ్డి సర్కార్ చేసిన కులగణనను లక్ష్మణ్ ఉద్దేశపూర్వకంగా తప్పుపడుతున్నారు. రెండు దశల్లో చేపట్టిన సర్వేలో 97.10 శాతం జనాన్ని సమీకరించి 57 ప్రశ్నలతో సమర్థవంతంగా సమాచారం సేకరించి తెలంగాణ కులగణనలో బీసీలు 46.25 శాతం అని లెక్కలు తేల్చారు. తరువాత బీసీ జాబితాలో చేర్చిన ముస్లింల జనాభా 10.8 శాతంగా లెక్కించారు. బీసీలను, ముస్లిం బీసీలను కలిపితే తెలంగాణలో మొత్తం బీసీల శాతం 56.33గా పేర్కొన్నారు. ఎస్సీలు 17.43శాతమని, ఎస్టీలు 10.45శాతమని ప్రకటించారు. మొత్తం ఓసీల జనాభా 13.31శాతం అని వెల్లడించారు. ఓసీ ముస్లింలు 2.48శాతం. ఓసీలు, ఓసీ ముస్లింలతో కలిపి తెలంగాణలో మొత్తం ఓసీల జనాభా 15.79శాతంగా స్పష్టం చేశారు. రేవంత్ సర్కార్ చేసిన సర్వేలో శాస్త్రీయత స్పష్టంగా ఉన్నది.

నిజానికి దేశంలో ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్లు కల్పించటానికి 1989–1990లో మాజీ ప్రధాని వి.పి.సింగ్ ప్రయత్నిస్తే 'మండల్ కమండల్' పేరుతో యాత్రలు చేసి, అల్లర్లు సృష్టించి వి.పి.సింగ్ ప్రభుత్వానికి మద్దతును ఉపసంహరించుకుని ప్రభుత్వాన్ని పడగొట్టిన సంస్కృతి బీజేపీది. ఈ సంగతి మర్చిపోయినట్లు రాజీవ్‌గాంధీ మీద ఆ నేరాన్ని డాక్టర్ లక్ష్మణ్ మోపారు. ఆ తరువాత ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పీవీ నరసింహారావు ప్రధానిగా దేశవ్యాప్తంగా ఓబీసీలకి 27 శాతం రిజర్వేషన్లు అమలు చేసింది నిజం కాదా లక్ష్మణ్ గారు? 2006లో ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీ వంటి కేంద్ర అత్యున్నతమైన విద్యాసంస్థల్లోను, కేంద్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లోను ఓబీసీలకి 27 శాతం రిజర్వేషన్లు అమలు చేసింది యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌లు అన్న సంగతి మర్చిపోతే ఎలా? బిహార్‌లో కులగణన అప్పటి ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలైన జేడీయూ, ఆర్జేడీ, కాంగ్రెస్ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్‌ల సమక్షంలో 2022 నుండి ప్రారంభమై 2023లో నివేదిక బైటపెట్టింది. దీన్ని కూడా లక్ష్మణ్ బీజేపీ ఖాతాలో వేసుకోవడం విచిత్రం.


కె.లక్ష్మణ్ గుర్తుపెట్టుకోవాల్సిన అంశం ఏమిటంటే ఈ దేశంలో తొలి బీసీ కమిషన్ వేసి, ఎస్సీ ఎస్టీ బీసీలకు ముమ్మాటికి న్యాయం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వాలే. రాష్ట్రంలో బీసీలుగా ఉన్న లంబాడీలను 1975లో ఎస్టీ జాబితాలో చేర్చింది కాంగ్రెస్ ప్రభుత్వాలే. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి వర్గీకరణను అమలు చేసిన తొలి ప్రభుత్వం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వమే. 42శాతం విద్య ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలుచేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపింది కాంగ్రెస్ రేవంత్‌రెడ్డి సర్కారే. నిజంగా మీకు బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే రాహుల్‌గాంధీ చెప్పినట్లు 50శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేసి శాస్త్రీయంగా జనగణనతో పాటు కులగణన చేసి దేశంలో అత్యధిక సంఖ్యలో ఉన్న వారి వాటాను వారికి పంచండి.

• కోటూరి మానవతారాయ్
టీపీసీసీ మాజీ ప్రధానకార్యదర్శి

ఈపీఎస్ పెన్షన్ పెరిగేదెన్నడు?

ఈపీఎస్ కనీస పింఛన్‌ను వెయ్యి రూపాయల నుంచి 7500కు పెంచమని గత ఎనిమిదేళ్ళుగా ఎంతోమంది కేంద్ర ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు చేసినా ఇంత వరకు పెంచలేదు. పదేళ్ళ క్రితమే అనేక కమిటీలు కనీస ఫించన్‌ను మూడు వేలకు పెంచాలని సిఫారసులు చేసాయి. బీజేపీ నాయకుడు ప్రకాష్ జవదేకర్ 2013 ఎలక్షన్ మీటింగ్‌లో తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కనీస పెన్షన్ మూడు వేలు చేస్తామని వాగ్దానం చేశారు. ఆ తరువాత పట్టించుకోలేదు. అప్పట్లో కేంద్రమంత్రిగా ఉన్న బండారు దత్తాత్రేయ, తరువాత అనేక మంది పార్లమెంటు సభ్యులు ప్రతీ సభలోనూ ఈ విషయంపై మాట్లాడారు. మధుర ఎంపీ హేమమాలిని ప్రధాని మోదీని స్వయంగా కలిసి వివరించినా, చివరకు ప్రధానమంత్రి నాగపూర్ సభలో నాలుగేళ్ళ క్రితం వాగ్దానం చేసినా... అన్నీ నీటిమీద రాతలుగానే మిగిలిపోయాయి. పెన్షన్‌దారుల్లో చాలా మంది ఇబ్బందులు పడుతూ బతుకులీడుస్తున్నారు. వీరంతా ఇంకా తమ కనీస పెన్షన్ 7500కు పెరుగుతుందని ఆశిస్తున్నారు. వికసిత భారత్ వీరి జీవితాలలో కూడా వికసించాలి కదా!

–ఎన్.ఎస్.ఆర్.మూర్తి





అభివృద్ధి వైపు అడుగులు

ఇండస్ట్రియల్, ఐటీ, డిఫెన్స్ అకాడమీ ఏర్పాటుకు రంగం సిద్ధం!

- జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో భూముల అన్వేషణ
- క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించిన కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల): రాజధాని అమరావతికి గేట్‌వే (ముఖ ద్వారం)గా ఉన్న జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇండస్ట్రియల్ సెక్టార్‌తో పాటు ఐటీ, డిఫెన్స్ అకాడమీలను తీర్చిదిద్దాలని ప్రభుత్వ పెద్దలు యోచిస్తున్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఇక్కడి ప్రభుత్వ భూముల వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటికే ప్రజాప్రతినిధులు, కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి భూములను పరిశీలించారు. ఈ రెండు నియోజకవర్గాలు 65వ నెంబర్ జాతీయ రహదారికి, ప్రతిపాదిత ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్)కు, రాజధాని అమరావతికి దగ్గరగా ఉండటం, కృష్ణానది చెంతనే ఉండటం వల్ల నీటికి కొరత లేకపోవటం, సిమెంట్, ఇసుక, మెటల్ పుష్కలంగా ఉండటం వల్ల వేగంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పెద్దలు ఈ రెండు నియోజకవర్గాల్లో ఐటీ, డిఫెన్స్, ఇండస్ట్రియల్ సెక్టార్లు అభివృద్ధి చేయాలనే తలంపుతో శరవేగంగా పావులు కదుపుతున్నారు. పెద్ద ప్రాజెక్టులు తీసుకురావాలన్న పట్టుదలతో జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య కూడా ఉన్నారు.

జయంతిపురంలో 498 ఎకరాలు

జగ్గయ్యపేట మండలం జయంతిపురం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 94లో 498.56 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. నెల రోజుల క్రితం ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, అధికారులు ఇక్కడకు వచ్చి ఈ భూములను పరిశీలించి వెళ్లారు. జయంతిపురం రెవెన్యూ పరిధిలోనే సర్వే నెంబర్ 65లో 365 ఎకరాల భూమి ఉంది. ప్రస్తుతం ఆ భూమిపై వివాదం నెలకొనటంతో కోర్టులో కేసు నడుస్తోంది. ఈ భూమి ప్రభుత్వానిది కాదని, తమకు హక్కు ఉందంటూ గ్రామానికి మిగతా 6లో..

పెద్దవరంలో మరో 1,120 ఎకరాలు

నందిగామ మండలం పెద్దవరం గ్రామ రెవెన్యూ పరిధిలో 1,120 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. మైనర్ సర్క్యూట్ లాండ్ కావటంతో ఎక్కువ భాగం కొండలు, గుట్టలుగా ఉంది. ఈ భూమిలో 515 ఎకరాలను దశాబ్దం క్రితమే ప్రభుత్వం ఏపీఐఐసీకి కేటాయించింది. కోట్లాది రూపాయల వ్యయంతో గుట్టలు, కొండలను చదును చేసి, రోడ్లు, నీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించారు. పరిశ్రమల స్థాపనకు అనువుగా అభివృద్ధి చేశారు. అయితే గత ప్రభుత్వ హయాంలో వైసీపీ పెద్దల నిర్లక్ష్యం వల్ల పరిశ్రమలు ఏర్పాటు కాలేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. రామన్నపేట (గుడిమెట్ల) పరిధిలో 250 నుంచి మూడు వందల ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉంది. మరో మూడు వందల ఎకరాల వరకు అటవీ భూమి ఉంది. ఈ భూమిని తీసుకునేందుకు డీ నోటిఫై చేయాల్సి ఉంది. ప్రస్తుతానికి స్థానిక అధికారులు, ప్రభుత్వ భూమి వివరాలను ఉన్నతాధికారులకు పంపించారు.

భగభగలు



జగ్గయ్యపేటలో రికార్డు స్థాయిలో 44 డిగ్రీలు నమోదు

విజయవాడ/జగ్గయ్యపేట, మే 12(ఆంధ్రజ్యోతి): ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఉదయం తొమ్మిది గంటలకే సూరీడు సుర్రుమనిపిస్తున్నాడు. జనం గడపదాటి బయటకు రావడానికి భయపడుతున్నారు. జిల్లాలో సోమవారం అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జగ్గయ్యపేట మండలంలో రికార్డు స్థాయిలో 44 డిగ్రీలు నమోదైంది. ఈ ఏడాది జిల్లాలో నమోదైన అత్యధిక ఉష్ణోగ్రత ఇదే. పెనుగంచిప్రోలులో 41.6, వీరులపాడులో 41.4, ఇబ్రహీంపట్నంలో 41.2, జి.కొండూరులో 41.1, కంచికచర్లలో 40.6, విజయవాడ రూరల్‌లో 40.2, వత్సవాయిలో 39.6, విజయవాడ ఉత్తరంలో 39.6, చందర్లపాడులో 39.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం నుంచి ఎండ వేడిమి అధికంగా ఉంది. 11 గంటల నుంచి ప్రజలు బయటకు రావడానికి భయపడిపోయారు. వాహనాలపై ప్రయాణికులు ముసుగులు వేసుకుని వెళ్లాల్సి వచ్చింది. మధ్యాహ్నానికి రహదారులన్నీ నిర్మానుష్యంగా మారిపోయాయి. జిల్లాలో మరో రెండు రోజులపాటు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తున్నారు.



ఇప్పట్లో సాధ్యమేనా!

బుడమేరు ప్రక్షాళన ప్రకటనలకే పరిమితం

ఆక్రమణలు నిగ్గుతేల్చినా పడని అడుగు

ఇంకా చర్చల్లోనే విస్తరణ, పటిష్ఠత

ఆక్రమణల తొలగింపు బాధ్యత ఎవరిది

2024 సెప్టెంబరు 1.. విజయవాడ చరిత్రలో గుర్తుండిపోయే రోజు. నగరంలో సగభాగాన్ని బుడమేరు బురద ముంచేసింది. అడుగు బయటకు వేసే లోపు వరద నీరు చుట్టేసింది. ఈ పరిస్థితిపై అధ్యయనం చేసిన నిపుణులు ప్రకృతి ప్రకోపం ఒక కారణమైతే, మానవ తప్పిదాలు మరో కారణమని తేల్చారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి ఉత్పన్నమైనా ఇళ్లలోకి చుక్కనీరు చేరకుండా చేయడానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ఈ ప్రణాళిక పట్టాలెక్కడంలో రోజులు గడిచిపోతున్నాయి. ప్రాథమికంగా లోపాలను తేల్చిన అధికారుల బృందం వాటిని సరి చేయడానికి ఎటూ అడుగులు వేయలేని పరిస్థితి కనిపిస్తోంది. వరదలు తగ్గి సాధారణ పరిస్థితి రాగానే బుడమేరు ప్రక్షాళన మొదలవుతుందని మంత్రులు, అధికారులు ప్రకటించారు. బుడమేరు ప్రళయం వచ్చి తొమ్మిది నెలలు పూర్తికావస్తున్నా ప్రక్షాళన ఇంకా చర్చల దశలోనే ఉండటం గమనార్హం.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): బుడమేరు ఉగ్రరూపం దాలిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో నగరవాసులు ప్రత్యక్షంగా చూశారు. 100 కిలోమీటర్ల మేర ప్రవహించే బుడమేరు వల్ల విజయవాడ అతలాకుతలమైంది. బుడమేరు పరీవాహక ప్రాంతం 2,930 ఎకరాలు. ఇందులో నగర పరిధిలోనే బుడమేరు భూములు 80 ఎకరాలు ఆక్రమణలో ఉన్నట్టు అధికారులు నివేదిక తయారు చేశారు. ఎకరం భూమి విలువ రూ.10 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేశారు. మొత్తం ఆక్రమణల విలువ రూ.800 కోట్లుపై మాటే అని నివేదికను రూపొందించారు. విజయవాడ కాకుండా ఇతర ప్రాంతాల్లో 500 ఎకరాలు దీని పరీవాహక ప్రాంతం ఆక్రమణల్లో ఉన్నట్టు నివేదిక స్పష్టం చేస్తోంది. ఈ ఆక్రమణలను తొలగించి, భవిష్యత్తులో విజయవాడ నగరానికి వరద ముంపు మాట వినపడకుండా ఆపరేషన్ బుడమేరు చేపడతామని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ వరదల సమయంలో ప్రకటించారు. ఆక్రమణల లెక్కలు తేలి తొమ్మిది నెలలు కావస్తోంది. ఇంత వరకు ఒక్క ఆక్రమణను తొలగించిన దాఖలాలు కనిపించలేదు. పైగా రోజుకు ఓ ప్రదేశంలో ఆక్రమణలు వెలుస్తున్నాయి. బుడమేరు వాగు వెడల్పు 50 నుంచి 120 మీటర్లు. చాలా చోట్ల ఇది 10 నుంచి 30 మీటర్లకు కుచించుకుపోయింది. రియల్ వ్యాపారులు బుడమేరును పూడ్చేసి భవనాలు నిర్మించేశారు. గొల్లపూడి పంచాయతీ పరిధిలో ఈ ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయి. సెంట్రల్ నియోజకవర్గం, గన్నవరం నియోజకవర్గాల్లోనూ బుడమేరు ఆక్రమణలు భారీగా ఉన్నాయని గణాంకాలతో నివేదిక రూపొందించారు.

ఆపరేషన్ ఎప్పుడు?

ఆపరేషన్ బుడమేరులో భాగంగా వాగు మొదలైన దగ్గర నుంచి కొల్లేరులో కలిసే వరకు ఆక్రమణలు తొలగించి, కుచించుకుపోయిన ప్రదేశాలను 50 మీటర్ల వరకు వెడల్పు చేయాలన్నది అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనితో పాటు వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద ప్రస్తుతం ఉన్న డిశ్చార్జి సామర్థ్యాన్ని ఏడు వేల క్యూసెక్కుల మిగతా 6లో..



మాట్లాడుతున్న నగర మేయర్ భాగ్యలక్ష్మి

39 అంశాలకు ఆమోదం

- స్థాయీ సంఘంలో 45 అంశాలపై చర్చించిన సభ్యులు

కార్పొరేషన్, మే 12(ఆంధ్రజ్యోతి): నగర పాలకసంస్థ స్థాయీ సంఘం సమావేశంలో 39 అంశాలకు ఆమోద ముద్రవేశారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో స్థాయీ సంఘం సమావేశం జరిగింది. సమావేశంలో 45 అంశాలపై చర్చించి 39 అంశాలను ఆమోదించారు. ఒక అంశం రికార్డు చేయడంతోపాటు పరిపాలన పరమైన అంశాలకు సంబంధించి ఒక అంశాన్ని ధ్రువీకరించడం జరిగింది. ఒక అంశాన్ని పరిశీలనార్థం ఉంచగా, మూడు అంశాలను ర్యాటీఫై చేశారు. వీఎంసీ శాశ్వత ప్రాతిపదికన నడుపుతున్న మాతా శిశు రక్షణ కేంద్రాలు మున్సిపల్ మెటర్నిటీ హోమ్ రామరాజ్యనగర్, మున్సిపల్ మెటర్నిటీ రాజీవ్‌నగర్, కృష్ణలంక ఏరియాలలో 14 మంది వైద్య సిబ్బంది కాలపరిమితి పెంచడంతోపాటు జీతాలు రూ.40.20 లక్షలు చెల్లించేందుకు, అలాగే ఆయుర్వేదిక్, యునానీ ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్ పద్ధతిపై 10 మంది డాక్టర్లకు సంవత్సరం కాలపరిమితితో పాటు రూ.44.52లక్షలు చెల్లించుటకు ప్రతిపాదనను ఆమోదించారు. వెహికల్ డిపోలో ఖాళీ ఉన్న డ్రైవర్ పోస్టులకు సీనియారిటీ ప్రకారం అర్హత ఉన్న 28 మందిని డ్రైవర్‌గా ప్రమోట్ చేస్తూ పెట్టిన ప్రతిపాదన పరిశీలనార్థం ఉంచారు. బీసెంట్ రోడ్డులోని మహంతీ మార్కెట్‌లోని 15 ప్లాట్ ఫాంకు టెండర్ నిర్వహించగా, అత్యధికంగా రూ.30.15లక్షలకు పాటదారునికి అప్పగించేందుకు ప్రతిపాదనను ఆమోదించారు. అలాగే నగరంలో జాతీయ పట్టణ జీవనోపాధి మిషన్ (ఎన్‌యుఎల్‌ఎం) ప్రాజెక్ట్ స్కీంను ఏర్పాటు చేయటానికి పట్టణ ప్రణాళిక విభాగం 27 ప్రాంతాలను గుర్తించింది. దీన్ని స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. వీటితోపాటు సర్కిల్-2లో రూ.5 లక్షలలోపు 288 నామినేషన్ పనులను ర్యాటీఫై(ఆమోదించారు) చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సిండికేట్లు!

రేషన్ బియ్యం వ్యాపారంలోకి కొత్త వ్యవస్థ!

ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)లో సిండికేట్ రూపంలో మరో కొత్త వ్యవస్థ పుట్టుకొచ్చింది. ఇప్పటి వరకు రేషన్ బియ్యం మాఫియానే చూశాం. వీరిని కంట్రోల్ చేసే సిండి 'కేట్లు' ఇప్పుడు తెరమీదకు వచ్చారు. పొరుగున ఉన్న గుంటూరు జిల్లాలోని సిండికేట్ సంస్కృతి ఉమ్మడి కృష్ణా జిల్లాకు కూడా పాకింది. ఈ సిండికేట్లకు రాజకీయ పరపతి తోడవటంతో మరింత శక్తివంతంగా తయారవుతున్నాయి. ఇక్కడి నుంచి నేరుగా ఆఫ్రికా దేశాలకు ఎగుమతులు చేస్తూ కోట్ల రూపాయలు దండుకుంటున్నాయి.

- ఇన్నాళ్లూ రేషన్ మాఫియాదే రాజ్యం!
- ఇప్పుడు రేషన్ మాఫియాపై సిండికేట్ల పెత్తనం
- వీరికి రాజకీయ అండదండలు పుష్కలం
- రేషన్ బియ్యాన్ని ఫైనల్‌గా వీరికి అమ్మాల్సిందే!
- లేదంటే వేధింపులు.. భౌతిక దాడులు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రేషన్ బియ్యం అక్రమ రవాణాలో సిండికేట్లదే ఇప్పుడు అగ్రస్థానం. వారు చెప్పిందే శాసనం. రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసే మాఫియా శక్తులన్నీ కూడా ఈ సిండికేట్‌కు విక్రయించాల్సిందే. లేదంటే భయభ్రాంతులకు గురి చేయటం, అక్రమ కేసులు బనాయించటం, భౌతిక దాడులకు పాల్పడటం జరుగుతోంది. కృష్ణాజిల్లా పెనమలూరు మండలంలో రేషన్ మాఫియాపై సిండికేట్ దాడులు జరిగాయి. ఎన్టీఆర్ జిల్లా జీ.కొండూరు, తిరువూరు మండలాల్లో ఈ తరహా దాడులు కొనసాగాయి. ఈ దాడుల తర్వాత రేషన్ మాఫియా కూడా సిండికేట్లకే తాము కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని విక్రయిస్తోంది. రేషన్ బియ్యం వ్యాపారులు, మాఫియా నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని సిండికేట్లు పాత విధానంలోనే పోర్టులకు తరలించేస్తున్నారు. నిన్న మొన్నటి వరకు రేషన్ మాఫియా చేసే పని.. ఇపుడు సిండికేట్లు చేస్తున్నారు.

ఈ సిండికేట్లు ఎవరంటే..

రాజకీయ నాయకుల ఆశీస్సులు బలంగా ఉన్నవారు. రాజకీయ నాయకులకు ఫండింగ్ ఇచ్చే స్థాయి కలిగిన వారు. రేషన్ బియ్యం వ్యాపారం రూ.కోట్ల వర్షం కురిపిస్తుండటంతో ఈ వ్యాపారంలోకి రాజకీయ మిగతా 6లో..

రవాణా బాధ్యత కూడా వారిదే..

రేషన్ వ్యాపారంలో సిండికేట్ల ప్రవేశంతో రేషన్ మాఫియా శక్తులు మాస్టర్ ట్రేడర్లతో సంబంధాలను తెగతెంపులు చేసుకోవాల్సి వస్తోంది. పోర్టుల్లో ఉండే మాస్టర్ ట్రేడర్లతో ఇపుడు రేషన్ సిండికేట్లు సంబంధాలు నెరపుతున్నాయి. వ్యాపార విధానం ఒకటే అయినా వ్యక్తులు, వ్యవస్థలు మాత్రమే మారుతున్నాయి. ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రస్తుతం క్రియాశీలకంగా అరడజను మంది రేషన్ సిండికేట్లలో ఉన్నారు. రేషన్ సిండికేట్లే నేరుగా రవాణా బాధ్యతలు నిర్వహిస్తున్నాయి. కొత్తగా వ్యాపారంలోకి వచ్చిన రేషన్ సిండికేట్లు వ్యాపార విధానాన్ని అర్థం చేసుకున్నాక మరింత ఎదిగిపోతున్నాయి. ఏ స్థాయిలో అంటే పోర్టుల్లో ఉండే మాస్టర్ ట్రేడర్లను కూడా పరిగణనలోకి తీసుకోకుండా నేరుగా విదేశాల్లో ఉన్న వ్యాపారులతో సంబంధాలు నెరపుతున్నాయి. కాకినాడ, ముంబయి పోర్టులకు తరలించి అక్కడి నుంచి నేరుగా ఆఫ్రికా దేశాలకు తరలిస్తున్నాయి. భవిష్యత్తులో ఆయా దేశాల్లో కూడా రేషన్ సిండికేట్ల మనుషులే అక్కడ కూడా వ్యాపారం నిర్వహించినా ఆశ్చర్యపోనక్కర లేదు.



ఇంద్రకీలాద్రి మాస్టర్ ప్లాన్ అమలుపై సమీక్ష 8లో

నకిలీ బ్రాండ్



- ఆర్టీసీ బస్సుల్లో అన్ బ్రాండ్ బ్యాటరీల వినియోగం 6లో
- పవర్ చాలక.. రోడ్లపై ఒక్కసారిగా ఆగిపోతున్న బస్సులు

విమానాశ్రయంలో పోలీసు దళాల కవాతు 6లో

భక్తి ప్రపత్తులతో దుర్గమ్మ గిరి ప్రదక్షిణ 8లో

శుభకార్యానికి వెళ్లి వస్తూ.. 6లో

- రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి
- మరో నలుగురికి తీవ్రగాయాలు

గ్యాస్ సిలిండర్ నుంచి వస్తున్న మంటలను ఆర్పుతున్న కలెక్టర్ లక్ష్మీశ



విపత్తులో సమయస్ఫూర్తే ఆపద్బంధు

- కలెక్టర్ లక్ష్మీశ
- కలెక్టరేట్‌లో మాక్‌డ్రిల్

8లో



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో కె.చంద్రశేఖరరావు, డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ఆర్డీవో స్వాతి తదితరులు

నిర్ణీత సమయానికి అర్జీలు పరిష్కరించాలి

» జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖరరావు

మచిలీపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోరుతూ మీకోసం కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన అర్జీలను నిర్ణీత సమయానికి పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశపు మందిరంలో కెఆర్ ఆర్సీ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, బందరు ఆర్డీవో కె.స్వాతి, సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఆర్.కుముదిని సింగ్‌లతో కలిసి ప్రజాసమస్యల పరిష్కార వేదిక 'మీకోసం' కార్యక్రమం నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ, ప్రస్తుత అర్జీలతోపాటు వివిధ శాఖల వద్ద పరిష్కరించాల్సిన అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. నియోజకవర్గాల వారీగా మండలస్థాయిలో రక్తదాన శిబిరాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా వివిధ శాఖల్లో పెండింగ్ కోర్టుకేసుల పరిష్కారానికి కృషిచేయాలని సూచిస్తూ, అవసరమైన వాటికి సకాలంలో కౌంటర్ దాఖలు చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనంద్‌కుమార్, డీపీవో జె.అరుణ, డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ, ఆర్అండ్‌బి ఈఈ లోకేష్, సీపీవో భీమరాజు, డ్వామా పీడీ ఎన్‌వి.శివప్రసాద్ యాదవ్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ

వేసవి వడగాల్పులపై అప్రమత్తం..

» ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ

మచిలీపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మూడో శనివారం వేసవి వడగాల్పుల దృష్ట్యా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా 'బీట్ ద హీట్' వేసవి వడగాలుల బారిన పడకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలు ప్రజలందరికీ వివరించాలన్నారు. వడగాలుల వల్ల ఏ ఒక్కరూ చనిపోరాదన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆ రోజున గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో స్వయం సహాయక సంఘాల మహిళలు, ఉపాధి హామీ శ్రామికులు, గ్రామ పంచాయతీల పారిశుధ్య కార్మికులు తదితరులతో సమావేశం నిర్వహించి వారికి ముందస్తు జాగ్రత్తలను తెలియజేయాలన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలు సిద్ధం చేసి ప్రజలందరికీ పంపిణీ చేయాలన్నారు. పిల్లలు, వయోవృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఐదు పడకలను ప్రత్యేకించి వడగాలుల బాధితుల కోసం కేటాయించాలని తెలిపారు. అన్ని గ్రామాలు, పట్టణాల్లోనూ ముఖ్యమైన ప్రదేశాల్లో చలివేంద్రాలను నిరంతరం నడపాలన్నారు. సమావేశంలో డ్వామా, డీఆర్డీఏ పీడీలు శివప్రసాద్, హరిహరనాథ్, డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ, జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనంద్‌కుమార్, డీపీవో అరుణ, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఆక్టోపస్, ఏపీఎస్పీ, ఎస్పీఎఫ్, బలగాలతో డీఎస్పీ మురళీ రామకృష్ణ

విమానాశ్రయంలో పోలీసు దళాల కవాతు

గన్నవరం, మే 12 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం విమానాశ్రయంలో పోలీస్ దళాలు సోమవారం సాయంత్రం కవాతు నిర్వహించాయి. చీఫ్ ఎయిర్‌పోర్టు సెక్యూరిటీ ఆఫీసర్ మురళీ రామకృష్ణ పర్యవేక్షణలో సెక్యూరిటీ యూనిట్(ఏపీఎస్‌యు) ప్రయాణికులకు భద్రత కల్పించటంతో పాటు ధైర్యాన్ని పెంచే విధంగా, అసాంఘిక శక్తుల్లో భయాన్ని కలిగించేలా విమానాశ్రయ ప్రాంగణంలో కవాతును జరిపారు. ఆక్టోపస్, ఏపీఎస్పీ, ఎస్పీఎఫ్, లా అండ్ ఆర్డర్, డాగ్ స్క్వాడ్‌లు విమానాశ్రయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీ రామకృష్ణ మాట్లాడుతూ, దేశంలో హై అలర్ట్ ఉన్న నేపథ్యంలో విమానాశ్రయంలో ప్రతిరోజు ఒక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నాకాబందితో అందరిని అప్రమత్తం చేస్తున్నామన్నారు. ఎయిర్‌పోర్టు సెక్యూరిటీ యూనిట్ అణువణువు క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నట్టు తెలిపారు. ఆక్టోపస్ డీఎస్పీ రాంబాబు, ఇన్‌స్పెక్టర్‌లు బీవీ శివప్రసాద్, శివాజీ, ఎస్సై శ్రీధర్, ఎయిర్‌పోర్టు వైద్యుడు డాక్టర్ రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ప్రారంభం

మచిలీపట్నం టౌన్ : కృష్ణాజిల్లాలో సోమవారం ఇంటర్‌సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 42 కేంద్రాల్లో ఉదయం 3289 మందికిగాను 3220 మంది పరీక్షలకు హాజరయ్యారు. మధ్యాహ్నం ఒకేషనల్ విద్యార్థులు 183 మందికిగాను 162 మంది హాజరైనట్టు ఇంటర్ ప్రాంతీయ అధికారి సాల్మన్‌రాజు తెలిపారు.

19 నుంచి పది సప్లిమెంటరీ..

మచిలీపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 19వతేదీనుంచి జిల్లాలో పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్నిచర్యలు తీసుకోవాలని డీఆర్వో కే చంద్రశేఖరరావు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మీకోసం సమావేశపుహాలులో పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సోమవారం ఆయన వివిధశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 30పరీక్షాకేంద్రాలలో ఈనెల 19వతేదీ ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు పరీక్షలు జరుగుతాయని అన్నారు. జిల్లావ్యాప్తంగా 4,544మంది విద్యార్థినీ, విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షాకేంద్రాల వద్ద వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడంతోపాటు విద్యుత్ అంతరాయంలేకుండా చూడాలన్నారు. పరీక్షాకేంద్రాలవద్ద 144సెక్షన్‌ను అమలు చేయాలన్నారు. పదోతరగతి పరీక్షలతోపాటే ఓపెన్‌స్కూల్‌కు సంబంధించిన పదోతరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు జిల్లాలో 14కేంద్రాలలో జరుగుతాయని ఆయన తెలిపారు. డీఈవో పీవీజే రామారావు, డీఎంఅండ్‌హెచ్‌వో శర్మిష్ఠ, మచిలీపట్నం ఆర్డీవో కే స్వాతి, పోలీస్, రెవెన్యూ, వైద్య శాఖ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

నకిలీ బ్రాండ్!

» ఆర్టీసీ బస్సుల్లో బ్రాండ్ కాని బ్యాటరీల వినియోగం

» పవర్ చాలక రోడ్లపై హఠాత్తుగా ఆగిపోతున్న బస్సులు

» సిటీ బస్సులే కాదు.. దూరప్రాంత బస్సుల్లోనూ ఇదే పరిస్థితి

» అమరావతి వంటి హై ఎండ్ బస్సులకూ తప్పని తిప్పలు



నడిరోడ్డుపై ఆర్టీసీ బస్సు మొరాయించడంతో నెడుతున్న స్థానికులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

మనం వాడుకునే వాహనం ఏదైనా మంచి బ్యాటరీని ఎంపిక చేసుకుంటాం. ఎందుకంటే ప్రయాణంలో వాహనం ఆగిపోకుండా ఉండాలంటే బ్యాటరీ అత్యంత కీలకం. మన్నిక, గ్యారంటీలో మంచి బ్రాండ్‌ను ఎంచుకుంటాం. మరి ఎక్కువ మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాలంటే ఆర్టీసీ బస్సులకు ఎంతో మన్నిక కలిగిన బ్యాటరీ వాడాల్సి ఉంటుంది. అయితే ఆర్టీసీ అధికారులు మాత్రం నిబంధనలకు నీళ్లొదిలి.. అంతగా బ్రాండ్ లేని బ్యాటరీలను వినియోగిస్తున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో సగటున రోజుకొక బస్సు నిలిచిపోవడమే దీనికి నిదర్శనం. అంతకు వించి ఆర్టీసీకి ఎంతో నష్టం వాటిల్లుతోంది. ఆర్టీసీ అధికారులు బస్సులకు వినియోగించే బ్యాటరీలు సరిగా చార్జ్ కాక బస్సులు ఎక్కడ పడితే అక్కడ ఆగిపోతున్నాయి. సిటీ ఆర్డినరీ బస్సులే కాకుండా.. ఇటీవలి కాలంలో హై ఎండ్ అమరావతి బస్సులకు కూడా ద్వితీయ శ్రేణి బ్యాటరీలను వినియోగించడంతో మొరాయిస్తున్నాయి. ఇదిలా ఉంటే ఆర్టీసీ అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

నాణ్యత లేని బ్యాటరీల వినియోగం

ఆర్టీసీలో కొత్త బస్సులు కొనుగోలు చేసినపుడు వాటికి ఎక్సైడ్, అమరాన్ వంటి బ్రాండ్ కంపెనీల బ్యాటరీలు వస్తాయి. వీటి కాలపరిమితి తీరిన తర్వాత మరల వీటినే కొనుగోలు చేయాల్సి ఉండగా.. ఆర్టీసీ అధికారులు మాత్రం ఖర్చు కోణాన్ని దృష్టిలో ఉంచుకుని తక్కువ ధరకు మార్కెట్‌లో లభించే ద్వితీయ శ్రేణి బ్యాటరీలను ఉపయోగిస్తున్నారు. విజయవాడ సిటీ బస్సుల్లో దాదాపుగా ఈ బ్యాటరీలనే వినియోగిస్తున్నారు. నాణ్యతలేని బ్యాటరీలను ఉపయోగించటంతో బస్సు స్టార్ట్ చేసేటపుడు సెల్ఫ్ కావటం లేదు. చాలా సందర్భాలలో బస్సులు రన్నింగ్ లోనే ఆగిపోతున్నాయి.

మొరాయిస్తున్న బస్సులు

ఒక బస్సుకు 24 ఓల్ట్‌ల విద్యుత్ అవసరం ఉంటుంది. ఆర్టీసీ ఉపయోగిస్తున్న బ్యాటరీల నుంచి 12 ఓల్ట్‌ల మించి విద్యుత్ సరఫరా కాకపోవటంతో బస్సు స్టార్ట్ కావడంలేదు. డీజిల్ బస్సులకు బ్యాటరీ నుంచి సెన్సార్లకు పవర్ వెళితేనే బస్సు స్టార్ట్ అవుతుంది. అదే సీఎన్‌జీ బస్సుల విషయానికి వస్తే స్పార్క్ ప్లగ్స్‌కు బ్యాటరీ నుంచి పవర్ వెళ్లాల్సి ఉంటుంది. ఆర్టీసీ ఉపయోగిస్తున్న బ్యాటరీల కారణంగా బస్సుకు తగినంతగా విద్యుత్ సరఫరా కావటం లేదు. దీంతో బస్సులు రన్నింగ్ లోనే ఆగిపోతున్నాయి. బస్సులను తోస్తే కానీ స్టార్ట్ కావు. ప్రతిరోజూ విజయవాడ సబర్బన్ పరిధిలో సిటీ బస్సులు ఆగిపోతున్నాయి.

ఎన్టీఆర్ జిల్లాలో అధిక శాతం..

విజయవాడ నుంచి సిటీ బస్సుల ఆపరేషన్ నూజివీడు, హనుమాన్‌జంక్షన్, కంకిపాడు, ఉయ్యూరు, అమరావతి, మంగళగిరి వరకు ఉంది. ఎన్టీఆర్ జిల్లాలో సగ భాగం సబర్బన్ పరిధిలోకి వస్తుంది. ప్రతి రోజూ సగటున సబర్బన్ పరిధిలో ఒక బస్సు చొప్పున మొరాయించటం జరుగుతోంది. సింహభాగం బ్యాటరీల సమస్య కారణంగానే ఆగిపోతున్నాయన్నది డ్రైవర్ల అభిప్రాయంగా ఉంది. విజయవాడ నుంచి దూరప్రాంతాలకు నడిచే హై ఎండ్ బస్సుల్లో కూడా ఇలాంటి బ్యాటరీలనే ఉపయోగిస్తున్నట్టు తెలుస్తోంది. ఇటీవలి కాలంలో విజయవాడ నుంచి హైదరాబాద్ వెళుతున్న అమరావతి బస్సులు సైతం పొరుగు రాష్ట్రంలో మొరాయిస్తున్నాయి. ప్రయాణికులకు కష్టంతో పాటు ఆర్టీసీకి నష్టం కూడా సంభవిస్తోంది. బస్సులు ఆగిపోవటంలో కీలకపాత్ర పోషిస్తున్న బ్యాటరీల విషయంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు నాణ్యమైనవి సరఫరా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఘంటసాలలో శయన బుద్ధ ప్రాజెక్టును

పట్టాలెక్కిస్తాం



ఘంటసాలలో బుద్ధజయంతి మహోత్సవ సభలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

» పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్

» కేంద్రం నిధులు, ఎంపీ బాలశౌరి సహకారంతో పూర్తి చేస్తాం

» వేడుకగా బుద్ధ జయంతి మహోత్సవం

ఘంటసాల, మే 12 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఘంటసాలలో నిర్మాణంలో ఉన్న శయన బుద్ధ ప్రాజెక్టును పట్టాలెక్కిస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతి సమితి ఆధ్వర్యంలో బుద్ధజయంతి మహోత్సవాన్ని సోమవారం రాత్రి ఘంటసాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గడ్డుగా ఉన్నప్పటికీ శయన బుద్ధ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తామన్నారు. పర్యాటకరంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం వద్ద నిధులు ఉన్నాయని, ఎంపీ బాలశౌరి సహకారంతో ప్రాజెక్టును పూర్తి చేయటానికి తనవంతు కృషి చేస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కళలు వెలవెలబోయాయని, కళా సంస్కృతి వైభవం నేలమట్టమైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కళలకు సీఎం చంద్రబాబు జీవం పోశారన్నారు. బౌద్ధక్షేత్రంగా విరాజిల్లుతున్న ఘంటసాల ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున బుద్ధ జయంతి వేడుకలు జరపటం ఆనందంగా ఉందని, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల ఆశీస్సులు ఉన్నాయని తెలిపారు. బుద్ధుని జీవితం ఒక సర్క్యూట్‌గానూ, బౌద్ధమతం వ్యాప్తి చెందిన ప్రాంతాలను ఒక సర్క్యూట్‌గా రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. రాష్ట్రంలో బౌద్ధ పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేస్తామని దుర్గేష్ తెలిపారు. ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ, అమరావతి, నాగార్జున కొండతోపాటు ఘంటసాల కూడా అత్యంత ప్రాధాన్యతగల ప్రాంతమని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఘంటసాల మ్యూజియం పునర్నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ నిధులు సమీకరించి అభివృద్ధి చేస్తానన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, తెలుగుజాతి వారసత్వానికి ప్రతీకగా నిలిచిన గ్రామం ఘంటసాల అన్నారు. పురావస్తు శాఖ అధికారి జితేంద్ర దాస్ కాలచక్ర సమయంలో బౌద్ధ స్థూపాన్ని, బౌద్ధ మ్యూజియంను ఇక్కడ ఏర్పాటు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్, డిసిఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, ఘంటసాల మార్కెట్ యార్డు ఛైర్మన్ తోట కనకదుర్గ, మండలి వెంకట్రామ్, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, బౌద్ధ భిక్షువులు, తదితరులు పాల్గొన్నారు.

చరిత్రకు దర్పణం ఘంటసాల గ్రామం : మండలి



'రెండువేల సంవత్సరాల చరిత్రకు దర్పణం ఘంటసాల గ్రామం' అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఘంటసాలలో బుద్ధ జయంతి వేడుకలను సోమవారం ఉదయం ఇంచార్జ్ కలెక్టర్ గీతాంజలి శర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, బౌద్ధమత గ్రంథాలు చదివిన వారికే ఘంటసాల గొప్పతనం తెలుస్తుందన్నారు. ఇది ఒక మహాచైతన్యం అన్నారు. బౌద్ధ చరిత్రలో ఘంటసాలకు ప్రముఖ స్థానం కల్పించాలనే ఉద్దేశ్యంతో శయన బుద్ధ ప్రాజెక్టు నిర్మాణానికి ఎన్ఆర్ఐ రంగనాథ్‌బాబు అత్యంత విలువైన రెండెకరాల స్థలాన్ని ఉచితంగా అందించారన్నారు. గీతాంజలి శర్మ మాట్లాడుతూ, గౌతమబుద్ధుని బోధనలు అనుసరణీయమన్నారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ రంగనాథ్ బాబు అభినందనీయులని అన్నారు. మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ మాట్లాడుతూ, మరుగున పడిన అమరావతిని రాష్ట్ర రాజధానిగా ఎంపిక చేసి ప్రాధాన్యత కల్పించారని, ఎంతో ప్రాధాన్యత కలిగిన ఘంటసాల గ్రామాభివృద్ధికి కూడా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నానని తెలిపారు. భారత పురావస్తు-సర్వేక్షన, శాసన అధ్యయన విభాగం సంచాలకులు కె.మునిరత్నం రెడ్డి మాట్లాడుతూ, చరిత్రను అధ్యయనం చేయటానికి అవసరమైనవి శాసనాలు అన్నారు. ఘంటసాల గ్రామ వైభవంగా కూడా భారతీయానం శాసనంలో పొందుపర్చారని తెలిపారు. ఈ సందర్భంగా దమ్మవస్సి తియ్యగూర సోతారామం రచించిన గౌతమ బుద్ధ నృత్య రూపకం, ప్రముఖ బౌద్ధ సాహితీ వేత్త బొర్రా గోవర్ధన్ రచించిన 'బుద్ధభూమి' మాస పత్రికలను ఆవిష్కరించారు.

ఆకట్టుకున్న బౌద్ధ సాహితీ - చారిత్రక సదస్సు

ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న బుద్ధజయంతి మహోత్సవంలో భాగంగా సోమవారం మధ్యాహ్నం బౌద్ధ సాహితీ - చారిత్రక సదస్సు పలువురిని విశేషంగా ఆకట్టుకుంది. జిల్లా రచయితల సంఘ అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు అధ్యక్షతన ప్రముఖ బౌద్ధ సాహితీ వేత్త బొర్రా గోవర్ధన్ బుద్ధుని జీవిత చరిత్ర గురించి పలు అంశాలను వివరించారు.

బుద్ధుని విగ్రహోష్కరణ

మాఘపౌర్ణమి సందర్భంగా బుద్ధుని విగ్రహాన్ని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బౌద్ధ భిక్షువు బంతేజీ బౌద్ధస్థూపం వద్ద ధూప, దీప పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. తొలుత గిరిజన సాంప్రదాయ నృత్యాలు, డప్పువాయిద్యాల నడుమ బౌద్ధ భిక్షువులు, కూటమి నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు.

ఇప్పట్లో సాధ్యమేనా!

(5వ పేజీ తరువాయి)

నుంచి 25 వేల క్యూసెక్కులకు పెంచాలని భావిస్తున్నారు. ఇది జరగాలంటే ముందుగా ఆక్రమణలు తొలగించి కాల్వను వెడల్పు చేయాలి. ఆక్రమణలు తొలగించడంతోపాటు నగర పరిధిలో బుడమేరు ప్రవాహ మార్గంలో రెండు వైపులా పటిష్ఠమైన కరకట్టలు నిర్మించి నగరానికి ముంపు నుంచి రక్షణ కల్పించడమే ఆపరేషన్ బుడమేరు లక్ష్యమని మంత్రులు వెల్లడించారు. ఈ ఆపరేషన్ ఎప్పుడు మొదలవుతుందని నాటి ముంపు బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటి వరకు జరిగిన ఆక్రమణల కారణంగానే బుడమేరు బురద కమ్మేసిందని ప్రకృతి స్పష్టంగా చూపించింది. ఆపరేషన్ మొదలుకావడానికి ఇంకా ఎన్ని రోజులు పడుతుందో తెలియదు. ఇంతలో తాజాగా జరుగుతున్న ఆక్రమణలకు అడ్డుకట్ట వేసే పని అధికారులు చేయకపోవడం గమనార్హం. ఈ విషయంలో రెవెన్యూ, జలవనరుల శాఖ, మున్సిపల్ కార్పొరేషన్ శాఖల మధ్య ఏమాత్రం సమన్వయం లేదని స్పష్టంగా తెలుస్తోంది.

చర్చలు నడుస్తున్నాయి

ఆపరేషన్ బుడమేరుకు సంబంధించి చర్చలు జరుగుతున్నాయి. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత బుడమేరు ఆపరేషన్ ప్రారంభిస్తాం. దీన్ని ఎన్ని దశల్లో అమలు చేయాలన్న దానిపై చర్చిస్తున్నాం.

-మోహనరావు, జలవనరుల శాఖ ఎస్ఈ

అభివృద్ధి వైపు అడుగులు

(5వ పేజీ తరువాయి)

చెందిన ఎస్టీలు ఎప్పటి నుంచో వాదిస్తున్నారు. దీనిపై వారు కోర్టును ఆశ్రయించారు. ఈ భూమి తమదే అంటూ ప్రభుత్వం పేర్కొంటుంది. వేదాద్రి దగ్గర మరో ఏడు వందల ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఈ భూముల చుట్టు పక్కల ఉన్న మరో మూడు వందల ఎకరాల ప్రైవేట్ భూములను సేకరించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. ఇప్పటికే అధికారులు సర్వే చేసి మూడు వందల ఎకరాల భూములను గుర్తించారు. భూసేకరణ ద్వారా రైతుల నుంచి స్వాధీనం చేసుకోవాలని యోచిస్తున్నారు. మొత్తం వెయ్యి ఎకరాలను డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో)కు అప్పగించాలన్న ఆలోచనలో పాలకులు ఉన్నారని సమాచారం. జగ్గయ్యపేట ప్రాంతంలోని ఈ భూములను కొద్దిరోజుల క్రితం విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కలెక్టర్ లక్ష్మీశ తదితరులు పరిశీలించారు.



స్వామివారి కల్యాణంలో భాగంగా మంగళసూత్రాలు భక్తులకు చూపుతున్న అర్చకులు

కన్నుల పండువగా శ్రీకాకుళేశ్వరస్వామి కల్యాణం

ఘంటసాల: శ్రీకాకుళం శ్రీకాకుళేశ్వరస్వామి కల్యాణం కన్నుల పండువగా సాగింది. ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాద్ ఆధ్వర్యంలో వేదపండితులు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణ ఘట్టంలో భాగమైన స్వామివారి ఎదుర్కోలు ఉత్సవాన్ని సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ సిబ్బంది భక్తులకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేత్రపర్వం.. వేణుగోపాలస్వామి కల్యాణం

మోపిదేవి, మే 12 (ఆంధ్రజ్యోతి) : కె.కొత్తపాలెంలో రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈవో జె.ప్రవీణ స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. వేదపండితులు సత్యసాయిరామ్ ఆలయ ప్రధాన అర్చకులు నరసింహమూర్తి ఆధ్వర్యంలో స్వామివార్ల కల్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ సహాయక ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.



స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఈవో

సిండికేట్లు!

(5వ పేజీ తరువాయి)

సిండికేట్లు రంగ ప్రవేశం చేశాయి. క్షేత్ర స్థాయిలో చూస్తే ఉమ్మడి జిల్లాలో రేషన్ బియ్యం కొనుగోళ్లు వివిధ రూపాల్లో ఉంటుంది. ప్రధానంగా ఎండీయూ ఆపరేటర్ల ద్వారా కొనుగోళ్లు జరుగుతున్నాయి. డోర్ డెలివరీ చేపట్టే ఎండీయూ ఆపరేటర్లు ప్రజలకు తూకం వేసి బియ్యం ఇచ్చి మళ్లీ ఆ బియ్యాన్నే కార్డుదారుల నుంచి ఎదురుకొంటున్నారు. ఇలా కొనుగోలు చేసిన బియ్యాన్ని ఎండీయూ ఆపరేటర్లు నిల్వ చేస్తూ నియోజకవర్గ స్థాయిలో ఉన్న రేషన్ వ్యాపారులకు విక్రయిస్తుంటారు. ఇంకాస్త తెలివి, ధైర్యం ఉన్న వారు ఏకంగా రేషన్ మాఫియాకే బియ్యాన్ని విక్రయిస్తుంటారు. ఇది రేషన్ బియ్యం కొనుగోలులో మొదటి ప్రక్రియ. రెండో ప్రక్రియ ఏమిటంటే.. ఎండీయూ ఆపరేటర్ల దగ్గర నుంచి బియ్యం కొనుగోలు చేసిన కార్డుదారుల నుంచి వీధి వ్యాపారులు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తుంటారు. ఇలా కొనుగోలు చేసిన బియ్యాన్ని వీరు మండల స్థాయిలో ఉన్న వ్యాపారులకు విక్రయిస్తారు. ఈ వ్యాపారులు నియోజకవర్గ స్థాయిలో ఉన్న వ్యాపారులకు కానీ, నేరుగా బియ్యం మాఫియాకు కానీ విక్రయిస్తారు. ఇక మూడో స్థాయిలో చూస్తే.. రేషన్ డీలర్లు తాము ఎండీయూలకు ఇవ్వాల్సిన బియ్యం బస్తాలను తమ దగ్గరే ఉంచుకుంటారు. కార్డుదారుల్లో నూటికి 30 శాతం మంది మాత్రమే రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తారని డీలర్లకు తెలుసు. ప్రస్తుతం డీలర్లు స్టాకిస్టులుగా మాత్రమే పరిమితమయ్యారు. ఎండీయూ ఆపరేటర్లకు స్టాకు మాత్రమే ఇస్తారు. ఎండీయూ ఆపరేటర్, డీలర్ మధ్యన అవగాహన కారణంగా బియ్యం బస్తాలను కొన్నింటిని తన దగ్గరే డీలర్ ఉంచుకుంటాడు. ఇలా ఉంచుకున్న బియ్యాన్ని రేషన్ మాఫియాకు విక్రయిస్తాడు. ఇలా మూడంచెల విధానంలో పేదల బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేస్తున్నారు. ఈ మూడంచెలు కూడా రేషన్ మాఫియా శక్తులకు వెళతాయి. ఉమ్మడి జిల్లాలో ఇలాంటి రేషన్ మాఫియా శక్తులు పాతిక మంది వరకు ఉన్నారు. ఈ రేషన్ మాఫియా శక్తులే తాము మూడంచెల విధానంలో కొనుగోలు చేసిన బియ్యాన్ని జిల్లా, రాష్ట్ర, దేశ సరిహద్దులు దాటించే బాధ్యత తీసుకుంటారు. విదేశాలకు రవాణా చేయటానికి పోర్టుల్లో మాస్టర్ ట్రేడర్లు ఉంటారు. మాస్టర్ ట్రేడర్లు, రేషన్ మాఫియా శక్తులకు సంబంధాలు ఉంటాయి.



ఎదురెదురుగా ఢీకొన్న కారు, మీని వ్యాన్

శుభకార్యానికి వెళ్లి వస్తూ..

» రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

» మరో నలుగురికి తీవ్రగాయాలు

ఎ.కొండూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ చిన్నారి మృతి చెందగా, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎ.కొండూరు ఎస్ఐ చల్లా కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కొండపల్లికి చెందిన తిరుమలకొండ వీరబాబు కుటుంబసభ్యులతో కలిసి ఎ.కొండూరు మండలంలోని వల్లంపట్ల గ్రామంలో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి కారులో కొండపల్లికి బయలుదేరాడు. ఎ.కొండూరు పోలీస్ స్టేషన్ సమీపంలో మలుపు వద్ద విజయవాడ నుంచి తిరువూరు వైపు వెళుతున్న మినీవ్యాన్ ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న తిరుమలకొండ మహాలక్ష్మి(6) అక్కడికక్కడే మృతి చెందగా, తిరుమలకొండ వీరబాబు, సుచిత్ర, ఖమ్మంజిల్లా వైరాకు చెందిన వేముల గంగరాజు, రమాదేవి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో విజయవాడలోని ఒక ప్రయివేటు అసుపత్రికి తరలించారు. వీరబాబు పరిస్థితి విషమంగా ఉన్నట్టు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కృష్ణ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని..



మృతుడు మీర్జావలి

జి.కొండూరు : వెంకటాపురం గ్రామం వద్ద స్కూటీని ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో స్కూటీపై వెళుతున్న వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నంకు చెందిన షేక్ మీర్జావలి (49) ఆదివారం రాత్రి 7 గంటలకు మైలవరంలో ఉన్న బంధువుల ఇంటికి తన స్కూటీపై వెళ్లి తిరిగి రాత్రి 10 గంటలకు ఇబ్రహీంపట్నం వస్తుండగా వెంకటాపురం గ్రామం వద్ద ఎదురుగా కంకర లోడుతో వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన మీర్జావలిని ట్రాక్టర్ డ్రైవర్ ఆటోలో మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య మున్ని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

చిట్టినగర్, మే 12 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి చనిపోయిన సంఘటన కొత్తపేట పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం గుణదలకు చెందిన వీరాబత్తిన వెంకట్రావు (45) వెల్డింగ్ వర్క్ చేస్తుంటాడు. ఆదివారం ఉదయం ఇంటి నుంచి పనికి వెళ్లిన వెంకట్రావు పైపులరోడ్డులోని సింహాద్రి టీఎంటీ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. మృతుడి అక్క వీరాబత్తిన నక్షత్ర ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గామల్లేశ్వరులకు విశేష పూజలు





క్యూలో వేచి ఉన్న భక్తులు, వివిధ ఆర్జిత సేవల్లో పాల్గొన్న భక్తులు

ఇంద్రకీలాద్రి, మే 12 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రి క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీదుర్గామల్లేశ్వరులకు సోమవారం విశేష నిత్య పూజలు వైభవంగా జరిగాయి. వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని భక్తులు వివిధ ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. లక్ష కుంకుమార్చన, చండీయాగం, శ్రీచక్ర నవావరణార్చన, శాంతి కల్యాణం పూజల్లో భక్తులు పాల్గొన్నారు. కొండ దిగువన ఏర్పాటు చేసిన ఉచిత బస్ సదుపాయం ఉపయోగించుకుని భక్తులు ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. వృద్ధులు, దివ్యాంగుల నిమిత్తం ఏర్పాటు చేసిన బ్యాటరీ వాహనాల ద్వారా ఓం మలుపు నుంచి ప్రోటోకాల్ ఆఫీస్ వరకు వృద్ధులు, దివ్యాంగులకు ఉచితంగా కల్పించిన రవాణా సదుపాయం భక్తులకు ఎంతో ఉపయోగపడింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు కుటుంబాలతో తరలి వచ్చారు. దర్శనం అనంతరం దేవస్థానం అందిస్తున్న ఉచిత ప్రసాదం, నిత్య అన్న ప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు. అమ్మవారి దర్శనం త్వరగా జరిగేందుకు ఈవో శీనా నాయక్, సిబ్బంది ముందస్తు ప్రణాళిక ప్రకారం క్యూలైన్లలో భక్తులను నియంత్రించారు. దేవస్థానం సిబ్బంది చలివేంద్రాలలో తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

నగర కమిషనర్ ధ్యానచంద్ర



ఫిర్యాదులను స్వీకరిస్తున్న నగర కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, మే 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే వాటికి శాశ్వత పరిష్కారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు.

నగరపాలకసంస్థ ప్రధాన కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంలో నగర ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి మాట్లాడుతూ ప్రజల సమస్యలను వేగంగా, సమర్థవంతంగా పరిష్కరించడం నగరపాలకసంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజా ఫిర్యాదులు అందిన వెంటనే అధికారులు వాటి పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 13 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలకసంస్థ అదనపు కమిషనర్ ప్రాజెక్ట్ డాక్టర్ డి. చంద్రశేఖర్, చీఫ్ సిటీప్లానర్ సంజయ్ రత్నకుమార్, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి. సృజన, ఎస్ఈ ఇంజనీర్ పి. సత్యకుమారి, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానికి అండగా నిలబడదాం : ఎమ్మెల్యే గద్దె

మొగల్రాజపురం, మే 12 (ఆంధ్రజ్యోతి): యుద్ధం వల్ల ప్రజలకు, ప్రభుత్వాలకు, దేశానికి నష్టమేనని,ఇతర మార్గాలలో పరిష్కారం అన్వేషించుకుని చర్చల ద్వారా శాంతిని నెలకొల్పడానికి ప్రతి ఒక్కరూ ప్రధాని మోదీకి అండగా నిలబడదాం అని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పిలుపునిచ్చారు. 8వ డివిజన్ ఫిటింగేల్ పేట కామాక్షి మెస్ ఏరియాలో సోమవారం పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కల్లూరి రవిబాబు కుటుంబానికి ఇస్త్రీ బండిని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పహెల్గాం దాడిని భారతీయులైన ముస్లింలు కూడా ఖండిస్తున్నారని చెప్పారు. ఉగ్రదాడులను కూడా యుద్ధంగా పరిగణిస్తామని మోదీ చెప్పారని, పాకిస్థాన్ ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, డివిజన్ కార్యదర్శి మల్లెల రామకృష్ణ, దేవ పొంగు కృపారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కష్టపడే వారికి టీడీపీలో సముచిత స్థానం

ఎమ్మెల్యే గద్దెను కలిసిన పేరేపి ఈశ్వర్



ఈశ్వర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గద్దె

పటమట, మే 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కష్ట కాలంలో ఉన్న సమయంలో పార్టీ అభివృద్ధికి కృషి చేసిన కార్యకర్తలు, నాయకులకు తగిన గుర్తింపు ఉంటుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. ఏపీ కుమ్మరి శాలివాహన అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన పేరేపి ఈశ్వర్ సోమవారం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ అంటేనే క్రమశిక్షణ గల పార్టీ అన్నారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు ఉందనేందుకు ఈశ్వర్‌కు దక్కిన పదవే నిదర్శనమన్నారు. ఈశ్వర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే గద్దెకు, టీడీపీ నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. శాలివాహనుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

బదిలీలు, పదోన్నతులపై షెడ్యూల్ విడుదల చేయాలి

● యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ డిమాండ్



ధర్నాలో పాల్గొన్న ఉపాధ్యాయులు

గవర్నర్‌పేట, మే 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. పాఠశాలల పునర్వ్యవస్తీకరణ గందరగోళంగా మారిన పరిస్థితుల్లో ఉపాధ్యాయ సంఘాల చర్చల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో చేపట్టిన ధర్నాలో భాగంగా సోమవారం ధర్నా చౌక్‌లో నిరసన ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటి వరకు బదిలీలు, పదోన్నతుల షెడ్యూలు విడుదల చేయకపోవడం వల్ల ఉపాధ్యాయుల్లో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పాఠశాల పునర్వ్యవస్తీకరణ ప్రక్రియకు తెరదించాలని కోరారు. మరో నెల రోజుల్లో స్కూల్స్ ప్రారంభం కావాల్సి ఉండగా ఏ ప్రాంతంలో ఏ రకమైన స్కూల్ ఉందో అధికారుల నుంచి స్పష్టత లేదన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.పి. మనోహర్‌కుమార్ మాట్లాడుతూ బాలిక విద్యకు ఆసరాగా ఉన్న యూపీ పాఠశాలలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఏ. సుందరయ్య, జిల్లా సహాధ్యక్షుడు ఎం. కృష్ణయ్య, గౌరవాధ్యక్షుడు మచ్చా శ్రీనివాస్, సహాధ్యక్షురాలు పి. లీల, కోశాధికారి పి. నాగేశ్వరరావు తదితరులు ప్రసంగించారు. ధర్నా అనంతరం డిఆర్‌వో లక్ష్మీనరసింహులు, డీఈవో కార్యాలయంలో సూరిబాబుకు సమస్యలపై వినతిపత్రం అందజేశారు.



ఆత్కూరి వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న కార్పొరేటర్ అడపా శేషు, టీడీపీ, జనసేన నాయకులు చిన్నా, జి.జయ తదితరులు

పదోన్నతి పొందిన ఎలక్ట్రికల్ ఏఈకి సత్కారం

కృష్ణలంక, మే 12 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంక విద్యుత్ కార్యాలయంలో ఎలక్ట్రికల్ ఏఈగా విధులు నిర్వహిస్తూ డీఈఈగా పదోన్నతి పొందిన ఆత్కూరి వెంకటేశ్వరరావును సోమవారం డ్వాక్రా సంఘాల హాలులో నాయకులు ఘనంగా సత్కరించారు. స్థానిక కార్పొరేటర్ అడపా శేషు, టీడీపీ డివిజన్ నాయకుడు మోటేపల్లి చిన్నా, జనసేన అధ్యక్షుడు జి.జయకుమార్, నాయకులు పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా శేషు, చిన్నాలు మాట్లాడుతూఆయన మరిన్ని పదవులు అలరించాలని ఆకాంక్షించారు.

విజయవాడ రైల్వేస్టేషన్‌లో క్యాటరింగ్ స్టాల్స్ తనిఖీలు

● 17 మంది అనధికార విక్రేతలు గుర్తింపు
● రూ.85 వేల జరిమానా వసూలు

రైల్వేస్టేషన్, మే 12 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే స్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫారాలలో ఆదివారం అర్ధరాత్రి విజయవాడ డివిజన్ కమర్షియల్ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వావిలపల్లి రాంబాబు పర్యవేక్షణలో తనిఖీలు జరిగాయి. ప్రయాణికులకు పరిశుభ్రమైన, నాణ్యమైన, నిర్ణీత ధరలతో ఆహారాన్ని విక్రయించటం లక్ష్యంగా ఈ తనిఖీలు జరిగాయి. అన్ని క్యాటరింగ్ స్టాల్స్‌ను అధికారులు పరిశీలించారు. గుర్తింపు కార్డులు లేకుండా, గడువు ముగిసినా కూడా రెన్యూవల్ చేయించకుండా అదే గుర్తింపు కార్డులతో ఆహారాన్ని విక్రయిస్తున్న 17 మందిని గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.85వేలు అక్కడికక్కడే జరిమానా రూపంలో వసూలు చేశారు. అనంతరం వీరందరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. క్రమం తప్పకుండా ఇటువంటి తనిఖీలు తరచూ నిర్వహిస్తామని రాంబాబు తెలిపారు.

రైల్వే కార్మికులకు ఎన్‌పీఎస్, యూపీఎస్‌లపై అవగాహన

రైల్వేస్టేషన్, మే 12 (ఆంధ్రజ్యోతి): రైల్వే కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పెన్షన్‌స్కీమ్, నూతన పెన్షన్ విధానాలపై అవగాహన కల్పించేందుకు సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ విజయవాడ డివిజన్ సంఘ్ కార్యాలయంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ అల్లం రమేష్ తన బృందంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 2004 తరువాత విధి నిర్వహణలో వచ్చిన ఉద్యోగికి పాత పెన్షన్ విధానాన్ని రద్దుచేసి ఆ స్థానంలో నూతన పెన్షన్ విధానాన్ని కొన్ని సవరణలు చేసి యూనిఫైడ్ పెన్షన్ విధానాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. వీటిలో ఏదైనా ఒకదానిని జూన్ లోగా ఉద్యోగి ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. రెండింటిలో ఎంపిక చేసుకోకపోయినా ఎన్‌పీఎస్ విధానం అంగీకరించినట్లే అని డీజీల్ లోకోషెడ్ సీనియర్ సెక్షన్ ఇంజనీర్ రవి తెలిపారు.ఇంకా పాత పెన్షన్ విధానం, నూతన పెన్షన్ విధానం, యూనిఫైడ్ పెన్షన్ విధానం, ఇలా మూడింటిలో ఉన్న తేడాలను ఇంజనీర్లు నాగశయన, రవికుమార్‌లు కార్మికులకు వివరించారు. సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ రమేష్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజులు జరుగుతాయని కార్మికులు పాల్గొని సద్వినియోగం చేసుకుని తమ సందేహాలు నివృత్తిచేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి కర్నూల్ సుకుమార్, కార్యవర్గ సభ్యులు నవీన్, లాజరస్, మణికుమార్, బి.వెంకటేశ్వరరావు, మదర్, పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



సెర్ప్ సీఈవో కరుణను కలిసిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నేత దేవరపల్లి సురేష్ బాబు

వన్‌టౌన్: గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం (సెర్ప్) సీఈవో వాకాటి కరుణను ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు సోమవారం సెర్ప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సామాజిక అంశాలు, డ్వాక్రా సంఘాలు, ఉద్యోగుల సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు.

ఆప్కాస్ కార్మికుల పదవీ విరమణ వయసు పెంచాలి

కార్పొరేషన్, మే 12 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య, పార్కు, ఎన్ఎంఆర్, టైం స్కేల్ కార్మికుల పదవీ విరమణ వయసు 60 నుంచి 62 సంవత్సరాలకు పెంపుదల చేయాలని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం నగర కమిషనర్ ధ్యానచంద్ర వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల పదవీ విరమణ వయస్సును రాష్ట్ర ప్రభుత్వం 60 నుంచి 62 సంవత్సరాలకు పెంపుదల చేసినట్లు, ఆప్కాస్ కార్మికులందరికి కూడా పదవీ విరమణ వయసు పెంచాలని కోరారు. ఆప్కాస్ కార్మికుల రిటైర్మెంట్ వయసు పెంపుదల చేసేందుకు నగరపాలకసంస్థ ద్వారా ప్రభుత్వానికి విన్నవించాలని యూనియన్ నాయకులు కమిషనర్‌ను కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా, అధ్యక్షులు ఎస్వీఎస్ చలం, ఎన్ఎంఆర్ యూనియన్ నాయకులు పరశురాం లు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో గాంధీహిల్ కార్యకలాపాలు

వన్‌టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): గాంధీహిల్ కార్యకలాపాలు ఇక నుంచి నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో జరుగుతాయని ఆ సంస్థ ఛైర్మన్ డాక్టర్ గాంధీ పీసీ కాజా (కాజా పూర్ణచంద్ర గాంధీ) ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర విభజన అనంతరం 2017లో గాంధీ స్మారక నిధి పేరిట ఒక కార్యవర్గం ఏర్పడిందన్నారు. కార్యదర్శి వై.రామచంద్రరావు ఈనెల 8న గాంధీ పర్వతంపైన ఫౌండేషన్ సమావేశం జరిగిందన్నారు. ఈ ఏడాది గాంధీ జయంతి నాటికి కొన్ని మార్పులు చేసి అక్కడే గాంధీ జయంతి వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. గాంధీ హిల్‌ను రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ కేంద్రంగా అభివృద్ధి పరిచే లక్ష్యంగా ముందుకు పోతామన్నారు.

అన్నదానం విభాగంలో సరుకుల తరలింపుయత్నం

తాత్కాలిక ఉద్యోగిని పట్టుకున్న సెక్యూరిటీ గార్డు
అతని పేరు బయోమెట్రిక్ నుంచి తొలగింపు

ఇంద్రకీలాద్రి, మే 12 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానం అన్నదాన విభాగంలో సరుకులు బయటకు తరలిస్తున్న తాత్కాలిక ఉద్యోగిని విధుల్లో ఉన్న ప్రైవేటు సెక్యురిటీ గార్డు పట్టుకున్న సంఘటన సోమవారం జరిగింది. అన్నదాన విభాగంలో ఏడాదిన్నరగా యోగి తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇతను రైస్, కూరల గిన్నెలు వాహనాల్లో తరలిస్తుంటాడు. ఈ క్రమంలో ఇతను సోమవారం ఉదయం 8.30 గంటలకు బ్యాగ్‌లో అన్నదాన విభాగం లోపల నుంచి సరుకులు బయటకు తీసుకువస్తుండగా అక్కడ విధుల్లో ఉన్న సెక్యురిటీ గార్డు అతనిని ఆపి తనిఖీ చేయగా ఆ బ్యాగ్‌లో సరుకులు ఉన్నట్లు గుర్తించింది. సంబంధిత విభాగం ఉద్యోగులకు యోగిని అప్పగించగా, ఆ బ్యాగ్‌ను వారు పరిశీలించారు. ఆ బ్యాగ్‌లో సుమారు రూ.5వేల విలువ చేసే కందిపప్పు, చింతపండు, ఇతర సరుకులు ఉన్నట్లు సమాచారం. ఉద్యోగులు ఈ విషయం ఎక్కడ బయటపడుతుందోనని హుటాహుటిన అతనిని విధుల నుంచి బయటకు పంపించివేసి, అతని పేరును బయోమెట్రిక్ నుంచి తొలగించారు. అన్నదాన విభాగం నుంచి ఈ సరుకులు యోగిని ఎవరు బయటకు తీసుకువెళ్లమని పంపించారనే విషయం తెలియాల్సి ఉంది. ఈ విషయమై ఏఈవో జంగం శ్రీనివాసరావును ప్రశ్నించగా పొంతన లేని సమాధానం చెప్పారు.మొదట అలాంటిది ఏమీలేదని చెప్పిన ఆయన మరోసారి క్యారీబాగ్‌లో సర్ఫ్, ఇంకా ఏవో సరుకులు తీసుకువెళ్లాడని చెప్పటం గమనార్హం.

తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమయ్య



అన్నమయ్య జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న అతిథులు

విజయవాడ కల్చరల్, మే12 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి నందకమే అన్నమయ్యగా అవతరించి లక్ష్మీ నృసింహో పాసకుడై అచ్చ తెలుగులో 13 వేల సంకీర్తనలను అందరి దేవతా మూర్తులపై రాసిన తొలి తెలుగు వాగ్గేయకారుడు, సంఘసంస్కర్త అన్నమయ్య అని పలువురు వక్తలు పేర్కొన్నారు. తెలుగు కళావాహిని, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం కౌతా పూర్ణానందం కళావేదికపై తాళ్లపాక అన్నమయ్య 617 జయంతి కార్యక్రమం జరిగింది. చింతకాయల చిట్టిబాబు పర్యవేక్షణలో అతిథులుగా గోళ్ల నారాయణరావు, శింగంశెట్టి చంద్రశేఖర్, రచయిత, ప్రభుత్వాధికారి ప్రభాకర్ తదితరులు పాల్గొని అన్నమయ్య చిత్రపటానికి పూలదండలు వేసి అంజలి ఘటించారు. తదుపరం జరిగిన సినీ సంగీత విభావరి శ్రోతలను ఆకట్టుకొంది. మోహనలక్ష్మి, నిషిత, ఉషారెడ్డి, శ్రీ దుర్గా నాగమణి, మల్లీశ్వరి, దుర్గాప్రసాదరావు, రవికుమార్, శేఖర్, మోహనకృష్ణ, పెద్దిరెడ్డి, కోటి, మస్తాన్‌వలి, తదితరులు పలు చిత్రాలలోని పాటలను హృద్యంగా పాడి వినిపించారు.

20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

సత్యనారాయణపురం, మే 12 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.ప్రవీణ్ అన్నారు. సత్యనారాయణపురం శానిటేషన్ కార్యాలయంలో సోమవారం పారిశుధ్య సిబ్బందితో మాట్లాడి సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. లేబర్ కోడ్ రద్దు చేయాలని, ఇంజనీరింగ్ కార్మికుల జీతాల పెంపుకోసం, 60సంవత్సరాల వారిని పనిలో నిలిపివేసి వారి కుటుంబంలోని పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని ,కనీస వేతనం రూ.26 వేలు, మున్సిపల్ ఆప్కాస్ పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సమ్మె చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పౌర సంక్షేమ సంఘం నాయకులు మురళీకృష్ణ, మున్సిపల్ యూనియన్ నాయకులు శ్రీనివాసమ్మ, దుర్గ పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్ల చోరీ కేసుల్లో ఇద్దరు అరెస్టు

● 11 మోటార్ సైకిళ్లు స్వాధీనం

విద్యాధరపురం, మే 12 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిళ్ల చోరీలకు పాల్పడు తున్న ఇద్దరు నిందితులను భవానీపురం క్రైం పోలీసులు సోమవారం అరెస్టు చేసి వారి నుంచి సుమారు రూ.20లక్షల విలువ చేసే 11 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలో మోటార్ సైకిళ్ల చోరీకి గురవుతున్నాయి. పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు ఆదేశాల మేరకు ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ సూచనలతో వెస్ట్ ఏసీపీ దుర్గారావు పర్యవేక్షణలో భవానీపురం సీఐ ఉమామహేశ్వరరావు తమ సిబ్బందితో మోటారు సైకిళ్ల చోరీల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. సోమవారం స్టేషన్ పరిధిలోని అట్కిన్‌సన్ సమీపంలో చెట్లు పొదలలో ఇద్దరు అనుమానితులు తిరుగుతున్నారని సమాచారం పోలీసులకు తెలిసింది. భవానీపురం సిఐ, క్రైమ్ సిబ్బంది అక్కడకు వెళ్లి వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. భవానీపురం న్యూహెచ్‌బి కాలనీ, ఎంఐజి 493లో ఉంటున్న గడ్డం చరణ్‌సాయి అలియాస్ చరణ్ (27), గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం, డోలాస్ నగర్, బాపనయ్యపేట, ఎర్రబాలెం రోడ్డులో ఉంటున్న బొక్కా కార్తీక్ అలియాస్ దాస్ (19)లు మొత్తం 11 మోటార్ సైకిళ్లు చోరీ చేశారని పోలీసుల విచారణలో తెలిసింది. పోలీసులు 11 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.







విపత్తులో సమయస్ఫూర్తే ఆపద్బంధు

- కలెక్టర్ లక్ష్మీశ
- కలెక్టరేట్‌లో మాక్‌డ్రిల్

కలెక్టరేట్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి విపత్తు సంభవించినా భయాందోళనలకు గురికాకుండా, సమయస్ఫూర్తితో వ్యవహరించి సరైన నిర్ణయాలు తీసుకొని తమను తాము రక్షించుకొంటూ ఇతరులకు ఆపన్నహస్తం అందించడం ముఖ్యమని, ఈ నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలనే దానిపై ప్రజలతో పాటు ఇతరులకు అవగాహన కల్పించేందుకు సమన్వయ శాఖల భాగస్వామ్యంతో మాక్‌డ్రిల్ నిర్వహించినట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సోమవారం విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఇందులో అగ్నిప్రమాదం, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలి, ఇంట్లో గ్యాస్ సిలెండర్ నుంచి మంటలు వస్తే ఎలా నియంత్రించాలనే అంశాలను ఒక డెమో ద్వారా ప్రదర్శించారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలెంటీర్ల భాగస్వామ్యంతో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నామని, డివిజన్లలోనూ ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, జిల్లా అగ్నిమాపక అధికారి (డీఎఫ్‌వో) ఏవీ శంకరరావు, సహాయ డీఎఫ్‌వో కె.వినయ్, ఎస్ఎఫ్‌వో కె.నరేష్, కలెక్టరేట్ ఏవో ఎస్.శ్రీనివాసరెడ్డి, జిల్లా ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.యుగంధర్, అధికారులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలెంటీర్లు పాల్గొన్నారు.



దివ్యాంగుడి పత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ట్రైసైకిల్‌ను అందిస్తున్న అధికారులు

దివ్యాంగుడికి ఆపన్నహస్తం

- గంటలోనే ట్రై సైకిల్ పంపిణీ
- ఆనందబాష్పాలతో కలెక్టర్‌కు కృతజ్ఞతలు

విజయవాడ, మే 12 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుడి వద్దకే వెళ్లి సమస్యను ఆలకించి పరిష్కరిస్తానని ఇచ్చిన హామీని గంటలోపే నెరవేర్చి మానవత్వాన్ని చాటుకున్న కలెక్టర్ లక్ష్మీశ తీరుపై ప్రశంసలు కురుస్తున్నాయి. సోమవారం ఉదయం కలెక్టరేట్ ఆవరణలో అగ్ని ప్రమాదాలు జరిగే సమయంలో పౌరులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. అనంతరం తిరువూరు పర్యటనకు వెళ్తుండగా బయట ఉన్న దివ్యాంగుడిని గమనించిన కలెక్టర్ నేరుగా అతడి వద్దకెళ్లి సమస్య తెలుసుకున్నారు. అతడి వద్ద ఉన్న పత్రాలను పరిశీలించి తక్షణమే 3 చక్రాల వాహనాన్ని సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. గంటలోనే దివ్యాంగ సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు కామరాజు 3 చక్రాల వాహనాన్ని దివ్యాంగుడికి అందించారు. కలెక్టర్‌ను కలిసిన గంటలోనే సమస్యను పరిష్కారం కావడంతో దివ్యాంగుడు గద్దె తంబి ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపాడు.

స్వర్ణాంధ్ర స్ఫూర్తిని రగిలించే ఇగ్నైట్

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మే 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆవిష్కరించిన స్వర్ణాంధ్ర 2047 దార్శనిక ప్రణాళికకు అనుగుణంగా దశల వారీగా లక్ష్యాలను చేరుకొనేందుకు జిల్లాస్థాయిలో ఇగ్నైట్ పేరుతో వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సోమవారం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్ ప్రాంగణంలో ఇగ్నైట్ సెల్‌ను ప్రారంభించారు. ఈ ప్రత్యేక సెల్ ద్వారా ప్రజలకందించాల్సిన సేవలపై అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ దార్శనిక ప్రణాళికపై వివిధ శాఖల మధ్య సమన్వయ సాధనకు ఈ సెల్ దోహదం చేస్తుందన్నారు. ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త సాకారం దిశగా ఔత్సాహికులను సరికొత్త ఆలోచనలతో పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఈ సెల్ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి, వాటికోసం దరఖాస్తు చేసుకోవడంలోనూ తోడ్పడుతుందన్నారు. ఇందుకోసం ప్రత్యేక కౌన్సెలింగ్ సిబ్బంది ఉంటారన్నారు. సమాచారాన్ని అందించే కరపత్రాలతో పాటు వివిధ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. రోజుకో డిపార్ట్‌మెంట్ ఇగ్నైట్ స్టాల్‌ను ఏర్పాటు చేస్తుందని, ఆ శాఖ కార్యకలాపాలతో పాటు ఆ శాఖ పరిధిలోని పథకాలు, కార్యక్రమాలపైనా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. సందేహాలను నివృత్తి చేయడంతో పాటు ఆర్థికంగా, సాంకేతికంగా, మార్కెటింగ్ పరంగా చేయూతనివ్వనున్నట్టు వివరించారు. ప్రజల నుంచి వచ్చే కొత్త ఆలోచనలను సరైన విధంగా నమోదు చేసి డాక్యుమెంటేషన్ సెంటర్‌గానూ వ్యవహరిస్తుందని, ఈ ఆలోచనలపై శాఖల సమీక్ష సమావేశాల్లో చర్చించి, నిర్ణయాలు తీసుకొంటామన్నారు. తొలిరోజు వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయం, రైతు సాధికార సంస్థ స్టాళ్లను ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, డీపీవో పి.లావణ్యకుమారి, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి పాల్గొన్నారు.

15న విజయవాడ టౌన్ విద్యుత్ అదాలత్

వన్‌టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15న గురువారం ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్టు టౌన్ ఈఈ పి.రవీంద్ర బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ సీపీడీసీఎల్ విజయవాడ సర్కిల్ కార్యాలయం 2వ అంతస్తులో గల సమావేశపు హాల్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విజయవాడ డివిజన్‌లోని 16 సెక్షన్లకు సంబంధించిన విద్యుత్ వినియోగదారులు పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకోవాల్సిందిగా ఆయన కోరారు.



వైభవంగా యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణం

జగ్గయ్యపేట రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): వేదాద్రి గ్రామంలోని యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాలు, భక్తుల జయ జయ నరసింహ నామస్మరణ మధ్య నిర్వహించిన కల్యాణోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వంశపారంపర్య అర్చకుడు వేదాంతం వంశీకుల యాగ్నికంలో వైఖానస, ఆగమానుసారం పంచాహ్నిక దీక్షతో కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, ఈవో సురేష్‌బాబు దంపతులతోపాటు వంశపారంపర్య ధర్మకర్త వెలగపూడి లక్ష్మణ ఇందిరా దత్ తరపున కేసీపీ ఉద్యోగులు పాల్గొన్నారు. భక్తులు వీక్షించేందుకు ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. కల్యాణానికి ముందు స్వామి, అమ్మ వార్లకు అర్చకులు ఎదురుకోలోత్సవం నిర్వహించారు. కేసీపీ, బాల త్రిపురసుందరీ అమ్మవారి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో ఆర్‌జేసీ ఆజాద్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్, కేసీపీ ఉద్యోగులు పాల్గొన్నారు. భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ సోమవారం స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈవో సురేష్‌బాబు ఆయనకు ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు.



జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రామచందర్‌కు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనా నాయక్, అర్చకులు

దుర్గమ్మ సన్నిధిలో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు

ఇంద్రకీలాద్రి, మే 12 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలోని కనకదుర్గమ్మను సోమవారం జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వి.రామచందర్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు ఈవో వీకే శీనా నాయక్ ఆలయ మర్యాదలను అందజేసి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు వారికి ఆశీస్సులు అందజేయగా ఈవో శీనా నాయక్, అర్చకులు లడ్డూ ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం వారికి అందించారు.

ప్రేమ పేరుతో వంచన

- విజయవాడ సీపీని ఆశ్రయించిన బాధితురాలు
- న్యాయం చేయాలని వేడుకోలు

ఇబ్రహీంపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రేమించానంటూ వెంటపడ్డాడు. శారీరకంగా లొంగదీసుకున్నాడు. గర్భవతిని చేశాడు. పెళ్లికి గర్భం అడ్డమంటూ మూడో కంటికి తెలియకుండా అబార్షన్ చేయించాడు. చివరకు మోసం చేసి మరో యువతితో వివాహానికి సిద్ధమైన ఓ ప్రబుద్ధుడి నుంచి రక్షణ కావాలని, న్యాయం చేయాలని ఓ నిర్భాగ్యురాలు విజయవాడ సీపీ కార్యాలయాన్ని ఆశ్రయించింది. కొండపల్లికి చెందిన ఓ యువతి ఉపాధ్యాయురాలిగా పని చేస్తుంది. తండ్రి లేడు. తల్లితో కలిసి జీవిస్తుంది. గుంటూరు జిల్లాలోని బంధువుల ఇంటికి వెళ్లిన తనకు చర్చి పక్కనే ఉంటున్న కొండవీటి వినయ్ కుమార్‌తో పరిచయమై ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేశాడు. పెళ్లికి గర్భం అడ్డు అని విజయవాడలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో అబార్షన్ చేయించాడు. అనంతరం మరో యువతితో పెళ్లికి సిద్ధ పడినట్టు గ్రహించిన ఆమె గ్రీవెన్స్‌లో విజయవాడ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 6న ఆ ఫిర్యాదును ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు వచ్చింది. వినయ్‌కుమార్ అన్న అనిల్ గుంటూరు జిల్లా తాడేపల్లి పీఎస్‌లో రైటర్‌గా పనిచేస్తున్నాడు. వచ్చిన ఫిర్యాదులో సరైన సెక్షన్స్ నమోదు కాకుండా చూశాడు. బాధితురాలి సంతకాన్ని ఫోర్జరీ చేసి సెక్షన్లు మార్చకుండా ఎండార్స్‌మెంట్ సీపీకి పంపి అన్యాయం చేశారని ఆమె ఈనెల 12న జరిగిన గ్రీవెన్స్ ఫిర్యాదు చేసింది. ఎఫ్ఐఆర్‌లో వారికి అనుకూలమైన సెక్షన్స్ నమోదు చేయడమే కాక కొందరు పార్టీల కార్యకర్తలను ఇంటికి పంపి తనను, తన తల్లిని బుజ్జగిస్తూ కేసు వాపసు తీసుకోవాలని వేధిస్తున్నారని, తన క్యారెక్టర్ మంచిది కాదని తప్పుడు ప్రచారం చేస్తూ మానసికంగా హింసిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. పేదరాలైన తనకు న్యాయం చేయాలని ఆమె పేర్కొంది.



జవాన్లకు నివాళులర్పిస్తున్న నాట్య కళాకారులు

అన్నమయ్యకు నృత్యనీరాజనం

విజయవాడ కల్చరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): అమరావతి శాస్త్రీయ నృత్య అధ్యాపకుల సంఘం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పదకవితా పితామహ తాళ్లపాక అన్నమాచార్యుల 617వ జయంతిని పురస్కరించుకొని ఘంటశాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో నృత్య నీరాజనం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కళాశాల ప్రిన్సిపాల్ కందుల లక్ష్మీనరసమ్మ, శారదా కళాసమితి అధ్యక్షుడు డోగిపర్తి శంకరరావు, సుమధుర కళానికేతన్ ప్రధాన కార్యదర్శి వీవీ భాస్కరశర్మ హాజరయ్యారు. ఆత్మీయ అతిథులుగా కళారత్న కుమార సూర్యనారాయణ, ప్రముఖ నేపథ్య గాయకుడు జోస్యుల శ్రీరామచంద్రమూర్తి, ఉత్తమ నాట్యాచార్య, చెన్నై తెలుగు అకాడమీ భారతనాట్యం డిప్లమో, పీజీ పూర్తి చేసిన వేదాంతం శ్రీపార్థసారథి, స్వతంత్ర భారతి రమేష్‌బాబు, నాట్యాచార్య పి.హేమంత్‌కుమార్, భారతీయ భారతి స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అధినేత ఉమామహేశ్వర పాత్రుడు, నటరాజ రామకృష్ణ అకాడమీ నాట్యాచారిణి అలివేలు మంగతాయారు పాల్గొన్నారు. నాట్యాచార్యుడు పద్మశ్రీ హేమంత్, చదలవాడ ఆనంద్, రాయల శ్రీనివాస్, గోనుగుంట శైలశ్రీ, ఉషామాధవి, యల్లాజోస్యుల అనురాధ, త్రినాథాచారి, ఎ.సంతోష్, సప్పా శివకుమార్, వేదాంతం పార్థసారథి, దేవరకొండ చంద్రశేఖర్, కందికట్ల వాసుదేవరావు, మల్లిశెట్టి అనూషనాయుడు, నరేంద్ర, పావని, హనీషా చౌదరి, లలితా దేవి, ఘంటసాల పవన్‌కుమార్, తన్మయి శిష్యబృందాలతో కలిపి 200 మంది విద్యార్థులు అన్నమయ్య సంకీర్తనలతో నృత్య నీరాజనం అందించి, ప్రేక్షకులను భక్తిరసంతో తడిసి ముద్దయ్యేలా చేశారు. అధ్యాపకులను కళాశాల ప్రిన్సిపాల్ నరసమ్మ సత్కరించారు. పాకిస్థాన్‌పై జరిగిన యుద్ధంలో అమరులైన భారత జవాన్లకు విద్యార్థులు నివాళులర్పించారు. నాట్యాచార్యులు ఉమామహేశ్వరపాత్రుడు, రాయల శ్రీనివాసరావు, మావులూరి త్రినాథాచారి, నాట్యాచార్య ఘంటసాల పవన్‌కుమార్ పర్యవేక్షించారు. వ్యాఖ్యాతగా సిహెచ్.ఆనంద్ వ్యవహరించారు.



డప్పు, వాయిద్యాల నడుమ గిరి ప్రదక్షిణ

భక్తి ప్రపత్తులతో దుర్గమ్మ గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి, మే 12 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని గంగా, పార్వతీ మల్లేశ్వరుల ఉత్సవమూర్తుల గిరిప్రదక్షిణ నిర్వహించారు. ఉదయం ఆలయం నుంచి ఉత్సవమూర్తులను మేళతాళాలతో ఘాట్‌రోడ్డు టోల్‌గేట్ వద్దకు తీసుకువచ్చారు. అక్కడ అన్నపు రాశిని పోసి బలిహరణలు సమర్పించారు. ఈవో శీనా నాయక్ గుమ్మడికాయ దిష్టితీశారు. ఈవో ఇతర అధికారులు కొబ్బరికాయలు కొట్టి బలిహరణలు సమర్పించారు. అనంతరం ఈవో, ఉద్యోగులు, భక్తులు ఉత్సవమూర్తులను ఉంచిన బండిని లాగారు. జై భవానీ, జైజై భవానీ అంటూ సాగిన భక్తుల నినాదాల మధ్య గిరిప్రదక్షిణ కోలాహలంగా ప్రారంభమైంది. మేళతాళాలు, తప్పెట్లు వాయిద్యాలు, భక్తుల భజనల వంటి భక్తిపారవశ్య వాతావరణంలో అమ్మవారి గిరిప్రదక్షిణ బయలుదేరింది. కుమ్మరిపాలెం సెంటర్, 4 స్తంభాల సెంటర్, సొరంగం సెంటర్, కబేలా సెంటర్, సీవీఆర్ బ్రిడ్జి, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి, రథం సెంటర్ మీదుగా బయలు దేరి తిరిగి ఘాట్ రోడ్డు మీదుగా ఉత్సవమూర్తులు కొండపైకి చేరుకున్నారు. గిరి ప్రదక్షణ సాగిన వీధుల్లో భక్తులు కొబ్బరికాయలు, పండ్లు, హారతులు సమర్పించి పసుపు నీళ్లతో వారుపోశారు. భక్తులు పెద్ద సంఖ్యలో గిరిప్రదక్షణలో పాల్గొని అమ్మవారు సుఖ శాంతులు ఇవ్వాలని వేడుకున్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం: ఎస్పీ

మచిలీపట్నం టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొనే సమస్యలను పోలీసు శాఖ దృష్టికి తీసుకువస్తే చట్టపరిధిలో పూర్తి విచారణ జరిపి పరిష్కరించేందుకు కృషి చేస్తామని కృష్ణాజిల్లా జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మీ కోసం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలతో ఎస్పీ కార్యాలయానికి వచ్చిన ప్రజల నుంచి ఎస్పీ గంగాధరరావు వినతులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశించారు.

రైతులంతా ఐక్యంగా ఉండాలి

- రాజకీయాలకతీతంగా రైతు నేతల ఆత్మీయ సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

గాంధీనగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): నరేగా పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని, పోలవరం ప్రాజెక్టును 45.73 మీటర్ల ఎత్తులో నిర్మించాలని, సోమనాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని రైతు నేతల సమ్మేళనంలో తీర్మానించారు. రాష్ట్రంలో రాజకీయాలకు అతీతంగా కృషి చేస్తున్న రైతు నేతల ఆత్మీయ సమ్మేళనం గాంధీనగర్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న భారీ సాగునీటి ప్రాజెక్టుల్లో గేట్లను నిర్మించడంలో, నిర్వహణలో ప్రముఖ ఇంజనీర్ కన్నయ్య నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఇప్పటి వరకు సుమారు 500 ప్రాజెక్టులకు గేట్లు అమర్చి రైతులకు నీళ్లివ్వడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాజెక్టులను అధ్యయనం చేసి వాటిని అభివృద్ధి చేసి రైతులకు నీరందించే అంశంలో సలహాలు, సూచలిస్తున్నట్టు చెప్పారు. అక్కినేని భవానీప్రసాద్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ఉండే సంఘంతోనే రైతుల సమస్యలు పరిష్కారించబడతాయన్నారు. రాజకీయ పార్టీలకు అనుబంధంగా ఉండే సంఘాలు ఆయా పార్టీలు, ప్రభుత్వాల తప్పులను చెప్పేందుకు అవకాశం ఉండదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సమావేశాలు నిర్వహిస్తామన్నారు. సమన్వయ కమిటీ చైర్మన్ జయరామయ్య, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగంపై పాలకుల నిర్లక్ష్యంతో ఈ రంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు తగిన ప్రాధాన్యత కల్పించి వారు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రైతుల ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. మేధావుల ఫోరం అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్, ఐసీఎలార్ న్యూఢిల్లీ అవార్డు గ్రహీత జి.వెంకటరామరాజు, వి.రామ్మోహన్‌రావు, వివిధ జిల్లాల నుంచి రాజకీయాలకు అతీతంగా రైతునేతలు పాల్గొన్నారు.



సమీక్షలో పాల్గొన్న ఈవో శీనా నాయక్, ఏఎస్ఐ డైరెక్టర్ మునిరత్నం, అడ్డూరి శ్రీరామ్, ప్రత్తిపాటి శ్రీధర్ తదితరులు

ఇంద్రకీలాద్రి మాస్టర్ ప్లాన్ అమలుపై సమీక్ష

ఇంద్రకీలాద్రి, మే 12 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో మాస్టర్ ప్లాన్ అమలుపై సోమవారం ఈవో శీనా నాయక్ తన చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. గతంలో ఎమ్మెల్యే సుజనా చౌదరి అనేక సమీక్షలు నిర్వహించి చేసిన సూచనల మేరకు వాటిని ఎలా అమలు చేయాలన్న దానిపై ఈ సమావేశాన్ని నిర్వహించారు. పురావస్తు శాఖ డైరెక్టర్ మునిరత్నం రెడ్డి, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ పాల్గొన్నారు. అన్నదానం, ప్రసాదం పోటు, వెలివేటెడ్ క్యూ కాంప్లెక్స్, భక్తులకు మౌలిక వసతులపై చర్చించారు. వచ్చే విజయదశమి నాటికి పూర్తి చేసేలా అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎమ్మెల్యే సుజనా చౌదరి సూచించారని ప్రత్తిపాటి శ్రీధర్ తెలిపారు. ఇంజనీరింగ్ నిపుణులతో చర్చించి మునిరత్నం రెడ్డి, శీనా నాయక్ పలు సూచనలు చేశారు. సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ పాండురంగారావు, దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కోటేశ్వరరావు, వైకుంఠరావు, రిటైర్డ్ ఎస్ఈ ఉదయకుమార్, రిటైర్డ్ ఈఈ నారాయణమూర్తి, డీసీపీ చంద్రబోస్, అధికారులు పాల్గొన్నారు.

రేపు దుర్గగుడి హుండీల్లోని కానుకల లెక్కింపు

ఇంద్రకీలాద్రిపై వేంచేసిన దుర్గగుడిలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ఆలయ ప్రాంగణంలోని హుండీల్లో సమర్పించిన కానుకలను ఈనెల 14న (బుధవారం) మహామండపం 6వ అంతస్తులో లెక్కిస్తున్నట్టు ఈవో శీనా నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 నుంచి కానుకల లెక్కింపు ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు.

పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

లబ్బీపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు దాతలు రూ.కోటి ఉపకారవేతనాలు పంపిణీ చేయడం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అకాడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ షేక్ సులేమాన్ అన్నారు. కాలేజ్ మెంటార్ ఆధ్వర్యంలో సోమవారం ఏ కన్వెన్షన్‌నందు స్కాలర్‌షిప్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులను ప్రోత్సహిస్తే వారు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని, వారిని ఆదుకునేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు, కళాశాలల యాజమాన్యాలు ముందుకు రావాలన్నారు. విద్యార్థులు చదువుల్లో రాణించి కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తేవాలని, ఇంటర్ తరువాత అనేక ఉపాధి అవకాశాల కోర్సులు ఉన్నాయని వాటిపైనా విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. అనంతరం ఆదిత్య వర్శిటీ వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో మొదటిసారిగా పెద్ద మొత్తంలో స్కాలర్‌షిప్‌లు అందజేయడం అభినందనీయన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో నిర్వహించిన టెస్ట్‌ల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సుమారు రూ.కోటి స్కాలర్‌షిప్‌ను అందజేశారు. కాలేజ్ మెంటర్ సంస్థ కో-ఫౌండర్ కృష్ణ గోళ్లమూడి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య డాక్టర్
మంగళవారం • 13 మే 2025



ఆహారం | ఆరోగ్యం

అల్పాహారంలో పొరపాట్లు

ఉదయం సరైన అల్పాహారం తీసుకుంటే రోజంతా హుషారుగా ఉండడంతో పాటు శరీరం శక్తిని ఖర్చు చేసే వేగం (మెటబాలిజం) మెరుగుపడుతుంది. అయితే అల్పాహారం విషయంలో చేసే పొరపాట్లు మెటబాలిజంను మందగించేలా చేస్తాయి. కాబట్టి ఈ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకుందాం.

- ఉదయం అల్పాహారం తీసుకోకుండా ఉండకూడదు. అల్పాహారం తీసుకోకపోతే శరీరం శక్తిని ఖర్చు చేసుకునే వేగం మందగిస్తుంది. అంతేకాకుండా ఉదయం తినకపోవడం వల్ల మిగిలిన రోజంతా అతిగా తినే ప్రమాదం ఉంటుంది. దాంతో అధిక బరువు పెరుగుతారు.
- ఉదయాన్నే తీపి పదార్థాలు తినకూడదు. అలా తింటే రక్తంలో చక్కెర స్థాయులు పెరిగిపోయి శక్తి తగ్గుతుంది. దాంతో మెటబాలిజం నెమ్మదిస్తుంది.
- ప్రొటీన్ ఉన్న అల్పాహారం తినాలి. ప్రొటీన్ కడుపు నిండిన భావనతో పాటు కండరపుష్టికి తోడ్పడుతుంది. ఇది మెటబాలిజం మెరుగుదలకు సహాయపడుతుంది.
- అల్పాహారం ఆలస్యంగా తీసుకోకూడదు. అల్పాహారం ఆలస్యమైతే మెటబాలిజం నిర్వహణలో కీలక పాత్ర పోషించే శరీర జీవగడియారం దెబ్బతింటుంది.
- పీచు అందించే అల్పాహారం తీసుకోవాలి. పీచు, పేగుల ఆరోగ్యాన్ని సంరక్షించడంతోపాటు మెటబాలిజంను మెరుగుపరుస్తుంది. క్యాలరీలను సమర్థవంతంగా ఖర్చు చేయడంలోనూ పీచు ముఖ్య పాత్ర పోషిస్తుంది.
- పరగడుపున కాఫీ తాగకూడదు. ఖాళీ కడుపుతో కాఫీ తాగితే కార్టిసాల్ పెరుగుతుంది. దీని వల్ల చక్కెర నియంత్రణకు ఆటంకం ఏర్పడుతుంది. దాంతో కాలక్రమేణా మెటబాలిజం మందగిస్తుంది.



మానసికం

ప్యానిక్ అటాక్స్‌కు చెక్

అకస్మాత్తుగా గుండెల్లో రైళ్లు పరిగెత్తుతాయి. శ్వాస తీసుకోవడం కష్టమైపోతుంది. మాట పెగలదు. ఇవన్నీ ప్యానిక్ అటాక్స్ లక్షణాలు. అయితే కొన్ని చిట్కాలతో ఆ పరిస్థితి నుంచి బయటపడొచ్చు. అదెలాగంటే..

శ్వాసతో...

- నెమ్మదిగా నాలుగు అంకెలు లెక్కబెడుతూ శ్వాస పీల్చుకోవాలి
- గాలి పీల్చుకున్న తర్వాత నాలుగు అంకెలు లెక్కబెట్టాలి
- తర్వాత నాలుగు అంకెలు లెక్కపెడుతూ శ్వాస వదలాలి
- పరిస్థితి మెరుగయ్యేవరకూ ఇలాగే శ్వాస తీసుకుని, వదులుతూ ఉండాలి

చూపు, స్పర్శ, రుచి

- కంటికి ఎదురుగా కనిపించే ఐదు వస్తువుల పేర్లు చెప్పాలి
- నాలుగు వస్తువులను తాకాలి
- 3 శబ్దాలను వివరించాలి
- రెండు వాసనలను పసిగట్టాలి
- ఒక పదార్థాన్ని రుచి చూడాలి
- ఇలా చేయడం వల్ల ధ్యాస మరలి నెమ్మది చేకూరుతుంది

భరోసా

ప్యానిక్ అటాక్స్ తాత్కాలికమైనవనీ, అవి వచ్చినంత వేగంగా మాయమై పరిస్థితి సర్దుకుంటుందనే విషయాన్ని గుర్తు పెట్టుకుని మనకి మనం ధైర్యం చెప్పుకోవాలి.



మెడ నొప్పి వేధిస్తోందా? వీపు నొప్పి చంపేస్తోందా? అయితే ఆ బాధలకు, తప్పుడు శరీర భంగిమలే కారణం కావచ్చు. శరీరాన్ని అసౌకర్యానికి లోను చేసే శరీర భంగిమలు, వాటి పర్యవసానాల గురించి వైద్యులు ఏమంటున్నారో తెలుసుకుందాం!

శరీర భంగిమలతో భంగపాట్లు

సాధారణంగా మెడ, వెన్ను, నడుము నొప్పులను ఆ ప్రదేశాల్లోని ఎముకలకే ఆపాదిస్తూ ఉంటాం. అక్కడి కీళ్లలో సమస్య ఉన్నట్టు, అవి అరిగిపోయినట్టు భావిస్తాం. కానీ నిజానికి ఎముకలకు దన్నుగా ఉండే కండరాలు బలహీనపడినప్పుడే ఇలాంటి నొప్పులు మొదలవుతాయి. ప్రత్యేకించి అస్తవ్యస్త భంగిమల్లో శరీరాన్ని ఇబ్బందికి గురి చేసే వారిలో ఇలాంటి నొప్పులు సర్వసాధారణం. ఎక్కువ గంటల పాటు ఒకే చోట కూర్చుని కంప్యూటర్ పని చేయడం, రోజులో గంటల తరబడి ఫోన్లు ఉపయోగించడం లాంటి అలవాట్లన్నీ ఈ కోవకు చెందినవే! ఇలాంటి అలవాట్లతో తలెత్తే నొప్పులు, వాటి పర్యవసానాల నుంచి విముక్తి పొందాలంటే, మన శరీర భంగిమలను సరి చేసుకోవాలి.

తప్పుడు భంగిమలతో...

మన శరీరాన్ని నిర్దిష్టమైన భంగిమలో ఉంచడానికి తగ్గట్టుగానే మన కండరాలు నిర్మితమై ఉంటాయి. నడిచేటప్పుడు కొన్ని కండరాలు చురుగ్గా మారితే, కూర్చున్నప్పుడు మరికొన్ని కండరాలు చురుగ్గా పని చేయడం మొదలుపెడతాయి. మరీ ముఖ్యంగా మన వెన్నుపాము... మెడ, వీపు, నడుము దగ్గర భిన్నమైన కోణాలతో కూడిన వంపును కలిగి ఉంటుంది. ఆ వంపులకు తగ్గట్టు అక్కడి కండరాలు కూడా పనిచేస్తూ ఉంటాయి. కాబట్టి వెన్నులోని వంపులకు తగ్గట్టు శరీరాన్ని ఉపయోగించుకున్నంత కాలం ఎలాంటి సమస్యలూ, నొప్పులూ తలెత్తవు. ఎప్పుడైతే ఆయా వంపులకు భిన్నంగా శరీరాన్ని అసౌకర్యానికి లోను చేస్తామో, అప్పటి నుంచి నొప్పులు వేధించడం మొదలుపెడతాయి.


వెన్ను వంపు సమస్య

వెన్నులో నొప్పులను అక్కడి కీళ్లు, డిస్కులకే ఆపాదిస్తూ ఉంటాం. కానీ ఇవి రెండూ పనిచేయాలంటే కండరాలు కూడా బలంగా ఉండాలి. సాధారణంగా వెన్నులో ఎలాంటి సమస్య తలెత్తినా దాన్ని డిస్క్ సమస్య, ఎముకల్లో సమస్య లేదా స్పాండిలోసిస్‌గా భావిస్తూ ఉంటారు. దాంతో వైద్యులను కలిసి ఎమ్మారై చేయించుకున్నప్పుడు దాన్లో కూడా ఎముక, డిస్క్ మినహా కండరాల పరిస్థితి కనిపించదు. కానీ ఎక్కువ సందర్భాల్లో అసలు సమస్య కండరాల్లో ఉండే అవకాశం ఎక్కువ. కాబట్టి ఎముకను, డిస్క్‌నూ పట్టి ఉంచే కండరాల ఆరోగ్యం గురించి అంచనా వేయాలి. ఎక్కువ కాలం పాటు ఒకే కోణంలో వంగి కూర్చోవడం వల్ల, వెన్నులో వెన్నుపూసకు దన్నుగా ఉండే కండరాలు ఒత్తిడికి లోనై పటుత్వాన్ని కోల్పోతాయి. దాంతో కండరాల తోడ్పాటు లోపించిన వెన్ను పూసల మధ్య జాగా తరిగిపోయి, క్రమేపీ వెన్ను ముందుకు వంగిపోతుంది. కండరాల ఆసరా లోపించిన కీళ్లు కూడా త్వరగా అరిగిపోతాయనే విషయం గుర్తు పెట్టుకోవాలి. ల్యాప్‌టాప్‌ను ఒళ్లో పెట్టుకుని ముందుకు వంగిపోయి పని చేసే వాళ్లుంటారు. డెస్క్‌టాప్ మానిటర్ దగ్గరకు తలను ముందుకు చాపి పని చేసుకునే వాళ్లుంటారు. దాంతో సరైన కోణాల్లో శరీరాన్ని పట్టి ఉంచే కండరాలు అలసిపోయి, బలహీనపడిపోయి, శరీర భంగిమలు క్రమం తప్పుతాయి.

- ఎక్కువ గంటల పాటు కూర్చుని పనులు చేసేవాళ్లు గంట గంటకూ లేచి ఒకట్రెండు నిమిషాలు నడుస్తూ ఉండాలి
- తాగే నీళ్లు కుర్చీకి దూరంగా పెట్టుకుంటే, తరచూ లేచి నడిచే పని కల్పించుకున్నట్టు అవుతుంది
- వ్యాయామంతో శరీరాన్ని చురుగ్గా ఉంచుకోవాలి

మెడ, వెన్ను నొప్పుల వెనక...

ప్రతి ఒక్కరూ ఏదో ఒక సందర్భంలో మెడ, వెన్ను నొప్పులను ఎదుర్కొంటూ ఉంటారు. ఈ నొప్పులే వీడకుండా వేధిస్తున్నా, భంగిమతో పని లేకుండా నిరంతరం మెడ, వెన్ను, నడుము నొప్పులు బాధిస్తున్నా వాటిని శరీర భంగిమ సమస్యలుగా అనుమానించాలి. వీటిని సరిదిద్దడం కోసం మందులు, కైరోప్రాక్టర్ అనే ప్రత్యామ్నాయ చికిత్సా విధానం, ఫిజియోథెరపీల మీద ఆధారపడడాని కంటే ముందు, శరీర భంగిమ మీద దృష్టి పెట్టడం అవసరం. మెడ, వెన్ను సమస్యల విరుగుడు మన లోనే ఉంది. శరీర భంగిమల పరంగా చేస్తున్న తప్పును సరిదిద్దుకుంటే నొప్పులు కచ్చితంగా అదుపులోకొస్తాయి. మెడ, వెన్నులో ఎముకల కీళ్లు అరిగే పరిస్థితి స్పాండిలోసిస్. ఇది పైబడే వయసు ఫలితంగా తలెత్తవచ్చు. ఎముకలను దన్నుగా ఉండే కండరాల పటుత్వం లోపించిన ఫలితంగా మెడ, వెన్నులోని కీళ్లు అరిగి చిన్న వయసులోనే లంబార్ స్పాండిలోసిస్, సర్వైకల్ స్పాండిలోసిస్‌లు వేధించవచ్చు.



వ్యాయామంతో కండర దన్ను

యవ్వనంలో ఉన్నప్పుడు చాలా వరకూ కండరాలు శక్తిమేరకు సామర్థ్యాన్ని కనబరుస్తూ శరీరాన్ని చురుగ్గానే ఉంచుతాయి. కానీ వయసు పైబడే కొద్దీ అస్తవ్యస్త భంగిమలతో కండరాలను ఒత్తిడికి లోనుచేసిన ఫలితం నొప్పుల ద్వారా బయల్పడుతూ ఉంటుంది. అయితే వ్యాయామం చేసే వారిలో ఈ సమస్యలు తక్కువ. కండరాలను బలపరిచే వ్యాయామాలతో తప్పుడు భంగిమలతో అలసిపోకుండా ఉండేలా కండరాలను బలోపేతం చేసుకోవచ్చు. వ్యాయామం లోపిస్తే, కండరాలు, ఎముకలు బలహీనపడిపోతాయి. అలాంటప్పుడు వాటి సామర్థ్యం లోపించి, చిన్నపాటి పనులకే డస్సిపోయి, అసౌకర్యాన్ని కలిగించడం మొదలుపెడతాయి. కాబట్టి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోజుకు కనీసం అరగంట పాటైనా వ్యాయామం చేయాలి. బరువులెత్తే వ్యాయామాలతో ఎముకలు బలపడతాయనే విషయం గుర్తు పెట్టుకోవాలి.

ఏది ఒప్పు - ఏది తప్పు?

- శరీర భంగిమల్లో ఏది ఒప్పో, ఏది తప్పో తెలుసుకోవడం అవసరం. అవేంటంటే..
- **కంప్యూటర్ పని:** వీపు కుర్చీకి పూర్తిగా ఆనించి, నిటారుగా కూర్చోవాలి. తుంటి ఎముక, మోకీలు సమాంతరంగా ఉండాలి. కంటి చూపు, మానిటర్‌కు సమాంతరంగా ఉండాలి. అలాగే మోచేయి, ముంజేయి డెస్క్‌కు సమాంతరంగా ఉండేలా చూసుకోవాలి.
- **నిలబడడం:** కొందరు నడుము పైభాగాన్ని ముందుకు వంచి నిలబడతారు. ఇంకొందరు వెనక్కి వంచి నిలబడతారు. కొందరు భుజాలను ముందుకు వంచేస్తారు. నిజానికి ఇవేవీ సరైన శారీర భంగిమలు కావు. నిలబడేటప్పుడు శరీర బరువు రెండు కాళ్ల మీద సమంగా పడేలా చూసుకోవాలి. వెన్ను, మెడ నిటారుగా ఉండాలి. ఎక్కువ సమయం నిలబడవలసి వచ్చినప్పుడు, శరీర బరువును ఒక కాలి పైనుంచి మరో కాలి పైకి తరచూ మారుస్తూ ఉండాలి.
- **బరువులు ఎత్తడం:** బరువు ఎత్తగానే నడుము పట్టేస్తుందంటే, బరువును లేపే పద్ధతిలో తప్పు ఉందని అర్థం చేసుకోవాలి. నడుము పైభాగాన్ని వంచి, బరువును చేతులతో పైకి లేపే ప్రయత్నం చేస్తే, వెన్ను మీద ఒత్తిడి పడుతుంది. అలాకాకుండా మోకాళ్లను వంచి, కిందకు కుంగి బరువును లేపాలి. ఇలా చేస్తే తేలికగా బరువును లేపగలగడంతో పాటు వెన్ను సురక్షితంగా ఉంటుంది.
- **కీబోర్డ్:** కంప్యూటర్ కీబోర్డు మీద టైప్ చేసేటప్పుడు, అరచేతులు బోర్డుకు ఆనించకూడదు. అలాగే రెండు చేతులు సమాంతరంగా ఉండాలి. వేర్వేరు దిశల్లో ఉండకూడదు. మణికట్టును మరీ కిందకు, లేదా మరీ పైకి లేపి ఉంచి, వేళ్లతో టైప్ చేయకూడదు.
- **మొబైల్ ఫోన్:** రోజులో ఎక్కువ సమయం మొబైల్ ఫోన్ వాడే వాళ్లు, వీలైనంత వరకూ ఫోన్‌ను ముఖానికి ఎదురుగా చేత్తో పట్టుకుని వాడుకోవాలి. టెక్స్ట్ చేసేటప్పుడు, తలను మరీ కిందకు దించడం, మెడ వంపులో ఫోన్ ఇరికించుకుని మాట్లాడడం చేయకూడదు. సాధ్యమైనంతవరకూ ఇయర్ పాడ్స్ లేదా ఇయర్ ఫోన్స్ ఉపయోగించాలి.

డాక్టర్ వంశీకృష్ణ వర్మ పెన్మెత్స
సీనియర్ స్పైన్ సర్జన్,
యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్.



వేసవి | ఆహారం

వేసవి వేడికి విరుగుడు

నడి వేసవిలో శరీరాన్ని చల్లగా ఉంచే మార్గాల కోసం వెతుకుతూ ఉంటాం. దాహార్తిని తీర్చడంతో పాటు పొట్టను చల్లగా ఉంచే పానీయాలకే పెద్ద పీట వేస్తూ ఉంటాం. అయితే వేసవి సెగ, వేడి ప్రభావాల నుంచి రక్షణ కల్పించి శరీరాన్ని చల్లగా ఉంచే ఆహారపదార్థాలను ఎంచుకోవాలి. అవేంటంటే...

వేసవిలో డీహైడ్రేషన్‌తో ఎండదెబ్బకు గురి కాకుండా ఉండాలంటే నీరు ఎక్కువగా ఉండే కూరగాయలు, పండ్లకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రత్యేకించి పుచ్చకాయ, దోస, నారింజ, నిమ్మ, పైనాపిల్ లాంటి పుల్లని పండ్లు ఎక్కువగా తినాలి. పసుపు, నారింజ రంగు పండ్లకు ప్రాధాన్యం ఇవ్వాలి. అలాగే ఆకుకూరలు ఎక్కువగా తీసుకుంటూ ఉండాలి. అలాగే ద్రవాహారం పరిమాణం పెంచాలి. అందుకోసం కొబ్బరినీళ్లు, మజ్జిగ, నిమ్మరసం లాంటివి తరచూ తీసుకుంటూ ఉండాలి. యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా దొరికే బెర్రీ పండ్లు తింటూ ఉండాలి. అలాగే తాజా సూప్స్ కూడా తీసుకోవచ్చు. పలురకాల కూరగాయలు, మొక్కజొన్నలతో తయారుచేసిన సూప్స్, పాలకూర సూప్ లాంటివి తీసుకోవచ్చు.

ఒంట్లో నీటి శాతం తగ్గకుండా...

వేసవిలో సాయంకాలానికి శరీరం నిస్సత్తువగా మారిపోతూ ఉంటుంది. తెలియని బడలిక ఆవరిస్తుంది. ఇలా జరగకుండా ఉండాలంటే శరీరాన్ని చల్లబరిచి, తేలికగా ఉంచే పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. అందుకోసం పాలకూర, లెట్యూస్ లాంటివి తరచూ తీసుకుంటూ ఉండాలి. వీటిలో క్యాలరీలు తక్కువ, నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి శరీరంలో ద్రవ నష్టం తొలగిపోయి, శక్తి సమకూరుతుంది. అలాగే టమేటాల్లో యాంటీఆక్సిడెంట్లు, నీటి శాతం ఎక్కువ కాబట్టి. వంటల్లో వీటిని ఎక్కువగా వాడుకోవాలి. అలాగే బత్తాయి, నిమ్మ, ఉసిరి, జామ ఎక్కువగా తినాలి. వీటిలోని విటమిన్ సి, నిస్సత్తువను దూరం చేస్తుంది. వీటిలో నీటితో పాటు యాంటీఆక్సిడెంట్లు కూడా ఎక్కువ కాబట్టి వేసవిలోని బడలిక కూడా దూరమవుతుంది. కీరదోసలో విటమిన్ కె, సిలు ఉంటాయి. పైగా ఇది శరీరాన్ని అద్భుతంగా చల్లబరుస్తుంది. కాబట్టి కీరదోసకాయలు కూడా తరచూ తీసుకుంటూ ఉండాలి. అలాగే పుచ్చలో నీటితో పాటు ఎలక్ట్రొలైట్స్ కూడా పుష్కలంగా ఉంటాయి. వేసవిలో పుచ్చకు ప్రాధాన్యం ఇవ్వాలి.

తేలికగా జీర్ణమయ్యేలా...

వేసవిలో తేలికగా అరిగే పదార్థాలనే ఎంచుకోవాలి. వాటిలో చెప్పుకోదగినవి... 'సలాడ్స్'! ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల ముక్కలతో తయారుచేసిన సలాడ్‌ను భోజనానికి ముందూ, తర్వాత తీసుకుంటూ ఉండాలి. అలాగే కూరగాయలను ఉడకబెట్టి తయారుచేసిన సూప్స్ లేదా ఫ్రిజ్‌లో చల్లబరిచిన సూప్స్ తాగుతూ ఉండాలి. వీటితో శరీరంలో నీటి శాతం పెరగడంతో పాటు తేలికగా జీర్ణమై శక్తి సమకూరుతుంది. అలాగే పెరుగులో అరటి, స్ట్రాబెర్రీ పండ్ల ముక్కలు కలుపుకుని తింటూ ఉండాలి. కొబ్బరినీళ్లు, ఉప్పు/చక్కెర కలపని మజ్జిగ తీసుకోవాలి. వీటితో వేసవి వేడిమి నుంచి ఉపశమనం దక్కుతుంది. హెర్బల్ టీలు కూడా తాగుతూ ఉండాలి. తాపం తీరడం కోసం ఐస్‌డ్ హెర్బల్ టీలు ఎంచుకోవచ్చు. గ్రీన్ టీ, బ్లూ పీ టీ, క్యామొమైల్ టీలు వేసవి తాపాన్ని తీరుస్తాయి. అలాగే కొద్దిగా నూనె చిలుకరించిన లేదా నూనె ఉపయోగించని కూరగాయ ముక్కలను గ్రిల్ చేసి తినాలి. ఇవి కూడా తేలికగా అరిగి, శక్తిని అందిస్తాయి. బార్లీ నీళ్లు రుచికరమైనవే కాదు, పోషకభరితమైనవి కూడా! అలాగే రాగి జావ, మజ్జిగలు తాగొచ్చు. దీన్లోని క్యాల్షియం శరీరానికి శక్తినిస్తుంది. చియా నీళ్లు శరీరానికి చల్లదనం అందిస్తాయి.

భారీ ఆహారం వద్దు

అధిక ఉప్పు, నూనె, కొవ్వులు కలిగిన పదార్థాలకు దూరంగా ఉండాలి. బిరియానీ, పానీ పూరి, సమోసాలు, కచోరిలు, బజ్జీలు, నూనెలో వేయించే ఇతరత్రా చిరుతిళ్లు, ఐస్‌క్రీమ్స్, చాక్లెట్లు, శీతల పానీయాలు తగ్గించాలి. వీటిలోని కృత్రిమ తీపిపదార్థాలు, చక్కెరలు, కొవ్వులు దాహార్తిని పెంచుతాయి. డీహైడ్రేషన్‌కు గురి చేస్తాయి. ఉప్పు ఎక్కువగా ఉండే అప్పడాలు, చిప్స్, నిల్వ పచ్చళ్లు ఈ కాలంలో తీసుకోకపోవడమే మేలు. మాంసకృత్తుల కోసం చర్మం తొలగించిన చికెన్, చేప, టోఫు (సోయా పనీర్) తీసుకోవాలి.

చల్లని చిరుతిళ్లు

వేసవిలో చల్లగా తినడం కోసం ఐస్‌క్రీమ్స్‌ను ఎంచుకుంటూ ఉంటాం. అయితే వీటితో అదనపు చక్కెరలు శరీరంలోకి చేరకుండా ఉండడంతో పాటు పోషకాలను పొందడం కోసం, ఫ్రూట్ పాప్సికల్స్‌ను ఇంట్లోనే తయారుచేసుకుని తినొచ్చు. పుచ్చకాయ రసాన్ని అచ్చుల్లో నింపి, డీప్ ఫ్రీజ్ చేసి ఫ్రూట్ పాప్సికల్స్ తయారుచేసుకోవచ్చు. పెరుగులో పండ్ల ముక్కలు కలిపి, ఫ్రోజెన్ యొగర్ట్‌లా తినొచ్చు. పండ్ల ముక్కలను పెరుగు, లేదా కొబ్బరిపాలతో కలిపి మిక్సీలో వేసి, ఆ మిశ్రమాన్ని మౌల్డ్స్‌లో నింపి, ఫ్రిజ్‌లో గడ్డకట్టించి తినొచ్చు.




ఎండదెబ్బ నుంచి కోలుకోవడంలో ఆరోగ్యకరమైన కొవ్వులు ఎంతో బాగా సహాయపడతాయి. అందుకోసం అవకాడొ, ఎండుద్రాక్ష, ఎండు ఖర్జూరం లాంటివి ఎంతో బాగా ఉపయోగపడతాయి. వీటిలోని ఆరోగ్యకరమైన కొవ్వులు మెదడు, గుండె పనితీరులకు తోడ్పడతాయి. అలాగే సలాడ్‌లో అవకాడొ ముక్కలు కలిపి, నట్స్, సీడ్స్‌ను చల్లుకుని, పెరుగుతో కలిపి తినొచ్చు. పొట్టు తీయని గోధుమలు, మల్టీ మిల్లెట్స్‌తో తయారుచేసుకున్న టోస్ట్‌ను నట్ బటర్‌తో కలిపి తినొచ్చు. అలాగే శరీరం కోల్పోయిన ద్రవాలను భర్తీ చేయడం కోసం కొబ్బరినీళ్లు, మజ్జిగ, సూప్స్, పండ్ల రసాలు లాంటివి తీసుకోవాలి.

డాక్టర్ ఎ. కిరణ్మయి
సీనియర్ క్లినికల్ న్యూట్రిషనిస్ట్
అండ్ లైఫ్‌స్టైల్ కన్సల్టెంట్,
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్,
హైదరాబాద్.

అధ్యయనం

కాలేయం... ఇలా ఆరోగ్యం


దేశంలో కాలేయ కొవ్వు, టైప్-2 మధుమేహం కలవరపెడుతున్నాయి. దేశ జనాభాలో 27.4 శాతం మంది కాలేయ కొవ్వుతో, 7.7 కోట్ల మంది టైప్-2 మధుమేహంతో బాధపడుతున్నారు. ఈ వ్యాధుల వల్ల గుండె జబ్బులు, కాలేయ క్యాన్సర్, మూత్రపిండాల సమస్యలు వచ్చే ప్రమాదముందని వైద్యులు ఇప్పటికే హెచ్చరించారు. అయితే సరైన ఆహారం, జీవనశైలి మార్పులతో ఈ వ్యాధులకు చెక్ పెట్టవచ్చని ప్రపంచ, భారత ఆరోగ్య నిపుణుల బృందం డయాబెటిక్ అండ్ మెటబాలిక్ సిండ్రోమ్ జర్నల్‌లో ప్రచురించిన మార్గదర్శకాల్లో వెల్లడించింది. వృక్షాధారిత పదార్థాలతో ఈ వ్యాధులను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని ఆ మార్గదర్శకాల్లో నిపుణులు వెల్లడించారు. కూరగాయలు, పళ్లు, చిక్కుళ్లు, తృణధాన్యాలు, గింజలు వంటివి రక్తంలో చక్కెర స్థాయులను నియంత్రిస్తాయని, కాలేయ కొవ్వును తగ్గిస్తాయని అధ్యయనాల్లో తేలిందని చెప్పారు. ఇలాంటి ఆహారం తీసుకునే వారిలో కొన్ని వారాల్లోనే కాలేయ కొవ్వు 30 శాతం తగ్గిందని, మధుమేహం కూడా నియంత్రణలో ఉందని వివరించారు. చాలా మంది నెయ్యి, వెన్న, కొబ్బరి నూనె ఆరోగ్యకరమైనవని భావిస్తారు. కానీ వీటితో కాలేయ కొవ్వు పెరగడంతో పాటు మెటబాలిజం సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంటుంది కాబట్టి ఇలాంటి కొవ్వు పదార్థాల వినియోగం తగ్గించాలని నిపుణులు సూచించారు. ఓట్స్, బ్రౌన్ రైస్ వంటి వాటిని తీసుకోవాలనీ, మద్యపానానికి దూరంగా ఉండాలని పేర్కొన్నారు. వ్యాయామం చేస్తుండాలని, ఆరోగ్యకరమైన శరీర బరువు ఉండేలా జాగ్రత్తపడాలని సూచించారు.



బిజినెస్

విజయవాడ ● మంగళవారం 13 మే 2025

మార్కెట్.. రాకెట్



భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ... దూసుకుపోయిన స్టాక్ సూచీలు

- ఇంట్రాడేలో 3,041 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- చివరికి 2,975 పాయింట్ల లాభంతో 82,429.90 వద్ద ముగిసిన సూచీ
- 916.70 పాయింట్ల లాభంతో మళ్లీ 25,000కు చేరువైన నిఫ్టీ

రూ.16.25 లక్షల కోట్లు పెరిగిన సంపద

సూచీలకు ఇదే అతిపెద్ద ఒక్కరోజు లాభం

ముంబై: భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ అంగీకారంతో పాటు పరస్పర సుంకాలు తగ్గించుకునే దిశగా అమెరికా-చైనా మధ్య ఒప్పందం కుదరడంతో ఈక్విటీ మదుపరుల్లో ఉత్సాహం ఉప్పొంగింది. వారు భవిష్యత్‌పై భయాందోళనలు వీడి కొనుగోళ్లను పోటెత్తించడంతో ప్రామాణిక సూచీలు నింగిలోకి రాకెట్‌లా దూసుకెళ్లాయి. సోమవారం ట్రేడింగ్‌లో బీఎస్ఈ సెన్సెక్స్ 2,975.43 పాయింట్లు (3.74శాతం) లాభపడి 82,429.90 వద్దకు చేరింది. సూచీకి 7 నెలలకు పైగా గరిష్ఠ ముగింపు స్థాయి ఇది. ఒక దశలో సూచీ 3,041.5 పాయింట్లు (3.82 శాతం) ఎగబాకి 82,495.97 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. నిఫ్టీ సైతం ఒక దశలో 936.8 పాయింట్ల (3.90శాతం) వృద్ధితో 24,944.80 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 916.70 పాయింట్ల (3.82 శాతం) లాభంతో 24,924.70 వద్ద ముగిసింది. సంఖ్య పరంగా సూచీలకు ఇప్పటివరకిదే అతిపెద్ద ఒక్కరోజు లాభం. గత రికార్డు లాభం 2024 జూన్ 3న నమోదైంది. ఆ రోజున సెన్సెక్స్ 2,507.45 పాయింట్లు, నిఫ్టీ 733.20 పాయింట్లు లాభపడ్డాయి. శాతం పరంగా, సూచీలకు 2021 ఫిబ్రవరి 1 (4 ఏళ్లకు పైగా కాలంలో) తర్వాత ఇదే అతిపెద్ద లాభం. ఆ రోజున సూచీలు 4.7 శాతం వరకు వృద్ధిని నమోదు చేశాయి.

- బుల్ ర్యాలీలో ఈక్విటీ మదుపరుల సంపదగా భావించే బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.16.15 లక్షల కోట్లకు పైగా పెరిగి రూ.432.56 లక్షల కోట్లకు (5.05 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.
- సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 28 రాణించాయి. ఇన్ఫోసిస్ 7.91 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా అవతరించింది. హెచ్‌సీఎల్ టెక్, టాటా స్టీల్ 6 శాతానికి పైగా లాభపడగా.. ఎటర్నల్, టెక్ మహీంద్రా, టీసీఎస్ 5 శాతానికి పైగా పెరిగాయి. మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్ 4.27 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 3.67 శాతం వృద్ధి చెందాయి. సన్‌ఫార్మా, ఇండస్‌ఇండ్ బ్యాంక్ మాత్రం 3 శాతానికి పైగా నష్టపోయాయి.
- ప్రధాన కంపెనీలతో పాటు చిన్న, మధ్య స్థాయి షేర్లలోనూ మదుపరులు దూకుడుగా కొనుగోళ్లు జరిపారు. దాంతో బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 4.18 శాతం, మిడ్ క్యాప్ ఇండెక్స్ 3.85 శాతం పుంజుకున్నాయి. బీఎస్ఈలోని రంగాల వారీ సూచీలన్నీ లాభపడ్డాయి. ఐటీ, ఫోకస్ ఐటీ సూచీలు ఏకంగా 6.75 శాతం వరకు ఎగబాకాయి. రియల్టీ, మెటల్, టెక్నాలజీ, యుటిలిటీస్ ఇండెక్స్‌లు 5 శాతానికి పైగా పెరిగాయి.
- భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు చల్లారినప్పటికీ, రక్షణ రంగ షేర్లు వరుసగా రెండో రోజూ పెరిగాయి. యాక్సిస్‌కేడ్స్ టెక్నాలజీస్ షేరు 5 శాతం లాభపడగా.. డేటా ప్యాటర్న్స్ లిమిటెడ్ 3.88 శాతం, మిశ్ర ధాతు నిగమ్ 3.40 శాతం, భారత్ ఎలక్ట్రానిక్స్ 2.23 శాతం, గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ 1.37 శాతం ఎగబాకాయి. డ్రోన్ కంపెనీల్లో ఐడియాఫోర్జ్ టెక్నాలజీ 6.09 శాతం, ద్రోనాచార్య ఏరియల్ ఇన్నోవేషన్ 4.99 శాతం పుంజుకున్నాయి.
- బీఎస్ఈలో మొత్తం 4,254 కంపెనీల షేర్లు ట్రేడవగా.. 3,541 లాభపడ్డాయి. 582 నష్టపోగా.. 131 యథాతథంగా ముగిశాయి. 110 కంపెనీల స్టాక్స్ సరికొత్త ఏడాది గరిష్ఠానికి చేరాయి.
- విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) నికరంగా రూ.1,246.48 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేయగా, దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు (డీఐఐ) రూ.1,448.37 కోట్ల నికర కొనుగోళ్లు జరిపారు.

గోల్డ్.. ధమాల్!

ఉద్రిక్తతలు, అనిశ్చితులు తగ్గుముఖం పట్టడంతో ప్రతికూలతల్లో భద్రమైన పెట్టుబడి సాధనంగా పేరున్న బంగారానికి అంతర్జాతీయంగా గిరాకీ భారీగా తగ్గింది. దాంతో వీటి ధరలు దేశీయంగానూ భారీగా తగ్గాయి. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర ఏకంగా రూ.3,400 తగ్గి రూ.96,550కి దిగివచ్చింది. గడిచిన 10 నెలల్లో బంగారానికి ఇదే అతిపెద్ద ఒక్కరోజు తగ్గుదల. 2024 జూన్ 23న తులం బంగారం రూ.3,350 తగ్గింది. కాగా, కిలో వెండి రూ.200 తగ్గుదలతో రూ.99,700 ధర పలికింది. అమెరికా-చైనా మధ్య తాత్కాలిక వాణిజ్య ఒప్పందం కుదిరిన నేపథ్యంలో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 3 శాతానికి పైగా క్షీణించి 3,218 డాలర్లకు పడిపోగా.. సిల్వర్ 32.33 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

65 డాలర్ల పైకి క్రూడ్: అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడి చమురు పీపా ధర 2.88 శాతం పెరిగి 65.75 డాలర్లకు ఎగబాకింది. అమెరికా-చైనా మధ్య తాత్కాలిక వాణిజ్య ఒప్పందం కుదరడంతో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ మళ్లీ జోరందుకోవచ్చని, తత్ఫలితంగా ముడిచమురు గిరాకీ మళ్లీ పుంజుకోనుందన్న అంచనాలు ఇందుకు కారణమయ్యాయి.

ఐటీ రిటర్నుల గడువు జూలై 31

ఏడు రకాల రిటర్న్ ఫారాల విడుదల

న్యూఢిల్లీ: మార్చితో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఐటీ రిటర్నుల ఫైలింగ్ గడువును ఆదాయ పన్ను (ఐటీ) శాఖ ఎప్పటిలా ఈ ఏడాది కూడా జూలై 31గా నిర్ణయించింది. అసెస్‌మెంట్ ఇయర్ (ఏవై) 2025-26కు సంబంధించి ఏడు రకాల ఐటీ రిటర్న్ ఫారాలను విడుదల చేసింది.

- లిస్టెడ్ కంపెనీల షేర్లు, మ్యూచువల్ ఫండ్స్‌లో వార్షిక దీర్ఘకాలిక మూలధన లాభాలు (ఎల్‌టీసీజీ) రూ.1.25 లక్షల వరకు ఉన్న చిన్న,మధ్య రకం పన్ను చెల్లింపుదారులు ఇకపై ఎలాంటి పన్ను పోటు లేకుండా ఐటీఆర్-2కు బదులుగా ఐటీఆర్-1, ఐటీఆర్-4 ఫారాల్లో తమ రిటర్నులు దాఖలు చేయాలి.
- ఎల్‌టీసీజీ రూ.1.25 లక్షలు మించితే మాత్రం 12.5 శాతం పన్ను చెల్లించాలి.
- ట్రస్టులు, ధార్మిక సంస్థలు ఐటీఆర్-7 ద్వారా తమ రిటర్న్‌లు ఫైల్ చేయాలి.
- ఐటీఆర్-2,3,5,6,7 ఫారాల్లో పేర్కొనే మూలధన లాభాలను హేతుబద్ధం చేశారు. ఇండెక్సేషన్ ప్రయోజనం కావాలనుకుంటే 20 శాతం, వద్దనుకుంటే 12.5 శాతం చెల్లిస్తే సరిపోతుంది.

కిమ్స్ హాస్పిటల్స్ లాభం రూ. 106 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కృష్ణా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లిమిటెడ్ (కిమ్స్ హాస్పిటల్స్).. గడచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.801 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.106 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.637 కోట్లుగా ఉండగా లాభం రూ.72 కోట్లుగా ఉంది. మార్చితో ముగిసిన పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను రూ.3,067 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.415 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరం అన్ని రకాలుగా బాగుందని, కేరళలో కొత్త హాస్పిటల్‌ను ప్రారంభించటంతో పాటు వివిధ ప్రాంతాల్లో కొత్త యూనిట్లను అందుబాటులోకి తీసుకురావటం ఎంతగానో కలిసి వచ్చిందని కిమ్స్ హాస్పిటల్స్ సీఎండీ బీ భాస్కర్ రావు తెలిపారు. కాగా ఈ ఏడాది ఏప్రిల్‌లో మహారాష్ట్రలోని థానేలో కొత్త హాస్పిటల్‌ను ప్రారంభించగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో బెంగళూరులో రెండు కొత్త యూనిట్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు.

ఆల్టో కే10, వ్యాగన్ ఆర్‌లో 6 ఎయిర్‌బ్యాగ్స్

న్యూఢిల్లీ: చిన్న కారు ఆల్టో కే10 సహా వ్యాగన్ ఆర్, సెలీరియో, ఈకో కార్లన్నింటిలోనూ ఆరు ఎయిర్‌బ్యాగ్స్‌ను పొందుపరిచినట్లు మారుతి సుజుకీ ఇండియా ప్రకటించింది. కస్టమర్లకు మరింత మెరుగైన భద్రతా ఫీచర్లను అందించాలన్న ఆలోచనకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. భారత్‌లో ఆధునిక రహదారుల మౌలిక వసతులు శరవేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో వాహనాల్లో మరింత శక్తివంతమైన భద్రతా చర్యలు అవసరమయ్యాయని కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్, సేల్స్) పార్థో బెనర్జీ అన్నారు.

ఫార్మా కంపెనీలకు ట్రంప్ అల్టిమేటం

- నెల రోజుల్లో ధరలు తగ్గించాల్సిందే
- లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరిక
- భారత్‌లో పెరగనున్న ఔషధాల ధరలు!
- ఎగుమతులపైనా ప్రభావం



న్యూఢిల్లీ: సుంకాల పోటుతో ప్రపంచ వాణిజ్యాన్ని అతలాకుతలం చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దృష్టి ఇప్పుడు ఫార్మా కంపెనీలపై పడింది. ఇక నుంచి అమెరికాలో ఔషధాలను విక్రయించే ఫార్మా కంపెనీలు.. అమెరికాతో అత్యంత ప్రాధాన్యతా హోదా (ఎంఎఫ్ఎన్) ఉన్న దేశాల్లో.. ఏ దేశంలో తక్కువ ధరకు తమ ఔషధాలను అమ్ముతాయో, అదే ధరను తమ దేశంలో అమలు చేయబోతున్నట్టు ప్రకటించారు. డాక్టర్ల సిఫారసు (ప్రిస్క్రిప్షన్)పై అమ్మే ఔషధాలకు ఇది వర్తిస్తుంది. దీంతో అమెరికాలో ఈ ఔషధాల ధరలు 30 నుంచి 80 శాతం వరకు తగ్గుతుందన్నారు. నెల రోజుల్లో ఫార్మా కంపెనీలు తమ ఔషధాల ధరలు తగ్గించకపోతే ఎగ్జిక్యూటివ్ ఆదేశాల ద్వారా దీన్ని అమలు చేస్తామని డొనాల్డ్ ట్రంప్ మరీ హెచ్చరించారు.

వర్ధమాన దేశాలకు ఇబ్బందే: అమెరికా ఈ విధానాన్ని అమలు చేస్తే భారత్‌తో సహా అనేక దేశాల్లో ఔషధాల ధరలు పెరగనున్నాయి. ఫార్మా కంపెనీలు తమ పేటెంట్, ఆఫ్ పేటెంట్ ఔషధాలను విస్తృత మార్కెట్ లేదా ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నేరుగా లేదా స్థానిక ఫార్మా సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని ధరలు తగ్గించి ఇతర దేశాల్లో అమ్ముతుంటాయి. ట్రంప్ ఆదేశాలు అమల్లోకి వస్తే ఇక అది కుదరకపోవచ్చు. ఈ కంపెనీలు తమ లాభాలను కాపాడుకునేందుకు అమెరికాతో సమాన స్థాయిలో వర్ధమాన దేశాల్లోనూ ధరలు నిర్ణయించే అవకాశం ఉంది. అదే జరిగితే అనేక దేశాల్లోని పేదలకు ప్రిస్క్రిప్షన్ ఔషధాలు భారమయ్యే ప్రమాదం ఉందని భావిస్తున్నారు.

ఎగుమతులకూ దెబ్బే: ట్రంప్ అన్నంత పని చేస్తే ఆ ప్రభావం మన దేశం నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే ఔషధాలపైనా పడనుంది. మన దేశం నుంచి ఏటా 700 కోట్ల డాలర్ల (సుమారు రూ.59,500 కోట్లు) విలువైన ఔషధాలు అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి. అమెరికాలో తమ లాభాలను కాపాడుకునేందుకు ఈ కంపెనీలు ఇక దేశంలోనూ తమ ధరలను పెంచాల్సి ఉంటుంది. అంతేగాక అమెరికా, జపాన్, ఈయూ దేశాల ఫార్మా కంపెనీలు తమ పేటెంట్ హక్కులనూ మరింత గట్టిగా అమలు చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. లేకపోతే ఈ కంపెనీలు కొత్త ఔషధాల పరిశోధన, అభివృద్ధి కోసం చేసే ఖర్చులు రాబట్టుకోవడం కష్టమవుతుందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ చెప్పారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



13వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	500
వరంగల్	502	గోదావరి	500
చిత్తూరు	583	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	119
వరంగల్	115	గుంటూరు	122
కరీంనగర్	115	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	124
కర్నూలు	115	నెల్లూరు	129
విశాఖపట్నం	116	అనంతపురం	129
గోదావరి	119		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	96,880 ▼	88,800 ▼	1,09,000 ▼
విజయవాడ	96,200 ▼	95,000 ▼	97,000 ▼
విశాఖపట్నం	96,300 ▼	88,800 ▼	1,09,000 ▼
రాజమండ్రి	96,870 ▼	87,500 ▼	98,800 ▼
ప్రొద్దుటూరు	95,700 ▼	88,040 ▼	98,500 ▼
ముంబై	93,076 ▼	85,258 ▼	94,095 ▼

ఈ ఏడాది రూ.200 కోట్ల

ప్రీమియం ఆదాయం లక్ష్యం

గెలాక్సీ హెల్త్ ఇన్సూరెన్స్ ఎండీ శ్రీనివాసన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.200 కోట్ల ప్రీమియం ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు గెలాక్సీ హెల్త్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈఓ జీ శ్రీనివాసన్ వెల్లడించారు. సోమవారం నాడిక్కడ సంస్థ రీజినల్ కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది అక్టోబరులో గెలాక్సీ హెల్త్ కార్యకలాపాలు ఆరంభం కాగా ప్రీమియం ఆదాయం రూ.17 కోట్లుగా ఉందన్నారు. కార్యకలాపాలు ప్రారంభించిన కొద్ది నెలల్లోనే 68 వేల మందికి పైగా పాలసీదారులను చేర్చుకున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం గెలాక్సీ హెల్త్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో సేవలందిస్తుండగా వచ్చే మార్చి నాటికి మరో ఐదు రాష్ట్రాలకు విస్తరించాలని చూస్తున్నట్లు శ్రీనివాసన్ తెలిపారు. ప్రస్తుతం ఏడు ఆరోగ్య బీమా ఉత్పత్తులను విక్రయిస్తుండగా ఈ ఏడాది మరో 10 కొత్త ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన చెప్పారు. కాగా ఏపీ, తెలంగాణల్లో కార్యకలాపాలను మరింత పటిష్ఠం చేసేందుకు మరో 14 కార్యాలయాలను ప్రారంభించాలని చూస్తున్నట్లు ఆయన చెప్పారు. అలాగే 10 వేల మంది ఏజెంట్లను చేర్చుకోనున్నట్లు ఆయన చెప్పారు. కాగా బీమా ఉత్పత్తుల విక్రయానికి బ్యాంకులతో ఒప్పందం కుదుర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు శ్రీనివాసన్ తెలిపారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

రామ్‌చరణ్‌కు అరుదైన గౌరవం



యువ కథానాయకుడు రామ్‌చరణ్ అరుదైన గౌరవం పొందారు. లండన్ మేడమ్ టుసాడ్స్‌లో ఆయన తన పెంపుడు కుక్క రైమ్‌తో కలసి మైనపు విగ్రహంగా కొలువు తీరారు. ఈ విగ్రహం ఆయన విజయాన్ని మాత్రమే కాదు తన పెంపుడు కుక్కతో ఉన్న బంధాన్ని కూడా తెలియజేస్తుంది. రెండో క్వీన్ ఎలిజబెత్ తర్వాత ఐకానిక్ మ్యూజియంలో తన పెంపుడు జంతువుతో నిలిచిన సెలబ్రిటీగా రామ్‌చరణ్ అరుదైన గౌరవం పొందారు. లండన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి దంపతులు, రామ్‌చరణ్ దంపతులు, సన్నిహితులు హాజరయ్యారు. ప్రస్తుతం దేశంలో నెలకొని ఉన్న పరిస్థితులు దృష్ట్యా ప్రకటనను వాయిదా వేయాలని భావించారు. అయితే పరిస్థితులు సాధారణ స్థాయికి చేరుకోవడంతో ఈ ఆనందాన్ని ప్రపంచంతో పంచుకోవాలని మెగా కుటుంబం నిర్ణయించింది. అభిమానులు, సందర్శకుల కోసం ఈ నెల 19 వరకూ లండన్‌లో ఈ విగ్రహాన్ని ఉంచుతారు. ఆ తర్వాత సింగపూర్‌లోని మేడమ్ టుసాడ్స్ మ్యూజియంకు తరలిస్తారు.

ఈ సారి ముగిద్దాం



పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా సుజిత్ తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్టైనర్ 'ఓజీ'. పవన్ రాజకీయాల్లో అడుగుపెట్టాక ఈ సినిమా షూటింగ్ వాయిదా పడుతూ వస్తోంది. ఎప్పుడెప్పుడు ఈ సినిమా చిత్రీకరణ రీస్టార్ట్ అవుతుందా అని అభిమానులు ఎదురుచూస్తూనే ఉన్నారు. వారి ఎదురుచూపులు ఫలించాయని తెలిపింది ఓజీ టీమ్. ఈ సినిమా షూట్ ప్రారంభించినట్లు సోమవారం ప్రకటించింది. "మళ్లీ మొదలైంది. ఈ సారి ముగిద్దాం" అని పేర్కొంది. డి.వి.వి. దానయ్య నిర్మిస్తున్నారు. ప్రియాంక మోహన్ కథానాయిక.

నాన్నగారిలానే కీర్తి ప్రతిష్ఠలు తెచ్చుకోవాలి

- నారా భువనేశ్వరి




సీనియర్ ఎన్టీఆర్ మనవడు, జానకీరామ్ కుమారుడు తారక రామారావు హీరోగా వైవీఎస్ చౌదరి దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రం సోమవారం పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. న్యూ ట్యాలెంట్ రోర్స్ బ్యానర్‌పై యలమంచిలి గీత నిర్మిస్తున్నారు. ప్రారంభోత్సవానికి నారా భువనేశ్వరి, దగ్గుబాటి పురందేశ్వరి, గారపాటి లోకేశ్వరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నారా భువనేశ్వరి క్లాప్ కొట్టగా, పురందేశ్వరి కెమెరా స్విచ్ఛాన్ చేశారు. లోకేశ్వరి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ 'తారక రామారావు అతని ముత్తాత నందమూరి తారక రామారావుగారి లాగా కీర్తి ప్రతిష్ఠలు తెచ్చుకోవాలని కోరుకుంటున్నా. నాలుగో తరం ఇండస్ట్రీలోకి రావడం ఆనందంగా ఉంది. రామ్ తన ప్రతిభను చాటుకోవడానికి చాలా కష్టపడుతున్నాడు. ఆ కసి ఉన్న వ్యక్తి కచ్చితంగా ఏం కోరుకుంటాడో ఆ స్థాయికి ఎదుగుతాడు' అని అన్నారు. నందమూరి మోహన కృష్ణ మాట్లాడుతూ 'రామ్‌కి సినిమా అంటే చాలా ఇష్టం. ఈ రంగంలోకి రావడానికి చాలా కృషి చేశాడు. చౌదరిగారికి రామ్ ప్రతిభ నచ్చింది. ఆయన సినిమా తీయడానికి ముందడుగు వేశారు' అని చెప్పారు. హీరో నందమూరి తారక రామారావు మాట్లాడుతూ 'ఈ రోజు నా కుటుంబసభ్యులందరూ నన్ను ప్రోత్సహించడానికి ఇక్కడికి రావడం ఎంతో ఆనందంగా ఉంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు వైవీఎస్ చౌదరి మాట్లాడుతూ 'ఈ రోజును నా జీవితంలో ఎప్పటికీ మర్చిపోను. ఎన్టీఆర్ ఘాట్ నాకు పుణ్యక్షేత్రంతో సమానం. ఎన్టీఆర్ కుటుంబంలో నాలుగో తరానికి చెందిన వ్యక్తి, ఆయన పేరు పెట్టుకున్న మనవడి సినిమా ప్రారంభోత్సవం ఈ ప్రదేశంలో జరగడం నాకెంతో ఆనందంగా ఉంది. తారకరామారావు సినిమా కోసం చాలా కష్టపడ్డారు. ఈ సినిమాకు దర్శకత్వం వహించడం నా అదృష్టంగా భావిస్తున్నాను' అని అన్నారు.

సూర్యకుమార్‌గా ఉపేంద్ర



రామ్ పోతినేని కథానాయకుడిగా 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' ఫేమ్ మహేశ్‌బాబు.పి ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'రాపో 22' (వర్కింగ్ టైటిల్). భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి రామ్, భాగ్యశ్రీ పాత్రలను పరిచయం చేశారు మేకర్స్. తాజాగా, ఇందులో కన్నడ నటుడు ఉపేంద్ర కీలక పాత్రలో నటిస్తున్నట్లు వెల్లడిస్తూ, ఆయన పాత్రను పరిచయం చేశారు. ఆయన 'సూర్యకుమార్' అనే స్టైలిష్ పాత్రను పోషించనున్నట్లు ప్రకటించారు. ఈ నెల 15న టైటిల్ గ్లింప్స్ విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ నుని, సంగీతం: వివేక్- మెర్విన్.

గుర్తుండిపోయే ప్రాజెక్టు అవుతుంది



తెలుగు చిత్రపరిశ్రమలోని కార్మికుల కోసం చిత్రపురి కాలనీలో నిర్మించనున్న ఓ నూతన రెసిడెన్షియల్ ప్రాజెక్టు 'సఫైర్ సూట్' బ్రోచర్‌ను ఆవిష్కరించారు చిత్రపురి కాలనీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్. ఈ సందర్భంగా ఫిల్మ్ నగర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ "త్వరలోనే భూమి పూజ నిర్వహిస్తాం. 40 నెలల్లో ఇది పూర్తవుతుంది. గుర్తుండిపోయే ప్రాజెక్టు అవుతుంది" అని అన్నారు. నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ "ఇండస్ట్రీ పెద్దలంతా ఒకే ప్రాజెక్టుపై నిలబడి ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకువచ్చారు. ఇది ఎంతో అద్భుతంగా ఉండబోతోంది" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుచిత్ర నిర్మాతలమండలి అధ్యక్షుడు కె.దామోదర ప్రసాద్, ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు భరత్ భూషణ్, సెక్రటరీ ప్రసన్న కుమార్, మా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మాదాల రవి, నిర్మాత సి.కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

బద్మాషులు వస్తున్నారు




ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే కుటుంబ కథా చిత్రం 'బద్మాషులు'. మహేశ్ చింతల, విద్యాసాగర్ కే, మురళీధర్ గౌడ్ ప్రధాన పాత్రలు పోషించారు. శంకర్ చేగూరి దర్శకత్వంలో సీ రామశంకర్, బి. బాలకృష్ణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు. జూన్ 6న 'బద్మాషులు' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని ఓ స్నేహబృందం పంచే వినోదం అన్నివర్గాల ప్రేక్షకులను అలరించేలా ఉంటుందని నిర్మాతలు తెలిపారు. మన ఊరి కథ అనేలా సినిమా ఉంటుంది, పాత్రలు సహజంగా ఉంటాయి అని దర్శకుడు తెలిపారు.

ఏడాదికి రెండు సినిమాలు



కిరణ్, అలేఖ్యా రెడ్డి జంటగా నటించిన 'దీక్ష' చిత్రం షూటింగ్ పూర్తయింది. జూన్‌లో విడుదల చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో దర్శకనిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ 'పట్టుదల, దీక్షతో పని చేస్తే ఏదైనా సాధించవచ్చు అనే పాయింట్‌తో ఫ్యామిలీ డ్రామాగా చిత్రం రూపుదిద్దుకుంటోంది. అలాగే పౌరాణిక అంశం కూడా జోడించాం. హీరో కిరణ్ భీముడి పాత్రలో కనిపిస్తారు. మా బేనరులో వస్తున్న 41వ సినిమా ఇది. దీని తర్వాత 'కబడ్డీ' సినిమా తీస్తున్నాం. ఏడాదికి రెండు సినిమాలైనా చేయాలని మా ప్లాన్' అని చెప్పారు. ఈ సినిమాలో హీరోగా నటించడం ఆనందంగా ఉందని కిరణ్ చెప్పారు. చిత్రంలో మంచి పాత్ర పోషించినట్లు నటి అక్సా ఖాన్ తెలిపారు. సినిమాలో విలన్‌గా నటించినట్లు రోహిత్ శర్మ చెప్పారు.

క్లీన్ సర్టిఫికెట్‌తో థియేటర్లకు



రుత్విక్, ఇక్రా ఇద్రిసి జంటగా నటించిన 'వైభవం' చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. ఇటీవల సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ ఫీల్ గుడ్ కామెడీ ఎంటర్‌టైనర్‌కు సెన్సారు నుంచి క్లీన్ యు సర్టిఫికెట్ లభించింది. ఇటీవల విడుదల చేసిన రెండు పాటలకు మంచి స్పందన లభించిందనీ, మంచి సినిమాలను ఆదరించే ప్రేక్షకులకు 'వైభవం' నచ్చుతుందని సాత్విక్ చెప్పారు.

ఆకట్టుకొనే శక్తిమతి



హెబ్బా పటేల్ ప్రధాన పాత్ర పోషించిన 'శక్తిమతి' చిత్రం మోషన్ పోస్టర్‌ను దర్శకుడు వి.వి. వినాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్మాత వెంకటేశ్ గౌడ్ మాట్లాడుతూ 'దర్శకుడు చెప్పిన పాయింట్ నచ్చి ఈ సినిమా తీశా. ఆగస్టులో విడుదల చేస్తాం' అని చెప్పారు. దర్శకుడు డి.రామకృష్ణ మాట్లాడుతూ 'మా గురువు వినాయక్‌గారి చేతుల మీదుగా మోషన్ పోస్టర్ విడుదల కావడం ఆనందంగా ఉంది.. సినిమాలో దాదాపు 30 నిముషాల పాటు సీజీ వర్క్ ఉంటుంది. మా నిర్మాత వెంకటేశ్ గౌడ్ రాజీపడకుండా సినిమా తీశారు. అందరూ ఆదరిస్తారనే నమ్మకం ఉంది' అన్నారు.

రికార్డుల 'కింగ్'

7 టెస్టుల్లో విరాట్ సాధించిన డబుల్ సెంచరీలు. భారత్ తరపున అత్యధిక టెస్ట్ ద్విశతకాలు సాధించిన ఆటగాడు కోహ్లీనే. అంతేకాదు.. వరుసగా నాలుగు టెస్ట్ సిరీస్‌లలో డబుల్ సెంచరీలు బాదిన క్రికెటర్ కూడా అతడే. ఈ క్రమంలో డాన్ బ్రాడ్‌మన్, రాహుల్ ద్రవిడ్ పేరిటనున్న వరుస మూడు డబుల్ సెంచరీల రికార్డును విరాట్ అధిగమించాడు.

20 కెప్టెన్ హోదాలో కోహ్లీ కొట్టిన సెంచరీలు. టీమిండియా సారథిగా అత్యధిక శతకాల వీరుడు విరాటే. సునీల్ గవాస్కర్ (11)ది రెండోస్థానం.

40 విరాట్ సారథ్యంలో టీమిండియా గెలిచిన టెస్టుల సంఖ్య. 68 మ్యాచుల్లో ఈ ఘనతను అందుకున్న కోహ్లీ.. టెస్టుల్లో అత్యంత విజయవంతమైన భారత కెప్టెన్‌గా రికార్డుకెక్కాడు.

5,864 కెప్టెన్‌గా విరాట్ టెస్టుల్లో కొల్లగొట్టిన పరుగులు. ఇందులో 20 శతకాలు, 18 అర్ధ సెంచరీలు ఉన్నాయి. భారత్ తరపున అత్యధిక రన్స్ చేసిన సారథి కోహ్లీనే. ధోనీ (3,454), సునీల్ గవాస్కర్ (3,449) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

9,230 టెస్టుల్లో కోహ్లీ చేసిన పరుగులు. సచిన్, ద్రవిడ్, గవాస్కర్ తర్వాత టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన నాలుగో భారత బ్యాటర్‌గా రికార్డు.



6 వేదికల్లో ఐపీఎల్

17న పునః ప్రారంభం
జూన్ 3న ఫైనల్

న్యూఢిల్లీ: ఐపీఎల్‌ను ఈనెల 17న పునః ప్రారంభించాలని బీసీసీఐ నిర్ణయించింది. మిగిలిన మ్యాచ్‌లను ఆరు వేదికల్లో నిర్వహించనుంది. జూన్ మూడున ఫైనల్ జరుగుతుంది. భారత్‌పై పాకిస్థాన్ దాడుల నేపథ్యంలో బీసీసీఐ..లీగ్‌ను వారం పాటు వాయిదా వేసిన విషయం తెలిసిందే. అయితే భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో ఐపీఎల్‌ను తిరిగి ప్రారంభించాలని సోమవారం జరిగిన సమావేశంలో బోర్డు నిర్ణయించింది. ఈనెల 17న బెంగళూరులో కోల్‌కతా-రాయల్ చాలెంజర్స్ బెంగళూరు పోరు ద్వారా లీగ్ పునఃప్రారంభమవుతుంది. బెంగళూరు, జైపూర్, ఢిల్లీ, లఖ్‌నవూ, అహ్మదాబాద్, ముంబైలలో లీగ్ మ్యాచ్‌లు జరుగుతాయి. ప్లేఆఫ్స్ మ్యాచ్‌ల వేదికలను తర్వాత వెల్లడిస్తామని బీసీసీఐ తెలిపింది. ఈనెల 8వ తేదీన అర్ధంతరంగా నిలిపివేసిన పంజాబ్-ఢిల్లీ మ్యాచ్ 24న జైపూర్ వేదికగా జరుగుతుంది. ఆరు వేదికల్లో మొత్తం 13 లీగ్ మ్యాచ్‌లు, నాలుగు ప్లే ఆఫ్‌లు కలిపి మొత్తం 17 మ్యాచ్‌లు జరుగుతాయి. కాగా ఈనెల 29నుంచి ఇంగ్లండ్-వెస్టిండీస్ జట్ల మధ్య వన్డే సిరీస్ జరుగనుంది. ఆ రెండు దేశాలకు చెందిన పలువురు ఆటగాళ్లు ఐపీఎల్ ఆడుతున్నారు. అలాగే ఐపీఎల్ ముగిసిన వారం తర్వాత...అంటే జూన్ 11 నుంచి లార్డ్స్‌లో డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్ జరగాల్సివుంది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు ఫైనల్‌కు అర్హత సాధించిన విషయం తెలిసిందే.

సవరించిన షెడ్యూల్

మే 17 : బెంగళూరు × కోల్‌కతా (బెంగళూరు) : రా.7.30
మే 18 : రాజస్థాన్×పంజాబ్ (జైపూర్) : మ.3.30
మే 18 : ఢిల్లీ×గుజరాత్ (ఢిల్లీ) : రా.7.30
మే 19 : హైదరాబాద్×లఖ్‌నవూ (లఖ్‌నవూ) : రా.7.30
మే 20 : చెన్నై× రాజస్థాన్ (ఢిల్లీ) : రా.7.30
మే 21 : ముంబై×ఢిల్లీ (ముంబై) : రా.7.30
మే 22: గుజరాత్×లఖ్‌నవూ (అహ్మదాబాద్) : రా.7.30
మే 23 : బెంగళూరు×హైదరాబాద్ (బెంగళూరు) : రా.7.30
మే 24 : పంజాబ్×ఢిల్లీ (జైపూర్) : రా.7.30
మే 25 : గుజరాత్×చెన్నై (అహ్మదాబాద్) : మ.3.30
మే 25 : హైదరాబాద్×కోల్‌కతా (ఢిల్లీ) : రా.7.30
మే 26 : పంజాబ్ ×ముంబై (జైపూర్) : రా.7.30
మే 27 : లఖ్‌నవూ×బెంగళూరు (లఖ్‌నవూ) : రా.7.30
మే 29 : క్వాలిఫయర్ 1 : రా.7.30
మే 30 : ఎలిమినేటర్ : రా.7.30
జూన్ 1: క్వాలిఫయర్ 2 : రా.7.30

జూన్ 3- ఫైనల్ రా.7.30 గం.

'టెస్టు' ముగించాడు

14 ఏళ్ల సంప్రదాయ క్రికెట్ కెరీర్‌కు వీడ్కోలు

ఇక వన్డేలకే పరిమితం • వారం వ్యవధిలో ఇద్దరు దిగ్గజాల నిష్క్రమణ

బీసీసీఐ విజ్ఞప్తి బేఖాతరు



ఊహాగానాలే నిజమయ్యాయి.. హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ రిటైర్మెంట్ నుంచి ఇంకా తేరుకోకముందే భారత క్రికెట్ ప్రేమికులకు మరో పిడుగులాంటి వార్త. ఏదైతే జరగకూడదని కోట్లాది మంది క్రికెట్ ప్రేమికులు భావించారో అదే జరిగింది. దశాబ్దానికి పైగా భారత క్రికెట్‌కు టార్చ్‌బేరర్‌గా ఉన్న విరాట్ కోహ్లీ టెస్టు ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. బీసీసీఐతో పాటు సెలెక్టర్లు, మాజీలు, విశ్లేషకులు ఇలా ఎంత మంది వారించినా తన మనస్సాక్షికే ఓటేశాడు. ఆధునిక క్రికెట్‌లో అత్యుత్తమ ఆటగాడిగా పేరు తెచ్చుకున్న కింగ్ కోహ్లీ ఇక వన్డేలకే పరిమితం. భారత క్రికెట్‌కు మూలస్తంభాల్లాంటి ఇద్దరు స్టార్లు వారం వ్యవధిలోనే టెస్టు జట్టును వీడడం నిజంగా టీమిండియా కెరీర్‌లో ఓ శకం ముగిసినట్టే..

టెస్ట్ కెరీర్	మ్యాచ్‌లు	ఇన్నింగ్స్	పరుగులు	అత్యధికం	సెంచరీలు	అ.సెం	సగటు
	123	210	9230	254*	30	31	46.8

న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు ముందు భారత క్రికెట్‌లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రపంచ క్రికెట్‌లో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పిన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తనకెంతో ఇష్టమైన టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈమేరకు సోమవారం తన ఇన్‌స్టాగ్రామ్‌లో భావోద్వేగంతో కూడిన పోస్ట్ పెట్టాడు. గతేడాది టీ20 ప్రపంచకప్‌ను గెలిచాక పొట్టి ఫార్మాట్ నుంచి వైదొలిగిన 36 ఏళ్ల కోహ్లీ ఇక వన్డేలకు మాత్రమే అందుబాటులో ఉంటాడు. ఈనెల 7న కెప్టెన్ రోహిత్ శర్మ సైతం ఈ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. ఆ తర్వాత రోజే విరాట్ సైతం ఇదే బాట పడతాడనే కథనాలు రావడంతో అంతా షాక్‌కు గురయ్యారు. కఠినంగా సాగే ఇంగ్లండ్ పర్యటనలో ఇద్దరు అనుభవజ్ఞులు లేకపోతే ఎలా? అనే ఆందోళన బీసీసీఐలోనూ కనిపించింది. దీంతో వెంటనే అతడిని బుజ్జగించే ప్రయత్నాలు చేసినట్టు సమాచారం. అయినా తను తిరస్కరించడంతో సచిన్‌ను కూడా రంగంలోకి దింపినట్టు తెలిసింది. అయితే ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా విరాట్ తాను అనుకున్నదానికే కట్టుబడి సంచలన నిర్ణయాన్ని ప్రకటించాడు. కొంతకాలంగా అతడి టెస్టు కెరీర్ అంత సాఫీగా సాగడం లేదు. గతేడాది ఆస్ట్రేలియా పర్యటనలో విరాట్ 9 ఇన్నింగ్స్‌లో చేసింది 190 పరుగులే. అంతేకాకుండా ఇందులో ఎనిమిదిసార్లు ఆఫ్‌సైడ్ ఆవల బంతులకే అవుట్ కావడంతో పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. ఆ సమయంలోనే అతడి మనస్సులో రిటైర్మెంట్ ఆలోచన వచ్చి ఉండవచ్చు. యువ ఆటగాళ్లకు దారి ఇవ్వాల్సిన తరుణం ఆసన్నమైందనే భావన అతడిలో వ్యక్తమైందేమో. కానీ భారత టెస్టు జట్టు అతడి ఆధ్వర్యంలో 68 మ్యాచ్‌ల్లో 40 విజయాలు అందుకున్న విషయం మాత్రం చరిత్ర మరువదు. అంతేకాకుండా సేన (ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్) దేశాలపై విరాట్ అద్వితీయ సెంచరీలు అభిమానుల జ్ఞాపకాల్లో ఎన్నటికీ ఉండిపోయేవే..

ఈ సుదీర్ఘ ప్రయాణాన్ని ఊహించలేదు..

'టెస్టు క్రికెట్‌లో నీలి రంగు క్యాప్‌ను ధరించి 14 ఏళ్లయ్యింది. నిజానికి ఈ ఫార్మాట్‌లో ఇంత కాలం కొనసాగుతానని నేనెప్పుడూ అనుకోలేదు. ఇది నన్నెంతగానో పరీక్షించింది. తీర్చిదిద్దింది. జీవితానికి సరిపడా పాఠాలను కూడా నేర్పింది. వ్యక్తిగత జీవితంలోనూ నేను వాటిని కొనసాగిస్తాను. తెలుపు రంగు జెర్సీలో ఆడడం వ్యక్తిగతంగా నాకెంతో ప్రత్యేకమైంది. ఈ క్రమంలో ఎదురైన నిశ్శబ్దకర పరిస్థితులు.. సుదీర్ఘ రోజులు.. ఎవరికీ కనిపించని చిన్న చిన్న మధుర క్షణాలు కూడా జీవితాంతం గుర్తుండిపోతాయి. ఇక ఈ ఫార్మాట్ నుంచి తప్పుకోవడం నాకంత సులువుగా ఏమీ అనిపించలేదు. కానీ ఇదే సరైన సమయం. ఆట కోసం సర్వస్వాన్ని ధారపోశాను. తిరిగి క్రికెట్ కూడా నేను ఆశించినదానికంటే ఎక్కువే ఇచ్చింది. అందుకే ఎనలేని సంతృప్తి, కృతజ్ఞతాభావంతోనే వైదొలుగుతున్నాను. క్రికెట్‌కు, సహచర ఆటగాళ్లకు, ఈ నా ప్రయాణాన్ని సుదీర్ఘ కాలం కొనసాగేలా చేసిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు. అలాగే నా టెస్టు కెరీర్‌ను ఎప్పుడూ చిరునవ్వుతోనే చూసుకోగలను...ఇక ఉంటా'

\- విరాట్ కోహ్లీ

నాకు నీ కన్నీళ్లు గుర్తుంటాయి..



స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ రిటైర్మెంట్‌పై అతడి భార్య అనుష్క శర్మ భావోద్వేగంతో స్పందించింది. 'అందరూ నీ రికార్డులు, మైలురాళ్ల గురించే మాట్లాడుకుంటారు. కానీ నాకు మాత్రం నీవెన్నడూ బయటకు చూపని కన్నీళ్లను, నీలో నీవే పడిన సంఘర్షణ గుర్తుంటా యి. అలాగే టెస్టు ఫార్మాట్‌పై నువ్వు చూపిన ప్రేమ ఎప్పటికీ గుర్తుండిపోయేదే. నువ్వు ఎదిగిన విధానాన్ని పక్కనే ఉండి చూడడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను. ఎల్లప్పుడూ నీ మనస్సు చెప్పిన ప్రకారమే నిర్ణయం తీసుకున్నావు. ఆటలో ప్రతీదీ సాధించావు కాబట్టి గుడ్‌బై చెప్పడానికి అర్హుడివే అని భావిస్తున్నా'నంటూ అనుష్క పేర్కొంది.

ఆ చరిత్రనే మార్చి..!

దిగ్గజ ఆటగాడిగా.. అంతకుమించి కెప్టెన్‌గా!



ఆటగాడిగా, భారత జట్టు సారథిగా కోహ్లీ హయాంలో టీమిండియా సరికొత్త స్థాయిలను అందుకొంది. భారత టెస్ట్ చరిత్రలో విరాట్‌ది ఓ విప్లవమనే చెప్పుకోవాలి. అత్యున్నత ఫిట్‌నెస్ ప్రమాణాలను నెలకొల్పడంతోపాటు గెలవాలన్న కసిని జట్టులో పెంపొందించడంలో విజయవంతమయ్యాడు. ప్రపంచ టెస్ట్ జట్లలో టీమిండియాను బలమైన శక్తిగా తీర్చిదిద్దాడు. బలమైన బౌలింగ్ విభాగాన్ని తయారు చేసి ప్రత్యర్థుల వెన్నులో వణుకు పుట్టించాడు. ఒకప్పుడు భారత జట్టు పర్యటనకు వస్తుందంటే.. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా జట్లు తమదే విజయమని భావించేవి. కానీ, కోహ్లీ హయాంలో లెక్కమారింది. ఆస్ట్రేలియాను వారి సొంతగడ్డపై మట్టికరిపించిన భారత్.. 71 ఏళ్ల చరిత్రను తిరగరాసింది. ఇక, బ్యాటర్‌గా కెప్టెన్‌గా కోహ్లీ ఎన్నో ఘనతలను అందుకొన్నాడు.

వెస్టిండీస్‌పై అరంగేట్రం..: 2011 జూన్‌లో వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్‌లో కింగ్‌స్టన్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో విరాట్ టెస్ట్ అరంగేట్రం చేశాడు. ఆ సిరీస్‌లో ఫర్వాలేదనిపించిన కోహ్లీ.. క్రమంగా జట్టులో తన స్థానాన్ని పదిలం చేసుకొన్నాడు. స్వదేశం, విదేశాల్లో టీమిండియా రన్ మెషీన్‌గా మారాడు. 2012 ఆస్ట్రేలియాతో అడిలైడ్‌లో జరిగిన టెస్టులో కోహ్లీ తొలి శతకం నమోదు చేశాడు. 2025 జనవరిలో ఆస్ట్రేలియాతో సిడ్నీలో చివరి టెస్ట్ ఆడాడు. కెరీర్‌లో 123 టెస్టులు ఆడిన విరాట్.. 9230 పరుగులు చేశాడు. అందులో 30 సెంచరీలు, 31 అర్ధ శతకాలు ఉన్నాయి. అత్యధికం 254 రన్స్. వంద టెస్ట్‌లకు పైగా ఆడి 55.57 స్ట్రయిక్ రేట్ నమోదు చేయడం అద్భుతం. అయితే, గత కొన్నేళ్లుగా టెస్టుల్లో కోహ్లీ ప్రదర్శన దిగజారింది. 2024-25 ఆసీస్ పర్యటనలో విరాట్ ఒక్క సెంచరీ మాత్రమే నమోదు చేశాడు.

డబుల్ సెంచరీ కింగ్..: భారత్ తరఫున టెస్టుల్లో అత్యధికంగా ఏడు ద్విశతకాలు నమోదు ఆటగాడు కోహ్లీ. 2019లో పుణెలో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్ట్‌లో విరాట్ 254 పరుగులతో కెరీర్‌లో తొలి డబుల్ సాధించాడు. అంతేకాకుండా నాలుగు వరుస సిరీస్‌ల్లో నాలుగు డబుల్ సెంచరీలు నమోదు చేసిన ప్లేయర్‌గా కూడా కోహ్లీ రికార్డు సృష్టించాడు. ఈ క్రమంలో డాన్ బ్రాడ్‌మన్, రాహుల్ ద్రవిడ్ మూడు వరుస సిరీస్‌ల్లో మూడు ద్విశతకాల రికార్డును అధిగమించాడు.

కెప్టెన్‌గా రికార్డులు..: 2014, డిసెంబరులో ఆస్ట్రేలియా టూర్‌లో ధోనీ అర్ధంతరంగా రిటైర్మెంట్ ప్రకటించడంతో.. కోహ్లీ జట్టు పగ్గాలందుకొన్నాడు. అనతికాలంలోనే రెడ్ బాల్ క్రికెట్‌లో భారత్ బలమైన శక్తిగా మారింది. స్వదేశంలో తిరుగులేని భారత్ క్రమంగా విదేశాల్లోనూ సిరీస్ విజయాలతో ఆధిపత్యం చెలాయించింది. 2018-19లో జరిగిన టెస్ట్ సిరీస్‌లో ఆస్ట్రేలియాను వారి సొంతగడ్డపై 2-1తో ఓడించిన భారత్.. 71 ఏళ్ల చరిత్రను తిరగరాసింది. ఇంగ్లండ్, దక్షిణాఫ్రికాల్లో కూడా భారత్ విజయాలను అందుకొంది. టెస్ట్ ర్యాంకింగ్స్‌లోనూ భారత్ నెం:1 స్థానానికి చేరుకొంది. 2021లో లార్డ్స్ టెస్టులో భారత్‌కు అద్భుత విజయం అందించాడు.

కోహ్లీ నా ఫేవరెట్

డీజీఎంవో రాజీవ్ ఘాయ్ ఆసక్తికర వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మిలటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ (డీజీఎంవో) రాజీవ్ ఘాయ్ స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ప్రస్తావన తెచ్చారు. అలాగే 70వ దశకంలో ఇంగ్లండ్-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన యాషెస్ సిరీస్‌నూ ఆయన గుర్తు తెచ్చుకున్నారు. 14 సంవత్సరాల సుదీర్ఘ టెస్ట్ కెరీర్‌కు గుడ్ బై చెబుతున్నట్టు విరాట్ సోమవారం అధికారికంగా వెల్లడించిన విషయం తెలిసిందే. విలేకరుల భేటీలో కోహ్లీ రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రస్తావించిన లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ 'విరాట్ టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. ఎందరో భారతీయుల మాదిరే నాకూ ఆయన ఫేవరెట్ క్రికెటర్' అని అన్నారు. ఇక..1970 యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్ జట్టును ఆస్ట్రేలియా దిగ్గజ పేసర్లు షేన్ థాంప్సన్, డెన్నిస్ లిల్లీ వణికించారు. ఆపరేషన్ సిందూర్‌లో మన గగనతల రక్షణ వ్యవస్థల సామర్థ్యాన్ని థాంప్సన్, లిల్లీ ప్రతిభతో పోలుస్తూ ఘాయ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. '1970ల్లో నేను పాఠశాలలో చదువుతున్న రోజుల్లో ఆస్ట్రేలియా-ఇంగ్లండ్ జట్ల నడుమ యాషెస్ సిరీస్ జరిగింది. ఆసీస్ జట్టులోని అప్పటి ప్రఖ్యాత పేసర్లు థాంప్సన్, లిల్లీ ఇంగ్లండ్ బ్యాటింగ్‌ను తుత్తునియలు చేశారు. దాంతో 'యాషెస్ టు యాషెస్ : డస్ట్ టు డస్ట్ : లిల్లీకి దొరక్కపోతే థాంప్సన్‌కు తప్పకుండా చిక్కుతారు' అని ఆస్ట్రేలియా చక్కని పద ప్రయోగం చేసింది. ప్రస్తుతం పాకిస్థాన్‌పై పోరాటంలో భారత్ ఆధిపత్యాన్ని ఆ విధంగా వర్ణించవచ్చు' అని రాజీవ్ ఘాయ్ అన్నారు.

వాణిజ్య యుద్ధానికి విరామం!

ప్రతీకార సుంకాల తగ్గింపుపై అమెరికా, చైనా ఒప్పందం

- ద్వైపాక్షిక దిగుమతులపై చెరో 115% టారిఫ్‌ల తగ్గింపు
- 90 రోజులు సుంకాలను పెంచవద్దని నిర్ణయం
- ఇక నుంచి చైనాపై 30%.. అమెరికాపై 10శాతం టారిఫ్ అమలు
- ఇంతకుముందు చైనాపై 145%.. అమెరికాపై 125శాతం సుంకాలు



జెనీవా, మే 12: వాణిజ్య యుద్ధానికి అమెరికా, చైనా విరామం ప్రకటించాయి. ప్రతీకార సుంకాల తగ్గింపుపై జెనీవాలో రెండు రోజుల పాటు, ఇరు దేశాల మధ్య జరిగిన చర్చలు ఫలించాయి. ఇటీవలి కాలంలో పరస్పరం విధించుకున్న ప్రతీకార సుంకాలను ఉపసంహరించుకోవాలని రెండు దేశాలూ ఓ ఒప్పందానికి వచ్చాయి. ఒప్పందం మేరకు అమెరికా, చైనా తమ ద్వైపాక్షిక దిగుమతులపై చెరో 115% సుంకాలను తగ్గించాయి. అంతే కాకుండా వాణిజ్య యుద్ధానికి 90రోజుల పాటు సంధి ప్రకటించాయి. రెండు దేశాలూ సుంకాలను పెంచవద్దని నిర్ణయించాయి. ఈ 90రోజుల వ్యవధిలో ఇరు దేశాల ద్వైపాక్షిక వాణిజ్య వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోనున్నారు. ఈ మేరకు అమెరికా, చైనా వాణిజ్య ప్రతినిధులు సోమవారం ప్రకటన చేశారు. ఈ ప్రకటనతో అంతర్జాతీయంగా స్టాక్ మార్కెట్లు పుంజుకున్నాయి. ప్రతీకార సుంకాల తగ్గింపుపై అమెరికా, చైనా వాణిజ్య ప్రతినిధులు రెండు రోజుల పాటు జెనీవాలో చర్చలు జరిపారు. ఒప్పందం కుదిరిన అనంతరం అమెరికా వాణిజ్య ప్రతినిధులు జేమిసన్ గ్రీర్, స్కాట్ బెస్సెంట్ జెనీవాలోనే విలేకరులతో మాట్లాడారు. చైనా దిగుమతులపై ప్రస్తుతం 145% టారిఫ్ విధిస్తుండగా దాన్ని 30శాతానికి తగ్గించడానికి(అంటే 115% కోత) అమెరికా అంగీకరించిందని చెప్పారు. రెండు దేశాల మధ్య వాణిజ్య యుద్ధంతో సరుకు రవాణా పూర్తిగా నిలిచిపోయిందని, ఇది రెండు దేశాలకూ మంచిది కాదని పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య మరింత సమన్వయమైన, సంతులిత వాణిజ్యం అవసరమని వారు అభిప్రాయపడ్డారు. మరోవైపు, చైనా ప్రస్తుతం అమెరికా దిగుమతులపై 125శాతం టారిఫ్ విధిస్తుండగా, దాన్ని 10శాతానికి తగ్గించడానికి అంగీకరించింది. అంటే, చైనా కూడా 115శాతం టారిఫ్ తగ్గించడానికి ఒప్పుకొంది. అయితే ఇందులో 91% తగ్గింపు వెంటనే అమల్లోకి వస్తుంది. మరో 24శాతం టారిఫ్‌ను దశల వారీగా 90రోజుల్లోపు తగ్గించనున్నారు. ఈ మేరకు చైనా వాణిజ్యశాఖ ప్రకటన విడుదల చేసింది. అమెరికా ఇకనైనా ఏకపక్షంగా టారిఫ్‌లను పెంచబోదని ఆశిస్తున్నట్లు అందులో పేర్కొంది. ప్రతీకార సుంకాల తగ్గింపుపై రెండు దేశాలు వేర్వేరు ప్రకటనలతో పాటు సంయుక్త ప్రకటన కూడా విడుదల చేశాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జనవరిలో చైనాపై ట్రేడ్ వార్ ప్రకటించారు. చైనా నుంచి వచ్చే వస్తువులపై టారిఫ్‌ను దశలవారీగా 145శాతానికి పెంచారు. దీనికి ప్రతిగా చైనా అమెరికా వస్తువులపై టారిఫ్‌ను 125శాతానికి పెంచింది. రెండు దేశాల మధ్య ట్రేడ్ వార్‌తో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మందగమనం చోటుచేసుకుంటుందని ప్రపంచ మార్కెట్లు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలోనే ఇరుదేశాల ఉన్నతస్థాయి వాణిజ్య ప్రతినిధుల మధ్య సమావేశం జరిగింది.

గాజాలో ఇజ్రాయెల్ దాడి..
16 మంది మృతి

- అమెరికన్-ఇజ్రాయెలీ బందీని విడుదల చేస్తామన్న హమాస్

డీర్ అల్-బలా, మే 12: గాజాలో బందీగా ఉన్న చివరి అమెరికన్-ఇజ్రాయెలీని విడుదల చేయనున్నట్టు హమాస్ వెల్లడించింది. గాజా స్ట్రిప్‌లో నిరాశ్రయులైన వారికి ఆశ్రయం కల్పిస్తున్న పాఠశాలపై సోమవారం ఇజ్రాయెల్ జరిపిన దాడిలో కనీసం 16 మంది మరణించారు. వీరిలో నలుగురు మహిళలు, ఐదుగురు చిన్నారులు ఉన్నారు. పలువురికి గాయాలయ్యాయి. ఈ దాడి నేపథ్యంలో హమాస్ తాజా ప్రకటన చేసింది. కాగా, ఈ వారంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. సౌదీ అరేబియా, ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో పర్యటించనున్నారు. ఈ తరుణంలో తాజా దాడి చోటుచేసుకుంది.

కులం ఆధారంగా విరాళాల స్వీకరణ నిరాకరించడం అంటరానితనమే

- మద్రాసు హైకోర్టు

చెన్నై, మే 12(ఆంధ్రజ్యోతి): ఆలయ ఉత్సవాల కోసం కులం ఆధారంగా విరాళాలు స్వీకరించేందుకు నిరాకరించడం కూడా అంటరానితనం కిందకే వస్తుందని మద్రాస్ హైకోర్టు పేర్కొంది. దేశంలో అంటరానితనం వివిధ రకాలుగా, పలు రూపాల్లో ఆచరణలో ఉందని, ఇది కూడా అలాంటి వాటిల్లో ఒకటి అని వ్యాఖ్యానించింది. చెన్నై కుండ్రత్తూర్ తిరునాగేశ్వర్ ఆలయ బ్రహ్మోత్సవ వేడుకలకు నిర్దిష్ట వర్గాల నుంచే విరాళాలు వసూలు చేస్తున్నారని, ఇతర వర్గాల నుంచి నిరాకరిస్తున్నారని ఆరోపిస్తూ పాండ్య రాజన్ అనే వ్యక్తి మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భరత్ చక్రవర్తి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి స్పందిస్తూ.. దేవుడి ఉత్సవాల వ్యవహారంలోనూ కుల ప్రస్తావన రావడం పట్ల విస్మయం వ్యక్తం చేశారు. ఆలయ ఉత్సవాల కోసం అన్ని వర్గాలు విరాళాలు ఇవ్వడానికి అనుమతించాలని, దీనికి తగిన ఉత్తర్వులు జారీచేయాలని దేవాదాయశాఖను ఆదేశించారు.



రెవెన్యూలో కలకలం

- డిప్యూటీ కలెక్టరును తహసీల్దార్‌గా డిమోట్‌చేసి.. అధికారులకు సుప్రీంకోర్టు గట్టి హెచ్చరిక
- 22(ఏ) కేసులపై తీర్పులు అమలుకాని వైనం
- ధిక్కరణ పిటిషన్ పడినప్పుడే కేసులో కొంత కదలిక
- వైసీపీ హయాంలో పదే పదే కోర్టు ధిక్కారం
- సీఎస్, డీజీపీ నుంచి అధికారి దాకా బోనులోనే..
- ఈ ధోరణి ఇక నడవదని తేల్చేసిన సుప్రీంకోర్టు

(గుంటూరు-ఆంధ్రజ్యోతి)

కోర్టు ధిక్కారానికి అధికారులు పాల్పడితే ఏమవుతుందో సుప్రీంకోర్టు చెప్పేసింది. డిప్యూటీ కలెక్టర్ కేసు వ్యవహారంలో సదరు అధికారి హోదాను తగ్గిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఇప్పుడు రెవెన్యూ శాఖలో చర్చనీయాంశమైంది. ఎందుకంటే, రెవెన్యూశాఖలో ప్రధానంగా భూముల వివాదాలకు సంబంధించిన కేసులే ఉంటాయి. సంబంధిత అధికారుల వద్దకు ఎన్నిసార్లు తిరిగినా న్యాయం జరగకపోతుండటంతో బాధితులు కోర్టులను ఆశ్రయిస్తుంటారు. బాధితుల పక్షాన న్యాయం ఉంటే కోర్టులు వారికి అనుకూలంగా తీర్పులిస్తుంటాయి. అయినప్పటికీ వాటిని ఒక పట్టాన రెవెన్యూ అధికారులు అమలు చేయరు. దాంతో బాధితులు ఒకటి, రెండుసార్లు అధికారుల చుట్టూ తిరిగి ఆ తర్వాత మళ్లీ కోర్టుని ఆశ్రయించి ధిక్కార పిటీషన్‌లు దాఖలు చేస్తుంటారు. ఎప్పుడైతే రాష్ట్ర భూపరిపాలన ముఖ్య కమిషనర్ మీద కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు అవుతుందో అప్పుడు ఇక్కడి నుంచి సీసీఎల్‌ఏ ఫైళ్లు తెప్పించుకొని చూసి కోర్టు తీర్పును అమలు చేయాల్సిందిగా ఆదేశాలిస్తారు. అధికారులు గతంలో నిబంధనలకు విరుద్ధంగా పట్టా భూములను నిషేధిత భూముల జాబితాలో చేర్చారు. వాటిని తొలగించాలంటూ పట్టాదారులు పెట్టుకొనే అర్జీలను సాధారణంగా పట్టించుకోరు. కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైతేనే 22(ఏ) నుంచి తొలగిస్తున్నారు. అయితే, కోర్టు తీర్పులను అమలు చేయకపోయినా, పై అధికారి చెప్పారని దూకుడుగా వ్యవహరించినా ఏమవుతుందనేది తాజా తీర్పులో సుప్రీంకోర్టు సూటిగానే చెప్పేసింది.

ఏమిటీ ఈ కేసు?

గుంటూరు శివారులోని అడవి తక్కెళ్లపాడులో ఉన్న ప్రభుత్వ భూమిలో సమైక్యాంధ్ర ఉద్యమం జరుగుతున్నప్పుడు కొంతమంది పూరి గుడిసెలు వేసి ఆక్రమించారు. అయితే ఆ గుడిసెలను తొలగించొద్దని హైకోర్టు తీర్పు ఇచ్చింది. అయినప్పటికీ నాటి జిల్లా కలెక్టర్ సురేశ్‌కుమార్ ఆదేశాల మేరకు అప్పటి గుంటూరు రూరల్ మండలం తహసీల్దార్ తాతా మోహన్‌రావు పోలీసు సహకారం తీసుకొని గుడిసెలను తొలగించారు. దీనిపై హైకోర్టు సీరియస్ అయి కోర్టు ధిక్కార చర్యల కింద ఆయనకు రెండు నెలల సాదారణ జైలు శిక్షను విధించింది. దీనిని మోహన్‌రావు సుప్రీం కోర్టులో సవాలు చేశారు. జైలుశిక్షను తప్పించి డిప్యూటీ కలెక్టర్ నుంచి తహసీల్దార్ స్థాయికి సుప్రీంకోర్టు మోహన్‌రావును డిమోట్ చేసింది. రూ. లక్ష జరిమానా కూడా విధించింది. కాగా, వైసీపీ హయాంలో రెవెన్యూశాఖలో 22(ఏ)కు సంబంధించిన కేసులు పేరుకుపోయాయి.. చివరకు హైకోర్టు ఆదేశాలను సైతం అప్పట్లో అధికారులు ధిక్కరించేవారు.సీఎస్ ,డీజీపీ మొదలు పలు శాఖల కార్యదర్శుల వరకు వేర్వేరు అంశాల్లో కోర్టు ధిక్కారానికి పాల్పడి తరచూ బోనులో నిలబడేవారు. చీవాట్లు తిని తిరిగొచ్చేవారేగానీ, కోర్టు ఆదేశాలను మాత్రం అమలుచేసేవారు కాదు. అయితే, ఇకముందు... అధికారులు అలా ప్రవర్తించలేరనే సంకేతాలను సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని పలువురు న్యాయ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.




సోమవారం ఉదయం తన నివాసంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్, విదేశాంగ మంత్రి జైశంకర్, సీడీఎస్ అనిల్ చౌహాన్, త్రివిధ దళాల అధిపతులతో ప్రధాని మోదీ ఉన్నత స్థాయి సమావేశం

అణు బూచికి బెదరం

(మొదటి పేజీ తరువాయి)

తుడిచే సాహసాన్ని ఉగ్రవాదులు చేశారని, దానికి ప్రతిగా ఉగ్రవాదం ప్రధాన కార్యాలయాలనే తుడిచిపెట్టేశామని, దాంతో, సిందూరాన్ని తుడిచేస్తే పరిణామాలు ఎలా ఉంటాయో ఇప్పుడు ప్రతి ఉగ్రవాదికి తెలిసిందని అన్నారు. మన సరిహద్దుల్లో దాడులు చేయడానికి పాకిస్థాన్ సిద్ధమైందని, కానీ, భారత్ మాత్రం నేరుగా దాని గుండెలపైనే తన్నిందని చెప్పారు. ఉగ్రవాదంపై పోరును ఆపరేషన్ సిందూర్ పునర్ నిర్వచించిందని, సరికొత్త బెంచ్ మార్క్‌ను నిర్దేశించిందని వ్యాఖ్యానించారు. పాకిస్థాన్‌లో భారత్ సృష్టించిన యుద్ధ బీభత్సానికి తట్టుకోలేక ఆ దేశం కాళ్ల బేరానికి వచ్చిందని, మరోసారి ఉగ్రవాదానికి పాల్పడబోమని చెప్పిందని, అందుకే తాము కూడా కాల్పుల విరమణకు అంగీకరించామని చెప్పారు. పాకిస్థాన్‌లో చర్చలంటూ జరిగితే ఉగ్రవాదం, పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను అప్పగించడంపైనేనని తేల్చి చెప్పారు. ఉగ్రవాదం, చర్చలు ఒకేసారి జరగవని, ఉగ్రవాదం, వాణిజ్యం ఒకే బాటలో సాగవని, రక్తం, నీళ్లు ఒకేసారి ప్రవహించవని స్పష్టం చేశారు. పహల్గాంలో ఉగ్ర దాడి.. అనంతరం ఉగ్రవాదుల పీచమణచడానికి భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో సోమవారం రాత్రి 8 గంటలకు ఆయన జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

ఆపరేషన్ సిందూర్.. భావోద్వేగాల ప్రతీక

ఆపరేషన్ సిందూర్ అనేది కేవలం ఒక్క పేరు మాత్రమే కాదు.. అది కోట్లాదిమంది భారతీయుల భావోద్వేగాలకు ప్రతీక. న్యాయం జరగాలని చేసిన దృఢమైన సంకల్పం. దీనినే ఈనెల ఆరేడు తేదీల్లో ప్రపంచం మొత్తం చూసింది. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలు, శిక్షణ శిబిరాలపై మన సైనిక బలగాలు కచ్చితమైన దాడులు చేశాయి. వాటిని తిరుగులేని దెబ్బతీశాయి. భారత్ ఇంత సాహసోపేతమైన అడుగులు వేస్తుందని ఉగ్రవాదులు ఎన్నడూ ఊహించి ఉండరు. కానీ, మాకు దేశమే తొలి ప్రాధాన్యమనే సంకల్పంతో జాతి మొత్తం ఏకమైంది. దృఢమైన నిర్ణయాలు తీసుకున్నాం. ప్రభావశీల ఫలితాలు వచ్చాయి. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై మన క్షిపణి, డ్రోన్ దాడులు ఉగ్రవాదుల మౌలిక సదుపాయాలనే కాదు.. వారి నైతిక స్థైర్యాన్ని కూడా బదాబదలు చేశాయి. బహావల్పూర్, మురుడ్కేల్లోని స్థావరాలు ఎప్పటి నుంచో ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాద కేంద్రాలు. అమెరికాలో 9/11, లండన్లోని ట్యూబ్ బాంబింగ్స్, దశాబ్దాలుగా భారత్‌లో ఉగ్రవాద దాడులు సహా ప్రపంచవ్యాప్తంగా ఉగ్ర కార్యకలాపాలకు వీటికి సంబంధం ఉంది. భారతీయ మహిళల పరువును తుడిచేయడానికి ఉగ్రవాదులు సాహసిస్తే.. భారతదేశం ఉగ్రవాద ప్రధాన కార్యాలయాలనే తుడిచిపెట్టేసింది. ఈ ఆపరేషన్లో వంద మందికిపైగా కరడుగట్టిన ఉగ్రవాదులు హతమయ్యారు. దశాబ్దాలుగా భారత్‌లో ఉగ్రదాడుల సూత్రధారులూ వీరిలో ఉన్నారు. భారత్‌కు ఉగ్ర ముప్పుగా పరిణమించిన వారిని అంతే వేగంగా హతమార్చాం.

ఉగ్రవాదంపై పోరుకు సిందూరమే మా విధానం

ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, నేవీ, బీఎస్ఎఫ్ వంటి సైనిక దళాలు, పారా మిలటరీ యూనిట్లు ఇప్పటికీ అప్రమత్తంగానే ఉన్నాయి. అన్ని వేళలా దేశ భద్రతకు హామీ ఇస్తున్నాయి. ఉగ్రవాదంపై పోరులో ఆపరేషన్ సిందూర్ ఇక నుంచి భారత సువ్యవస్థిత విధానం. భారత వ్యూహాత్మక వైఖరిలో నిర్ణయాత్మక మార్పు. ఉగ్రవాద వ్యతిరేక పోరాటాలకు ఈ ఆపరేషన్ సరికొత్త ప్రమాణాన్ని నిర్దేశించింది. మన భద్రతా సిద్ధాంతానికి మూడు మూల స్తంభాలున్నాయి. ఒకటి.. నిర్ణయాత్మక ప్రతి దాడి. భారత్‌పై ఉగ్రవాద దాడి జరిగితే.. బలంగా, తిరుగులేని విధంగా జవాబు ఇవ్వడం. భారత్ తన సొంత విధానాలతోనే ప్రతి దాడి చేస్తుంది. ఉగ్రవాద స్థావరాలను వాటి మూలాల్లోనే గురిపెడుతుంది. రెండోది.. అణు బ్లాక్ మెయిలింగ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు. అణ్వస్త్ర



బెదిరింపులకు భయపడేది లేదు. అణు బూచి చూపించి ఉగ్ర స్థావరాలను నిర్వహిస్తే.. కచ్చితమైన, నిర్ణయాత్మక దాడులు చేస్తాం. మూడోది.. ఉగ్రవాదులు, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించేవారి మధ్య ఎటువంటి తేడా చూడం. ఉగ్రవాద నాయకులు, వారికి ఆశ్రయమిచ్చే ప్రభుత్వాలను వేర్వేరుగా చూడం. మనం హతమార్చిన ఉగ్రవాదుల అంత్యక్రియలకు పాక్ సీనియర్ సైనికాధికారులు హాజరయ్యారు. అంటే, ప్రభుత్వ ప్రేరేపిత ఉగ్రవాదంలో పాక్ ఏ స్థాయిలో కూరుకుపోయిందో సుస్పష్టమైంది. ఈ వికల వాస్తవాన్ని ప్రపంచమంతా మరోసారి కళ్లారా చూసింది. ముప్పు నుంచి తన పౌరులను కాపాడుకోవడానికి భారత్ నిర్ణయాత్మక చర్యలు తీసుకుంటూనే ఉంటుంది.

పాకిస్థాన్ పరుగెత్తుకుంటూ వచ్చింది

భారత్ బలంగా, కచ్చితంగా దాడులు చేయడంతో పాకిస్థాన్ తీవ్ర నిరాశానిస్పృహల్లో కూరుకుపోయింది. ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదంపై పోరుకు చేతులు కలపడానికి బదులుగా.. ప్రమాదకర ఆటకు తెర లేపింది. మన పాఠశాలలు, కాలేజీలు, గురుద్వారాలు, మందిరాలు, పౌర ఆవాసాలపై దాడులు చేసింది. అంతటితో ఆగలేదు. సైనిక స్థావరాలపైనా గురిపెట్టింది. కానీ, ఈ దాడి పాకిస్థాన్ దుర్బలత్వాన్ని బయటపెట్టింది. భారతదేశ అడ్వాన్స్‌డ్ వాయు రక్షణ వ్యవస్థల ముందు దాని క్షిపణులు, డ్రోన్లు కట్టె పుల్లల్లా తేలిపోయాయి. వాటిని గగనతలంలోనే నిర్వీర్యం చేశాయి. భారత సరిహద్దుల్లో దాడులు చేయాలని సిద్ధపడితే.. పాకిస్థాన్ నట్టింట్లోకి వెళ్లి గుండెలపైనే భారత్ గట్టిగా మోదింది. భారత క్షిపణులు, డ్రోన్లు అత్యంత కచ్చితత్వంతో దాడులు చేశాయి. పాక్ ఎప్పటినుంచో ఎంతో గొప్పగా చెప్పుకొనే దాని వైమానిక స్థావరాలను ఎందుకు పనికి రాకుండా ధ్వంసం చేశాయి. కేవలం 3రోజుల్లోనే పాకిస్థాన్ ఊహకు కూడా అందనంత విధ్వంసం జరిగింది. భారత్ ప్రతి దాడులతో పాకిస్థాన్ ఉద్రిక్తతలు చల్లారేందుకు దారులు వెతుక్కుంది. తమకు ఊరట కల్పించాలంటూ ప్రపంచ దేశాలను వేడుకుంది. మే 10న మధ్యాహ్నం పాక్ మిలటరీ అధికారులు మన డీజీఎంవో వద్దకు పరుగెత్తుకు వచ్చారు. ఉగ్రవాద కార్యకలాపాలన్నీ పూర్తిగా నిలిపివేస్తామని, భారత్‌పై సైనిక దాడిని కూడా ఆపేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే, పరిస్థితిని భారత్ సమీక్షించింది. పాక్ సైనిక, ఉగ్రవాద స్థావరాలపై ప్రతి దాడులను తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించింది. ఇది తాత్కాలికంగా నిలిపివేతే. కానీ ముగింపు కాదు. రాబోయే రోజుల్లో పాకిస్థాన్ ప్రతి అడుగునూ భారత్ నిరంతరం గమనిస్తుంది.

సైనిక దళాలకు, శాస్త్రవేత్తలకు సెల్యూట్

ఇటీవల భారత్ సహనం, సమర్థతను దేశమంతా చూసింది. ఇందుకు ప్రతి భారతీయుడి తరఫున సైనిక దళాలు, నిఘా సంస్థలు, శాస్త్రవేత్తలకు సెల్యూట్ చేస్తున్నాను. ఆపరేషన్ సిందూర్ లక్ష్యాలను సాధించడంలో మన సైనికులు తిరుగులేని ధైర్యాన్ని ప్రదర్శించారు. వారి తిరుగులేని పరాక్రమాన్ని దేశంలోని ప్రతి తల్లి, సోదరి, కుమార్తెకు అంకితం ఇస్తున్నాను. పహల్గాం ఉగ్ర దాడి మొత్తం ప్రపంచాన్నే కుదిపేసింది. అమాయక పౌరులు సెలవులకు వెళితే.. కుటుంబ సభ్యులు, పిల్లల కళ్లెదుటే వారిని మతం అడిగి మరీ అతి కిరాతకంగా చంపేశారు. దేశ సామరస్యాన్ని ముక్కలు చేయడానికి చేసిన నీచ ప్రయత్నం ఇది. అందుకే, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకోవాలంటూ ప్రతి పౌరుడు, ప్రతి రాజకీయ పార్టీ.. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఏకతాటిపై నిలిచారు. అందుకే, ఉగ్రవాదులను ఏరివేయడానికి సైనిక దళాలకు ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది. భారత మహిళల గౌరవానికి భంగం కలిగిస్తే ఎటువంటి పరిణామాలు ఎదురవుతాయో ఇప్పుడు ఉగ్రవాద సంస్థలకు సుస్పష్టంగా అర్థమైంది.

ఉగ్రవాద శకం కాదు

యుద్ధాల్లో పాకిస్థాన్‌ను భారత్ ఎప్పటికప్పుడు ఓడిస్తూనే ఉంది. దేశ సైనిక శక్తికి సంబంధించి ఆపరేషన్ సిందూర్ సరికొత్త కోణాన్ని ఆవిష్కరించింది. ఎడారుల్లోనే కాదు.. పర్వత ప్రాంతాల్లో యుద్ధాల్లో భారత్‌కు తిరుగులేని సామర్థ్యం ఉంది. తాజాగా అత్యాధునిక యుద్ధంలోనూ భారత్ పైచేయి చాటింది. ఈ ఆపరేషన్లో.. మేడిన్ ఇండియా రక్షణ పరికరాల సత్తా సుస్పష్టంగా రుజువైంది. 21వ శతాబ్దపు యుద్ధంలో బలీయమైన శక్తిగా మేడిన్ ఇండియా రక్షణ వ్యవస్థలు రావడాన్ని ప్రపంచం ఇప్పుడు కళ్లారా చూసింది. అన్ని రూపాల్లో ఉగ్రవాదంపై పోరాటానికి ఐకమత్యమే భారత్ అతి పెద్ద బలమని ఇప్పుడు రుజువైంది. ఇది యుద్ధాల యుగం కాదు. అలాగే, ఉగ్రవాద శకమూ కారాదు. సురక్షిత, అత్యుత్తమ ప్రపంచం కావాలంటే ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించరాదు.

ఉగ్రవాదం పాకిస్థాన్‌నే మింగేస్తుంది

పాకిస్థాన్ ప్రభుత్వం, సైన్యం ఎప్పటికప్పుడు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూనే ఉన్నాయి. పాకిస్థాన్ పతనానికి కూడా ఇటువంటి చర్యలే కారణమవుతాయి. ఉగ్రవాదానికి ఇలాగే చేయూత ఇస్తే ఏదో ఒక రోజు పాకిస్థాన్‌నే మింగేస్తుంది. పాకిస్థాన్ బయటపడాలంటే ఉగ్రవాద మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయాల్సిందే. శాంతికి ఇది తప్ప మరో మార్గం లేదు. ఉగ్రవాదం, చర్చలు సహజీవనం సాగించలేవు. ఉగ్రవాదం, వ్యాపారం ఒకే బాటలో పయనించలేవు. రక్తం, నీళ్లు కలిసి ప్రవహించలేవు. పాకిస్థాన్‌తో ఎప్పుడైనా చర్చలంటూ జరిగితే అది కేవలం ఉగ్రవాదంపైనే. పాక్‌తో సంప్రదింపులంటూ జరిగితే అది పాక్ ఆక్రమిత కశ్మీర్‌పైనే. సుదీర్ఘ కాలంగా మా విధానం ఇదే. ఈ రోజు బుద్ధ పూర్ణిమ. శాంతి మార్గాన్ని శక్తి నిర్దేశించాలని బుద్ధుడు ప్రవచించాడు. శాంతి, సౌభాగ్యాల దిశగా మానవత్వం ముందుకు అడుగులు వేయాలి. శాంతిని నిలబెట్టుకోవాలంటే భారత్ బలంగా ఉండాలి. అంతేనా.. అవసరం వచ్చినప్పుడు ఆ శక్తిని ప్రదర్శించాలి కూడా. తన సిద్ధాంతాలను కాపాడుకోవడానికి భారత్ సంకల్పాన్ని ఇటీవలి ఘటనలు ప్రదర్శించాయి. భారత భద్రతా దళాల తెగువకు మరోసారి వందనం. భారతీయుల ఐక్యత, ధైర్యానికి అభివందనం.



వాణిజ్య బెదిరింపులతో దారికి!

(మొదటి పేజీ తరువాయి)

చరిత్రాత్మక ఘటనలు జరుగుతున్నాయి. భారత్, పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. వారు ఇప్పట్లో వెనక్కి తగ్గేలా కనిపించలేదు. ఇరు దేశాలు అమెరికాతో వాణిజ్యం నుంచి ఎంతో లబ్ధి పొందవచ్చని వారికి చెప్పా.. మరింతగా వాణిజ్య అవకాశాలు కల్పిస్తానని ప్రతిపాదించా.. ఒకవేళ భారత్-పాక్ వెంటనే కాల్పుల విరమణ పాటించకపోతే.. అమెరికాతో వాణిజ్యం ఉండబోదని స్పష్టం చేశా.. వాళ్లు పలు కారణాలతో కాల్పుల విరమణ పాటించవచ్చు. కానీ అసలైన పెద్ద కారణం మాత్రం వాణిజ్యమే. మేం పాకిస్థాన్, భారత్ రెండింటితోనూ పెద్ద ఎత్తున వాణిజ్యం జరపనున్నాం. ఈ అంశంలో భారత్‌తో చర్చలు మొదలుపెట్టాం. త్వరలో పాకిస్థాన్‌తోనూ చర్చలు జరుపుతాం.." అని ట్రంప్ చెప్పారు. బోలెడన్ని అణ్వాయుధాలు ఉన్న భారత్- పాకిస్థాన్ మధ్య ప్రమాదకర పరిస్థితిని నివారించేలా, ఉన్నపళంగా కాల్పుల విరమణ ప్రకటించేలా తన యంత్రాంగం విజయవంతంగా మధ్యవర్తిత్వం వహించిందని పేర్కొన్నారు. లేకుంటే అణుయుద్ధం జరిగి కోట్లాది మంది చనిపోయేవారని.. దానిని ఆపినందుకు గర్వపడుతున్నానని వ్యాఖ్యానించారు. ఈ ప్రక్రియలతో తమ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో బాగా కృషి చేశారని ప్రశంసించారు. భారత్, పాక్ ప్రధాన మంత్రులు శక్తివంతులు, తిరుగులేని వారని.. ప్రస్తుత పరిస్థితి ఏవిటో అర్థం చేసుకోగలిగిన తెలివి వారికి ఉందని వ్యాఖ్యానించారు. వాణిజ్యం అంశాన్ని తాను వినియోగించినట్లుగా ఎవరూ వినియోగించలేరని, అది స్పష్టంగా చెప్పగలనని పేర్కొన్నారు.

ట్రంప్ వ్యాఖ్యల్లో వాస్తవం లేదు..!

వాణిజ్యం ఆపేస్తానని హెచ్చరించడంతో భారత్, పాక్ కాల్పుల విరమణకు సిద్ధమయ్యాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు వాస్తవదూరమని భారత ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. "ట్రంప్ వ్యాఖ్యలను భారత ప్రభుత్వం ఖండిస్తోంది. ఆపరేషన్ సిందూర్ మొదలయ్యాక మే 9న ప్రధాని మోదీతో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మాట్లాడారు. మే 8న, 10న విదేశాంగ మంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు డోభాల్‌తో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మాట్లాడారు. అందులో ఎక్కడా, ఏ రకంగానూ వాణిజ్యం ప్రస్తావనే రాలేదు" అని వెల్లడించాయి.

సరిహద్దుల్లో సైన్యాన్ని తగ్గిద్దాం

(మొదటి పేజీ తరువాయి)

సరిహద్దు వెంబడి ఇరువైపులా సైన్యాన్ని తగ్గించాలని నిర్ణయించారు. డ్రోన్లు, మిసైల్ దాడులు జరగొద్దని ఆకాంక్షించారు. ఒకవేళ ఒక తూటా పేలినా.. సీరియస్‌గా పరిగణించాలని తీర్మానించారు. ఈ నెల 10న కాల్పుల విరమణపై ఇరుదేశాల నుంచి ప్రకటనలు వెలువడిన వెంటనే.. డీజీఎంవోల సమావేశాన్ని ఖరారు చేసిన విషయం తెలిసిందే.! సాధారణంగా వీరి భేటీ మంగళవారాల్లో ఉంటుంది. దీన్ని బట్టి.. మంగళవారం కూడా మరోమారు హాట్‌లైన్ సమావేశం జరిగే అవకాశాలున్నాయి. కాగా.. ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం సాయంత్రం జాతినుద్దేశించి ప్రసంగించిన కాసేపటికే.. భారత గగనతలంలోకి పాకిస్థాన్‌కు చెందిన పలు డ్రోన్లు ప్రవేశించాయి. తొలుత పఠాన్‌కోట్ వద్ద రాత్రి 8.30 సమయంలో ఒకటి.. బమియాల్ వద్ద రెండు నిఘా డ్రోన్లను గుర్తించినట్లు బీఎస్ఎఫ్ వర్గాలను ఉటంకిస్తూ.. జాతీయ మీడియా కథనాలను ప్రచురించింది. రాత్రి 9.20 సమయంలో జలంధర్, సాంబ సెక్టార్ వద్ద నిఘా డ్రోన్లను సైన్యం కూల్చివేసింది. అమృత్‌సర్ వైపు డ్రోన్లు దూసుకురావడంతో.. న్యూఢిల్లీ నుంచి వచ్చిన ఇండిగో విమానం వెనుదిరిగింది. ఆయా ప్రాంతాల్లోని డ్రోన్లను సమర్థంగా కూల్చివేశామని, ప్రస్తుతం సరిహద్దుల వద్ద పరిస్థితి ప్రశాంతంగా ఉందని సైన్యం ఓ ప్రకటనలో తెలిపింది. ముందుజాగ్రత్త చర్యగా జమ్మూకశ్మీర్‌లోని సాంబ, హోషియార్‌పూర్‌లో బ్లాకౌట్‌ను ప్రకటిస్తూ ఆయా జిల్లాల కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు.


జమ్మూకశ్మీర్‌లోకి సోమవారం రాత్రి పాకిస్థాన్ డ్రోన్లు దూసుకువచ్చిన నేపథ్యంలో రియాసీ జిల్లాలో బ్లాక్ అవుట్ ప్రకటించారు.

ఆపరేషన్ సిందూర్ విజయంపై నేటి నుంచి తిరంగయాత్ర

- దేశ వ్యాప్తంగా 11 రోజుల పాటు నిర్వహించనున్న బీజేపీ

న్యూఢిల్లీ, మే 12: పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులను అణచివేయడానికి చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయం సాధించడంతో బీజేపీ మంగళవారం నుంచి దేశవ్యాప్తంగా తిరంగ యాత్ర నిర్వహించనుంది. భారత సైన్యం సాధించిన విజయాలను, మోదీ ప్రభుత్వ నిబద్ధతను ప్రజలకు తెలియజేస్తూ 11 రోజుల పాటు ప్రచారం జరపనుంది. ఈ నెల 13 నుంచి 23 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రేమ్ శుక్లా తెలిపారు. బీజేపీ కార్యకర్తలు జాతీయ జెండాలను పట్టుకొని ఊరేగింపులు నిర్వహిస్తారని చెప్పారు. ముగింపు రోజున విజయోత్సవ సభ నిర్వహిస్తారు. ఈ విషయమై సీనియర్ నాయకులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, జె.పి.నడ్డాలు విస్తృతంగా చర్చలు జరిపారు. పార్టీ అధ్యక్షుడు నడ్డా జాతీయ కార్యదర్శులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ యాత్రను సీనియర్ నాయకులు వినోద్ తావ్డే, తరుణ్ చుగ్, సంబిత్ పాత్రలు సమన్వయ పరచనున్నారు. మరోవైపు ఇది రాజకీయ ప్రచారం అన్న ఆరోపణలను ఓ సీనియర్ నాయకుడు ఖండించారు. రాజకీయ ప్రయోజనాలను ఆశించడం లేదని, జాతి విజయాన్ని అందరికీ పంచుకోవడానికే దీన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.



పాక్ వైమానిక స్థావరాలకు చావుదెబ్బ



నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ రన్‌వే ధ్వంసం

- ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు తునాతునకలు
- మా టాస్క్‌లను 100% పూర్తిచేశాం
- 'ఆపరేషన్ సిందూర్'పై ఆపరేషన్స్ డీజీల ప్రెస్ బ్రీఫింగ్‌లో వెల్లడి

న్యూఢిల్లీ, మే 12: 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా మే 7న జరిపిన దాడుల్లో ఉగ్రవాద స్థావరాలను 100% కచ్చితత్వంతో ధ్వంసం చేశామని త్రివిధ దళాల అధికారులు స్పష్టం చేశారు. ఉగ్రవాదులకు మద్దతుగా కాల్పులకు దిగి, భారత్‌పై క్షిపణి, డ్రోన్ దాడులు చేసిన పాకిస్థాన్‌కు గట్టి జవాబిచ్చామని పేర్కొన్నారు. పాకిస్థాన్ సైన్యానికి, సైనిక సంపత్తికి ఏదైనా నష్టం జరిగితే.. దానికి వారే బాధ్యులన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎయిర్ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్(డీజీఏవో)/ఎయిర్ మార్షల్ ఏకే భారతి, మిలటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్(డీజీఎంవో)/లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్, నావల్ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్/వైస్ అడ్మిరల్ ఏఎన్ ప్రమోద్ 'ఆపరేషన్ సిందూర్'లో భారత విజయాలను గురించి వివరించారు. అందుకు ఆధారంగా పాకిస్థాన్‌పై దాడుల వీడియోలను, శాటిలైట్ చిత్రాలను ప్రదర్శించారు. పాక్ దాడిని భారత గగనతల రక్షణ వ్యవస్థలు సమర్థంగా తిప్పికొట్టాయని, ఆకాశ్ క్షిపణి దెబ్బను దాయాదికి రుచిచూపించామని వ్యాఖ్యానించారు. భారత్ సర్వసన్నద్ధతతో పాకిస్థాన్ ఆటలు సాగలేదన్నారు.

పాక్‌లోని 11 ఎయిర్ బేస్‌లకు నష్టం

భారత వైమానిక దళం దాడుల్లో పాక్ ఎయిర్‌బేస్‌లకు భారీ నష్టం వాటిల్లినట్లు ఏకే భారతి వెల్లడించారు. "అత్యంత కచ్చితత్వంతో మేము ప్రయోగించిన క్షిపణులు లక్ష్యాలను ఛేదించాయి. ఫలితంగా పాకిస్థాన్ వాయుసేనకు చెందిన 11 ఎయిర్ బేస్‌లు-- నూర్‌ఖాన్, రహీమ్‌యార్ ఖాన్, రఫీకీ, మురిద్, సుక్కుర్, సియాల్‌కోట్, పాసుర్, చునియాన్, సర్గోధా, స్కర్దు, జకోబాబాద్ వాయుసేన స్థావరాలకు నష్టం వాటిల్లింది. నూర్ ఖాన్, రహీమ్‌యార్ ఖాన్ ఎయిర్ బేసుల్లో రన్‌వేలు దెబ్బతిన్నాయి" అని ఆయన వివరించారు. నూర్‌ఖాన్, రహీమ్‌యార్‌ఖాన్ ఎయిర్‌బేస్‌లపై దాడి దృశ్యాలను మీడియాకు ప్రదర్శించారు. రావల్పిండిలోని నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌లో పాకిస్థాన్‌కు చెందిన ఎయిర్ మొబిలిటీ కమాండ్ ఉంది. ఇక్కడే సాబ్ ఎయిర్‌బోర్న్ అర్లీ వార్నింగ్ వ్యవస్థలు, సీ-130 రవాణా విమానం, ఐఎల్-78 ఏరియల్ రీఫిల్లింగ్ ట్యాంకులు ఉన్నాయి. వీటిపై దాడులు జరిగినట్లు తెలుస్తోంది. పాక్ ప్రతిష్ఠాత్మకంగా భావించే ఎఫ్-16, జేఎఫ్-17ఎస్ ఫైటర్ జెట్లకు సర్గోధ, భోలారీ ఎయిర్‌బేస్‌లు ప్రధాన కేంద్రాలని ఏకే భారతి గుర్తుచేశారు. రహీమ్‌యార్ ఖాన్ ఎయిర్‌బేస్ పాకిస్థాన్‌కు వ్యూహాత్మక స్థావరమన్నారు. తమ పోరు ఉగ్రవాదంపైనేనని, కానీ, పాకిస్థాన్ సైన్యం ఉగ్రవాదులకు అండగా నిలిచి, ఈ పోరాటాన్ని పాక్ పోరాటంగా మార్చాయని పేర్కొన్నారు.

ఉగ్ర స్థావరాలపై..

పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లో ఉగ్రవాదులు ఆశ్రయం పొందుతున్న 9 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని.. 24 క్షిపణులను ప్రయోగించినట్లు ఏకే భారతి తెలిపారు. "100% కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించాం. స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఆకాశ్ గగనతల రక్షణ క్షిపణులను ఈ ఆపరేషన్‌లో సమర్థంగా వినియోగించాం. పాకిస్థాన్‌కు చెందిన సామాన్య పౌరులకు ఎలాంటి నష్టం జరగలేదు. పాకిస్థాన్ వైపు నుంచి వచ్చిన క్షిపణులు, డ్రోన్లను సమర్థంగా ఎదుర్కొన్నాం" అని వివరించారు. చైనా తయారీ పీఎల్-15 క్షిపణులు, తుర్కియేకు చెందిన డ్రోన్ల(వైఐహెచ్ఏ, సోంగర్)ను కూల్చిన తర్వాత లభించిన శకలాల చిత్రాలను మీడియాకు చూపించారు. దీనికి సంబంధించి నౌకాదళానికి చెందిన వైస్ అడ్మిరల్ ప్రమోద్ మరిన్ని వివరాలను అందజేశారు. "ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్లు, రాడార్లను ఉపయోగించాం. ఫ్లీట్, ఎయిర్ డిఫెన్స్‌ను సమర్థంగా వినియోగించాం. డ్రోన్లు, హైస్పీడ్ క్షిపణులతో దాడులు చేశాం. నౌకాదళ అడ్వాన్స్‌డ్ రాడార్ల ద్వారా పాక్ డ్రోన్లను గుర్తించి, అడ్డుకున్నాం. వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న పాక్ విమానాలను దగ్గరికి రాకుండా నిలువరించాం. ఈ విషయంలో త్రివిధ దళాలు సమన్వయంతో పనిచేశాయి. స్వదేశీ పరిజ్ఞానంతో బలమైన ప్రతిస్పందనను పాక్‌కు చూపించాం" అని వ్యాఖ్యానించారు.

కరాచీ కంటోన్మెంట్‌పై..

కరాచీలోని 'మలీర్ కంటోన్మెంట్'పైనా దాడి చేసినట్లు వాయుసేన, నౌకాదళం వెల్లడించాయి. ఇజ్రాయెల్ తయారీ హరూప్ డ్రోన్లతో దాడి చేసినట్లు తెలిపాయి. నౌకాదళం అరేబియా సముద్రంలో మోహరించి, పాకిస్థాన్ యుద్ధ నౌకలను కరాచీ పోర్టుకు పరిమితం చేశామని వైస్ అడ్మిరల్ ప్రమోద్ వెల్లడించారు. ఇప్పటికిప్పుడు ఆపరేషన్లకు తాము సిద్ధమని ప్రకటించారు. వాయుసేన, ఆర్మీ అధికారులు తాము తదుపరి ఆపరేషన్లకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

అణు స్థావరాలపై దాడి చేయలేదు

సర్గోధా ఎయిర్‌బేస్‌కు సమీపంలో ఉండే కిరాణా హిల్స్‌లో తమ అణుస్థావరాలున్నట్లు పాకిస్థాన్ స్వయంగా తెలిపింది. కిరాణా హిల్స్‌పై భారత్ దాడులు చేసిందంటూ సోషల్ మీడియాలో వచ్చిన పోస్టులపై ఏకే భారతిని విలేకరులు ప్రశ్నించారు. దీనికి ఆయన సమాధానమిస్తూ.. "పాక్ తన అణుస్థావరాల వివరాలను చెప్పినందుకు థాంక్స్. కానీ, కిరాణా హిల్స్ మా టార్గెట్ జాబితాలో లేవు" అని పేర్కొన్నారు. అయితే.. సర్గోధా ఎయిర్‌బేస్‌పై దాడి నేపథ్యంలో.. పాకిస్థాన్ పౌరులు అణుస్థావరాలపై దాడులంటూ సోషల్ మీడియాలో పోస్టు చేశారని తెలుస్తోంది.



32 విమానాశ్రయాల్లో సర్వీసులు మొదలు

» ఆపరేషన్ సిందూర్‌తో 7 నుంచి ఆగిన రాకపోకలు

న్యూఢిల్లీ, మే 12(ఆంధ్రజ్యోతి): పాక్‌తో కాల్పుల విరమణ నేపథ్యంలో ఉత్తర, పశ్చిమ భారత్ ప్రాంతాల్లోని 32 విమానాశ్రయాల తాత్కాలిక మూసివేతను ఎత్తేస్తున్నట్లు భారత విమానాశ్రయాల సంస్థ (ఏఏఐ) సోమవారం ప్రకటించింది. ఈ విమానాశ్రయాల్లో పౌర విమానాల రాకపోకలు తక్షణం ప్రారంభమవుతాయని పేర్కొంది. ఇండిగో, స్పైస్‌జెట్ సహా పలు ప్రధాన విమానయాన సంస్థలు కూడా విమాన సర్వీసులు ప్రారంభిస్తున్నట్లు ప్రకటించాయి. ఏఏఐ ఆదేశాల నేపథ్యంలో విమానయాన సంస్థలు, ఎయిర్‌పోర్టుల అధికారులు విమాన సర్వీసుల పునరుద్ధరణకు చర్యలు చేపట్టాయి. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో బుధవారం నుంచి 24 విమానాశ్రయాల పరిధిలో విమానాల రాకపోకలపై ఏఏఐ ఆంక్షలు విధించింది. శనివారం దాన్ని 32 ఎయిర్‌పోర్టులకు విస్తరించింది. శ్రీనగర్, చండీగఢ్, అమృత్‌సర్, జైసల్మేర్, జోధ్‌పూర్, పఠాన్‌కోట్, లేహ్, రాజ్‌కోట్, పోర్ బందర్ తదితర 32 విమానాశ్రయాల పరిధిలో తాత్కాలికంగా విమాన సర్వీసులు రద్దు చేశారు.

ఆపరేషన్ సిందూర్‌లో అదానీ డ్రోన్లు

» స్కైస్ట్రైకర్లతో పాక్‌ను దెబ్బకొట్టిన భారత్

న్యూఢిల్లీ, మే 12: అదానీ గ్రూపునకు చెందిన ఆల్ఫా డిజైన్ టెక్నాలజీస్ అభివృద్ధి చేసిన స్కైస్ట్రైకర్ డ్రోన్లు ఆపరేషన్ సిందూర్‌లో సత్తాచాటాయి. భారత్‌లోని అనేక నగరాలపై పాక్ చేసిన దాడులను తిప్పికొడుతూనే.. భారత్ మరిన్ని క్షిపణి, డ్రోన్ దాడులకు దిగింది. ఈ క్రమంలో కామికేజ్ డ్రోన్లుగా పిలిచే స్కైస్ట్రైకర్ డ్రోన్లను వినియోగించింది. ఈ డ్రోన్లను బెంగళూరులోని అదానీ గ్రూపు సంస్థ ఆల్ఫా డిజైన్ టెక్నాలజీస్, ఇజ్రాయెల్‌కు చెందిన ఎల్బిట్ సెక్యూరిటీ సిస్టమ్స్ సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. ఈ అధునాతన డ్రోన్లు 100 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలపై దాడిచేసేందుకు వినియోగిస్తున్నారు. ఆల్ఫా డిజైన్ టెక్నాలజీస్ సంస్థ వీటిని భారత ఆర్మీకి సరఫరా చేస్తోంది. 5 నుంచి 10 కేజీల మందుగుండును తీసుకెళ్లే విధంగా వీటిని రూపొందించారు. స్కైస్ట్రైకర్ మానవరహిత విమాన వ్యవస్థలా గాలిలోకి ఎగిరి, క్షిపణిలా దాడి చేస్తుంది. ఇది నిర్దేశిత ప్రాంతంపై తిరుగుతూ.. లక్ష్యాలను గుర్తించి విరుచుకుపడుతుంది. తక్కువ శబ్దం చేస్తుంది కాబట్టి.. తక్కువ ఎత్తులో ఎగిరినా శత్రువు గుర్తించడం కష్టం.

పది ఉపగ్రహాలతో నిత్యం పహారా: ఇస్రో

ఇంఫాల్, మే 12: ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో దేశ ప్రజల భద్రత, రక్షణ నిమిత్తం కనీసం పది ఉపగ్రహాలు ఆకాశంలో నిరంతరం పహరా కాస్తున్నాయని ఇస్రో చైర్మన్ వి నారాయణన్ అన్నారు. మణిపూర్‌లోని ఇంఫాల్‌లో జరిగిన సెంట్రల్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ (సీఏయూ) స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల మధ్య దేశ భద్రత కోసం ఇస్రో చేస్తున్న కృషిని వివరించారు. 'మన ఇరుగు పొరుగు దేశాల గురించి అందరికీ తెలుసు. మన దేశ భద్రత, ప్రజల రక్షణ కోసం ఉపగ్రహాలతో నిత్యం నిఘా పెట్టాలి. 7 వేల కిలోమీటర్ల మేర ఉన్న సముద్ర తీర ప్రాంతాలను పర్యవేక్షించాలి. మన ఉత్తర భాగాన్నంతా నిరంతరం పరిశీలించాలి. ఉపగ్రహాలు, డ్రోన్ల సాయం లేకుండా దాన్ని సాధించలేం' అని నారాయణన్ అన్నారు.

యుద్ధంలో నడిపించిన రహస్య గైడ్

న్యూఢిల్లీ, మే 12 : సరిహద్దు వెంబడి గ్రామాలు, పట్టణాల్లో ప్రమాదాన్ని శంకించగానే విద్యుత్ దీపాలు ఆర్పివేయడం, సైరన్లు మోగించడం, అక్కడి నుంచి ప్రజలను తరలించడం వంటి చర్యలను అధికారులు చకచకా చేపట్టడం ఆపరేషన్ సిందూర్ కొనసాగినంతకాలం చూశాం. ఆ చివర జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్ నుంచి ఈ చివర గుజరాత్‌లోని కచ్ వరకు.. అధికారులు ఒకేరకమైన యుద్ధ ప్రొటోకాల్‌ను సమర్థవంతంగా అమలుచేశారు. ప్రాణనష్టం, ఆస్తినష్టం చాలావరకు తగ్గించగలిగారు. ప్రజలను ఈ సమయంలో అధికారులు ఎప్పటికప్పుడు గైడ్ చేయగా, వారిని ఓ రహస్య మాన్యువల్ గైడ్ చేసింది. అదే యూనియన్ వార్ బుక్. యుద్ధం వచ్చినప్పుడు ఎలా ప్రతిస్పందించాలో ఈ మాన్యువల్‌లో స్పష్టంగా మార్గదర్శకాలు ఉన్నాయి. పాక్‌తో సంఘర్షణ మొదలుకాగానే...'యూనియన్ వార్ బుక్‌ను అనుసరించండి' అంటూ దేశవ్యాప్తంగా అత్యున్నత స్థానాల్లో ఉన్న కీలక అధికారులకు ఆదేశాలు వెళ్లాయని సీనియర్ అధికార వర్గాలను ఉటంకిస్తూ ఓ జాతీయ ఆంగ్ల పత్రిక కథనం ప్రచురించింది. ఈ కథనాన్ని అనుసరించి...రెండువందల పేజీలతో నీలం రంగులో ఉన్న ఈ మాన్యువల్‌ను 2010లో కేంద్ర రక్షణ, హోంశాఖలు, కేబినెట్ సచివాలయ అధికారులు సంయుక్తంగా రూపొందించారు. ముంబైపై ఉగ్రదాడి జరిగిన రెండేళ్లతర్వాత దీనిని తయారుచేశారు. చాలా లిమిటెడ్ ఎడిషన్ ఇది. బయటలభ్యం కాదు. కేంద్ర మంత్రిత్వశాఖలు, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శుల వద్ద మాత్రమే ఒక ప్రతి ఉంటుంది. సాయుధ సంఘర్షణ తలెత్తినప్పుడు ప్రభుత్వంలోని వివిధ శాఖలు, విభాగాలు ఎలా ప్రతిస్పందించాలీ....ఎలా పనిచేయాలనే వివరాలు ఇందులో ఉంటాయి.

పాక్ ప్రభుత్వ లాంఛనాలతో ఉగ్రవాదుల అంత్యక్రియలు

ఉగ్రమూకల శవ పేటికలపై పాక్ పతాకం.. అంత్యక్రియలకు లష్కరే కమాండర్



ఉగ్రవాదుల శవపేటికలపై పాకిస్థాన్ జాతీయ పతాకం.. అంత్యక్రియల్లో పాల్గొన్న లష్కరే కమాండర్ రవూఫ్, సైనికాధికారులు

న్యూఢిల్లీ, మే 12: భారత్‌పై విషం చిమ్మడమే తన విధానంగా పెట్టుకున్న పాకిస్థాన్.. తాజాగా అంతర్జాతీయ సమాజాన్ని కూడా ఏమార్చే ప్రయత్నం చేసి అడ్డంగా దొరికిపోయింది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాక్‌లోని ఉగ్ర శిబిరాలపై 'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత్ జరిపిన దాడుల్లో పదుల సంఖ్యలో ఉగ్రవాదులు హతమయ్యారు. వీరిలో లష్కరే తాయిబా ఉగ్రవాద సంస్థకు చెందిన పలువురు మృతి చెందారు. అయితే.. మృతి చెందిన ఉగ్రవాదులకు పాక్ ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించింది. ఈ అంత్యక్రియల్లో లష్కరే తాయిబాకు చెందిన సీనియర్ కమాండర్ హఫీజ్ అబ్దుల్ రవూఫ్ సహా సైనికాధికారులు, పాక్ పోలీసులు, రాజకీయ నేతలు పాల్గొన్నారు. రవూఫ్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా అమెరికా కూడా ముద్ర వేసింది. అలాంటి ఉగ్రవాదికి ఆశ్రయం ఇవ్వడంతో పాటు అంత్యక్రియల్లో పాల్గొన్నా.. పాక్ ప్రభుత్వం మౌనంగా ఉంది. అంతేకాదు.. దీనిని సమర్థించుకుంటూ.. ఆయనను మత గురువుగా, కుటుంబ సభ్యుడిగా పేర్కొంటూ అంతర్జాతీయ సమాజాన్ని ఏమార్చే ప్రయత్నం చేసింది. మరోవైపు, పాక్ సైన్యం కూడా రవూఫ్‌ను వెనుకేసుకు వచ్చింది. "ఆయన స్థానిక మతగురువు. ఓ పార్టీ కార్యకర్త, కుటుంబ సభ్యుడు." అంటూ పాకిస్థాన్‌కు చెందిన ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌధురి మీడియా సమావేశంలో చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో.. ఓ గుర్తింపు కార్డును కూడా ప్రదర్శించారు. అయితే.. ఇక్కడే పాక్ అడ్డంగా దొరికిపోయింది. సదరు గుర్తింపు కార్డులో పేర్కొన్న పుట్టిన రోజు, గుర్తింపు సంఖ్య వంటివి అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ రవూఫ్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా పేర్కొంటూ జారీ చేసిన కార్డులోని వివరాలతో పక్కాగా సరిపోయాయి. ఇదే విషయాన్ని భారత సైనికాధికారులు బట్టబయలు చేశారు.

రాజకీయంగా కూడా..

రవూఫ్ ఉగ్రవాది మాత్రమే కాదు. రాజకీయ నాయకుడిగా కూడా చలామణి అవుతున్నాడు. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో లాహోర్‌లోని ఎన్ఏ-119 నియోజకవర్గం నుంచి పీఎంఎంఎల్ పార్టీ తరఫున పోటీ చేశాడు. ఈయనకు 2 వేల ఓట్లు కూడా పడ్డాయి. పీఎంఎంఎల్ పార్టీకి లష్కరే ఉగ్రవాద నాయకుడు హఫీజ్ సయీద్ మద్దతిస్తుండడం గమనార్హం. ఈ ఎన్నికల్లో హఫీజ్ సయీద్ కుమారుడు తల్హా సయీద్ సైతం లాహోర్ ఎన్ఏ-122 నియోజకవర్గం నుంచి పోటీ చేశాడు. ఇక, రవూఫ్ గతంలో లష్కరేకు ఫలాహ్-ఇ-ఇన్‌శానియంట్ ఫౌండేషన్ పేరుతో నిధులు సమకూర్చాడు.

వీరంతా ఎవరు?: భారత్

ఉగ్రవాదుల అంత్యక్రియల్లో పాల్గొన్న పాక్ అధికారులు, ఉగ్రవాదుల జాబితాను కేంద్రం విడుదల చేసింది. వీరంతా ఎవరు? అంటూ పాక్‌ను నిలదీసింది. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఉగ్రవాదుల అంత్యక్రియల్లో లష్కరే కమాండర్ అబ్దుల్ రవూఫ్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశాడు. అలాగే పాక్ సైన్యానికి చెందిన లెఫ్టినెంట్ జనరర్ ఫయ్యాజ్ హుస్సేన్ షా, మేజర్ జనరల్ రావ్ ఇమ్రాన్ సర్తాజ్, బ్రిగేడర్ మహ్మద్ ఫర్కాన్ షబ్బీర్, సీనియర్ పోలీసు అధికారి ఉస్మాన్ అన్వర్, రాజకీయ నేత మాలిక్ సోహైబ్ అహ్మద్ కూడా ఉగ్రవాదుల అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

పాక్‌కు ఆయుధాలు ఇవ్వలేదు

» సైనిక కార్గో విమానం పంపామన్నది వదంతే: చైనా

న్యూఢిల్లీ, మే 12: ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌ను ఎదుర్కొనేందుకు పాకిస్థాన్‌కు చైనా ఆయుధాలు పంపినట్లు వస్తున్న వార్తలను డ్రాగన్ దేశం తోసిపుచ్చింది. అవన్నీ వదంతులేనని కొట్టిపారేసింది. గత వారం పాక్‌కు ఆయుధ సామగ్రితో కూడిన అతి పెద్ద కార్గో విమానాన్ని చైనా పంపిందన్న వార్తల నేపథ్యంలో సోమవారం ఆ దేశ వాయుసేన స్పందించింది. 'మేం అటువంటి విఫషన్‌ను చేపట్టలేదు. ఈ వదంతుల వెనక ఉన్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఇంటర్నెట్.. చట్టానికి అతీతమేమీ కాదు' అంటూ రక్షణ శాఖ వెబ్‌సైట్‌లో ఓ ప్రకటన చేసింది. భారత్‌పై పాక్ చైనా యుద్ధ విమానాలను ప్రయోగించిందన్న వాదనలను అంతకుముందే బీజింగ్ కూడా కొట్టిపారేసింది. 'మేం అన్ని రకాల ఉగ్రవాదానికి వ్యతిరేకం. శాంతి కోసం సంయమనం పాటించాలని ఇరువైపుల వారిని కోరుతున్నాం' అంటూ పేర్కొంది.

యుద్ధం అంటే.. బాలీవుడ్ సినిమా కాదు!

» దౌత్యానికే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి

» ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ నరవణె వ్యాఖ్యలు



పుణె, మే 12: భారత్, పాక్ మధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందంపై ప్రశ్నలు వస్తున్న నేపథ్యంలో భారత ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ మనోజ్ నరవణె కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధం అనేది రొమాంటిక్ లేదా బాలీవుడ్ సినిమా కాదన్నారు. పిల్లలతో సహా ప్రియమైన వారిని కోల్పోవాల్సి వస్తుందని, ఆ ఆవేదన తరతరాలు వెంటాడుతుందన్నారు. దౌత్యానికే మొదటి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మహారాష్ట్రలోని పుణెలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న నరవణె కాల్పుల విరమణ ఒప్పందంపై మాట్లాడారు. 'నాకు ఆదేశాలు వస్తే.. తప్పకుండా యుద్ధానికి వెళ్తా. కానీ, దౌత్యమార్గమే నా ప్రథమ ప్రాధాన్యంగా ఉంటుంది' అని పేర్కొన్నారు. 'యుద్ధం లేదా హింస ఏదైనా చివరి అవకాశంగా మాత్రమే ఉండాలి. అందుకే మన ప్రధాని ఇది యుద్ధాల యుగం కాదని చెబుతుంటారు. బుద్ధి లేని వ్యక్తులు మనపై యుద్ధాన్ని బలవంతంగా రుద్దినప్పటికీ, మనం దాని కోసం ఉత్సాహంగా ఉండకూడదు' అని జనరల్ నరవణె అన్నారు.

17 మంది పాపలకు 'సిందూర్' పేరు

కుషినగర్ (యూపీ), మే 12: 'ఆపరేషన్ సిందూర్' స్ఫూర్తితో ఉత్తరప్రదేశ్‌లోని నవజాత శిశువులకు 'సిందూర్'గా వారి తల్లిదండ్రులు నామకరణం చేశారు. కుషినగర్ మెడికల్ కాలేజీలో మే 10, 11 తేదీల్లో జన్మించిన 17 మంది ఆడపిల్లలకు సిందూర్ అని పేరు పెట్టారని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌కే షాహీ తెలిపారు. పాకిస్థాన్‌పై భారతసైన్యం చేసిన ఈ ఆపరేషన్‌కు గుర్తుగా.. పుట్టిన పిల్లలకు ఈ పేరు పెట్టడాన్ని తల్లిదండ్రులు గౌరవసూచకంగా భావిస్తున్నారని ఆయన చెప్పారు. "పహల్గాం దాడిలో ఎంతో మంది మహిళలు తమ భర్తల్ని కోల్పోయారు. దానికి ప్రతిస్పందనగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరుతో దీటుగా స్పందించింది. సైనికుల త్యాగాలను గౌరవిస్తూ మా కుమార్తెలకు సిందూర్ అని పేరు పెట్టాం" అని చిన్నారుల తల్లిదండ్రులు చెప్పారు.

త్యాగం కన్న పిల్లలు!

స్వాతంత్ర్యం అనంతరం యుద్ధాలు, దాడుల్లో 21 వేలకు పైగా సైనికులు మృతి

» గత రెండు దశాబ్దాల్లో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు 3,500 మందికిపైనే

» నేడు అమర సైనికుల పిల్లల దినోత్సవం



లాన్స్ నాయక్ దినేశ్‌కుమార్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఆయన ఐదేళ్ల కుమారుడు

ఆర్మీ లాన్స్ నాయక్ దినేశ్‌కుమార్ శర్మ.. రెండు రోజుల కింద పాక్ జరిపిన కాల్పుల్లో వీరమరణం పొందారు. హరియాణాలోని పల్వాల్‌కు చెందిన ఆయనకు ఏడేళ్ల కావ్య, ఐదేళ్ల దర్శన్ ఇద్దరు పిల్లలు. దినేశ్ భార్య సీమ ఇప్పుడు ఏడు నెలల గర్భవతి. అంతా అమరవీరుడిగా దినేశ్‌కుమార్‌ను కీర్తిస్తున్నా.. తండ్రి ప్రేమను కోల్పోయిన ఆ పిల్లల పరిస్థితి ఏమిటి, పుట్టబోయే బిడ్డ అయితే కనీసం తండ్రిని చూడలేని స్థితి. ఆర్థికంగా, విద్యాపరంగా ప్రభుత్వ సాయం అందినా.. ఆ పిల్లలు అనుభవించే మానసిక వేదన మాత్రం ఎవరూ తీర్చలేనిది. ఇది ఒక రకంగా ఆ పిల్లలు దేశం కోసం చేసిన త్యాగమే! వారు త్యాగం కన్న పిల్లలే!

యుద్ధమేదైనా పిల్లలపై ప్రభావం..

యుద్ధాలు, పోరాటాల్లో అమర వీరులైనవారి పిల్లల త్యాగాలను, వారికి తగిన సాయం అందాల్సిన అవసరాన్ని గుర్తు చేసుకుంటూ ఏటా మే 13న 'చిల్డ్రన్ ఆఫ్ ఫాలెన్ పేట్రియాట్స్ డే'గా నిర్వహిస్తుంటారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల సంతానాన్ని గౌరవించుకునే రోజు ఇది. తాజాగా పాక్ దాడుల్లో కన్నుమూసిన వైమానికదళ సార్జెంట్ సురేంద్ర కుమార్ మోగాకు 11 ఏళ్ల కుమార్తె, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. పహల్గాం దాడి తర్వాత గాలింపు చర్యల్లో ఉధంపూర్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో కన్నుమూసిన హవల్దార్ జంటు అలీ షేక్‌కు పదేళ్ల కుమారుడు, ఆరేళ్ల కుమార్తె ఉన్నారు.

వేలాది మంది అనాథలుగా..

ఆర్మీ విశ్రాంత సైనికుల వ్యవహారాల డైరెక్టరేట్ గణాంకాల ప్రకారం.. మన దేశంలో స్వాతంత్ర్యం నాటి నుంచి 21 వేల మంది సైనికులు యుద్ధాల్లో అమరులయ్యారు. గత రెండు దశాబ్దాల్లో మిలటరీ, పారామిలటరీ దళాల్లో పనిచేసే తమ తల్లినిగానీ, తండ్రినిగానీ కోల్పోయిన పిల్లలు 3,500 మందికిపైనే. వీరిలో చాలా మంది తమవారిని కోల్పోయిన బాధను అనుభవిస్తూనే ఉన్నారు. ఇలా "తల్లినో, తండ్రినో పోగొట్టుకున్న పిల్లలను జీవితాంతం ఆ బాధ వెంటాడుతుంది. కానీ ధైర్యం వారి డీఎన్ఏలోనే ఉంటుంది. ఆ వారసత్వాన్ని నిలబెట్టేలా ముందుకు సాగే ప్రయత్నం చేస్తుంటారు కూడా.." అని భారత సైన్యంతో కలసి పనిచేసే పిల్లల మానసిక నిపుణురాలు డాక్టర్ రీనా మల్హోత్రా చెబుతున్నారు. ఇక ఆర్మీ వెల్ఫేర్ ఫండ్, ఎక్స్ సర్వీస్ మెన్, భారత్ కే వీర్, వీర్ నారీస్ వెల్ఫేర్ బోర్డు వంటివి అమరులైన సైనికుల పిల్లల చదువు, ఆ కుటుంబాలకు ఆర్థిక సాయం బాధ్యతలను చూసుకుంటున్నాయి.

- సెంట్రల్ డెస్క్

నాన్నను తలచుకుని ఏడవని రోజు లేదు..

- జోయా ఆలం, శ్రీనగర్‌కు చెందిన 13 ఏళ్ల బాలిక. బీఎస్ఎఫ్‌లో పనిచేస్తున్న ఆమె తండ్రి 2018లో ఉగ్రవాదుల బాంబు దాడిలో కన్నుమూశారు. ప్రస్తుతం డెహ్రాడూన్ మిలటరీ స్కూల్‌లో చదువుతున్న ఆమె.. 'నేను నాన్న తలచుకుని ఏడవని రోజు లేదు. నా డైరీలో మా నాన్నకు లేఖలు రాస్తా. నేను చెబుతుంటే మా నాన్న వింటున్నట్టు అనిపిస్తుంది' అని ఆమె చెబుతోంది.
- తమిళనాడుకు చెందిన కవితారాజ్ తండ్రి ఎం.రాజేంద్రన్ సైన్యంలో సుబేదార్. కార్గిల్ యుద్ధంలో కన్నుమూశారు. అప్పుడు ఆమె వయసు పదేళ్లు. 'యుద్ధం నా తండ్రిని, నా బాల్యాన్ని పోగొట్టింది' అని ఆమె ఇప్పటికీ ఆవేదన చెందుతూనే ఉంది.

పోరు బందర్!



డీ4 వ్యవస్థ

(మొదటిపేజీ తరువాయి)

దాడిని తిప్పికొట్టే ఎయిర్ డిఫెన్స్ వినియోగమూ చాలా పెరిగింది. తుర్కియే, చైనాల నుంచి దిగుమతి చేసుకున్న డ్రోన్లను పాకిస్థాన్ పెద్ద సంఖ్యలో భారత్‌పై ప్రయోగించింది. అయితే వాటిని అడ్డుకోవడం, కూల్చివేయడంలో మన ఎయిర్ డిఫెన్స్ అద్భుత విజయాలు సాధించింది. ఇందులో ఎస్-400, ఆకాశ్ వంటి క్షిపణులతో పాటు మన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ తయారుచేసిన డీ4 వ్యవస్థలు ప్రధాన పాత్ర నిర్వహించాయి.

డీ4 అంటే డ్రోన్ డిటెక్షన్, డెటర్ అండ్ డెస్ట్రాయ్. ఇందులో రాడార్లు, లేజర్లు, ఎలక్ట్రో ఆప్టికల్ వ్యవస్థలు ముఖ్యమైనవి. భారత్‌కు చెందిన రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ వీటిని అభివృద్ధి చేయగా పెద్దసంఖ్యలో తయారు చేసే బాధ్యతను భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)కు అప్పగించారు. తయారీ దశలో మళ్లీ బీఈఎల్‌లోని పరిశోధన, అభివృద్ధి విభాగాలు వీటికి తుది మెరుగులు దిద్దుతాయి. ఈ డీ4 వ్యవస్థలకు కావాల్సిన రాడార్లను బెంగళూరు యూనిట్‌లో తయారు చేయగా, జామర్లను తెలంగాణలోని హైదరాబాద్ యూనిట్ ఉత్పత్తి చేస్తోంది. తర్వాత వీటిని ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నానికి తరలిస్తారు. మచిలీపట్నం యూనిట్ ఎలక్ట్రో ఆప్టిక్ ఉపకరణాలను తయారు చేయడంతోపాటు రాడార్లు, జామర్లను కూడా వాటికి అనుసంధానించి డీ4 వ్యవస్థకు తుదిరూపును ఇస్తుంది. అక్కడి నుంచి వాటిని సైన్యానికి అందజేస్తారు.

భారత్‌పైకి పాక్ ప్రయోగించిన డ్రోన్లను తొలుత రాడార్లు ఎక్కువ దూరం నుంచి గుర్తిస్తాయి. అవి కొంత దగ్గరకు వచ్చిన తర్వాత కెమెరాలు, లేజర్ రేంజ్ ఫైండర్ వంటి ఎలక్ట్రో ఆప్టిక్ పరికరాలు వాటిని మరింత స్పష్టంగా గుర్తించి భారత దళాలను అప్రమత్తం చేస్తాయి. ఆపై ఆ డ్రోన్లను రెండు రకాలుగా నేలకూలుస్తారు. ఒకటి జీపీఎస్ జామింగ్, రెండు లేజర్ ప్రయోగం! డ్రోన్లను ప్రత్యర్థి పైకి ప్రయోగించేటప్పుడు వాటిని జీపీఎస్ ద్వారా ప్రోగ్రామ్ చేస్తారు. అంటే భారత స్థావరాలు ఎక్కడ ఉన్నాయనే శాటిలైట్ డేటాను వాటిలో పొందుపరుస్తారు. ఆ తర్వాత మనం గూగుల్ మ్యాప్ సాయంతో కారు డ్రైవ్ చేసినట్లే ఇవి కూడా జీపీఎస్ సాయంతో అక్కడికి చేరుకుని దాడి చేస్తాయి. ఈ జీపీఎస్ సిగ్నల్‌ను ఎలక్ట్రానిక్ పరికరాల సాయంతో జామ్ చేస్తే డ్రోన్లు ఎటు వెళ్లాలో దిక్కుతోచక కుప్పకూలిపోతాయి. లేదంటే ఈ డ్రోన్లపైకి లేజర్‌ను ప్రసరింపజేయడం ద్వారా కూడా కూల్చివేయవచ్చు. ఇలా డ్రోన్లను కూల్చడంలో బీఈఎల్ తయారీ డీ4 వ్యవస్థలు అద్భుతమైన పనితీరును ప్రదర్శించాయని భారత రక్షణ శాఖ అధికారులు కొందరు ఆంధ్రజ్యోతికి తెలిపారు. రాను రాను యుద్ధాల్లో డ్రోన్ల వాడకం చాలా పెరగబోతోంది. యుద్ధ విమానాల నుంచి, యుద్ధ నౌకల నుంచి, యుద్ధ ట్యాంకుల నుంచి కూడా డ్రోన్లను ప్రయోగించడం, నియంత్రించడం వంటి పరిజ్ఞానాలు పెద్ద ఎత్తున రాబోతున్నాయి. అలాగే డ్రోన్ల తయారీ ఖర్చు తక్కువ కావడంతో ఉగ్రవాదులు, తీవ్రవాదులు, సంఘ విద్రోహ శక్తులు సైతం వాటిని తయారు చేసి దుర్వినియోగం చేసే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో బీఈఎల్ పరిశోధనల ఫలితమే ప్రస్తుత యుద్ధంలో కనిపించిందని రక్షణ అధికారులు పేర్కొంటున్నారు. - ఆంధ్రజ్యోతి రక్షణ ప్రత్యేక ప్రతినిధి

పహల్గాం కుట్రదారులను చంపారా?

» భద్రతా వైఫల్యానికి బాధ్యులెవరు?

» పార్లమెంటు ప్రత్యేక భేటీ ఎందుకు పెట్టరు?

» ప్రభుత్వం వివరణ ఇవ్వాలన్న కాంగ్రెస్

న్యూఢిల్లీ/తిరువనంతపురం, మే 12: పహల్గాంలో ఉగ్రవాదుల దాడి కుట్రదారులను అరెస్టు చేయడం గానీ, చంపేయడం గానీ చేశారా అని కేంద్రాన్ని కాంగ్రెస్ ప్రశ్నించింది. 26 మంది అమాయక పర్యాటకులను పొట్టన పెట్టుకున్న ఘటనకు సంబంధించి భద్రతావైఫల్యానికి బాధ్యులెవరని నిలదీసింది. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేస్తున్నారో లేదో చెప్పాలని అడిగింది. ద్వైపాక్షిక అంశమైన కశ్మీరుపై దేశం వైఖరి మారిందా.. మూడో దేశం జోక్యంపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసింది. సోమవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి భూపేశ్ బఘేల్ ఢిల్లీలో, మరో జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ తిరువనంతపురంలో విలేకరులతో మాట్లాడారు. భారత్-పాక్ కాల్పుల విరమణను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం మన దౌత్య వైఫల్యం కాదా అని నిలదీశారు. తాజా పరిణామాలపై పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను గానీ, అఖిల పక్ష సమావేశాన్ని గానీ ఎందుకు ఏర్పాటుచేయడం లేదని బఘేల్ ప్రశ్నించారు. ఇకపై ప్రధాని మోదీ రాకుంటే తమ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అఖిల పక్షానికి రారని స్పష్టంచేశారు. కశ్మీరు అంశంపై మూడో పక్షం జోక్యానికి భారత్ సిద్ధంగా ఉందా అని వేణుగోపాల్ ప్రశ్నించారు. అదే జరిగితే సిమ్లా ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లవుతుందన్నారు.

'సెకీ' సీఎండీ గుప్తాపై కేంద్రం వేటు

» మరో నెల గడువు ఉండగానే తొలగింపు

» కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ

» కార్యదర్శి సారంగికి అదనపు బాధ్యతలు



న్యూఢిల్లీ, మే 12: భారత సౌర శక్తి కార్పొరేషన్(సెకీ) చైర్మన్-మేనేజింగ్ డైరెక్టర్ రామేశ్వర్ ప్రసాద్ గుప్తాను కేంద్రం తొలగించింది. ఆయన స్థానంలో కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ కార్యదర్శి సంతోష్‌కుమార్ సారంగికి సీఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ సోమవారం నిర్ణయం తీసుకుంది. గుప్తా గుజరాత్ కేడర్‌కు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి. 2023 జూన్‌లో సెకీ సీఎండీగా బాధ్యతలు చేపట్టారు. మరో నెలలో ఆయన పదవీకాలం ముగియనుంది. ఈలోపే ఈ నెల 10న ఆయనపై వేటు వేయడం గమనార్హం. ఆయన్ను తొలగించడానికి కారణాలేంటో ప్రభుత్వం పేర్కొనలేదు. అయితే అదానీ స్కాంతో ఈ నిర్ణయానికి సంబంధం ఉందని కాంగ్రెస్ ఆరోపించింది. ఇలాంటి చర్యలతో కుంభకోణాన్ని దాచిపెట్టలేరని స్పష్టంచేసింది. అదానీ, ఆయన సహచరులపై అమెరికా అధికారులు చార్జిషీటు దాఖలుచేశారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ గుర్తుచేశారు. అందులో సెకీ కూడా ఉందన్నారు. కాగా.. నాటి ఏపీ సీఎం జగన్ హయాంలో సెకీతో రాష్ట్రప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. 25 ఏళ్లపాటు కరెంటు కొనడానికి ఒప్పందం చేసుకున్నారని.. ఈ వ్యవహారంలో జగన్‌కు రూ.1,750 కోట్ల ముడుపులు అందాయని టీడీపీ గతేడాది ఏసీబీకి ఫిర్యాదు చేసింది.

వలసలపై బ్రిటన్ కఠిన వైఖరి

లండన్, మే 12: విదేశీయుల వలసలపై బ్రిటన్ కఠిన వైఖరి అవలంబించనుంది. పౌరసత్వం పొందడం కోసం ప్రస్తుతం ఉన్న అయిదేళ్ల నిరీక్షణ సమయాన్ని పదేళ్లకు పెంచనుంది. వలసల విధానంపై పార్లమెంటులో ప్రభుత్వం శ్వేతపత్రాన్ని సమర్పించనున్న నేపథ్యంలో సోమవారం ప్రధాని స్టార్మర్ ఈ విషయాన్ని వెల్లడించారు. వృత్తి, విద్య, కుటుంబం తదితర కేటగిరీల వీసాలపై వచ్చిన వారికి కూడా ఇది వర్తిస్తుంది. భారతీయులు సహా ఇతర దేశాల వారు బ్రిటన్‌లో అయిదేళ్ల పాటు నివసిస్తుంటే ప్రస్తుతం వారికి ఆటోమేటిక్‌గా పౌరసత్వం లభిస్తుంది. దీనికి అడ్డుకట్టవేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. నైపుణ్యాలు ఉన్నవారికే పౌరసత్వం మంజూరులో ప్రాధాన్యం ఇవ్వనుంది. ఈ వర్గంలో నర్సులు, డాక్టర్లు, ఇంజినీర్లు, కృత్రిమ మేధ లీడర్లు ఉండనున్నారు. కాగా, కొత్త విధానంలో.. వలస వచ్చేవారికి హయ్యర్ స్టాండర్డ్ ఇంగ్లీష్ వచ్చి ఉండాలని పేర్కొన్నారు. బ్రిటన్‌లో నివసించే విదేశీయులపై ఆధారపడ్డ వారు మేజర్లయితే వారికి కూడా తప్పనిసరిగా కనీస ఇంగ్లీషు పరిజ్ఞానం ఉండాలన్నారు.



టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న వర్ల రామయ్య, నీలాయపాలెం తదితర నాయకులు

ఘనంగా పల్లా జన్మదిన వేడుకలు

అమరావతి, మే 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పలువురు టీడీపీ నేతలు మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పల్లా చేసిన పోరాటం ఆయన్ను ప్రజానేతగా నిలిపిందన్నారు. కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, బయో డైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పునరుత్పాదక ఇంధన రంగంలో రూ.22 వేల కోట్ల పెట్టుబడులు

- 17న పలు ప్లాంట్లకు లోకేశ్ భూమిపూజ

అమరావతి, మే 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన రంగంలో రూ.22,000 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. 2019-24 నడుమ ఈ రంగంలో రూపాయి కూడా పెట్టుబడి రాలేదు. 2024లో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక అనంతపురం, కర్నూలు జిల్లాల్లో 1,800 మెగావాట్ల సోలార్ ఎనర్జీ ప్లాంటు, మరో 1,000 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్)తో కూడిన సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసేందుకు కొన్ని సంస్థలతో రాష్ట్ర పునరుత్పాదక ఇంధన సంస్థ ఒప్పందాలు చేసుకుంది. తాజాగా రెండు దశల్లో రెండు గిగావాట్ల బీఈఎస్ఎస్ ప్లాంట్లను అనంతపురం జిల్లాలో స్థాపించేందుకు ప్రతిపాదనలు వచ్చాయని రాష్ట్ర పునరుత్పాదక విద్యుత్ అభివృద్ధి సంస్థ వెల్లడించింది. ఇందుకోసం 100 కిలోమీటర్ల మేర అదనపు హైవోల్టేజీ (ఈవీహెచ్) లైన్ ట్రాన్స్‌మిషన్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 17వ తేదీన పలు పునరుత్పాదక ఇంధన ప్లాంట్లకు మంత్రి లోకేశ్ భూమి పూజ చేయనున్నారు. మొదటి దశలో 587 మెగావాట్ల సోలార్ ప్లాంట్, 250.8 మెగావాట్ల విండ్ ప్రాజెక్టులను, 415 మెగావాట్ల బీఈఎస్ఎస్ ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయి. ఇంటిగ్రేటెడ్ రెన్యువల్ ఎనర్జీ పాలసీని రాష్ట్రప్రభుత్వం అమల్లోకి తెచ్చిన సంగతి తెలిసిందే. ఏసీఎంఈ సోలార్, రెన్యూ పవర్, గ్రీన్‌కో హోల్డింగ్, యాక్సిస్ విండ్ ఫర్మ్స్, అజూర్ పవర్, మైత్రాస్ వంటి సంస్థలు భారీ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమయ్యాయి.


20న మంత్రివర్గ సమావేశం

అమరావతి, మే 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గం ఈ నెల 20వ తేదీన భేటీ కానుంది. ప్రతి నెలా రెండు, నాలుగు గురువారాల్లో కేబినెట్ సమావేశాలను నిర్వహంచాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఈసారి 20న మంగళవారం నిర్వహిస్తుంది. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఈ సమాచారం మంత్రులకు అందింది. ఆ రోజు ఉదయం 11 గంటలకు సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో సమావేశం జరుగుతుంది.

ఏజెన్సీలో గిరిజనులకే ఉద్యోగాలు

- 100% కల్పించేందుకు కట్టుబడి ఉన్నాం
- రద్దయిన జీవో 3 పునరుద్ధరణకు చర్యలు
- సుప్రీంకోర్టు మార్గదర్శకాలు పాటిస్తూనే.. అవకాశాలపై అధ్యయనం చేయండి
- గిరిజన సంక్షేమ శాఖ సమీక్షలో సీఎం ఆదేశాలు

అమరావతి, మే 12(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక గిరిజనులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో వంద శాతం కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని సీఎం చంద్రబాబు అన్నారు. సోమవారం ఆయన గిరిజన సంక్షేమశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానిక గిరిజనులకు 100 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు 2000 సంవత్సరంలో ఉమ్మడి రాష్ట్రంలో జీవో నంబర్ 3 తెచ్చామని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. 2020లో న్యాయ సమీక్షలో రద్దు అయిన ఆ జీవో పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షించారు. సుప్రీంకోర్టు ఆదేశాలు, మార్గదర్శకాలు పాటిస్తూనే.. జీవో 3 పునరుద్ధరణకు అవకాశాలపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. 1986లో వచ్చిన జీవో ప్రకారం ఏజెన్సీలో స్థానిక గిరిజనులకు టీచర్ పోస్టుల్లో నూరు శాతం రిజర్వేషన్లు తెచ్చామని, దీనిపై న్యాయపరమైన చిక్కులు రావడంతో మళ్లీ పెరిగిన మహిళా రిజర్వేషన్ శాతాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని 2000లో జీవో 3 తెచ్చామన్నారు. దీని అమలు ద్వారా 4,626 టీచర్ ఉద్యోగాలు ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు దక్కాయన్నారు. అయితే జీవో 3పై 2002లో కొందరు కోర్టును ఆశ్రయించగా.. వివిధ స్థాయిల్లో విచారణ అనంతరం 2020లో ఆ ఉత్తర్వులను సుప్రీంకోర్టు రద్దు చేసిందని సీఎం పేర్కొన్నారు. అయితే గత ప్రభుత్వం దీనిపై సమీక్ష పిటిషన్ వేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించిందన్నారు. దీంతో సమీక్ష పిటిషన్ను కూడా సుప్రీంకోర్టు కొట్టివేసిందన్నారు. దీని వలన గిరిజనులు జీవో 3 లబ్ధిని కోల్పోయారని సీఎం తెలిపారు.



చట్టపరమైన అడ్డంకులపై అధ్యయనం

జీవో 3 పునరుద్ధరణ లేదా అదే తరహా న్యాయం చేస్తామని చంద్రబాబు ఎన్నికల సమయంలో గిరిజనులకు హామీ ఇచ్చారు. ఆ మేరకు సమీక్షలో భాగంగా ఏజెన్సీలో ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానిక గిరిజనులకు వంద శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉన్న అవకాశాలు, చట్టపరంగా ఉన్న వివిధ అనుకూలతలు, అడ్డంకుల గురించి చర్చించారు. జీవో 3 పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపై గిరిజనులు, సంఘాల నుంచి అభిప్రాయాలు తీసుకోవాలని సీఎం అధికారులకు సూచించారు. గిరిజనులకు తిరిగి ఆ లబ్ధిని అందించేందుకు అవకాశాలు పరిశీలించాలన్నారు. న్యాయపరమైన అంశాలు, సుప్రీంకోర్టు తీర్పు, గిరిజన హక్కుల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలను అధ్యయనం చేయాలని సూచించారు.

సీఎం ముందు 3 ఆప్షన్లు

జీవో 3 పునరుద్ధరణపై ప్రస్తుతమున్న మూడు అవకాశాల గురించి అధికారులు సీఎంకు వివరించారు. మొదటి ఆప్షన్‌గా ఏజెన్సీ ప్రాంతాల్లో వంద శాతం రిజర్వేషన్లు స్థానిక గిరిజనులకు కల్పించడం, రెండో ఆప్షన్‌గా స్థానిక గిరిజనులకు వారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వడం, మూడో ఆప్షన్‌గా సుప్రీంకోర్టు సూచించినట్లు 50 శాతం మించకుండా స్థానిక గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించి వారి హక్కులను పరిరక్షించడం వంటి అవకాశాలను చంద్రబాబు దృష్టికి తెచ్చారు. దీనిపై సీఎం మాట్లాడుతూ గిరిజనుల హక్కులకు కట్టుబడి ఉన్నామని, ఎన్నికల సమయంలో చెప్పినట్లు జీవో 3 పునరుద్ధరించడం లేదా అదే స్థాయిలో గిరిజనులకు న్యాయం చేయడానికి కట్టుబడి ఉన్నామన్నారు. ఈ విషయంలో జాతీయస్థాయిలో రాజ్యాంగ, న్యాయ నిపుణులతో కూడా సంప్రదింపులు జరపాలన్నారు. గిరిజనుల జీవన ప్రమాణాలు పెంచేందుకు విద్యావైద్య సదుపాయాలు కల్పిస్తూ.. ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. వారికి న్యాయం చేసేందుకు ఉన్న ఏ ఒక్క అవకాశాన్ని వదులుకునే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

శ్రీశైలం దుస్థితిపై సీఎం సీరియస్!

(మొదటి పేజీ తరువాయి)

కూడా కొట్టుకుపోయినా పునర్నిర్మాణ చర్యలు చేపట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఆర్థిక శాఖతోనే అసలు 'పేచీ' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ప్లంజ్‌పూల్ వద్ద భారీ గొయ్యి ఏర్పడిందన్న విషయం తప్ప.. స్టీల్ సిలెండర్లకు రంధ్రాలు పడడం.. కొండ భాగం కోత వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి ఇంతవరకు ఎందుకు తీసుకురాలేదని మండిపడ్డారు. తక్షణమే కేంద్ర జలసంఘం, జాతీయ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ)తో సమావేశం ఏర్పాటు చేయాలని.. మొత్తం మరమ్మతులకు ఎంతవుతుందో అంచనాలు తయారుచేయించాలని సీఎంవో కార్యదర్శి రాజమౌళిని ఆదేశించారు. ఆ అంచనాలను మంత్రివర్గం ముందుంచి వెంటనే ఆమోదం తీసుకోవాలని స్పష్టంచేశారు. దరిమిలా రాజమౌళి సోమవారం మూడుసార్లు జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్‌తో మాట్లాడారు. సీఎం ఆదేశాలను తెలియజేశారు. ఆర్థిక శాఖ నిధులు విడుదల చేయకపోవడం ఈ సందర్భంగా ప్రస్తావనకు వచ్చింది. కేంద్రప్రభుత్వ డివిడెండ్ రీఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (డ్రిప్) నిధులు కూడా మంజూరు కావడం లేదని.. డ్యాముల నిర్వహణకు నిధులు కోరుతున్నా ఇవ్వడం లేదని సాయిప్రసాద్ వివరించారు. ఈ సందర్భంగా ఈ నెల ఐదో తేదీన ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ అనిల్ జైన్ రాసిన లేఖ ప్రతిని సీఎంవోకు పంపించారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక, తక్షణ చర్యలపై ప్రాథమిక నివేదిక అందించారు. ప్లంజ్‌పూల్ వద్ద ఏర్పడిన భారీ గొయ్యి ప్రభావాన్ని తగ్గించేందుకు చర్యలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. సముద్రతీర ప్రాంతంలో హార్బర్ వద్ద ఆటుపోట్లను తట్టుకుని.. సముద్రపు నీరు సమీప ప్రాంతాలను ముంచెత్తకుండా నివారించేందుకు భారీ సిమెంట్ దిమ్మెలు వేస్తారని.. అదే మెథడాలజీని ప్లంజ్‌పూల్ వద్ద కూడా వాడాలని నిర్ణయించామని చెప్పారు. కాగా.. సాయిప్రసాద్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. దాని కథనంలో ప్రచురితమైన ఫొటోలు చూశాక.. జలాశయానికి పొంచి ఉన్న ప్రమాద తీవ్రత ఏస్థాయిలో ఉందో అర్థమైందని అన్నారు. ఎన్‌డీఎస్‌ఏ, జలసంఘంతో సమావేశమై.. ఆయా మరమ్మతు పనులకు ఎంతవుతుందో అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదిస్తామని.. ఈ వ్యవహారంలో సీఎంవో ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తామని స్పష్టంచేశారు. ఇంకోవైపు.. శ్రీశైలం జలాశయం దుస్థితిని సీఎం సీరియస్‌గా తీసుకోవడంతో యుద్ధప్రాతిపదికన టెయిల్‌పాండ్ డ్యాం పునరుద్ధరణ, జలాశయాన్ని ఆనుకుని ఉన్న కొండ కోతకు గురికాకుండా చూడడం.. 2009లో కొట్టుకుపోయిన టెయిల్‌పాండ్ రహదారి పునర్నిర్మాణంపై జలవనరుల శాఖ దృష్టి సారించింది. అంచనాలు తయారై వచ్చాక సదరు మరమ్మతు పనులను ప్రస్తుతం శ్రీశైలం జలాశయం వద్ద నిర్మాణ పనులు చేస్తున్న కాంట్రాక్టు సంస్థకు అప్పగించాలని యోచిస్తోంది.



అమర జవాన్ మురళీనాయక్ తల్లిదండ్రులకు జాతీయజెండా అందజేస్తున్న సైనికాధికారి

'జాతీయ జెండా కప్పుకొనే చనిపోతా'

- అమర జవాన్ మురళీనాయక్ వ్యాఖ్యలు గుర్తొచ్చి కన్నీటిపర్యంతమైన మిత్రులు, తల్లిదండ్రులు

హిందూపురం, మే12(ఆంధ్రజ్యోతి): 'నేను జాతీయ జెండా కప్పుకొనే చనిపోతా..' అని అమర జవాన్ మురళీ నాయక్.. స్నేహితులతో అనేవారట. మురళీనాయక్ మాటలు తలుచుకుని స్నేహితులు కన్నీరు పెట్టుకున్నారు. చెప్పినట్లుగానే జాతీయ జెండా కప్పుకొనే చనిపోయారంటూ ఆవేదన చెందారు. ఆయన అంత్యక్రియలు ఈనెల 11న శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్లి తండాలో ముగిశాయి. అనంతరం జవాన్ పార్థివదేహంపై కప్పిన జాతీయ జెండాను ఆయన తల్లిదండ్రులకు సైనికాధికారి అందించారు. ఆ త్రివర్ణ పతాకాన్ని అందుకుంటూ తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. ఉబికొస్తున్న కన్నీళ్లను దిగమింగుకుంటూ సైనికాధికారికి తండ్రి శ్రీరామ నాయక్ సెల్యూట్ చేశారు.

సైనిక సంక్షేమ నిధికి విరాళంగా నెల జీతం: మంత్రి అనిత

సింహాచలం, మే 12(ఆంధ్రజ్యోతి): పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లోని ప్రజలు భారత్‌లోనే ఉండాలని కోరుకుంటున్నారని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆమె సోమవారం సింహాచలం అప్పన్నని దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడుతూ భారత సైనిక సంక్షేమ నిధికి ఒక నెల వేతనం విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు.

ఏపీభవన్‌కు 456మంది విద్యార్థులు

న్యూఢిల్లీ, మే 12(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ సరిహద్దు రాష్ట్రాల్లోని యూనివర్సిటీల్లో విద్యాభ్యాసం చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థులు స్వస్థలాలకు చేరుకునేందుకు ఢిల్లీలోని ఏపీభవన్‌కు వస్తున్నారు. ఇప్పటివరకు 456 మంది వచ్చినట్లు ఏపీ భవన్ అధికారులు తెలిపారు. వీరిలో ఇప్పటికే 167 మంది స్వస్థలాలకు వెళ్లిపోయారు. శ్రీనగర్ నిట్ క్యాంపస్ నుంచి 130, ఎల్‌పీయూ నుంచి 120, షేర్ ఈ కశ్మీర్ వర్సిటీ నుంచి 16 మంది విద్యార్థులు ఏపీభవన్‌కు వచ్చారని, వారికి భోజన ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు.

సాగర్‌లో సుందరీమణుల సందడి



నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం వద్ద సోమవారం బుద్ధుని పాదాలకు అంజలి ఘటిస్తున్న ప్రపంచ సుందరి పోటీదారులు

- గిరిజన నృత్యంతో అందగత్తెలకు స్వాగతం
- బుద్ధవనాన్ని సందర్శించిన భామలు
- నేడు చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్

నల్లగొండ, మే 12(ఆంధ్రజ్యోతి): మిస్ వరల్డ్-2025 పోటీల్లో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వచ్చిన వివిధ దేశాల సుందరీమణులు సోమవారం నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్‌ను సందర్శించారు. బుద్ధవనాన్ని చూసి ఆనంద పరవశులయ్యారు. ఆసియా దేశాలకు చెందిన 22 మంది అందాల భామలు ప్రత్యేక బస్సులో సోమవారం సాయంత్రం 4:55 గంటలకు నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని విజయవిహార్ అతిథి గృహానికి చేరుకున్నారు. వారికి జిల్లా అధికార యంత్రాంగం ఘనస్వాగతం పలికింది. కొద్దిసేపు విశ్రాంతి అనంతరం సాగర్ జలాశయం ఒడ్డున ప్రత్యేక ఫొటో షూట్‌లో వారు పాల్గొన్నారు. సాయంత్రం 6 గంటలకు బుద్ధవనం చేరుకున్నారు. వారికి గిరిజన నృత్యంతో స్వాగతం పలకగా, బుద్ధ జయంతి సందర్భంగా బౌద్ధ భిక్షువులు ఆశీర్వచనం చేశారు. బుద్ధపీఠం వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న అనంతరం బుద్ధవనంలోని మీడియా పాయింట్ వద్దకు వచ్చి ఫొటో షూట్‌లో పాల్గొన్నారు. బుద్ధవనం ప్రత్యేకతను, బుద్ధుని జీవిత విశేషాలను పర్యాటక శాఖ గైడ్ ఈమని శివనాగిరెడ్డి వారికి వివరించారు. రాత్రి 7.55 గంటలకు సుందరీమణులు హైదరాబాద్‌కు బయలుదేరారు. మంగళవారం హైదరాబాద్ నగరంలోని పలు దర్శనీయ ప్రాంతాలను సందర్శించనున్నారు. నగర వారసత్వాన్ని, సాంస్కృతిక సంపదను ప్రపంచానికి పరిచయం చేసే లక్ష్యంతో ప్రభుత్వం చార్మినార్ పరిధిలో మిస్ వరల్డ్-2025 హెరిటేజ్ వాక్, చౌమల్లా ప్యాలెస్‌లో వెల్‌కమ్ డిన్నర్ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. సుందరీమణులు బుధవారం ఓరుగల్లు పర్యటనకు వెళ్తారు.

అప్పీళ్లన్నీ ఆదాయ వనరులే!

- ఒక్కో అప్పీలుకు 15-20 లక్షలు లంచం
- బినామీలు, హవాలా ఖాతాల్లోకి మళ్లింపు
- ముంబై సంస్థ నుంచి 2.5 కోట్ల ఫ్లాట్ గిఫ్ట్
- సీబీఐ విచారణలో ఐఆర్ఎస్ అధికారి జీవన్‌లాల్ అవినీతి బాగోతం

హైదరాబాద్, మే 12(ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రముఖ నిర్మాణ, ఇంజనీరింగ్ సంస్థ షాపూర్‌జీ పల్లోంజీ కంపెనీ నుంచి రూ.70 లక్షలు లంచం తీసుకున్న అభియోగంపై అరెస్టయిన ఆదాయ పన్ను కమిషనర్ లావుడ్య జీవన్‌లాల్ కేసులో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆయన ఐటీ అప్పీల్ యూనిట్ 7, 8కి ఇన్‌చార్జ్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. కార్పొరేట్ సంస్థల అప్పీళ్లను పరిష్కరించేందుకు ఎక్కడికక్కడ మధ్యవర్తులను ఏర్పాటు చేసుకుని జీవన్‌లాల్ లంచాలు వసూలు చేసినట్లు సీబీఐ విచారణలో తేలింది. లంచంగా తీసుకున్న స్థిరాస్తులను బినామీల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించి పత్రాలను తన వద్ద భద్రపర్చుకున్నట్లు దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. ప్రాథమికంగా ఆయన అక్రమ సంపాదన రూ.కోట్లలో ఉన్నట్లు తేలగా.. తదుపరి దర్యాప్తులో అంతకు పదింతలు ఎక్కువ తేలే అవకాశం ఉన్నట్లు సీబీఐ వర్గాలు భావిస్తున్నాయి. కార్పొరేట్ సంస్థల స్థాయిని బట్టి కనీసం రూ.15 లక్షలు, రూ.20 లక్షల నుంచి రూ.కోట్లు లంచం తీసుకుని, అప్పీళ్లను పరిష్కరించినట్లు సీబీఐ విచారణలో తేలింది. ఈ క్రమంలోనే ముంబైలో ఎన్‌డీడబ్ల్యూ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎల్ఎల్‌పీకి సంబంధించిన అప్పీలుకు ఏకంగా రూ.2.5 కోట్ల విలువైన ఫ్లాట్ లంచంగా తీసుకున్నట్లు తేలింది. ఈ ఫ్లాట్‌ను ఖమ్మంకు చెందిన దండెల వెంకటేశ్వర్లు పేరిట రిజిస్ట్రేషన్ చేయించి పత్రాలను జీవన్‌లాల్ వద్ద ఉంచుకున్నట్లు సీబీఐ అధికారులు గుర్తించారు. ముంబైకి చెందిన వెంచూరా సెక్యూరిటీస్ లిమిటెడ్ నుంచి రూ.20 లక్షలు లంచం డిమాండ్ చేసి, రూ.15 లక్షలు మధ్యవర్తి వెంకటేశ్వర్లు ద్వారా తీసుకున్నట్లు వెల్లడైంది. అహ్మదాబాద్‌కు చెందిన హేమంత్ కుమార్, రాజేంద్ర కుమార్ షా నుంచి రూ.15 లక్షలు వసూలు చేసి హవాలా మార్గంలో తన వారి ఖాతాలో జమచేయించినట్లు సీబీఐ గుర్తించింది. తాజాగా ముంబైకి చెందిన షాపూర్‌జీ పల్లోంజీ గ్రూప్ నుంచి ఓ అప్పీలు విషయంలో రూ.కోటీ 20 లక్షలు లంచం డిమాండ్ చేశారు. అందులో రూ.15 లక్షలు ముంబైకి చెందిన సాజీదా మజహర్ హుస్సేన్ షాను మధ్యవర్తిగా ఉంచి తీసుకున్నారు. ఆ మొత్తం జీవన్‌లాల్ ఆదేశాల మేరకు వరహాలు అనే వ్యక్తి ఖాతాలో జమ చేశారు. మరో రూ.70 లక్షలు మధ్యవర్తి రాంగోపాల్ ద్వారా జీవన్‌లాల్‌కు చేరాల్సి ఉంది. డబ్బులు చేతులు మారేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో పక్కా సమాచారంతో సీబీఐ ప్రత్యేక బృందం జీవన్‌లాల్‌ను అరెస్ట్ చేసింది. లంచం డబ్బులు వసూలు చేయడంలో కీలకంగా వ్యవహరించిన మధ్యవర్తులు, ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయించుకున్న బినామీలు, ఓ చార్టర్డ్ అకౌంటెట్‌పై సీబీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది.

షష్ఠ షణ్ముఖ క్షేత్రాలకు జనసేన ఎమ్మెల్యేలు

- సైన్యానికి దైవ బలం కోసం నేడు పూజలు



మంగళగిరి క్యాంపు కార్యాలయంలో సోమవారం పిఠాపురం నుంచి వచ్చిన ప్రభుత్వ నర్సుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్

అమరావతి, మే 12 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ సిందూర్'తో పాకిస్థాన్‌కి గట్టి పాఠం నేర్పిన మన దేశ సైన్యానికి, దేశ నాయకత్వానికి దైవ బలం, ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరుకుంటూ షష్ఠ షణ్ముఖ క్షేత్రాల్లో పూజలు చేయించాలని జనసేన అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిర్ణయించారు. తమిళనాడులోని ఆరు మురుగన్ ఆలయాలతో పాటు కర్ణాటకలో రెండు, మన రాష్ట్రంలోని రెండు సుబ్రహ్మణ్యస్వామి క్షేత్రాలు, విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయం, పిఠాపురం పురుహూతికాదేవి ఆలయాల్లో మంగళవారం జనసేన ఎమ్మెల్యేలు, నేతలు పూజలు నిర్వహిస్తారు. తమిళనాడులోని తిరుపరకుండ్రంలోని ఆలయానికి సుందరపు విజయకుమార్ (యలమంచిలి), పళని క్షేత్రానికి పంతం నానాజీ (కాకినాడ రూరల్), స్వామిమలైకి బొలిశెట్టి శ్రీనివాస్ (తాడేపల్లిగూడెం), తిరుచెందూర్ ఆలయంలో పత్సమట్ల ధర్మరాజు (ఉంగుటూరు), తిరుత్తణిలో ఆరణి శ్రీనివాసులు (తిరుపతి), పాలముదిరిచోళై మురుగన్ ఆలయంలో శ్రీధర్ (రైల్వేకోడూరు) ఆధ్వర్యంలో పార్టీ నేతలు, శ్రేణులు తరలివెళ్లాయి. మంళవారం ఉదయం ఆయా ఆలయాల్లో పూజలు చేయిస్తారు. కర్ణాటకలోని కుక్కే శ్రీ సుబ్రహ్మణ్య క్షేత్రంలో పూజాదికాల కోసం అనంతపురం నుంచి జనసేన నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. ఈ బృందానికి అనంతపురంలోని హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ చైర్మన్ టి.సి.వరుణ్ నేతృత్వం వహిస్తారు. అలాగే ఘాటీ శ్రీసుబ్రహ్మణ్య క్షేత్రంలో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ నేతృత్వంలోని బృందం పూజలు చేయిస్తుంది. ఇక రాష్ట్రంలో విజయవాడ ఇంద్రకీలాద్రిపై మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ పూజలు చేయిస్తారు. బిక్కవోలు శ్రీసుబ్రహ్మణ్య ఆలయంలో మంత్రి కందుల దుర్గేశ్, మోపిదేవి సుబ్రహ్మణ్య ఆలయంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో పూజలు జరుగుతాయి. పిఠాపురం పురుహూతిక ఆలయంలో పూజల్లో డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, నియోజకవర్గ సమన్వయకర్త మర్రెడ్డి శ్రీనివాస్ పాల్గొంటారు. క్రైస్తవ ధర్మాన్ని విశ్వసించే పార్టీ నేతలు, శ్రేణులు చర్చిల్లో ప్రార్థనలు చేయిస్తారు. ఇంకోవైపు.. అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారమే శాంతి హోమం చేయించారు. కాగా, నర్సుల దినోత్సవం సందర్భంగా పిఠాపురానికి చెందిన ప్రభుత్వ స్టాఫ్ నర్సులతో పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు. నర్సులను సత్కారించారు.



అమర సైనికులకు నివాళిగా కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న మంత్రులు అనిత, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తదితరులు

మాల్స్‌ను తనిఖీ చేసి నివేదిక ఇవ్వండి

- 'ఫైర్ సేఫ్టీ' నిబంధనలను పరిశీలించండి
- అగ్నిమాపక అధికారులకు హోంమంత్రి ఆదేశం

విజయనగరం, మే 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మాల్స్‌పై అగ్నిమాపక శాఖ అధికారులు తనిఖీలు చేసి నెల రోజుల్లో నివేదికలు ఇవ్వాలని హోంమంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. సోమవారం విజయనగరం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా సమీక్షా సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని చాలా మాల్స్‌కు అగ్నిమాపక శాఖ అనుమతులు లేవని, వైసీపీ ప్రభుత్వ హయాంలో సెల్ఫ్ డిక్లరేషన్‌తో ఎన్‌వోసీలు ఇచ్చేశారని అన్నారు. మాల్స్‌లో కనీస నిబంధనలు పాటించలేదని, తక్షణమే ఆయా అంశాలను అధికారులు పరిశీలించాలన్నారు. ఫైర్ సేఫ్టీ పాటిస్తున్నారా? లేదా? అనేది చూడాలని ఆదేశించారు.

రెచ్చకొట్టినట్లు వ్యవహరిస్తే కఠిన చర్యలు

మత సంబంధ వ్యవహారాలను ప్రస్తావిస్తూ ఎవరైనా రాజకీయ ముసుగులో రెచ్చకొట్టినట్లు మాట్లాడినా, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి హెచ్చరించారు. దేశం గురించి ఎవరైనా తక్కువగా మాట్లాడితే విడిచిపెట్టేది లేదన్నారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలోని అమరువీరుల స్థూపం వద్ద పాకిస్థాన్ ముష్కరుల దాడిలో అమరులైన వీర జవాన్లకు నివాళులర్పించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. యుద్ధంలో అమరులైన సైనికుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ జిల్లా పోలీసుశాఖ సోమవారం రాత్రి చేపట్టిన క్యాండిల్ ర్యాలీలో ఇద్దరు మంత్రులతో పాటు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కలెక్టర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందాల్, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

నెలాఖరులోగా కాలువల మరమ్మతులు

- యుద్ధప్రాతిపదికన పూడికతీత పనులు చేపట్టాలి: మంత్రి నిమ్మల



అమరావతి, మే 12(ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరులోగా కాలువల పూడికతీత వంటి మరమ్మతు పనులు పూర్తిచేయాలని జలవనరుల శాఖ ఇంజినీరింగ్ అధికారులను మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. సోమవారం విజయవాడ ఇరిగేషన్ క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖ చీఫ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అవసరమైన చోట్ల వారం రోజుల వ్యవధిలో స్వల్పకాలిక టెండర్లు పిలిచి పనులు చేపట్టాలని ఆదేశించారు. అత్యవసర పనులన్నింటినీ నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కాలువల్లో పూడికతీత పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. కాలువల్లో సముద్రపు డెక్క, తూటికాడ వంటి కలుపు మొక్కలను తొలగించాలన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభానికి ముందే కాలువలన్నింటినీ అభివృద్ధి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఈఎన్‌సీ ఎంవెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.